ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

## సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 3 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org



ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక
సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 3 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

# సంపాదక వర్గం

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

**ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు**
వరిష్ఠ సంపాదకులు

**ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి**
సంపాదకులు

**డా. సుంకర గోపాలయ్య**
సంపాదకులు


**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ప్రధాన సలహాదారు

**శ్రీ మా శర్మ**
గౌరవ సంపాదకులు

## సంపాదక సలహాదారులు

శ్రీ గురజాడ రవీంద్రుడు
డా. రేవూరి అనంత పద్మనాభ రావు
డా.వి.ఆర్.రాసాని
డా. నాగసూరి వేణుగోపాల్
శ్రీ విహారి
డా. సి. భవానీదేవి

# స్వాతంత్ర్యం వచ్చెననీ...




భారతదేశంలో నివసిస్తున్న ప్రియతమ భారతీయులకి, ప్రపంచమంతటా విస్తరించి విరాజిల్లుతున్న భారతీయులకీ 77వ స్వాతంత్ర్య దిన శుభాకాంక్షలు. గడచిన ఏడున్నర దశాబ్దాలలో భారత దేశం సాధించిన ప్రగతి, దేశంలో పలు రంగాలలో జరిగిన అభివృద్ధి ఎంతో గణనీయమైనదన్న విషయం కాదనలేనిది. భారత్ సాధించిన ప్రగతికి ఎన్నో కారణాలు ఉండవచ్చు కానీ, దేశం ఎంచుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థ, దేశ ప్రజల శాంతికాముక జీవన ఆకాంక్ష, స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో ప్రగతికి నాటిన విత్తనాలు ముఖ్యకారణాలు. ఏ ఒక్క పార్టీ వల్లనో, ఏ ఒక్క నాయకుడి వల్లనో మాత్రమే జరిగిన అభివృద్ధి కాదు మనది.

ఎంతో సాధించినా ఇంకా సాధించవలసినది ఎంతో ఉందన్నది నిర్వివాదాంశం. వేగంగా పెరుగుతున్న జనాభాకి తగిన వసతుల కల్పన, యువతీ యువకుల శక్తి, సామర్థ్యాలను ఉపయోగించుకోగల పథకాల రూపకల్పన, స్థిరమైన అభివృద్ధికి అవసరమైన దీర్ఘకాల ప్రణాళికల రూపకల్పన ఎంతో అవసరం. రైతులకి సరైన ప్రోత్సాహం, పంటకి అవసరమైన కిట్టుబాటు ధర ఇవ్వడం ఎంతో ముఖ్యం.

ఒక పక్క పేదరికం విస్తరిస్తోంటే, మరో పక్క ధనవంతుల ఆదాయం మరింత పెరుగుతోంది. పేద–ధనిక వర్గాల మధ్య అంతరం తగ్గించవలసిన అవసరం భారత దేశం లాంటి దేశంలో ఎంతో ఉంది. పేదలకి, మధ్య తరగతి వర్గానికి ఉద్యోగ, ఆహార భద్రత కల్పించే సాధనాలుగా ఎన్నో ప్రభుత్వ సంస్థలు ఇప్పటి వరకూ పనిచేశాయి. వాటిని నిర్వీర్యం చేయడం, ప్రయివేటీకరణ చేయడం దేశ ప్రయోజనాల దృష్ట్యా మంచిది కాదు. భారత దేశానికి mixed economy చాలా అనువైనది. ప్రజలకి కావలసిన కనీస అవసరాలు తిండి, బట్ట, ఇల్లు. ఈ అవసరాలు ప్రతి ఒక్కరికీ తీరిన రోజు మన దేశం ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానంలో నిలబడుతుంది.

దేశ అభివృద్ధి, ప్రగతి సుస్థిరమైన ప్రజాస్వామిక వ్యవస్థల నేపథ్యంలోనే సాధ్యం అన్న విషయం ఇరుగు, పొరుగు దేశాల స్థితిగతులను పరిశీలిస్తే తెలుస్తుంది. భారతదేశ ప్రగతికి ప్రజాస్వామ్య వ్యవస్థ మకుటాయమానం

అన్న సంగతి ప్రజలు గమనించాలి. బహుళ సంస్కృతులు, బహు జాతుల సమాహారమైన బారతదేశ మనుగడకి ప్రజాస్వామ్యయుత పాలన, అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా తీసుకునే నిర్ణయాల ఆధారంగా సాగే పరిపాలన ఎంతో అవసరం. నిక్కచ్చిగా, నిష్పాక్షికంగా చెప్పాలంటే, దేశం కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటోందన్నది వాస్తవం. ప్రజాస్వామ్య ధోరణికి గండి పడుతోందన్న భావన చాలామంది ప్రజలలో ఉన్నట్టు తెలుస్తోంది. వ్యవస్థలలో కనిపిస్తున్న లోపాలను వేలెత్తి చూపి, గొంతెత్తి నిరసించగల హక్కులు హరించబడితే ఏ దేశంలో అయినా ప్రజాస్వామ్యం కుంటుబడుతుంది, ప్రగతి మందగిస్తుంది.

నిష్పాక్షిక సమాచార అందుబాటు, సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచార వితరణ లాంటి కొన్ని ప్రాథమిక విషయాలు ప్రజాస్వామ్య వ్యవస్థని బొట్టు బొట్టుగా నీరుగార్చగల శక్తి గలవి. ప్రభుత్వాలు, ప్రజలు– ముఖ్యంగా మేధావులు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంతో సాధించాం, ఇంకా ఎంతో సాధించాలి. సంబర పడి సభలు చేసి, విజయగీతికలు పాడుకుంటే చాలదు; కులమతభేదాలూ, భాషాద్వేషాలూ, నిరుద్యోగ సమస్యలాంటివి దేశాన్ని ఇంకా కలవరపెట్టకుండా ఉంటే దేశం మరింత ప్రగతి సాధించగలదు.

ఇంకా చాలా రాయాలని ఉంది, కానీ 1961 లో శ్రీ శ్రీ రాసిన పాట కంటే గొప్పగా రాయలేను కదా– అందుకే ఆయన పాటని నా మాటగా చదవమని కోరుతున్నాను.

ప్రగతి ఒక గమ్యం కాదు, నిరంతరం సాగే ఒక ప్రయాణం.భారత దేశ ప్రగతియానం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిద్దాం.

"పాడవోయి భారతీయుడా..
ఆడిపాడవోయి విజయగీతికా..ఆ..ఆ..
నేడే స్వాతంత్ర్య దినం.. వీరుల త్యాగఫలం..
నేడే నవోదయం... నీదే ఆనందం..

స్వాతంత్ర్యం వచ్చెననీ సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి..
సాధించినదానికి సంతృప్తిని పొంది...

అదే విజయమనుకుంటే పొరపాటోయి...
ఆగకోయి భారతీయుడా..
కదిలి సాగవోయి ప్రగతిదారులా

ఆకాశం అందుకొనే  ధరలొకవైపు..
అదుపులేని నిరుద్యోగమింకొకవైపూ..
అవినీతి.. బంధుప్రీతి.. చీకటి బజారూ..
అలముకున్న నీ దేశమెటు దిగజారూ..
కాంచవోయి నేటి దుస్థితి..
ఎదిరించవోయి ఈ పరిస్థితి..


పదవీవ్యామోహాలూ కులమతభేదాలూ..
భాషాద్వేషాలూ చెలరేగే నేడూ..
ప్రతి మనిషి మరియొకని దోచుకునేవాడే..
తన సౌఖ్యం తన భాగ్యం చూచుకునేవాడే..
స్వార్థమే అనర్థ కారణం..
అది చంపుకొనుటే క్షేమదాయకం..
స్వార్థమే అనర్థ కారణం..
అది చంపుకొనుటే క్షేమదాయకం..
సమసమాజనిర్మాణమే నీ ధ్యేయం..
సకలజనుల సౌభాగ్యమే నీ లక్ష్యం..

ఏకదీక్షతో గమ్యం చేరిననాడే..
లోకానికి మన భారతదేశం
అందించునులే శుభ సందేశం..
లోకానికి మన భారతదేశం"

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం

ఎందరో వీరుల త్యాగ ఫలం...
...పరిరక్షణ మన కర్తవ్యం




# లోపల

| | |
|---|---|
| అలరాస పుట్టిళ్ళు | 7 |
| పరువు ప్రతిష్ట క్రౌర్యం... | 31 |
| పెంజీకటికవ్వల... | 38 |
| కలల రజను | 71 |
| ఈ క్షణం జీవించు...అని చెప్పే కథ, పెంజీకటికవ్వల | 72 |
| 'మువ్వా' కవిత్వంలో కవిత్వ సాధన తత్త్వం | 80 |
| నిషేధిత సమయంలో | 97 |
| శేషేంద్ర శర్మసాహితీ ప్రస్థానం–<br>ప్రాచీనం నుండి ఆధునికం వరకూ | 99 |
| పరవశం | 121 |
| స్వాతంత్ర్య సమరంలో ఆధ్యాత్మిక, తత్త్వవేత్తల పాత్ర | 123 |
| వైద్యశాస్త్ర రంగంలో 1977 సంవత్సరపు<br>నోబెల్ పొందిన మహిళ రోసలిన్ సుస్ మన్ యాలో | 140 |

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# అలరాస పుట్టిళ్ళు



శ్రీమతి ఎన్.కళ్యాణసుందరీ జగన్నాథ్

అమ్మవారి గుడి పాడుపడి ఉంది, తల వాకిళ్ళు దుమ్ము, సాలీళ్ళు.

మునసబుగారి లోగిలి అరుగులు విరిగి, రాళ్ళు బయటపడ్డాయి. అరుగుమీద స్తంభంలోనుంచీ కూడా రాళ్ళు ఊడిపడినాయి. లోగిలి సింహద్వారం వద్ద మెట్లు గచ్చుపోయి, రాళ్ళు పెల్లగిలిన చోట్లల్లో రావిమొక్కలు చిన్న గడ్డిపరకల్లా మొలుచుకొచ్చినయి. మేడమీద వేసిన కిటికీలకి సాలీడు పట్టింది. భవంతి గోడలన్నీ నల్లబలడిపోయి, అక్కడక్కడా పెచ్చులు రాల్తూ, బీటలు కూడా పడ్డాయి. లోగిలి పెరట్లో ఒక నూతి చుట్టూ తప్ప అంతా నిలువెత్తు గడ్డి పెరిగి ఉంది. నుయ్యి ఒకవైపు కూలింది. ఖాళీ ధాన్యపు గాదులన్నీ పందికొక్కుల కన్నాలు.

లోగిలికి ప్రక్కగా, వీథికటుప్రక్కనున్న పెద్ద దొడ్డిలో గడ్డి వాములు ఉన్నచోట వరిగడ్డి కుళ్ళి మోకాటి లోతున పడి ఉంది. సగం విరిగిన చావిడిలో, ఒక మూలన నులక మంచాలూ, విరిగిన గోనె మడత మంచాలు మేటగా పడి ఉన్నాయి. మరోవైపున తుప్పు పట్టిన నాగటికర్రులూ, కొడవళ్ళూ, గొడ్డళ్ళూ, విరిగిన నాగలి కొయ్యలూ, చీకిపోతున్న గోనెలు, పలుపులూ యేటిగా పడి ఉన్నాయి. కట్టు కొయ్యలన్నీ ఖాళీ పై కప్పుమీద పెంకులు లేచిపోయినయి. చాలాచోట్ల పెద్ద గాలి వానకి విరిగిన కొబ్బరి చెట్లు, బాదం చెట్టూ పడినవి పడినట్టే ఎండిపోయినయి. సగం విరిగిన కమ్మ రేగు చెట్లు రెండూ విరిగినంతవరకూ తల్లి చెట్టునుంచీ వ్రేలాడుతూ, అలాగే ఎండిపోయినయి. కుంకుడు, బూరగచెట్ల కింద పండాకులు మోకాళ్ళ ఎత్తున రాలి ఉన్నాయి. చుట్టూ ఉమ్మెత్త, జిల్లేడి చెట్ల మయం – గడ్డిలో.

పున్నయ్య చెరువు పామంచాలు విరిగి చెరువులోకి ఒదిగి ఉన్నాయి. వాట్లల్లో కొన్ని పెద్ద రాళ్ళు మాత్రం కొంచెం దూరంగా పడేసి ఊరు వాళ్ళు బట్టలు ఉతుక్కుంటున్నారు. పొలంలో ఉన్న పున్నయ్య, చిన్నాయమ్మగారి సమాధుల

సున్నం నల్లబడిపోయింది. చుట్టూ గడ్డి మొలిచి సమాధుల్ని కప్పుతోంది. సమాధుల మీద రాళ్ళు రెండు మూడు చోట్ల ఊడి వచ్చేసినయి.

ఆ రిక్షా లోగిలి సింహద్వారం దగ్గర ఆగింది. దానిలోనుంచీ ఒక వృద్ధాప్యం సమీపిస్తున్న ఆవిడ దిగింది చేతిలో ఒక సంచి పట్టుకుని.

తాడిచెట్లమీద కాకులు గుంపులు గుంపులుగా కూచుని 'కావు కావు'మని కూస్తున్నాయి. లోగిలి వెనకవైపు నుంచీ తుమ్మచెట్ల మీదుగా సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆ సాయంత్రపు ఎర్రటి ఆకాశం ముందు నల్లగా నిటారుగా మొండి తాడిచెట్టు ఒకటి నించుని ఉంది. దానికీ, తామర గుంటకీ మధ్య ఉన్న మట్టి దారిలో నుంచి రిక్షా ఒకటి వస్తోంది. తామర గుంట అంతా నాచుతో నిండి ఉంది. చుట్టూ బురద పాములు వరసగా తలలు మాత్రమే నీళ్ళలో నించీ బయటికి పెట్టి గాలి పీల్చుకుంటున్నాయి.

ఆ రిక్షా లోగిలి సింహద్వారం దగ్గర ఆగింది. దానిలోనుంచీ ఒక వృద్ధాప్యం సమీపిస్తున్న ఆవిడ దిగింది చేతిలో ఒక సంచి పట్టుకుని. లోపలినుంచీ అడుగుల చప్పుడు ఖాళీ భవంతిలో ప్రతిధ్వనించింది. ఈవిడకంటే మరి కాస్త పెద్ద వయస్సు గల మరో ఆవిడ లోపలినుంచీ వచ్చింది. ఎండలో వెలిసి, వానల్లో తడిసిన ముఖం, ఈ వేళ ఆ ముఖం దుఃఖంగా కూడా ఉంది. "వచ్చేశారు గదా, అక్కమ్మ గారూ! మీరు అందుకోలేరేవో అనుకున్నానండి" అంది అక్కమ్మ పమిట చెంగు ముడి విప్పి చిల్లర తీసి రిక్షావాడి కిస్తుంటే. క్రింద పెట్టి ఉన్న సంచీ పట్టుకుని చంద్రమ్మ ముందూ, అక్కమ్మ వెనక ఆ శిథిల సోపానాలు ఎక్కి ఆ నిశ్శబ్దాలలోకి వెళ్ళారు. వీధి అరుగుమీద నిశ్శబ్దంగా పడుకుని ఉన్న మేకపిల్ల బే బే అని అరచి, ప్రక్కనుంచీ దూకి పారిపోయింది, ఈ మాత్రం అలజడికే.

లోపలకెళ్తుంటే, లోపల గుమ్మంలోనుంచీ వ్రేళ్ళాడుతున్న సాలీడు అక్కమ్మ ముఖానికి చుట్టుకొంది. "ఇల్లంతా తుడిశానమ్మా. ఇంకా బూజు ఇక్కడ ఉండిపోయిందన్నమాట. ఈ పెద్ద గవిడి కూడా నేను వచ్చాక తెరిశానండి, నాలుగు రోజులే అయింది. ఆరూ, ఈరూ రావాలిగందా ఇక ఇప్పుడు అని తెలిసి

తెరిసేశాను" అంది చంద్రమ్మ, అక్కమ్మ సాలీడు బూజు తుడుచుకుంటుంటే. ఎత్తయిన స్తంభాల మధ్య చంద్రమ్మ గొంతు 'బొంయ్ బొంయ్' మని మారుమ్రోగింది. ముందర మండువాలో గచ్చు ఊడిపోయిన చోటా, బీటలు వారిన చోటా గడ్డి మొలిచింది. మండువా వసారా అంచులలోంచీ రావి మొక్కలూ, మర్రి మొక్కలూ మొలుచుకొచ్చినయి. మండువాలో అడ్డంగా ఒక తొండ ప్రాక్కుంటూ వెళ్ళిపోయింది. "ఏమన్నా ధారకం దిగుతూందా?" అంది అక్కమ్మ నడుస్తూనే విచారంగా, నిమ్మళంగా. "కొంచెం గంజి" అంది చంద్రమ్మ. "ఈ పాటికి వాళ్ళందరికీ ఉత్తరాలు అందే ఉండాలి. వచ్చే సమయం అయింది" అంది అక్కమ్మ రెండో మండువా దాటుతూ. ఆ మండువా వెనక వసారాలో నులక మంచంమీద ఒక వృద్ధుడు పడుకొని ఉన్నాడు. పైన మెడవరకూ బూర్నీసు కప్పి ఉంది. నేల అంతా అక్కడక్కడ గోతులు పడి ఉంది. మంచానికి కొంచెం దూరంలో ప్రక్క వసారాలో పాతదై, తుప్పుపట్టి ఊడిపోతున్న ఒక చిలక పంజరం వ్రేళ్ళాడుతోంది. అక్కమ్మ మంచం దగ్గర కొంచెం వంగి "అన్నా!" అని నెమ్మదిగా పిలిచింది. వృద్ధుడు పలకలే. "ఒక అరగంట నుంచీ నెమ్మదిగా ఉండారమ్మ, మూలుగుడూ అదీ లేదు" అంది చంద్రమ్మ.

> **లోపలి గదిలో నుంచి సుబ్బారాయుడు భార్య వచ్చింది అడుగులు పట్టి వేసుకుంటూ. "డాక్టరు ఏమన్నాడు వదినా?" అంది అక్కమ్మ.**

లోపలి గదిలో నుంచి సుబ్బారాయుడు భార్య వచ్చింది అడుగులు పట్టి వేసుకుంటూ. "డాక్టరు ఏమన్నాడు వదినా?" అంది అక్కమ్మ. "వచ్చావా అమ్మా. కాళ్ళు కడుక్కున్నావా? ఎవ్వరేమంటారు? ఏం లాభం లేదంట. పేరంటాలయ్య కొడుకు అన్నాడు" అంది. "తెల్ల వైద్యం తెలిసిన వారిని పిలవకపోయావా?" అంది అక్కమ్మ. "సరే! మందూ వద్దు, మాకూ వద్దు. డాక్టరు అసలే వద్దని ఎంత పట్టుబట్టారో చంద్రాయి నడుగు అసలే పట్టుదల మనిషాయె" అంది సుబ్బారాయుడి భార్య. "అసలు ఆయన బ్రతుకులో మందెప్పుడైనా తిన్నారేంటండి?" అంది చంద్రమ్మ. అంతలో లోపలి గదుల్లో నుంచి ఒక చూరు గబ్బిలాయి గదికడ్డంగా ఎగురుతూ వచ్చి రోగి మంచమూ, ఆడవాళ్ళనీ దాటి, ఇవతల గదుల్లోకి

> బయట గోడనానుకుని అరుగు మీద కూచుంది అక్కమ్మ. చంద్రమ్మ స్తంభాన్ని ఆనుకుని కూచుంది. దూరంగా ఎక్కడనుంచో ఆవు 'అంబా' అని అరిచింది.

వెళ్ళిపోయింది శబ్దం లేకుండా. క్రింద పడి ఉన్న విసనకర్ర అందుకుని కాస్సేపు రోగికి విసిరింది అక్కమ్మ నించుని. "నేను వంట చేస్తాను. నువ్వు కాస్సేపు గాలికి బైట కూచో వీధి అరుగుమీద. లోపల మరీ ఒంటరిగా ఉంటుంది" అంది సుబ్బారాయుడు భార్య. "ఎందుకొదినా, నేను చేస్తానులే. నువ్వన్న దగ్గర కూచో" అంది అక్కమ్మ. "రేపణ్ణించీ ఎట్లాగా చాకిరీ తప్పదు గదమ్మా నీకు" అంది ఆమె. "ఇప్పుడెట్టాగా నిద్రోతుండారు గందా అయ్య. మీరూ అల్సిపోయారు గిందా కాళ్ళు కడుక్కోండి, బయట కూకుందాం" అంది చంద్రమ్మ.

బయట గోడనానుకుని అరుగు మీద కూచుంది అక్కమ్మ. చంద్రమ్మ స్తంభాన్ని ఆనుకుని కూచుంది. దూరంగా ఎక్కడనుంచో ఆవు 'అంబా' అని అరిచింది. "ఎసువంటి మారాజు! ఎంత మెత్తని గుండెకాయ! ఏ కథలే" అంది చంద్రమ్మ తలవంచుకుని. "ఒకప్పుడూ మా ఇంటి మడిసి" అని తల ఎత్తుతూ చెప్పసాగింది "నన్ను బాదాడు. ఒక్క పరుగుచ్చుకుని ఇక్కడకొచ్చి పడ్డా. ఈ మారాజు కూసుని ఉండాడు. నాకింకేం తోసలే. ఆయన రెండు పాదాలు పట్టుకున్నా. మా ఇంటోడు నా యనకాల్నే వచ్చేశాడు బడితుచ్చుకుని. ఈ బాబు లేసి ఒక్కటిచ్చుకున్నాడు శంపమీద. ఈ మడిసి ఇంకంతే! రొండు సేతులూ మొకంమీద అదిమి పట్టుకున్నాడు. కళ్ళలో నీళ్ళు తిరిగినయి అతగాడికి. నా కడుపాగలే, మల్లా కాళ్ళుచ్చుకున్న 'బాబయ్య బాబయ్య కొట్టబోకుండి ఒదిలెయ్యండి' అని ఏడిశా. ఆయన నా మాట ఇన్నాడో లేదో గాని జేబులో సెయ్యెట్టి, సేతికొచ్చిన రూపాయిలిచ్చేశారు మావోడి దోసిల్లో". మావోడు అన్నాడు గిందా "నేను ఉత్తినే కొట్టానాండి అయ్యగారూ, నేను గొడ్డల్లే కట్టపడి ఇంటికొచ్చేతలికి ఇది కూడు ఒండకుండా ఆ కన్నిగాడితో మాట్టాడతా కూకుంది. ఆడేంటేంటో గట్టిగా సెప్పా--- ఇది గంటే పడీ పడీ నవ్వా" అన్నాడు. అయ్యగారి కళ్ళు సింతనుప్పులయినయి. 'ఈసారి కన్నిగాడితో మాట్లాడితే, దీన్ని ఒక్క ఏటున

నరికెయ్యరా' అన్నారు మా మడిసితో. ఆయన ముఖం సూత్తే అంత బయ్యం ఏసింది నాకు... ఆ బయ్యం ఇప్పుడికీ వదలలే నాకు. మా నీతిమంతుడండి ఆయన. కోపం ఉంటే ఉండాదిగాని, అంతా కనికరం. ఆయన ఇచ్చిన రూపాయలు పెట్టుకుని కడుపారా, ఇందు చేసుకు తిన్నాం. మావోళ్ళు శానామంది ఇంకా నిలకడ లేకుండా కుప్పలూ గట్రా నలుపుకు తింటా, దొంగతనాలే గిందా! ఇంత కులవుత్తే గిందా! ఈ మారాజు మమ్మల్ని పిల్సి పున్నయ్య సెరువు మీద కావిలిగా పెట్టి ఇల్లూ, వాకిలీ ఇచ్చే. మా రాజుకి పువ్వుల ఇమానం వత్తాది ఎల్లేటప్పుడు. ఆ సెరువు కూడా ఈఁరి తాతగారు తొవ్వించిందేనంటండి. ఆ తాతగారియేనంటగా ఆ సమాధులు" అంది. కాస్సేపు అంతా నిశ్శబ్దం.

**ఎదురుగా తామర గుంట గట్టుమీద నుంచీ కప్పలు బెకబెకమని అరుస్తున్నాయి. చుట్టూ కీచురాళ్ళు కూస్తున్నాయి. కనుచీకటి పడుతోంది.**

ఎదురుగా తామర గుంట గట్టుమీద నుంచీ కప్పలు బెకబెకమని అరుస్తున్నాయి. చుట్టూ కీచురాళ్ళు కూస్తున్నాయి. కనుచీకటి పడుతోంది. "ఈ జబ్బు ఫలానా అని తేల్చిన వైద్యులు లేరు గదా, ఇన్నేళ్ళన్నూ!" అంది అక్కమ్మ. "అసలే వైద్యులతో పలకరిచ్చారు ఆయన? అసలు ఒకళ్ళతో మాట్లాడారా, ఇన్నేళ్ళూ? ఏదో గట్టి కాయం గనక ఇట్టా గెంటుకొచ్చారు గానుండీ!" అంది చంద్రమ్మ. అక్కమ్మకి ఈ లోగిలిలో తాను గడిపిన బాల్యం జ్ఞాపకాలన్నీ మనసులోకొస్తున్నాయి. "ఈ ఇంటి సిరిసంపద లేమయిపోయినయ్యో చంద్రా! రోజులెట్లా మారిపోయినయ్యో" అంది అక్కమ్మ నిమ్మళంగా. "ఎందుకు సెపుతారమ్మా ఆ సత్తవతమ్మ గారి పెళ్ళి అయిందీ లచ్చిమి తొలిగిందీ. ఒకేల యేమన్నా శాతమా, గిట్టనోళ్ళు యామన్నా, సేసారా అనిపిత్తాది నాకు" అంది చంద్రమ్మ.

సత్యవతి పేరు ఎత్తేటప్పటికి అక్కమ్మ మనస్సు బరువెక్కింది. సత్యవతీ, అక్కమ్మా కలిసి పెరిగారు. దూరపు బంధువులు. చిన్న బ్రతుకు బ్రతకడంవల్ల అక్కమ్మ తండ్రి వీరయ్య, సుబ్బారాయుడు తండ్రి మునసబుగారిని ఆశ్రయించి లోగిట్లోనే ఉండిపోయాడు సకుటుంబంగా. తల్లిలేని సత్యవతికి పాలిచ్చింది అక్కమ్మ తల్లి. బ్రతికి ఉన్నన్నాళ్ళూ లోగిలి సువ్వారాలన్నీ ఆవిడే నిర్వహించింది.

అక్కమ్మకి, సత్యవతికీ బలీయమైన స్నేహం, ఇద్దరికీ మరుగులు లేవు. ఇద్దరూ ప్రాణ స్నేహితురాళ్ళు కూడాను.

చంద్రమ్మ లాంతరు వెలిగించుకు రావడానికి లోపలికెళ్ళింది. అక్కమ్మ మనసులో జ్ఞాపకాలు కదిలినయి బాధతో. సుమారు నలభై ఏండ్ల క్రితం జరిగిన గాథ అదంతా. సుబ్బారాయుడు తరుణప్రాయంలో అది. నెల పొడిచింది. రాత్రి రెండు జాములయింది. ప్రపంచం పగటి వేసవి తాపం అంతా మరచి నిద్రపోతోంది.

ఎప్పట్లాగా లేచి చేతిలో హరికేను లాంతరు పట్టుకుని గొడ్ల చావిడి అంతా కలియచూచి, ధాన్యపు కొట్లు తాళాలు లాగి చూచి, వాకిట్లో ధాన్యం గరిసెల చుట్టూ తిరిగి వచ్చి, చెప్పులు వదిలి మండువాలో మంచం మీద పండుకోబోతున్నాడు సుబ్బారాయుడు. ముందరి వాకిట్లో ధాన్యం పాతర మీద వరిగడ్డి మీద చాపలు పరిచి పండుకున్న చింతాలూ, నల్లిగాడూ పెట్టే గుర్రు తప్ప అంతా నిశ్శబ్దం. ఒక్కసారి గాలి గట్టిగా విసిరింది. ఇంటి ముందర తామర గుంట నుంచీ పెద్ద గుమ్మానికి కట్టి ఉన్న కొంచెంగా ఎండిన మామిడాకుల తోరణాలు ఆ చిరుగాలికి 'గలగల'మన్నయి. ఎక్కడో చిన్న అడుగుల చప్పుడైంది. పండుకోబోయే సుబ్బారాయుడు తిరిగి లేచి కూచున్నాడు, మరి కాస్త ఆలకించాడు. అవును అడుగులే! అడుగులు ముందరి వాకిట్లోకి వస్తున్నాయి. ధాన్యం పాతర వద్దకే లాగుంది. గరిసెల సుమారున ఆగినట్టుగ ఉన్నాయి. ఊళ్ళో దొంగల ముఠాలు తిరుగుతున్నట్టు వినికిడి. సుబ్బారాయుడు బస్తాలమీద వెండి పొన్నుకర్ర చేత పట్టుకుని తెరిచి ఉన్న తలుపులోంచి బయటకొచ్చాడు. గరిసె దగ్గర ఎవ్వరూ లేరు.

ఒక్కసారి గొంతు సవరించుకుని "ఎవ్వరదీ" అన్నాడు దృఢంగా. ఎవ్వరూ పలకలే. మళ్ళీ పిలిచాడు. అంతా నిశ్శబ్దం.

ఒక్కసారి గొంతు సవరించుకుని "ఎవ్వరదీ" అన్నాడు దృఢంగా. ఎవ్వరూ పలకలే. మళ్ళీ పిలిచాడు. అంతా నిశ్శబ్దం. కానీ గరిసెల అవతల ప్రక్కగా, గాలికి బట్ట రెపరెప కొట్టుకుంది. సుబ్బారాయుడు ధైర్యం చేసుకుని గరిసెల అవతల ప్రక్కగా వెళ్ళాడు "ఎవ్వరది?". వాడిన పువ్వుల వాసన కొట్టింది. ఆ ప్రక్క వేపచెట్టు

నీడ పడుతోంది. ఆ నీడలో మసక వెన్నెలలో ఒక స్త్రీ రెండు చేతులతోనూ ముఖం అంతా కప్పుకొని ఉంది. ఈ సారి "ఎవరు నీవు" అని గర్జించాడు. బదులు లేదు, కానీ ఆ అరుపుకి ఇంటికి దూరంగా మొండి తాడిచెట్టుకి రెండు పలుపులతో కట్టేసిన కారుదున్న ఒకటి తలకాయ క్రిందకు చాపి హు!హు! అని అరిచి ముందరి కాలుతో కోపంగా నేలను వెనక్కి త్రవ్వింది, నాలుగైదు సార్లు. బండెడు దుమ్ము లేచింది. పలుపు తెంచుకోడానికి ప్రయత్నించింది. సుబ్బారాయుడు అక్కడే ఆగాడు... ఒక్క క్షణం. ఆ స్త్రీని పరకాయించి చూచాడు. ఆవిడ తల్లో వాడిన ఎఱ్ఱ బంతి పువ్వు, బొగడ చెండూ ఆ మసక వెన్నెలలో కొంచెం నల్లగా కనిపించాయి. ఇంకా దగ్గరగా వచ్చాడు సుబ్బారాయుడు. అనేక తలంపులు ఒక్కసారిగా వచ్చాయి.

> పెండ్లి అయ్యి రెండు వారాలే గదా అయింది. పందిరైనా విప్పలేదే! ఎంత ఆపద అయితే మాత్రం అర్ధరాత్రి పూట, ఆడకూతురు ఇల్లు విడిచి నడిచి రావడమా... ఇంత దూరం!

"సత్యవతీ!" అన్నాడు.

"అన్నా! నేనే" సత్యవతి దీనస్వరం వినేటప్పటికి సుబ్బారాయుడికి, మనస్సు కరిగిపోయింది. వెంటనే భయం కూడా కలిగింది. "కూడా వచ్చిందెవరు?" అన్నాడు. సత్యవతి మాట్లాడలేదు. ఇంత అర్ధరాత్రి సత్యవతి ఎందుకొచ్చింది? ఎల్లా వచ్చింది? ఏమాపద కలిగిందో? ఏమాపద కలుగుతుంది?

పెండ్లి అయ్యి రెండు వారాలే గదా అయింది. పందిరైనా విప్పలేదే! ఎంత ఆపద అయితే మాత్రం అర్ధరాత్రి పూట, ఆడకూతురు ఇల్లు విడిచి నడిచి రావడమా... ఇంత దూరం! అందులోనూ అత్తవారిల్లు విడిచి పుట్టింటికి. ఏమి అఘాయిత్యం! భూమి పుట్టినప్పటినుంచీ ఈ ఇంట్లో ఆడవాళ్ళు ఇట్లా చేశారా? అట్లాని ప్రపంచంలో ఎవ్వరైనా విన్నారా? రేపు ప్రొద్దున్న నలుగురిలో తల ఎత్తుకోవడం ఎలాగ! సుబ్బారాయుడు కోపం ఆపుకుని "లోపలికి రా" అన్నాడు. అన్నా చెల్లెలూ ఎదురు పడి మాట్లాడుకోవడం అరుదు. అందులోనూ అతను పెద్దవాడైన తర్వాత అసలు ఆ మాటకొస్తే, పెద్దన్న గారితో అతని ఆరుగురు

> నడిరేయి ఈ సందడికి పండుకున్న వదినెలు లేచారు. "ఇదేమి ఆగడమమ్మా! ఎప్పుడూ ఎరగం ఈ విచిత్రం.

తమ్ములూ బదులు మాట్లాడరు. పిలవకుండా ఎదురుగా రారు. అతను చావిట్లో ఉన్నంతసేపూ ఆడపిల్లల గొంతులు బయట ఆ ప్రాంతాల్లో వినిపించవు. పైగా పెద్దబ్బాయంటే తండ్రి మునసబు గారికే, అదొక మోస్తరు.

సత్యవతి ఆడవాళ్ళంతా పడుకున్న రెండో మండువాలోకి వెళ్ళింది. మండువాలో తూర్పున వసారాలో సత్యవతి గదిముందు వ్రేలాడగట్టిన పంజరంలోనించీ చిలుక సత్యవతిని చూడంగానే పాట మొదలెట్టింది, కీచు గొంతుతో...

"వచ్చేవు పోయేవు ఓ రామ చిలుకా

అలరాస పుట్టిళ్ళులా వార్తలేమి?

పట్టు చీరలు కొన్నారు పణతి మీ యన్నలు

వనిత మీ యన్నలూ వచ్చుచున్నారు".

నడిరేయి ఈ సందడికి పండుకున్న వదినెలు లేచారు. "ఇదేమి ఆగడమమ్మా! ఎప్పుడూ ఎరగం ఈ విచిత్రం. పేరూ, ప్రతిష్టలూ మన్ను గలిశాయి" అన్నారు. "నలుగురు నోళ్ళల్లో వేస్తావుంది నాయనా ఈ ఇంటిని. మిగతా ఆడపిల్లలలకి పెళ్ళిళ్ళు ఎట్లా అవుతయి ఇక?" అంటూ సత్యవతి మారుతల్లి ప్రక్కమీద లేచి కూచుని విసనకర్ర చేత్తో అందుకుంటూ. ఈ మాటలకి మారుటి చెల్లెళ్ళు నలుగురూ లేచారు, ఆవిలిస్తూ, విరుచుకుంటూను. సవితి తల్లి చావిట్లో పెద్ద మంచంమీద పండుకున్న మునసబుగారి చెవిలో అప్పటికప్పుడు వెళ్ళి ఊదేసింది. ఆయన ప్రక్కగానే మడత మంచంమీద పండుకున్న వీరయ్యా లేచాడు దిగ్గున ప్రక్కన ఉన్న తువ్వాలుతో మెడ చెమట తుడుచుకుంటూ. పై మేడమీద పండుకున్న మునసబుగారి కొడుకులందరికీ కూడా తెలిసింది. ఆ రాత్రి మునసబుగారి ఇంట్లో ఎవ్వరూ నిద్రపోలేదు.

అక్కమ్మ వచ్చింది సత్యవతి గదిలోకి. అక్కమ్మని చూచి కళ్ళు తుడుచుకుంది సత్యవతి. అక్కమ్మ తలుపు జారగిలవేసి దగ్గరగా వచ్చి కూర్చుంది. "బయటదారులన్నీ దొంగలు తిరుగుతున్నారంట ఎట్టా రాగలిగేవు సత్యవతీ?" అంది. "ఇవిగో అందెలూ, కడియాలూ దారాలతో కట్టాను మోగకుండా. మిగతా నగలన్నీ తీసేసి వాళ్ళింట్లోనే పారేశాను" అంది సత్యవతి తలవంచుకుని. కొంచెంసేపు ఇద్దరూ మౌనం. "ఏమయిందీ?" అడిగింది అక్కమ్మ. సత్యవతి ఇంకా తలవంచుకుంది. "నిన్న సాయంత్రం నన్ను బలవంతంగా ముస్తాబు చేశారు. పడకింటి వైపు తొంగి చూడనైనా చూడకుండా నేను పారిపోయి వచ్చేశాను". అక్కమ్మ తన పవిట కొంగుతో సత్యవతి కళ్ళు అద్దింది, "ఏటికి ఎదురీదడం కష్టం సత్యవతీ" అంటూ.

> **మర్నాడు మధ్యాహ్నం వేళకల్లా అత్తవారి పాలేరు వచ్చాడు. చింతాలు సవ్వారి బండి కట్టాడు.**

మర్నాడు మధ్యాహ్నం వేళకల్లా అత్తవారి పాలేరు వచ్చాడు. చింతాలు సవ్వారి బండి కట్టాడు. వీరయ్య, అక్కమ్మా, సత్యవతి వెంట బయలుదేరారు అత్తవారి ఇంట్లో దిగబెట్టడానికి. "అసలు ఆడదానికి ఇష్టమూ, అయిష్టమూ ఏంటి?" అంది సవతి తల్లి. "పరువు ప్రతిష్ఠలు కొంపకీడ్చుకు తల్లీ" అన్నారు మునసబుగారు నిమ్మళంగా దగ్గుతూ. "తిరిగి వచ్చావా, గడపకడ్డంగా నరికేస్తాను" అన్నాడు కోపంగా సుబ్బారాయుడు.

బండిలో ఎవ్వరూ పైకి మాట్లాడలేదు. తన కష్టాలన్నీ మనసులో తలపోసుకుంది సత్యవతి. ఒక వారం దినాలకి ముందు ఇట్లాగే చడీ చప్పుడూ లేకుండా అత్తవారి ఇంట్లోనుంచీ చీకటి కడ్డం పడ్డది. ఎక్కడా మనుష్య సంచారం లేదు. పండిన చేల పక్కనుంచీ బళ్ళ దారిని నడిచింది. కొంతదూరం వచ్చేసరికి వెన్నెల వచ్చింది. ఎంత దూరం చూచినా వెన్నెల వెలుగులో అనంతంగా పొలాలు తప్ప మానవుడు కనిపించలే. పొలాల్లో ఎక్కడో ఒక నక్క అరుస్తూ, పరిగెట్టింది. తన కాళ్ళ అడుగుల చప్పుడు తనకే పెద్దగా వినిపిస్తోంది. ఆఖరికి గోనలేరు దగ్గరికి వచ్చింది... అడ్డదారిన. వేసవిలో నీరు ఎండి నీళ్ళు నడుము వరకే వస్తాయి. ఏరు ప్రశాంతంగా ప్రవహిస్తోంది. అలలమీద చంద్రుడు మెరుస్తున్నాడు, కానీ వెంటనే భయం వేసింది. నీళ్ళలో కాలు పెట్టబుద్ధి కాలేదు ఒంటరిగా. తన

చిన్నతనపు భయం ఇంకా ఉండిపోయింది. ఈ గోనలేట్లోనే చాలా భయపడింది ఒకసారి బాల్యంలో. మూడు రోజులు జ్వరం కూడా వచ్చింది అప్పుడు. ఒకనాడు రోహిణి కార్తె ఎండలకి, భూమి మాడి మాడి ఉంది. ఆనాడు మృగశిర కార్తె వచ్చిన క్రొత్త, కాలువలు వదిలే రోజులు. ఎవ్వరూ చూడకుండా అక్కమ్మా, తనూ ఆ ఏట్లో దిగారు ఒడ్డున ఆడుకోవడానికి. ఇంకా దిగువన ప్రక్క ఊరి పిల్లలు తడి ఇసుక ముద్దలు మీద జల్లుకుంటూ ఆడుకుంటున్నారు. కాలువకి ఎగువనించీ క్రొత్త నీళ్ళు వస్తున్నాయి. వీళ్ళెవరూ దాన్ని చూడలేదు. నీళ్ళు చిక్కగా, ఎర్రగా, బురదతో, నురగలతో పొర్లుకుంటూ వస్తున్నాయి. వీళ్ళని దాటుకుంటూ పోతున్నాయి. పిల్లలు కాస్త ఇంకా ఒడ్డుకి తప్పుకున్నారు. చెట్ల మొద్దులూ, విరిగిన పచ్చి చెట్ల కొమ్మలూ అన్నీ నీళ్ళలో కొట్టుకొస్తున్నాయి. ఒడ్డుకి తప్పుకోబోతున్న సత్యవతికి నీళ్ళలో ఒక ముళ్ళ కంప గీచుకుపోయింది.

> **ఆ గాయాలు తడుముకుని, తల పైకెత్తేలోపుగా నీళ్ళలో ఒక ఆడమనిషి చెయ్యి కనబడింది గాజులతో సహా.**

ఆ గాయాలు తడుముకుని, తల పైకెత్తేలోపుగా నీళ్ళలో ఒక ఆడమనిషి చెయ్యి కనబడింది గాజులతో సహా. ఆ చేతి ప్రక్కనే నల్లటి జుట్టూ, నీళ్ళమీద సగం మునిగీ, సగం తేలీ చేతితో సహా ప్రవాహ వేగంలో ఏటి మధ్యనుంచీ క్షణంలో కళ్ళముందు నుంచీ వెళ్ళిపోయింది. ఆ శవం, ప్రవాహ వేగం ఇప్పుడు గుర్తుకు వచ్చి ముచ్చెమటలు పోశాయి. కాళ్ళు శక్తిహీనమై మడతలు బడ్డాయి. ఒక నిమిషానికి ధైర్యం తెచ్చుకుని కాళ్ళు నిలద్రొక్కుకుని వచ్చిన దారినే వెనక్కి తిరిగింది. వెనక్కి తిరిగి చూడకుండా గబగబా నడిచింది. అత్తగారు అప్పుడే లేచి పెరట్లోకి వెళ్ళి వస్తోందనుకుని "ఒంటరిగా ఎందుకు లేచి వెళ్ళా"వంది.

ఈ ఆలోచనలూ, భయాలతో అత్తవారిల్లు సమీపిస్తోంది బండికీ, బండిలోని సత్యవతికీ.

ఇక్కడ పాలేరులో బండి వెళ్తున్న దారే చూస్తూ నిలబడ్డాడు సుబ్బారాయుడు. బండి పది బారలు పోయాక వెనక్కి తిరిగాడు. లోగిలివైపు అరుగుమీద కూర్చుని అరుగు క్రింద ఉన్న పెంపుడు లేళ్ళయిన గౌరీ, రాజాలకు లేత గడ్డి మేపుతున్నాడు.

లోపలి నుంచీ కొండలయ్య వచ్చాడు. అమ్మవారి కొలువుల ఖర్చుల వివరాలకి, ఉత్సవాలకీ, ప్రభలకీ అయ్యే రొక్కం విషయం అంతా మాట్లాడి, ఇనపపెట్టె తాళం తీసుకుని లోపలికి వెళ్ళాడు. కొండలయ్య మునసబు గారికి దూరపు మేనల్లుడు, ఆశ్రితుడు కూడాను. మునసబుగారి ఈ వ్యవహారాలన్నీ చూచే బాధ్యత ఈ మధ్యనే సుబ్బారాయుడు భుజాలపై పడింది. మునసబుగారి వయసు క్రుంగిన తర్వాత ఈ నిర్వహణ అంతా చెంగల్వరాయుడు మోశాడు. అతని పేరు జ్ఞాపకం రాగానే కొంచెం కళ్ళెర్రనయ్యాయి. ఏమి అభిమానం! "వెళ్ళేటప్పుడు డబ్బిస్తే పుచ్చుకోలే! వద్దంట!" ఇంకా ఇంట్లోనే ఉంటే ఇంకా ముదురును వ్యవహారం. ఎందుకైనా మంచిది పంపించెయ్యడం! ఇంకా నయం ఇంత గల ఇంటికి ఎంత అప్రతిష్ఠ. బయట ఎక్కడైనా ఏమన్నా మాట పుట్టుకొచ్చిందంటే... ఇక చావాల్సిందే!

**చేతిలో గడ్డి అయిపోయింది. అరుగు దూకి చావిట్లోకి వెళ్ళి కొయ్య పడక కుర్చీలో కూచుని లంక పొగాకు చుట్ట చుట్టుకుంటున్నాడు...**

చేతిలో గడ్డి అయిపోయింది. అరుగు దూకి చావిట్లోకి వెళ్ళి కొయ్య పడక కుర్చీలో కూచుని లంక పొగాకు చుట్ట చుట్టుకుంటున్నాడు... కొంచెం మనస్సు నెమ్మదిగా. గుమ్మం ముందరనుంచీ గవిడి పోతుల్ని బీడుకి తీసుకెళుతున్నాడు నల్లిగాడు. సుబ్బారాయుడు "ఒరేయ్ నల్లిగా... నెమళ్ళకి మేత పెట్టావుట్రా?" అని అరిచాడు. అతని గొంతు వినగానే, జతలో ఒక కారుదున్న హు! హు! అని కొమ్ములు పైకి పెట్టి, తల నేలకి వంచి, ముందర కాళ్ళతో వెనక్కి నేల దువ్వడం ఆరంభించింది పలుపులు తెంచుకోవడానికి ప్రయత్నిస్తూ. మిగతా పాలేళ్ళు కూడా పరిగెత్తుకుంటూ వచ్చి పలుపులు బలంగా లాగి తీసుకుపోయారు మేతకి. నల్లిగాడు ఒక్కడివల్ల కాలేదు దున్నపోతుని ఆపడం. అతను ఉన్నంత కాలమూ, అతను ఒక్కడూ ఆ దున్నను అదుపులో పెట్టగలిగేవాడే. ఇప్పుడు నలుగురు కావలసి వచ్చారు. తిరిగి చెంగల్వరాయుడే గుర్తుకొచ్చాడు సుబ్బారాయుడికి. మనిషి వీళ్లందరికంటే ఏమంత బలాఢ్యుడేమీ కాదు కానీ అదేమి మాయో 'దా దా' అంటూ అతను దగ్గరికెళ్ళేసరికల్లా ఆ పాపిష్టి దున్న తల పైకెత్తి కాళ్ళు

దువ్వడం ఆపేసి పసిపిల్ల చూచినట్టు చూచేది.

సుబ్బారాయుడు లేచి, గొడ్ల చావిడిలో ఉన్న పెద్ద దొడ్లోకి వెళ్ళాడు. దొడ్లో వరిగడ్డి మేటుల్లో గడ్డి మీదేసుకుని ఆటలాడుకుంటున్న పాలేళ్ళ పిల్లలందరూ ఎక్కడ వాళ్ళక్కడ మీద ఉన్న వరిగడ్డి కదలనీయకుండా గప్‌చుప్‌గా ఉండిపోయారు. సుబ్బారాయుడు చేతులు వెనక్కు కట్టుకుని తలవంచుకుని ఆలోచనగా, నిమ్మళంగా అడుగులు వేస్తూ ఇంకా దొడ్డి లోపలికి వెళ్ళాడు. పందెపు కోడిపుంజులకి తవుడు కలిపి పెడుతున్న చిన్న పాలేళ్ళు లేచి నిల్చున్నారు. కానీ సుబ్బారాయుడు అక్కడ కూడా ఆగకుండా ఇంకా వెళ్ళాడు. చిన్న చావిట్లో ఏడు సంవత్సరాలు చెంగల్వరాయుడు పండుకున్న మడత మంచం జారవేసి ఉంది. చావిట్లో ఒక ప్రక్క కప్పుకంటుకుంటూ పేర్చిన తుమ్మ మొద్దులు, సరుకు మొద్దులు ఉన్నాయి, సువ్వారాలకి. పెద్ద గొడ్ల చావిట్లో ఆరు లేగలు మూతులకి చిక్కాలు కట్టుకొని పండుకొని ఉన్నాయి. నాలుగు ముసలి ఎద్దులు కట్టు కొయ్యల వద్ద పండుకుని నిమ్మళంగా నెమరు వేస్తున్నాయి... లేవలేక రోజులు లెక్కబెట్టుకుంటున్నట్లుగా. పెద్ద ఎద్దు వీపుమీద జోరీగని చేత్తో కొట్టేశాడు. ఎద్దు తృప్తిగా ఎత్తలేక ఎత్తలేక తల పైకెత్తి చూచింది. ఆ కట్టు కొయ్యల దగ్గరినించీ, పావురాయి గూళ్ళ దగ్గిరకెళ్ళి పావురాళ్ళను బయటకు తీసి ఒక్కొక్కటే ఎగురవేశాడు. పావురాలు కాళ్ళ అందెల రవళితో "గలగల" మంటూ ఆకాశంలోకి గుంపుగా ఎగిరి మొగ్గలేస్తున్నాయి. సుబ్బారాయుడు ఒక తుమ్మ మొద్దు మీద కాళ్ళు దగ్గరగా పెట్టుకుని కూర్చున్నాడు తృప్తిగా చుట్ట పీలుస్తూ. పాలేరు ఒకడు బుట్టెడు పెసలు పావురాల మేతకోసం తెచ్చి అతని కాళ్ళ దగ్గర పెట్టి వెళ్ళిపోయాడు. "ఛ ఛ పేరూ, ప్రతిష్ట! ఈ సారి తిరిగి రానియ్యి చెబుతా!" అన్నాడు తనలో తానే పళ్ళు బిగించి, కనుబొమలు చిట్లించి.

నాలుగు ముసలి ఎద్దులు కట్టు కొయ్యల వద్ద పండుకుని నిమ్మళంగా నెమరు వేస్తున్నాయి... లేవలేక రోజులు లెక్కబెట్టు కుంటున్నట్లుగా. పెద్ద ఎద్దు వీపుమీద జోరీగని చేత్తో కొట్టేశాడు.

అక్కమ్మ మనసులో ఇంకా ఈ గాథ నడుస్తూనే ఉంది. పైకి మాత్రం ఏమీ మాట్లాడడం లేదు. చంద్రమ్మ కూడా మాట్లాడకుండా కూచునే ఉంది. ఇద్దరి మధ్యా లాంతరు వెలుగుతోంది. దూరాన కుక్కలు మొరిగాయి. తామర గుంటలో కప్పలు ఇంకా పెద్దగా అరుస్తున్నాయి. ఇంకో రిక్షా వచ్చి ఆగింది గుమ్మం ముందు. సుబ్బారాయుడి మూడో తమ్ముడూ, అతని భార్య, మనుమడూ వచ్చారు. వాళ్ళని తీసుకుని లాంతరు చూపిస్తూ అక్కమ్మ, చంద్రమ్మా లోపలికి వెళ్ళారు.

విధి నిర్ణయాలు, భగవల్లీలలు, ఎంత విచిత్రం! "ఆ చెంగయ్య ఎక్కడున్నాడో పాపం! సత్తవతమ్మ గారిని తల్చుకుంటే ఆయన మతి కొత్తారండి.

"అన్నా, అన్నా ఇదిగో చూడు. కళ్ళు తెరువు. చిన్నన్న వచ్చాడు" అంది అక్కమ్మ సుబ్బారాయుడు నుదురుమీద చెయ్యివేస్తూ. "ఎవరు నువ్వు? సత్యవతా? ఆ!" అంటూ కళ్ళు కొంచెం తెరిచి చూచి "నీవా అక్కమ్మా వచ్చావా?" అన్నాడు. "ఆ వచ్చానన్నా". "సత్యవతి ఏదీ? ఇంకా రాలే" కొంచెం ఆయాసంగా అడిగాడు. అక్కమ్మ కళ్ళు తుడుచుకుంటూ ఒక చాప పరిచింది, వచ్చిన వదినగారిని కూచోమంటూ. చంద్రమ్మ గోడకి ఆనించి ఉన్న బెంచీమీద దుమ్ము దులిపి చిన్నన్నగార్ని, మనవడ్ని కూచోబెట్టింది.

మళ్ళీ బయటకు వస్తుంటే మండువా వసారాలో తగిలించి ఉన్న పాత చిలక పంజరం అక్కమ్మ తలకి తగిలింది. చిలుక లేదు. పంజరం మాత్రమే ఉంది. ఆ చిలుకమీద చెంగల్వరాయుడు జ్ఞాపకం వచ్చాడు తిరిగి వచ్చి బయట అరుగు మీద కూర్చుని ఉన్న అక్కమ్మకి. పంజరం చూడకపోయినా జ్ఞాపకం రాక తప్పదు. అతను పుట్టిందెక్కడ? వచ్చిందెక్కడికి? ఈ లోగిలి సిరి సంపదలతో, అతని బ్రతుకు పెనవేసుకుపోయింది. విధి నిర్ణయాలు, భగవల్లీలలు, ఎంత విచిత్రం! "ఆ చెంగయ్య ఎక్కడున్నాడో పాపం! సత్తవతమ్మ గారిని తల్చుకుంటే ఆయన మతి కొత్తారండి. ఆయనా మా దొడ్డ మడిశండి. ఊరంతా అట్టుడికినట్టూ ఉడికింది గందా!" అంది చంద్రమ్మ సగం పైకి వినబడుతూ తనలో తానే. ఎదురుగా స్తంభాన్ని ఆనుకొని కూచుని తల గోడకి జేరవేసి కూచున్న అక్కమ్మకి మరికొన్ని గడచిన దృశ్యాలు మనసులో మెదిలాయి.

అప్పుడు సుబ్బారాయుడికి మంచి ప్రాయం. సత్యవతి గాలిలో పువ్వు ఎగిరినట్టూ, బంగారు జడ కుచ్చులతో, కాళ్ళ గజ్జెల తోడాలతో, చేతి కంకణాలతో, లోగిలి ఆవరణంతా ఎగిరి ఆడుతుండేది... ఎనిమిది సంవత్సరాల వయసులో.

చెంగల్వరాయుడు వచ్చాడు ఒక ఉదయం. చేతిమీద బాగా గీసుకుపోయిన గాయాలున్నాయి. పచ్చి రక్తం చారికలున్నాయి చేతిమీద. చెయ్యి కొంచెం పైకి ఎత్తి పెట్టుకున్నాడు. ప్రక్కన ఇంకా బండ్లవాళ్ళు నిల్చుని ఉన్నారు. మునసబు గారి చావిట్లో మునసబుగారు మంచంమీద కూచుని ఉన్నారు. సుబ్బారాయుడు వచ్చి పడక కుర్చీలో కూచున్నాడు. ఒక బండివాడు చెబుతూ ఉన్నాడు, "ఇందాకండీ పొద్దుటేల చెరువు ప్రక్కనుండీ, ఈయన గారు చెట్టెక్కాడండీ, వణ్ణం చేసుకోటానికి... ఎండు కొమ్మలు వడతా ఉండాయి పైన. ఈయనగారి తండ్రేమో చెరువులో తపేలాతో నీళ్ళు ముంచాడండీ. మా ముసిలాయన లెండి. ఒడ్డుకు చేరాడండి. అంతే! 'రామా' అంటూ నేలమీద కూలబడిపోయాడు. మరి ఏమన్నా పురుగే కుట్టిందో ఏమోనండి. మేమంతా దగ్గరికి లగెత్తేతలికి ఈయనగారు చెట్టుమీదనుంచి కిందకి గాబరాగా దూకబోయాడండి. చెట్టుమీద ఎండిన కొమ్మ ఒకటి ఇరిగి చేతి అద్దమీద నుంచీ దూసుకుపోయిందండి. సూడండి ఈ నెత్తురు, మా మంచోరండీ. ఇదుగో ప్రక్క ఇంటోరిని అడిగామండీ కామందులు పొలంలోకెల్లారు కాస్త ఆగమన్నారండి. తవురు దయ చేయించాలండి. తెచ్చిన దాన్నం తెచ్చినట్టుగానే ఉండాది. రొక్కం లేకపాయె. ఏదో ఇంటికో పువ్వేత్తే ఈస్సరుడికి ఒక మాలన్నారు కదండీ". అంతవరకూ మౌనంగా ఉన్న సుబ్బారాయుడు "అట్టాంటిదేమీ అక్కరలేదు. అంతా మేమే చూస్తాం. ఇంకొకళ్ళ ప్రసక్తి ఏంటి? అక్కర్లేదు. మనకి అలవాటూ లేదు" అన్నాడు కఠినంగా.

> సుబ్బారాయుడు వచ్చి పడక కుర్చీలో కూచున్నాడు. ఒక బండివాడు చెబుతూ ఉన్నాడు, "ఇందాకండీ పొద్దుటేల చెరువు ప్రక్కనుండీ, ఈయన గారు...

అంతవరకూ ఏదో మైకంలో ఉన్న చెంగల్వరాయుడు "ధాన్యం ఏదో ధరకట్టి మీరే తీసుకోండి" అన్నాడు సుబ్బారాయుడితో. సుబ్బారాయుడు కొంచెం వెటకారంగా చిరునవ్వు నవ్వాడు చిన్నగా. "నీ పేరేంటబ్బాయి?" అని

అడిగారు మునసబుగారు. "ఇనుగంటి చెంగల్వరాయుడు". "ఇనుగంటా?" అన్నారు మునసబుగారు తిరిగి ప్రశ్నార్థకంగా. "మా ఊర్లో ఈరిని ఎరగనోళ్ళంటూ లేరండి. బాగా బతికిన మారాజులేనండీ. తమరికేమన్నా బందుగులేమోనండీ, సుట్టరికాలు తిరగేత్తే" అన్నాడు అతనితో పాటు ఉన్న బండివాడు. "కాదు కాదు" అన్నాడు పడక కుర్చీలోనుంచీ సుబ్బారాయుడు కత్తిలా. చెంగల్వరాయుడు చటుక్కున తల పైకెత్తాడు. నల్లటి గిరజాలు ముందర కళ్ళల్లోనించీ వెనక్కి చెదిరినయి. "ఇనుగంటారు అన్న పేరు ఎక్కడో విన్నట్టుగా ఉంటే" అన్నారు మునసబుగారు. లోపలినుంచీ ఆటల్లో వగర్చుకుంటూ, అప్పుడే గుమ్మంలోకి వచ్చిన సత్యవతి అతన్ని చూచి అట్టే ఆగిపోయింది. మౌనంలో మాటలాగా అతని ముఖంలో ఆగివున్న దుఃఖాన్ని చూచి, చైతన్యం లేనట్టు అయిపోయింది. చెంగల్వరాయుడు ఒక్క క్షణం సజీవంగా చూశాడు సత్యవతికేసి.

> "తోబుట్టువులూ, అన్నదమ్ములూ ఎంతమంది?" అన్నారు మునసబుగారు. "ఈయన ఒక్కడే సంతుండి. కొండ్ర గట్రా....."

"తోబుట్టువులూ, అన్నదమ్ములూ ఎంతమంది?" అన్నారు మునసబుగారు. "ఈయన ఒక్కడే సంతుండి. కొండ్ర గట్రా ఏమీ లేదు. ఇప్పుడు అంతా పోయింది. ఒట్టి కౌలుకే చేత్తా ఉండారు. ఇటు పక్క బత్తీలలో, మరి కాసిని రాళ్ళు గిట్టుబాటు అవుతయ్యన్నారు. అందుకని మాతోపాటు ఆయనా బండి కట్టుకొచ్చారండి" అన్నాడు వెంట ఉన్న మరొక బండివాడు. ఈలోగా సత్యవతి తడిసిన గుడ్డ ఒకటి తీసుకొచ్చి గుమ్మంలోనించి చెయ్యి చాపింది. ఎవ్వరూ అందుకోలే. సుబ్బారాయుడు "సత్యవతీ! ఏంటది!" అని గర్జించాడు. గుమ్మం మీదనే ఆ గుడ్డ పెట్టి సత్యవతి వెనక్కి పారిపోయింది రెండంగలలో. చెంగల్వరాయుడు ఆ గుడ్డ అందుకుని, చేతినున్న రక్తం చారికలు తుడుచుకున్నాడు.

వివరాలన్నీ తెలుసుకున్న మీదట "ఇక్కడే ఉండిపో అబ్బారు. పాపం! మంచీ చెడ్డా అంతా మేమే చూస్తాంలే. భయం లేదు" అన్నారు మునసబుగారు. చనిపోయిన తన తండ్రికి దహన సంస్కారాలన్నీ మునసబుగారే చేయించారు, లోగిట్లో. ఆ ధాన్యం అమ్మించి ఆ రొక్కం దగ్గరే ఉంచుకోమన్నారు

చెంగల్వరాయుడ్ని.

ఆనాటినుంచీ మునసబుగారికి కుడి భుజంలాగా మునసబుగారి లోగిట్లోనే ఉండిపోయాడు చెంగల్వరాయుడు. చెంగల్వరాయుడ్ని చూచినప్పటినుంచీ సత్యవతికి కన్నతల్లి తిరిగి లేచి వచ్చినట్టుండేది. పొలం వెళ్ళినా, బయటికెళ్ళినా సత్యవతికి ఇష్టమైనదేదైనా ఒకటి తెచ్చి ఇచ్చేవాడు చెంగల్వరాయుడు. సత్యవతి జ్వరం పడి లేస్తే సోలెడు గుమ్మపాలు తెచ్చి సత్యవతి మంచం దగ్గర స్వయంగా పెట్టేవాడు. ఎవరైనా అడిగితే, గుమ్మపాలు వంటికి మంచిదమ్మా అని సమాధానం ఇచ్చేవాడు. రోజులు గడుస్తున్నాయి.

> సత్యవతి పెద్దదయింది. గడప దాటనివ్వడం లేదు. ఇంట్లో పెద్దవాళ్ళూ, సంప్రదాయమున్నూ. కానీ సత్యవతికి మాత్రం చెంగల్వరాయుడ్ని తల్చినంతనే దేవగానం వినిపించినట్టుండేది.

సత్యవతి పెద్దదయింది. గడప దాటనివ్వడం లేదు. ఇంట్లో పెద్దవాళ్ళూ, సంప్రదాయమున్నూ. కానీ సత్యవతికి మాత్రం చెంగల్వరాయుడ్ని తల్చినంతనే దేవగానం వినిపించినట్టుండేది. అతను ఎదుట ఉన్నంతసేపూ తన ముఖానికి వన్నెలు వచ్చేవి. ఒకనాడు చెంగల్వరాయుడు ఎప్పట్లాగే పొలంలో పాలకోడు ఒడ్డుగా పెరిగిన పెద్ద పెద్ద మల్లె పొదలలో నుంచీ దోసెడు మల్లె మొగ్గలు తెచ్చాడు ఉత్తరీయంలో. "ఆ దుబ్బుల్లో పాము ఉందంట ఎందుకక్కడికి పోతావు? ఈ పువ్వులు లేకపోతే పోయిందిలే వెళ్ళొద్దు" అంది పువ్వులందుకుంటూ సత్యవతి. "నన్నే పామూ ఏమీ చేయదు, నీవు నా పక్క చూస్తా ఉన్నన్నాళ్ళూ" అన్నాడు కళ్ళు నేలకు వాల్చి. నిండు చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగినట్టు పొంగింది సత్యవతి హృదయం. రోజులు గడుస్తూనే ఉన్నాయి. మరొకనాడు పొలంనుంచీ వస్తుంటే మొండి తాటిచెట్టు క్రింద ఎగరలేక పడిపోయిన చిలక పిల్ల కనిపించింది. ఆ చెట్టు మానులో దాని గూడులో నుంచీ పడ్డది. దాన్ని సత్యవతికి ఇచ్చాడు. ఆ చిలుకను ఒక బుట్టలో పెట్టి అరటి పండ్లు పెట్టింది సత్యవతి.

ఆ సాయంత్రం ఇంటి ఖర్చులకి గాను చెంగల్వరాయుడు బండి కట్టుకుని సంతకు వెళ్తున్నాడు. అతను ఎప్పుడు, ఎందుకు కట్టినా తన స్వంత బండి, స్వంత ఎడ్లనే వాడతాడు. కొంత దూరం వెళ్ళేటప్పటికి సత్యవతి దారికడ్డంగా నించుంది, ప్రక్కనుంచీ చెట్టు కిందనుంచీ దూకి వచ్చి. ముందర రోజు వర్షానికి రోడ్డంతా తడిసి పారాణి పూసుకున్నట్టుగా ఉంది. సత్యవతిని చూచి చెంగల్వరాయుడు నిర్ఘాంతపోయాడు.

"ఎందుకొచ్చావు ఇంత దూరం? తిరిగి నిన్ను ఎట్లా తీసుకెళ్ళడం ఇంటికి?" అన్నాడు చిరునవ్వు, భయం కలిసి. "ఏం భయం లేదులే. నన్నెవరూ ఈ చుట్టుపక్కల ఏం చెయ్యలేరు. నేనందరికీ తెలుసుగా ఇక్కడ. నువ్వు మాత్రం భద్రంగా వెళ్ళిరా" అంటూ తన తలలో వాడిపోయిన మల్లెపూల చెండ్లు తీసి ఎడ్ల కొమ్ములకి కట్టింది. "ఇదిగో అమ్మవారి కుంకం" అని చెంగుముడిలో ఉన్న కుంకం తీసి నించుని ఉన్న అతనికి బొట్టు పెడుతూ "నీ కూడా నేను ఉండనుగా. సంతలో అమ్మవారే కాపాడుతుందిలే. అందుకనే ఇది" అంది. చెంగల్వరాయుడి హృదయంలో పువ్వులు వికసించి, కళ్ళలో తేనెలొలికినయి.

> ఆ సాయంత్రం తిరిగి వచ్చేటపుడు చిలకకి ఒక పంజరమూ, గోధుమ పూసలూ తెచ్చాడు సత్యవతికి.

ఆ సాయంత్రం తిరిగి వచ్చేటపుడు చిలకకి ఒక పంజరమూ, గోధుమ పూసలూ తెచ్చాడు సత్యవతికి. ఈ పెరుగుతున్న మైత్రి సుబ్బారాయుడికి అంత నచ్చలేదు, కళ్ళు చిట్లించాడు. వదినలు రుస రుస లాడారు. మరో సంవత్సరం గడిచింది. ఒకనాడు రవికె అంచులకి చెంగల్వరాయుడు తెచ్చిన గోధుమ పూసలు కుట్టుకుంటూ, చిలకకి పాటలు నేర్పుతోంది సత్యవతి. మధ్యాహ్నం ఎండకి నిద్రపోతున్న సుబ్బారాయుడు త్రుళ్ళిపడి లేచాడు. "ఏం సత్యవతీ! ఏంటీ శని. ఈ చిలుకని ఎప్పుడో పీక పిసికేస్తాను. ఏం గోల నిద్ర లేకుండా" అని అరిచి ఛటాలున లేచి బయటకెళ్ళిపోయాడు. క్రొత్తగా కొన్న కారె దున్నల జతని కట్టేస్తున్నాడు చింతాలు. దున్నపోతులు గున్న ఏనుగుల్లాగున్నాయి. వాటికి ముక్కులు కుట్టారు. చింతాలుని అవి ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఇంట్లో కోపంమీద చావిట్లోకి వచ్చిన సుబ్బారాయుడు చెట్టుకు నిలబడి ఉన్న దుక్కి కర్రతీసి దున్నల్ని

ఒక్క పెద్ద దెబ్బ వేశాడు. జతలో ఒక పోతుకి నడుంమీద పడ్డది దెబ్బ. దున్న దద్దరిల్లిపోయింది. అప్పటినుంచీ, ఆ దున్న మరీ పొగరుబోతు అయ్యింది. సుబ్బారాయుడి గొంతు వినిపించినా, నీడ మీద పడినా అతన్ని చీరెయ్యడానికి చూస్తోంది. అతని మీద పగబట్టింది.

“దోసెడు ముత్యాల్లోనూ, దోసెడు రత్నాల్లోనూ పుట్టావు నువ్వు. నేనంటే ఎందుకిట్లా నీకు?” అన్నాడు చెంగల్వరాయుడు ఒకనాడు పై కొమ్మల నుంచీ ఎఱ్ఱ మందార పువ్వులు కోస్తూ. పువ్వుల కోసం దోసిలి పట్టి పైకి చూస్తూ ప్రతిమలా నించుంది సత్యవతి. “నా పుట్టుక మాటకేం కానీ, నాకు నువ్వే పుట్టెడు బంగారం” అంది కొంచెం కొంటెగా. “నేనూ ఆలోచిస్తా ఉండా నాకు చిన్న తాత కొడుకు ఉండాడు. నాకు పినతండ్రి. ఆయనతో నీకోసం అడిగిద్దామని. ఎట్లొచ్చీ డబ్బులు సంపాదించాలి. అదే చిక్కు” అన్నాడు విచారంగా. ఒకనాడు సుబ్బారాయుడుతో “వయస్సు వచ్చిన పిల్ల. అతగాడితో ఈ సఖ్యం ఏంటండీ?” అంది ఆయన భార్య. అతను ఉలిక్కిపడ్డాడు. కోపంగా చూచి ఊర్కున్నాడు. కాస్త ఆగి “ఏం ఎవరన్నా ఏవన్నా అన్నారా ఊళ్ళో?” అన్నాడు.

“నా పుట్టుక మాటకేం కానీ, నాకు నువ్వే పుట్టెడు బంగారం” అంది కొంచెం కొంటెగా. “నేనూ ఆలోచిస్తా ఉండా నాకు చిన్న తాత కొడుకు ఉండాడు. నాకు పినతండ్రి...

తన మేడమీద గదిలో ఒక్కడే పచార్లు చేస్తున్నాడు. ఆనాడు ఆ నగల మూట విషయమూ అంతేగా, ఈ పేరు ప్రతిష్ఠల కోసమేగా అంత భయపడింది? ఆ రోజు ఎవ్వరూ వెళ్ళని, ఆ మల్లి దుబ్బల దగ్గరికి ఎందుకు వెళ్ళడం ఆ చెంగల్వరాయుడు... దానికి పువ్వులకి అంటే, ఆ సత్యవతికి. ఎవరో దొంగాళ్ళు దాచిపెట్టుకున్న ఆ నల్లగుడ్డ మూట వాడి కంటబడింది... అనుకుంటూ తిరిగాడు తనలో తాను. ఆనాడు ఆ మూట దొరికిందని, మల్లెపొదలో పెట్టారని వచ్చి సుబ్బారాయుడితో చెప్పాడు చెంగల్వరాయుడు. సుబ్బారాయుడు వళ్ళంతా వణికిపోయింది. “మన పంట బోదెలోనా? మన పొలంలోనా? దొంగల సొమ్ము! రెండో కంటి వాడికి

తెలియనివ్వద్దు" అని ఆ మూట మోయించుకెళ్ళి గోనెలేట్లో వదిలేయించేశాడు. లోకనింద ఏదైనా ఎట్లా భరించడం? ఎందుకైనా మంచిది, ఈ చెంగల్వరాయుడ్ని వదుల్చుకోడం మంచిది అనుకుంటూ కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాడు. ఎదురుగా తామర గుంటలో నించీ మునసబుగారి గూసుబాతులు ఈదుకుంటూ ఒడ్డు చేరుతున్నాయి. గట్టుమీద వెళ్తున్నవాళ్ళని పొడవడానికి మెడలు బారెడేసి చాచుకుంటూ. మునసబుగారి రాశి కావలి కుక్కలు చెరువు గట్టుమీద తోకలమీద కూర్చుని నీళ్ళు చూస్తూ ఈగల్ని నాలుకతో పడుతున్నాయి. చుట్టూ పచ్చని చేలన్నీ పసిరి కప్పినట్టున్నాయి.

మర్నాడు ఉదయం తెల్లవారక ముందే అక్కమ్మ చూసేసరికి సత్యవతి తన గదిలో లేదు. చెంగల్వరాయుడు తన బండి కట్టుకుని వెళ్ళిపోయిన దారినే నడుచుకుంటూ, వెతుక్కుంటూ వెళ్ళింది అక్కమ్మ.

ఆ రాత్రి పొలంలోనించీ రాంగానే రమ్మన్నారని వీరయ్య చెప్పడంతో చెంగల్వరాయుడు సుబ్బారాయుడి గదిలోకి వెళ్ళాడు. ఒక అరగంట అయ్యాక, మేడమీద మంచినీళ్ళు పెడుతూ అక్కమ్మ చూచింది. సుబ్బారాయుడి గదిలో నుంచీ బయటకొస్తూ గుమ్మం బయట చెంగల్వరాయుడు అతని పలుచటి, తెల్లటి ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు.

మర్నాడు ఉదయం తెల్లవారక ముందే అక్కమ్మ చూసేసరికి సత్యవతి తన గదిలో లేదు. చెంగల్వరాయుడు తన బండి కట్టుకుని వెళ్ళిపోయిన దారినే నడుచుకుంటూ, వెతుక్కుంటూ వెళ్ళింది అక్కమ్మ. కొంత దూరంలో పున్నయ్య కోనేటి ప్రక్కన, పున్నయ్యగారి సమాధులకెదురుగా, ఒక చెట్టుకింద, ఒక ప్రక్కగా ఒరిగి ముడుచుకొని పండుకుని ఉంది సత్యవతి. ఆమె కౌగిట్లో ఒక తెల్లటి ఉత్తరీయం ఉంది. నిన్న రాత్రి చెంగల్వరాయుడు వేసుకున్నదే అది. ఉత్తరీయం ఒక చోట కొంచెం తడిగా ఉంది. గడ్డం క్రింద, మొఖం అంతా కన్నీళ్ళు జారిన ఆనవాళ్ళు ఉన్నాయి. కళ్ళు ఇంకా వాచి తడిగానే ఉన్నాయి. అప్పుడే నిద్రపట్టినట్లుగా ఉంది. సత్యవతికి తెలియకుండా ఆ ఉత్తరీయం లాక్కుని, మరుగుగా ఒళ్ళో పెట్టుకుని ఎవ్వరికీ కనబడకుండా దాచింది అక్కమ్మ. రోడ్డు మీద నుంచీ, చెట్టు వరకూ

ఉన్న పల్లంలో సన్న మన్నుమీద రెండు జతల అడుగులు కనిపించాయి. ఒకటి చిన్నది, ఇంకోటి పెద్దది. అక్కమ్మ అడుగుజాడలు చేత్తో తుడిచేసింది.

ఆ ఎండల్లో ముహూర్తాల రోజుల్లోనే సత్యవతికి పెండ్లి అయింది.

పక్షం తిరగకముందే పుట్టింటికి పారిపోయి రావడమూ, అక్కమ్మ, వీరయ్య తిరిగి తీసుకువెళ్ళడమున్నూ.

మరొక వారం పోయాక, జుట్టు విరియబూసుకుని మునసబుగారి అమ్మాయి పొలాల్లో తిరుగుతోందనీ, ఎక్కడో తూముమీద కూచుని ఉందనీ పాలూరు గ్రామానికి రకరకాల వార్తలు చేరినయి. ఊళ్ళో అమ్మలక్కలు చెప్పుకోసాగారు: "అదేంటి, ఆ అన్నల్ని చూస్తే మనలాంటి వాళ్ళకే బయ్యం. ఆ పిల్లదేమి రాతి గుండెమ్మా! బయమే లేదు గదా" అంది ఒకావిడ. "ఏమీ ఎరగనట్టే ఉంటాది. ఎంత జాణతనం. జట్టీల్లాంటి అన్నలుండగా ఇట్లా కాపురం ఎగెయ్యటం" అంది రెండవ ఆవిడ బిందె తోముతూ, నీళ్ళాట రేవులో. "కాపురంమీద ఎట్లా ఉంటాది?" అన్నాడు ఒకతను ఎడ్లను కడుగుతూ. "ఆ! చెంగల్వరాయుణ్ణి ఇన్నాళ్ళు ఇంట్లో గట్టా ఉంచుకోకూడదు. ఆడపిల్లలున్న ఇంట్లో ఇట్లాగే అవుతాయి" అంది మరొక వేదాంతి బిందె భుజం మీద పెట్టుకుంటూ. అన్ని వార్తలూ సేవకుల ద్వారా మునసబుగారి కోడళ్ళకు తెలుస్తున్నయి. సుబ్బారాయుడు వినక తప్పింది కాదు. పిచ్చివాడిలా కోపం తెచ్చుకున్నాడు. పండ్లు పటపట కొరికాడు, పరవళ్ళు త్రొక్కుతున్నాడు.

> **మునసబుగారి ఒత్తిడివల్ల సత్యవతిని భూతవైద్యం చేయించడానికి పుట్టింటికి తీసుకొచ్చారు.**

మునసబుగారి ఒత్తిడివల్ల సత్యవతిని భూతవైద్యం చేయించడానికి పుట్టింటికి తీసుకొచ్చారు. నిశ్చయంగా సత్యవతికి దయ్యం పట్టింది అన్నాడు వైద్యుడు పేరంటాలయ్య. చెంగల్వరాయుడు రంగూన్‌లో ఉన్నాడనీ, రెండు సంవత్సరాలు అక్కడే ఉంటాడనీ అక్కమ్మ మరిది రంగూన్ నుంచీ ఉత్తరం వ్రాశాడు. అక్కమ్మ సత్యవతితో ఈ విషయం చెప్పింది. "అవును! డబ్బు సంపాదించుకుని

వస్తానన్నాడు" అంది సత్యవతి విచారంతో. "ఏం లాభం సత్యవతీ, ఇక ఇప్పుడు?" అంది అక్కమ్మ. సత్యవతి ముఖం చేతులతో కప్పుకొని చిన్నగా ఆపుకుంటూ వెక్కివెక్కి ఏడ్చింది.

సత్యవతిని తిరిగి పంపించే రోజున సుబ్బారాయుడు అగ్నిపర్వతంలా బుస్సల్లొక్కాడు. మొండి తాడికి కట్టేసిన కారు దున్న ఇంకా బుస కొట్టింది. ఇంకా పగబట్టే ఉంది. రోజులు గడుస్తున్నాయి. తొలకరి వచ్చింది. రాత్రిళ్ళంతా తామర గుంటలో కప్పలు బెకబెకమంటున్నాయి. పున్నయ్య చెరువులోనూ, తామర గుంటలోనూ, తామర పువ్వులు వర్షానికి నలిగిపోయాయి. మొండితాడిమీద చంద్రుడుదయించాడు. పౌర్ణమి చంద్రుడు ఎర్రగా, నిశాదేవి కుంకుమ బొట్టులా... రాత్రి గడిచినకొద్దీ పున్నమి నెల తెల్లవారింది. భోజనాల వేళకి సత్యవతి వచ్చింది. ఈ సారి నగలు తీయాలన్న స్పృహ కూడా లేదు. తిరిగి సత్యవతికి చూచేటప్పటికి, పంజరంలో చిలక "కిలకిల"లాడింది. రెక్కలు "రెపరెప" కొట్టుకుంటూ, పాట మొదలెట్టింది. ఆ గోలకి పెంపుడు కుక్కని పరీక్షిస్తున్న సుబ్బారాయుడు, తలపైకెత్తి చూచాడు కళ్ళు ఎర్రబారాయి. ఒళ్ళు వణికింది, కోపంతో "ఈ గడప తొక్కొద్దు అనలే? ఈ శని ఇంకా మాకు విరగడ కాలే? తల ఎత్తుకుని బ్రతకనివ్వదల్లే ఉంది" అంటూ అంగలమీద లేచి, చావిట్లో చిలకకొయ్యకి ఉన్న ఉత్తరీయం వేసుకుని, చెప్పుల్లో కాళ్ళు పెడుతూ "వచ్చిన దారినే నడు" అన్నాడు. సత్యవతి వెనక్కి వెనక్కి చూచింది వెళ్ళబోతూ. తనకేసే చూస్తూ చిలక పాట పాడుతూనే ఉంది.

> **రాత్రి గడిచినకొద్దీ పున్నమి నెల తెల్లవారింది. భోజనాల వేళకి సత్యవతి వచ్చింది. ఈ సారి నగలు తీయాలన్న స్పృహ కూడా లేదు. తిరిగి సత్యవతికి చూచేటప్పటికి, పంజరంలో...**

"పరువు గల అన్నలూ పయనమైనారా? రాకాసి వదినలూ, రానివ్వరేమో"

మండువాలోకి వచ్చిన పెద్ద వదిన "తెల్లారాక తీసికెళ్ళండి" అంది. "ఎవళ్ళన్నా వస్తే తిరిగి వచ్చేసినట్టూ?" అంటూ అతను ముందూ, సత్యవతి వెనకా

నడిచి పోతూనే ఉన్నారు. దారిలో తుమ్మ మానులు నల్లగా నించుని ఉన్నాయి. నేవళంగా, పచ్చగా పెరిగి ఉన్న చెట్లన్నీ పూర్తిగా, విభూదిలో ముంచెత్తినట్టు ఉన్నాయి ఆ పున్నమి వెలుగులో. అతని కిర్రు చెప్పుల చప్పుడికి, దారికి అడ్డంగా ఉన్న ఒక పెద్ద పాము ప్రక్కగా తప్పుకుపోయింది. దారి ప్రక్కన మళ్ళల్లో నీళ్ళు తళతళలాడుతున్నాయి.

**సుబ్బారాయుడు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి చుక్క పొడిచింది. "వాళ్ళ గుమ్మం వరకూ పంపించి వచ్చాను, లోపలికి వెళ్ళడానికి నాకు ముఖం చెల్లలేదు" అన్నాడు భార్య అడుగగా.**

సుబ్బారాయుడు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి చుక్క పొడిచింది. "వాళ్ళ గుమ్మం వరకూ పంపించి వచ్చాను, లోపలికి వెళ్ళడానికి నాకు ముఖం చెల్లలేదు" అన్నాడు భార్య అడుగగా. తిరిగి మర్నాడు వాళ్ళ అత్తగారి మనుషులు వచ్చారు వెతుక్కుంటూ. అన్నగారి ముఖం వెనక్కి తిరగంగానే, ఇంట్లోకి వెళ్ళకుండా ఎక్కడికో పారిపోయింది. నూతులూ, గోతులూ దేవించారు. చెరువులు గాలించారు. ఆ చుట్టపక్కల ఎక్కడా సత్యవతి జాడ కనబడలేదు. వెతికి వెతికి వేసారిపోయి, మునసబుగారు మంచం ఎక్కారు. చేతినున్న షాహుకారు మురుగు అరచేతిలో పడుతోంది. క్షీణించిపోయి మూడు నెలలు కాకముందే కాలం చేశారు.

సుబ్బారాయుడు ఇంటి విషయం, ఆస్తి విషయం పట్ల ఏమీ శ్రద్ధ పెట్టడంలేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ చావిట్లోనే కూచుని ఉంటాడు. సత్యవతి పరారైన సంవత్సరంలోనే గమిడిపోతుల జత అమ్మేశారు, వెంట వెంటనే దుక్కిటెడ్లు, పాడి పశువులూ అన్నీ అమ్ముడయిపోయాయి. సుబ్బారాయుడు తన పట్టె మంచం పడక మార్చేశాడు. చావిట్లో ఒక నులక మంచం వేసుకున్నాడు. భోజనం, పడక అన్నీ అక్కడే. అమ్మవారి గుడి ముఖం చూడడం మానేశాడు. సత్తెమ్మ సంబరాలు ఆగిపోయాయి. ఆస్తి క్షీణించసాగింది. ఆశ్రిత సేవక వర్గం లోగిలి విడిచిపోయారు. క్రమంగా ఏదో తగుపాటి సంబంధాలకి ఆడపిల్లల్ని ఇచ్చేశారు. "ఎంత పౌరుషవంతుడు! ఆ సంబంధాలకు ఎట్లా అందాడో! ఏదో మతి పోయిందతనికి, చెల్లెలు తెచ్చిపెట్టిన తలవంపులకి" అని అందరూ

ఉసూరుమన్నారు. ఆఖరుకి ఆస్తి అంతా పోయింది. ఆ లోగిలి ఒక్కటి నిల్చింది. దాని కోసం రక్షణలేదు. దానిమీదా అప్పులవుతున్నాయి.

సుబ్బారాయుడు ఆ కాలంలోనే వృద్ధుడయ్యాడు. మండుటెండలకి తన పొలంలో నల్ల రేవడిలా బీటలు వారినట్టు ముఖం అంతా తీరని భారంతో ముడతలు పడింది. అతన్ని చూడగానే పంజరంలో చిలుక భయపడి రెక్కలు 'టపటప'లాడించి బయటకు ఎగిరిపోవడానికి ప్రయత్నించేది. సుబ్బారాయుడు చిలుకమీద కోపం కూడా తెచ్చుకోవడంలేదు. సత్యవతి వెళ్ళిపోయినప్పటి నుంచీ చిలుక తిండీ తిప్పలు మానేసింది. అక్కమ్మ పెట్టినా తినకుండా ముక్కు రెక్కలలో పెట్టుకుని అలాగే పడి ఉండేది. రంగూన్ నుంచీ వచ్చిన మరిది, చెంగల్వ రాయుడు జ్వరం పడి రంగూన్‌లోనే పోయాడని అక్కమ్మతో చెప్పాడు. అక్కమ్మ గుండెలో బరువుతో వెళ్ళి చిలుక పంజరం తెరిచి చిలుకను వదిలేసింది. పేదరికం భరించలేకా, పువ్వులమ్మిన ఊళ్ళో కట్టెలమ్మడం కష్టమై తమ్ముళ్ళందరూ తలోకదారిన బస్తీల బాట పట్టారు. వాళ్ళ కుటుంబాలతో, దుకాణాలు పెట్టుకుని, గుమాస్తాగిరులు సంపాదించుకుని చిన్న బ్రతుకులు బ్రతుకుతున్నారు. జరిగిన ఈ గాథ అంతా ఈ లోగిలి విచిత్ర పరిణామం అంతా ఆ అరుగుమీద కూచున్న అక్కమ్మ తలపోసుకుంది.

ఆ రాత్రంతా వచ్చిన కొద్దిమంది బంధువులు, అందరూ సుబ్బారాయుడు మంచం చుట్టూ జాగారం చేశారు. మధ్య రాత్రికి వృద్ధుడికి మళ్ళీ మెలకువ వచ్చింది.

ఆ రాత్రంతా వచ్చిన కొద్దిమంది బంధువులు, అందరూ సుబ్బారాయుడు మంచం చుట్టూ జాగారం చేశారు. మధ్య రాత్రికి వృద్ధుడికి మళ్ళీ మెలకువ వచ్చింది. "ఇంకా రాలేదూ సత్యవతి?" అన్నాడు. "లేదన్నా" అంది అక్కమ్మ. "అక్కమ్మా! ఇకమీదట సత్తెమ్మ సంబరాలు చేయిస్తావా? ఆయమ్మ పేరే సత్యవతిది" అన్నాడు ఆగి ఆగి కొంచెం ఆయాసంతో. "అట్లాగే అన్నా, తప్పకుండా చేయిస్తాం" అంది నుదురుమీద చెయ్యి వేస్తూ. రోగికి ఆయాసం కాస్త ఎక్కువయింది. బయటనుంచీ తొలకరి గాలులు చల్లగా వీస్తున్నాయి. ఆ చిన్న గాలిలో ఆ పాత చిలుక పంజరం

కొంచెం ఊగిసలాడింది. వెలిమబ్బు చాటునుంచీ చంద్రుడుదయించాడు. నీళ్ళల్లో వజ్రంలా నడిరాత్రి గడిచిపోయింది.

అదిగో నురగలు, కన్నయ్య లేడూ?" అన్నాడు ఆగుతూ, ఆయాసంతో కొంచెం ఆగాడు. "బల్లకట్టు కన్నయ్య లేడే అక్కమ్మా! ..."

మలి కోడి కూసేటప్పటికి "సత్యవతీ సత్యవతీ" అని గట్టిగా అరిచాడు. "అన్నా అన్నా ఇంకా రాలేదు" అంది అక్కమ్మ. "ఆ! ఆ! గోనలేరు పొంగింది. అదిగో నురగలు, కన్నయ్య లేడూ?" అన్నాడు ఆగుతూ, ఆయాసంతో కొంచెం ఆగాడు. "బల్లకట్టు కన్నయ్య లేడే అక్కమ్మా! లేడు. నేనే బల్లకట్టు వేస్తానే! అక్కమ్మా నేనే! ఎక్కనందే బల్లకట్టు! చేత్తో లాగి బల్లకట్టు మీద పడేశానే అక్కమ్మా అంతే!" అన్నాడు. అంతా నిశ్శబ్దం మళ్ళీ. "సత్యవతీ?" కేక. "వస్తాదిలే పడుకో అన్నా" అంది అక్కమ్మ మృదువుగా. సుబ్బారాయుడు కండ్లు ఇంకా తెరిచాడు. "ఎర్రిదానా! సత్యవతి రాదు! గోనలేరు మింగేసింది. బల్లకట్టు మీదనుంచీ నీళ్ళలోకి పోయింది. అదిగో అదిగో... నేనే నా చేతులారా..." సగం తెరిచిన కళ్ళు మూతబడ్డాయి.

గదిలో చుట్టూ వస్తున్న కన్నీళ్ళన్నీ గడ్డలు కట్టాయి. శ్వాస వినబడడం ఆగింది...రోగిది.

నీడలా ప్రమిద వెలిగించి, గాలికి దీపానికి చెయ్యి అడ్డం పెట్టుకుని లోపల్నుంచీ వచ్చింది చంద్రమ్మ తల దగ్గర పెట్టడానికి.

ఈ కథ 1961 ఆంధ్ర పత్రిక లో ప్రచురించబడినది.

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# పరువు ప్రతిష్ఠ క్రౌర్యం...



శ్రీమతి ప్రతిమ
✆ 98485 41485



ప్రతి చిన్న కళనీ కళాత్మకంగా ఆస్వాదించగల, అనుభూతించగల కళ్యాణ సుందరీ జగన్నాథ్ కి ప్రకృతి అంటే విపరీతమైన ఆరాధన. తోట పని చేసే వారిలో సృజనాత్మకత ఏదో ఉండే ఉంటుందని కదా అని మనం భావిస్తాం. అటువంటి సృజనాత్మకత ఏదో గ్రామ సీమల్లో పెరిగిన ఆమెలో బాల్యంలోనే బీజం పడినట్టుగా అనిపిస్తుంది. ఆమె మనసు ఎంత సున్నితమైనదంటే ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా అది తనదిగా భావించి తీవ్రంగా చలించిపోయేంత.

ఆమె కథలు చదివి ఎవరైనా "మరీ ఇంత కష్టాలా" అని ప్రశ్నిస్తే "కష్టాలంటే నాకు ఇష్టాలు కావు కష్టాలంటే బాధ" అని జవాబు చెప్తుందామె...

"మానవ ప్రయత్నాలకు అన్నిసార్లూ ఫలితం ఉండకపోవచ్చు కానీ, మానవులు ప్రయత్నాలు మాత్రం మానకూడదు" అనే తన శ్రీవారి ఆలోచనే తానూ గట్టిగా నమ్మానని చెప్పే కళ్యాణ సుందరి గారిది ఏ లోటూ లేని గౌరవప్రదమైన, అన్యోన్య దాంపత్యం.

అప్పటికి భారతి ఎడిటర్ గా ఉన్న మల్లంపల్లి సోమశేఖర శర్మ గారి ప్రోత్సాహంతో ఆమె రాసిన "ఒక చిన్న కథ" ఆమె మొదటి కథగా చెప్పుకోవచ్చు. ఆ కథ భారతిలో ప్రచురించబడి పాఠకుల, విజ్ఞుల మెప్పు పొందడం ఆమెకు ఉత్సాహాన్నిచ్చి, తర్వాతి కథలు రాయడానికి దారులు వేసింది.

అయితే జీవితపు పులి విసిరిన పంజా దెబ్బలతో చాలా అంతరాయం ఏర్పడింది ఆమె రచన వ్యాసంగానికి.

కానీ భర్త ఇచ్చిన ఓదార్పు, ప్రోత్సాహంతో జీవితం తొక్కిన లోతుల్ని అధిగమిస్తూ, చాలా ఏళ్ల తర్వాత ఆమె మళ్ళీ రాయడం మొదలుపెట్టారు.

అలా "మాడంత మబ్బు"తో మొదలైన ఈ రెండో ఇన్నింగ్స్ లో ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు అనే చెప్పాలి. రాసిన ప్రతి కథా ప్రచురించబడి, మేధావుల మెప్పు పొందడంతో తాను చెప్పాల్సిన అంశాలు తప్పకుండా ప్రపంచానికి చెప్పే తీరాలని గట్టిగా నిర్ణయించుకున్నారామె.

తన మనసుకి, హృదయానికీ దగ్గరైన థామస్ హార్డీ సిద్ధాంతాలు తన ఆలోచనలకి, ఆవేశానికి ప్రోత్సాహాన్నిచ్చాయని అంటారామె.

అయితే పత్రికలు అడిగినప్పుడు రాసి ఇవ్వడమే తప్ప ఆ కథల్ని జాగ్రత్తగా దాచి ఉంచాలన్న జ్ఞానం లేకపోయింది అని నొచ్చుకునే కళ్యాణ సుందరి గారు మిత్రుల సాయం తో అంతిమంగా లభ్యమైన ఇరవై కథలతో "అలరాస పుట్టిళ్ళు" శీర్షికతో ప్రచురించిన కథా సంపుటి మాత్రమే ఇవ్వాళ మనకి అందుబాటులో ఉన్నది.. బాపు బొమ్మతో ఉన్న ఆ ముఖచిత్రం మీద పంజరంలో ఉన్న చిలక, అలాగే మరోవైపు పంజరం నుండి ఎగిరిపోతున్న చిలక చాలా ప్రతీకాత్మకంగా పాఠకుడి గుండెల్ని మీటుతాయి.

రూపం కంటే సారానికి ప్రాధాన్యత నిచ్చే కళ్యాణ సుందరి గారి కథల్ని చూసినప్పుడు, ఒక మంచి కథా వస్తువు తనంతట తానుగా శిల్పాన్ని సంతరించుకుంటుంది అన్న లాక్షణికుల మాట ఆమె కథలకి వర్తిస్తుందేమో అనిపిస్తుంది..

ఆమే చెప్పుకున్నట్టుగా ఆమె కథలన్నీ యధాతథంగా పూర్తవుతాయి. రూపం కోసం ప్రత్యేకించి ఆమె శ్రమ పడినట్టుగా ఆగుపడదు; విస్తృతమైన పఠనాసక్తి ఆమెకి కథా కథన శిల్పచాతుర్యాన్ని అయాచితంగా అందించి ఉండవచ్చు.

తెలుగు సాహిత్య ప్రపంచంలో ముందు వరుసలో ఒక మైలురాయిగా నిలబడ్డ "అలరాస పుట్టిళ్ళు" కథని మళ్లీ ఒకసారి జ్ఞాపకం చేసుకుని మాట్లాడుకోవడం ఒకానొక చారిత్రక అవసరం...

1961లో ఆంధ్రపత్రికలో ఉగాది సంచికకు కథ రాయమని వచ్చిన జాబు ని అందుకొని ఆమె "అలరాస పుట్టిల్లు" కథ రాసి పంపించారు. ఆ మరునాటి సాయంత్రానికి బాపుగారు రమణ గారితో కలిసి వీరి ఇంటికి వచ్చి ఆ కథని విశ్లేషించి, చర్చించి అభినందించడం ఒక విశేషం.. బాపూ గారికి జగన్నాథ్ గారు మేనమామ అవుతారు...

మనకు తెలిసినంతవరకు తెలుగు కథా సాహిత్యంలో పరువు హత్యల మీద వచ్చిన మొట్టమొదటి కద "అలరాస పుట్టిళ్ళు".

**మునసబు గారి లోగిలి అరుగులు విరిగి, రాళ్లు బయటపడ్డాయి. అరుగు మీది స్తంభం లోంచి కూడా రాళ్లు ఊడిపోయాయి..**

పాడుబడి, బూజు నిండి

బూజు పట్టిన మునసబు గారి లోగిలిని వర్ణించడంతో కథ ప్రారంభమవుతుంది. ఆ చిత్రణ ఎంత దృశ్యమానంగా ఉంటుందంటే చెప్పడం అసాధ్యం..

అందుకే మచ్చుకి మీ ముందు నాలుగు వాక్యాలు ఉంచుతున్నాను.

మునసబు గారి లోగిలి అరుగులు విరిగి, రాళ్లు బయటపడ్డాయి. అరుగు మీది స్తంభం లోంచి కూడా రాళ్లు ఊడిపోయాయి. లోగిలి సింహద్వారం వద్ద మెట్లు గచ్చుపోయి రాళ్లు పెళ్లగిలిన చోట్లలో రావి మొక్కలు ,చిన్న గడ్డి పరికలు మొలుచుకొచ్చాయి. గోడలన్నీ నల్లబడి పెచ్చులు రాలుతూ బీటలు పడ్డాయి.. ఖాళీ ధాన్యపు గాదులన్నీ పందికొక్కుల కన్నాలే.

లోగిలికి పక్కగా వీధి కటుపక్క పెద్దదొడ్డిలో గడ్డివాములు ఉన్నచోట, వరిగడ్డి కుళ్ళి మోకాలు లోతున పడి ఉంది. పెద్ద గాలి వానకి విరిగిన కొబ్బరి చెట్లు, బాదం చెట్టు పడినవి పడినట్టే వున్నాయి... ఎండిపోయిన సగం విరిగిన కమ్మరేగు చెట్లు రెండు విరిగినంతవరకు తల్లి చెట్టు నుండి వేలాడుతూ అలాగే ఎండిపోయాయి. చుట్టూ ఉమ్మెత్త, జిల్లేడు చెట్లమయం. లోగిలి వెనకవైపు నుంచి తుమ్మ చెట్టు మీదుగా సూర్యుడు అస్తమిస్తున్నాడు".

ఈ మొత్తం చిత్రణ కథా వస్తువుకి సూచనగా, ప్రతీకగా సాగుతుంది. ఒక విషాద మోహన రాగమేదో పాటకుడి గుండెల్ని మీటుతున్నట్టుగా అనిపిస్తుంది

ప్రవేశంలోనే ...

ఏ రచయిత అయినా తనకు తెలిసిన జీవితాన్ని చాలా సూక్ష్మస్థాయిలోకి వెళ్లి, శక్తివంతంగా చిత్రించగలడు అన్న విషయం మనసుకు వస్తుంది మనకి.

ఆ మునిమాపు వేళ ఆ మొండి తాటి చెట్టుకీ, ఎదురుగా ఉన్న తామరగుంటకీ మధ్యనున్న మట్టిరోడ్డులో నుంచి నిమ్మలంగా వచ్చి ఆగిన రిక్షా నుంచి అంతే నిమ్మలంగా కిందికి దిగుతుంది అక్కమ్మ.... ఆ ఇంటి ఆడపడుచు సత్యవతికి బాల్య, ప్రాణ స్నేహితురాలు.

"ఆ వచ్చారామ్మా! అందుకోలేరేమో అనుకున్నా"అక్కమ్మని లోపలికి తీసుకెళ్లిన చంద్రమ్మ ఆ ఇంటి మనిషి వంటి పనిమనిషి.

"థారకం ఏదైనా దిగుతోందా" అన్న అక్కమ్మ ప్రశ్న ఆ ఇంట్లోని ఆఖరి ఘడియల సందర్భాన్ని మనకి అవగతం చేస్తుంది.

అలా అక్కమ్మ చంద్రమ్మ లతోపాటు మననీ ఆ శిధిల సోపానాలను ఎక్కించి లోపల ముందు మండువాలోకి అంచలంచెలుగా నడిపిస్తుంది రచయిత్రి. రెండో మండువా లోపల అవతలి వసారా లో నులక మంచం మీద పడుకుని ఉన్న వృద్ధుడి మీదికి వంగి "అన్నా ఎలా ఉంది" అంటూ ప్రశ్నించిన అక్కమ్మ గొంతు విని "ఎవరూ సత్యవతీ" అనడం ఆ సదరు సత్యవతి కోసం ఆ జీవుడు ఎంతగా కొట్టుకుంటున్నాడో అర్థమై పాటకుడి గుండె గొంతుకు అడ్డం పడుతుంది .

ఆ వసరాలో మరోపక్క పాతబడి, తుప్పు పట్టి, ఒక వైపు విరిగి ఉన్న పంజరం వేలాడుతోంది....

ఆ వృద్ధుడు సుబ్బారాయుడు... పేర్లు పెట్టడంలో కూడా రచయిత్రి తీసుకున్న శ్రద్ధ మనని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. వయసులో ఉన్నప్పుడు ఈ సుబ్బారాయుడు ఒక్క కంటి చూపుతో కుటుంబాన్ని, ఊరిని కూడా నిలబెట్టినవాడు...

సత్యవతి పేరు వినగానే బరువెక్కిన అక్కమ్మ గుండె నలభై ఏళ్ల నాటి చరిత్రని తన ఆలోచనలో నుండి పాఠకుడికి ముందు పరుస్తుంది...

సిరి సంపదలతో వెల్లువెత్తిన, పాలు పొంగిన ఆ లోగిలి అనేక మందికి

ఆశ్రయం ఇచ్చింది; ఆ లోగిట్లో చంగల్వరాయుడు కూడా ఒక ఆశ్రితుడు.

అంతస్తుల తారతమ్యాలు తెలియని ప్రేమ ఆ పసి సత్యవతి హృదయంలో చెంగల్వరాయుడినీ ప్రతిష్టిస్తుంది.. రచయిత్రి వారిరువురి నడుమ ఉదయించిన ప్రేమ కిరణాలని ఎంత ఉన్నతంగా చిత్రీకరిస్తుందంటే

ఒళ్లంతా చీరుకుపోయినా సరే ముళ్ళపొదలని దాటి అడవి మల్లెలు తెచ్చి సత్యవతి దొసిట్లో పోస్తాడతడు..

ఒళ్లంతా చీరుకుపోయినా సరే ముళ్ళపొదలని దాటి అడవి మల్లెలు తెచ్చి సత్యవతి దొసిట్లో పోస్తాడతడు.. గాయపడి నేల వాలిన చిలకని తన సేవతో తేరుకునేలా చేసి బహుమతిగా అందిస్తాడు.. దానికోసం పట్నం నుండి ఒక పంజరాన్ని కూడా తెస్తాడు..

చెంగల్వరాయుడుని చూసినప్పటినుండి సత్యవతికి కన్నతల్లి లేచి వచ్చినట్లుగా ఉండేదట... అతడు ఎదుట పడితే చాలు దేవగానం ఏదో వినిపించినట్లు గా ఉండేది అంటుంది. అత్యంత సున్నితంగా రచయిత్రి వివరించిన వారి ప్రేమ మీద హఠాత్తుగా పాట పాఠకుడికి ప్రేమ కలుగుతుంది ...

కానీ "అలరాస పుట్టిళ్ల"లో పరువు చాలా బరువైన తూకపురాయి.. ఈ పితృస్వామ్య సమాజంలో స్త్రీలకు ఎటువంటి స్వయం నిర్ణయాధికారాలు ఉండవు. ఇక ప్రేమ, పెళ్లి, లైంగిక సంబంధాలు, పునరుత్పత్తి వంటి విషయాలలో అయితే కులం, కుటుంబం, రాజ్యం వారిని అడుగడుగునా అదుపులో ఉంచి హద్దు దాటకుండా అహర్నిశలు కాపలా కాస్తుంటాయి..

చెంగల్వరాయుడు ఇంటి నుండి వెళ్ళ గొట్టబడి రంగూన్ చేరుకుంటాడు డబ్బు సంపాదన కోసం...

బలవంతపు పెళ్లితో అత్తవారింటికి వెళ్ళిన సత్యవతి..... మనసు లేని కాపురం చేయలేక అర్ధరాత్రిళ్లు తిరిగి వస్తుంది... నీలాటి రేవు కాడ నీలాపనిందలు తలదించుకునేలా చేస్తాయి కుటుంబాన్ని.... సుబ్బారాయుడు కళ్ళు, గుండె ఎర్రబడతాయి.

ఆ రాత్రి మళ్ళీ తిరిగి వచ్చిన చెల్లిని ఎవరికీ తెలియకుండా తిరిగి నడిపించుకుంటూ వెళ్లి నది దాటుతుండగా బల్లకట్టు ఎక్కించి గోసలేరులో ముంచేస్తాడు..

చాలాసార్లు రచయితలు సామాజిక వైద్యులు అని మనం అనుకుంటాం. కానీ నిజానికి కాదేమో అనిపిస్తుంది.

పోనీ ముంచిన తర్వాత నిమ్మల పడ్డాడా అంటే, అదీ కాదు. క్షణం క్షణం అపరాధ భావంతో కృంగి, కృశించి ఆస్తులన్నీ పోగొట్టుకొని, చెల్లాచెదురైన కుటుంబంతో, మందు, మాకు లేని రోగంతో మంచం పట్టాడు..

చాలాసార్లు రచయితలు సామాజిక వైద్యులు అని మనం అనుకుంటాం. కానీ నిజానికి కాదేమో అనిపిస్తుంది. ఒక సామాజిక సమస్య యొక్క స్వరూప స్వభావాలను అర్థం చేయించి, ఆ సమస్య పట్ల చైతన్యాన్ని రగిలించి ఆ సమస్యని పరిష్కరించుకునే మార్గాన్ని వెతకమని సూచించడం మాత్రమే కళాకారుని పని. ఆ సమస్యకు పరిష్కారాన్ని వెతక వలసింది మనమే.

ఈ కథలో అంతిమంగా రచయిత్రి ఏ పరిష్కారం చూపించింది? అనుకుంటే బరువైన పరువు ని తూకం రాయిలా నెత్తిన మోసిన తరుణప్రాయపు సుబ్బారాయుడిని,.. మూఢంగా పరువుకి భయపడి చేసిన హత్య తాలూకూ భారాన్ని నెత్తిన మోస్తూ కృంగి కృశించి సత్యవతిని పలవరించి, కలవరించి కన్నుమూయడానికి సిద్ధంగా ఉన్న వృద్ధ సుబ్బారాయుడునీ ఏకకాలంలో బొమ్మ కట్టించి పరువు హత్యలకి పరిష్కారాన్ని వెతకమని సున్నితమైన కఠోర స్వరంతో మొట్టిన కథ "అలరాస పుట్టిళ్ళు".

వివాహం, కుటుంబం ఈ రెండింటిలోని అణిచివేతనీ, అసమానత్వాన్ని ఆనాటికే ప్రశ్నించిన కథ "అలరాస పుట్టిళ్ళు".

కుటుంబం ఎంతో పవిత్రమైనదనీ, దాన్ని మార్చడం అసాధ్యమని, అసహజమనీ రకరకాలుగా కుటుంబం చుట్టూ అల్లబడుతూ వచ్చిన భ్రమలన్నింటినీ

బద్దలు కొట్టి కుటుంబాలలో ప్రజాస్వామ్యం ఉండాల్సిన అవసరాన్ని సున్నితమైన స్వరంతో చెప్పిన బలమైన కథ "అలరాస పుట్టిళ్ళు"

80 ల ప్రారంభంలో ముందుకొచ్చిన అస్తిత్వవాద ఉద్యమాల వెలుగులో స్త్రీల ఆలోచనలలో గుణాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, ఆనాటికే స్త్రీల సమస్యలు, వారి మీద అమలవుతోన్న హింస, అణిచివేత వ్యక్తిగతమైనవి కావనీ, అవి సామాజికమైనవనీ గుర్తించి అర్థం చేయిస్తుంది రచయిత్రి.....ఆ హింస మూలాలను అర్థం చేసుకోమని పరోక్షంగా హెచ్చరిస్తుంది...

నిజానికి 80 ల తర్వాత మనకి అంది వచ్చిన స్త్రీవాదపు వెలుతురుకి ఈ "అలరాస పుట్టిళ్ళు" వంటి కథలు గట్టి పునాదులు..

ఈ కథని మళ్ళీ చదివి ఈ పితృస్వామ్య సమాజంలో స్త్రీల యొక్క స్థానాన్ని మరోసారి అంచనా వేయడానికి అవకాశం కల్పించినందుకు ప్రకాశిక నిర్వాహకులకు, ముఖ్యంగా రాసాని గారికి నా కృతజ్ఞతలు.

అయితే 60 ఏళ్ల నాడు "అలరాస పుట్టిళ్ళు" కథాకాలం నాటితో పోలిస్తే అస్తిత్వ వాద ఉద్యమాల రాకడ స్త్రీల మీది అణిచివేతని ఆపగలిగిందా అనుకుంటే, ఆ హింస రూపాలను మాత్రమే మార్చుకుని ఆమె మీద అమలవుతూనే ఉందని అర్థమవుతుంది..

ఇవ్వాళ పరువు హత్యలు సర్వసామాన్యమైపోవడం విచారించదగ్గ విషయం..

యెక్కడైతే కన్య మానం
కాచుకొనుటకు మంట గలిసెనో
అక్కడొక్కటి లేచె సౌధము
ఆకసము పొడుగై

పట్టమేలే రాజు పోయెను,
మట్టి కలిసెను కోట పేటలు,
పదం పద్యం పట్టి నిలిచెను
కీర్తులపకీర్తుల్."

- కన్యక కవిత లోని భాగం

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# పెంజీకటికవ్వల...

శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

తొలుత ఆ వూరు చిన్నదే అయినా రెండు ఆర్ట్సు కాలేజీలూ, ఇంజినీరింగ్ కాలేజీ, చిన్నతరహా పరిశ్రమలూ వచ్చాక పల్లెలనుంచీ వలస వచ్చే జనంతో అనేకమైన కాలనీలు పెంచుకుంటూ బాగా విస్తరిల్లింది. ఆ కాలనీల్లో శ్రీనగర్ కాలనీ ముఖ్యమైనది. అందమైనదీ, చెప్పుకోదగినదీను. ఊళ్ళోవుండే సంపాదనాపరులూ, నాలుగంకెల జీతాలవాళ్ళూ అక్కడే వుంటారు. అంత సంపాదన లేకపోయినా వున్నట్లు కన్పించాలనుకునేవాళ్ళూ, రిటైరైన పెద్ద ఉద్యోగస్తులూ కూడా అక్కడ వున్నారు.

అక్కడుండే మేడలు మామూలు మనుష్యులు కట్టుకునే ఆశలమేడలు. అక్కడ నివసించేది సామాన్యుడు కోరుకునే కోరికలూ, కనే కలలూను. ఆ విషయం అక్కడుండేవాళ్ళకూ తెలుసు. అందుకనే ఇంకా ఎక్కువగా మనుష్యులు ఊహించుకునే స్వర్గంలోని దేవతల్లాగా ఉండటానికి శాయశక్తులా కృషి చేస్తారు. ఇతర మనుష్యుల ఉనికిని వారు గుర్తించరు. సగం మంది అమెరికాకో, ఇంగ్లండ్‌కో, కెనడాకో, ఆస్ట్రేలియాకో వెళ్ళి వచ్చయినా ఉన్నారు. లేక వాళ్ళ బంధువులెవరో ఆ దేశాల్లో ఉన్నారు. మిడిల్ ఈస్ట్ కూ, సౌత్ ఈస్ట్ ఏషియాకూ వెళ్ళి వచ్చినవాళ్ళు ఆ విషయం పెద్దగా చెప్పుకోలేరు. ఫారిన్ రేడియోగ్రాంలూ, ఇంపీరియల్ బ్లెండర్లూ సామాన్య విషయాలు. ఇల్లాండ్లు నెలకో పట్టుచీర విధిగా కొంటారు. ఒక నెలలో వాటిమీద జరీబాతులంటే ఇంకో నెలలో నెమళ్ళు, మరో నెలలో చెట్లు, తరువాతి నెలలో దేవాలయాలూ ఇంకా చిన్న విచిత్రాలూ వుంటూ వుంటవి ఆ చీరల్లో. వస్తువులు కొనడం వాళ్ళకు ఎలా తప్పనిసరో, వాటి ధరల్ని మరచిపోవటం కూడా తప్పనిసరియైన విషయమే. సామాన్యులకుండే ఈతిబాధలు – గయ్యాళి అత్తలు, ఆడబిడ్డలు, సరిగా చూడని మొగుడు, జబ్బులు లాంటివి కూడా వాళ్ళకు ఉన్నట్లు ఎక్కడా కనబడదు.

ఇటువంటి మనుష్యులుండేచోటు దేవలోకం కాకుండా ఎట్లా వుంటుంది? అయితే దానికీ ఒక లోటుంది. ఆ కాలనీ వెనుకనే, దానిగోడలు క్రిందనే ఆనుకుని వుండే స్మశానమే ఆ లోటు. కాలనీ దానివేపుకి వీపు త్రిప్పి వుంటుంది. మొదటి వరుస ఇండ్లకు పెరటివేపుకు వెళితే బాగా కనిపిస్తుంది – బాగు లేకుండా కనిపిస్తుంది. అక్కడికి రోజూ రెండో, మూడో పీనుగలు తప్పెట్లతో వస్తుంటాయి – మట్టయి, మసైపోవటానికి. శీతాకాలంలోనూ, ఊళ్ళో ఏవైనా వ్యాధులు వ్యాపించినప్పుడూ ఒక్కోనాడు పదికూడా వస్తాయి. తీరిక వేళల్లో ఆ ఇళ్ళలోని పనివాళ్ళూ, వంటవాళ్ళూ మాత్రం వెనుక దొడ్లలో చేరుతారు. శవం వృత్తాంతం తెలిసినదీ, ఊహించుకున్నదీ ఒకరితో ఒకరు చెప్పుకుంటూ చూస్తూ నిల్చుంటారు. 'విశేషమైన' శవం వచ్చినప్పుడు గోడలమీద ఎక్కి కూర్చుని అవతల ఏడ్చేవాళ్ళనో, ప్రక్కన నిల్చున్నవాళ్ళనో పిలిచి సావకాశంగా మాట్లాడి విషయమంతా వివరంగా కనుక్కుంటారు. వీలున్నంతసేపు అక్కడ నిల్చుని చూస్తారు. అది రోజూ చూసే 'పాడే' అయినా, అదేదో గొప్ప రసవత్తర విషయమైనట్లు మళ్ళీ అక్కడికి చేరుతూనే వుంటారు వాళ్ళు. యజమానులు మాత్రం అటువైపు రారు. పూడ్చే శవాలైతే వాళ్ళకేం సంబంధం వుండదు. కాల్చేవాటితోనే చీకాకు. ఒక్కోసారి ఏమరుపాటున సంజె వెలుగుల్ని చూసిన 'అమ్మ'గార్లు వాటిని కాష్ఠ జ్వాలలని జెడుసుకొని తలుపులు మూయడం కద్దు. శవం ముప్పాతిక కాలిన తర్వాత కమురుకంపు పైకెగసి గాలిలో కలిసి కాలనీలోని ఇళ్ళన్నిటినీ చుట్టివేస్తుంది. ఆ విషయం ముందే తెలుసుగనుక వంటవాళ్ళు తలుపులు, కిటికీలు ముందుగానే మూసేస్తారు. ఎక్కడైనా ఒక తలుపుగానీ, కిటికీ రెక్కగానీ తెరుచుకొని వుంటే కమురుకంపు ఇంటిలోపల ప్రవేశించి ఇంటిలోని వాళ్ళని ఉక్కిరిబిక్కిరి చేసివేస్తుంది. ఆ ఊళ్ళో ఎలక్ట్రిక్ క్రిమిటోరియం వెలిసేవరకు ఈ దేవలోకానికి ఈ బాధ తప్పే అవకాశం లేదు!

> తీరిక వేళల్లో ఆ ఇళ్ళలోని పనివాళ్ళూ, వంటవాళ్ళూ మాత్రం వెనుక దొడ్లలో చేరుతారు.

ఆ మొదటి వరుసలోని ఒక ఇంట్లో డాక్టర్ సీతారామారావుగారు వుంటారు. ఆయనైతే అక్కడుండాలని అనుకోలేదు. ఊరి మధ్యలో వుంటేనే ఆయన క్లినిక్కూ, కూతురు రాధిక కాలేజికి దగ్గర. అనుకూలం. కాని ఆయన భార్య జయలక్ష్మి

పట్టుదలవలన అక్కడున్నారు. ఆవిడ అక్కడే వుండాలని ఎందుకనుకుందో ఆవిడకే తెలియాలి. ఆమెకూ, కాలనీ మనస్తత్వానికీ ఆమడ దూరం. స్వతహాగా చాలా నిరాడంబరంగా వుంటుంది. 'పిచ్చి'గా వుంటుందని అనేవాళ్ళూ వున్నారు. ఆమెకు ధనవంతులంటే సద్భావమూ లేదు. అక్కడే వుండటానికి కారణం ఆమె కూడా చెప్పలేదు.

తాను చేసే ఏ పనికిగాని ఖచ్చితమైన కారణం చెప్పగల మనస్థిమితం ఆమెకు లేదు.

ఒక్కోసారి జీవితం నిస్సారంగా, నిరర్థకంగా కనిపిస్తుంది. భర్త, బిడ్డలు, లోకంలోని ప్రతిబంధమూ అవసరాలకు పరిమితమైనదిగా, స్వార్థపూరితంగా తోస్తుంది.

ఒక్కోసారి ఆమెకు చాలా సంతోషంగా వుంటుంది. అకారణంగా మనసు ఉత్సాహంతో ఎగసిపడుతుంది. భర్తమీద, బిడ్డలమీద కనిపించిన ప్రతి ప్రాణిమీదా ప్రేమ పెల్లుబికి వస్తుంది. జీవితంలో అర్థం, సారం, నిండుదనం తోస్తవి. తాను పూజించే లక్ష్మీదేవి కళ్ళలో ప్రసన్నత కనిపిస్తుంది. మనస్ఫూర్తిగా నమస్కారం చేస్తింది. ఏమిటో అందరానిది అర్థం అయిపోయినట్లనిపిస్తుంది. ప్రేమ, ఆనందం, అర్థం, దేవుడు, జీవితం అన్నీ ఒకటే అనుకుంటుంది.

ఒక్కోసారి జీవితం నిస్సారంగా, నిరర్థకంగా కనిపిస్తుంది. భర్త, బిడ్డలు, లోకంలోని ప్రతిబంధమూ అవసరాలకు పరిమితమైనదిగా, స్వార్థపూరితంగా తోస్తుంది. మంచితనం, దయ, ప్రేమ అన్నీ మోసం అనుకుంటుంది. మనసులో నిస్పృహ నిండిపోతుంది. ఈ అర్థంలేనితనం ఆమెను కృంగదీస్తుంది. అటువంటి సమయంలో తాను పూజించే లక్ష్మీదేవిని చూసి 'కాగితం మీద అచ్చుకొట్టిన వట్టి బొమ్మ' అనుకుంటుంది. పాతబడి రంగులు మాసిపోతున్న ఈ కాగితం చూసి అందులో ఏదో వెలుగును, భావాన్ని, ప్రాణాన్ని, కృపను, ఆశీర్వచనాన్ని, శక్తిని ఎట్లా చూడగలిగాను? అని ఆశ్చర్యపోతుంది. కిటికీలోనుంచి పడే వెలుగు ఏదోకోణంలో నుంచి పడినప్పుడు ఏదో అస్పష్టతలోనుంచి కలిగే భ్రమ అనుకుంటుంది అస్పష్టంగా.

పట్టు, స్పష్టత లేనట్లు చలించిపోతుండే ఆమె మనస్సు ఎప్పుడూ

లోపల దేనికోసమో వెతుక్కుంటూ వుంటుంది. దేన్నో పట్టుకోవాలన్న నిరంతర ప్రయత్నంలో వుంటుంది. ఎవరితో మాట్లాడకుండా, ఏమీచేయకుండా ఒంటరిగా కూర్చొని దాన్ని వెతికిపట్టుకోవాలి! జీవితానికి అర్థం, లక్ష్యం అయి అతి ముఖ్యమైన 'అది' క్షీరార్ణవశాయి అయిన విష్ణువులాగా దుఃఖ సముద్రం మధ్యన అందరాకుండా నిలిచివున్నది. దాన్ని పట్టుకోవాలి! పట్టుకోవాలి! ఆమె మనస్సు ఉద్వేగంతో చలించిపోతుంది... ఏమిటది? నన్ను బ్రతకనివ్వకుండా, ఊపిరాడనివ్వకుండా లాక్కుపోతున్నది, ఏమిటది? మృత్యువా? అనుకుంటుంది. అటువంటి సమయాల్లో ఆమె ఎవరితోనూ పలకదు. వూరికే అర్థంలేని చూపులు చూస్తూ కూర్చుంటుంది. శ్రావ్యమూ దుఃఖభరితమూ అయిన సంగీతాన్ని ఏమాత్రము భరించలేదు. అది ఆమెను ఈ వెతుకులాట నుంచి బలవంతాన ఈడ్చుకొస్తుంది. ఆమె జీవితంలో ఏర్పడిన బంధాలు, దిగంతాలకు వ్యాపించిన తీయదనాలు, ఎరుగరాని ఆనందానికి సంకేతాలు – అమూల్యమైనవి – అన్నీ ఆ దుఃఖ సముద్రంలోకి లయమైపోయాయి. భరింపరాని బాధావేశం గుండెను చీల్చుతుంది. ఏ పని చెయ్యనివ్వని నిస్సత్తువ ఆమెను ఆవరిస్తుంది. అటువంటప్పుడు ఎవరు పలకరించినా పట్టరాని కోపం వస్తుంది. "ఎప్పుడూ మీకందరికీ వేళకి తిండి, బట్టలూ అందిస్తూ కూర్చోవడమేనా నా జీవితానికి పరమార్థం? మీరు నన్ను పీక్కుతినేస్తున్నారు, నా రక్తం తాగేస్తున్నారు" అంటూ విరుచుకుపడుతుంది. "ఏం, పనెక్కువనుకుంటే వంటమనిషిని పెట్టుకుందాం" అంటాడు సీతారామారావు. పని ఎక్కువ అవడమేమిటి? అసలు పని అనేదే ఎక్కువ. ఏ పనైనా ఎందుకు చెయ్యాలి? "అవును నాకు ప్రతి పనీ ఎక్కువనే అనిపిస్తుంది. ఏ పనీ చెయ్యకుండా వూరికినే వుండాలనిపిస్తుంది. చావాలనిపిస్తుంది" అంటుంది కసిగా.... కొంచెం చల్లబడ్డాక "నాకు వాళ్ళంటే ప్రేమ, వాళ్ళకు అన్ని సౌకర్యాలు కావాలనే చేస్తున్నాను. ఇష్టంతోనే చేస్తున్నాను. మరి ఎందుకు అట్లా మాట్లాడుతున్నాను" అనుకుంటుంది.

ఒక్కసారి వున్నట్టుండి ఆమెలో ఏదో భయం పుట్టుకొస్తుంది. ఏదో పోతున్నదన్న బాధ ఉవ్వెత్తుగా పొంగివస్తుంది. భర్త, పిల్లలు అందరూ బాగున్నారని వరుసగా గుర్తు చేసుకున్నాకనే అది శాంతిస్తుంది. "వాళ్ళమీద మమకారం ఒక్కటే నాకు జీవితంలో మిగిలింది. అదే నేను బతకటానికి కారణం. జరక్కూడదు.... వాళ్ళకు ఏమైనా జరిగితే.... వాడు దేవుడే కాదు! నాశనమైపోతాడు!! వాడి సృష్టి మసైపోతుంది..... వాడు....

నేనెందుకిలా ఆవేశపడిపోతున్నాను?! అందరూ బాగానే వున్నారు. భగవంతుడిని శపించుకుంటూ వున్నానెందుకు?.... ఈ రకంగా సాగిపోతాయి ఆమె ఆలోచనలు...

2

ఇరవై ఏళ్ళు కలిసి జీవించినా జయలక్ష్మికి భర్త స్వభావం అర్థం కాలేదు. ఆమె ఆలోచనలకు కేంద్రం ఉత్తరధ్రువమైతే, ఆయన మాటలు దక్షిణ ధృవం నుంచీ వచ్చినట్లనిపిస్తాయి. సరిగ్గా ఆమె అనుకునేదానికి వ్యతిరేకంగా మాట్లాడతాడు. కావాలని ఉద్దేశపూర్వకంగా అట్లా మాట్లాడుతాడని మొదట అనుకుంది. కాని, ఆయన స్వభావం, తన స్వభావం పూర్తిగా వేరని తర్వాత అనుకుంది. అయినా ఆయన ప్రతిమాటకీ కోపం తెచ్చుకుంటుంది. ప్రతి సంభాషణా చికాకులోనే అంతమౌతుంది. ఆయన ఆమెకు అర్థం కానేకాడు!

> **అతడు డాక్టరుగా వృత్తిలో ఎక్కువ సంపాదించలేడు. దానికి ఒక కారణం అతని నిబ్బరం.**

అతడు డాక్టరుగా వృత్తిలో ఎక్కువ సంపాదించలేడు. దానికి ఒక కారణం అతని నిబ్బరం. ఎవరికైనా జ్వరం రాగానే విషజ్వరం కావచ్చనుకునో, పేరు సంపాదించాలనో, దాన్ని వెంటనే తరిమెయ్యాలని కొత్తవైన పెద్ద మందులు శరీరాన్ని అతలాకుతలం చేసేవాటిని గబగబ ఇచ్చెయ్యడు. రెండో కారణం అతను ప్రతివాళ్లనూ ఖచ్చితంగా ఇంత డబ్బివ్వాలని నిలవెయ్యడు. అట్లా చేస్తే జబ్బు ముంచుకొచ్చేవరకూ వాళ్ళు దగ్గరకు రారుగనుక. ఈ కారణాలవలన వూరికే మందులు తీసుకెళ్లేవాళ్ళే అతని దగ్గరకు జాస్తిగా వస్తారు. ఈ రెండు కారణాలూ జయలక్ష్మికి అర్థమయ్యేవే. ఆమె హర్షించేవే. అయినా మాట మీద మాట వచ్చినప్పుడు "పెళ్ళాం డబ్బు తేరగా వచ్చిందని, కష్టపడకుండానే మంచిపేరు సంపాదించొచ్చని కనిపెట్టారు. అంతే" అనకుండా వుండదు.

పెద్ద కూతురు రాధికకు పదహారేళ్ళు. బిఎస్సీ చదువుతున్నది. అరటి బోదెలాగా నవనవలాడుతూ ఏపుగా పెరిగింది. చురుగ్గా, ధీమాగా, ఆకర్షణీయంగా వుంటుంది. చదువులో మంచి తెలివితేటలు గలది. తన కోరికలకూ, ఆశయాలకూ, మూర్తి కట్టినట్లున్న రాధికను చూసి పొంగిపోతుంది జయలక్ష్మి.

ఆరేళ్ళ చిన్నకూతురు చంద్రికను చూసినప్పుడు ఆమెకు గుండె బరువైపోతుంది. లక్ష్యంలేని ఆవేశం పెల్లుబుకుతుంది. అది వెర్రిపిల్ల. మెదడులో ఏర్పడిన ఏదో లోపం వల్ల తెలివి పెరగలేదు. శరీరం అర్భకంగా వుండి మూడేళ్ళపిల్లలాగే కనిపిస్తుంది. ఎప్పుడో ఒక మాట మాట్లాడుతుంది. నోట్లోంచి నిరంతరం చొంగ కార్చుకుంటూ, నవ్వుతూ అందరి దగ్గరకు వస్తుంది. బయటివాళ్ళు భయపడతారు. వాళ్ళ ముఖాల్లో చీదరింపు కనిపిస్తుంది. ఇంట్లోవాళ్ళు "ఫో, ఫో" అంటారు. అన్నీ చూస్తున్న జయలక్ష్మికి జాలి, దుఃఖం, కోపం అన్నీ ఒక్కసారే కలుగుతవి. "ఎందుకీ పిల్ల ఇట్లా పుట్టింది? అదేం చేసిందని దానికీ శిక్ష? అమాయకుల్ని ఇంత క్రూరంగా శిక్షిస్తున్నాడెందుకు ఆ దేవుడు? అని తిరిగి తిరిగి ప్రశ్నించుకుంటుంది. ఆఖరికి కోపం పట్టలేక దానిని ఏ సాకుతోనో కసిరి, తిట్టి, కొట్టి కళ్ళముందునుంచీ తరిమేస్తుంది.

**సీతారామారావు చంద్రికను గురించి పట్టించుకోడు. దగ్గరకొస్తే మెడలోని బిబ్‌తో మూతి తుడిచి, వీపు తట్టి 'ఆడుకో ఫో' అంటాడు.**

సీతారామారావు చంద్రికను గురించి పట్టించుకోడు. దగ్గరకొస్తే మెడలోని బిబ్‌తో మూతి తుడిచి, వీపు తట్టి 'ఆడుకో ఫో' అంటాడు. రంగుల పేక ముక్కలో, బొమ్మల కాగితమో ఏదో ఒకటిస్తాడు. దాన్ని తీసుకొని ఆనందంగా వెళ్ళిపోతుంది అది. చంద్రికపట్ల చూపబడే ఈ ఆదరణకి లోపల చాలా సంతోషిస్తుంది జయలక్ష్మి. భర్త యెడల ప్రసన్నత, కృతజ్ఞత కలుగుతుంది. "అయ్యో, అందరూ దాన్ని అసహ్యించుకుంటున్నారే..... ఈ కునిష్ఠి బ్రతుకు ఎలా బ్రతుకుతుంది? ఎలా పెద్దదవుతుంది?" అన్న ఆవేశం కలిగినప్పుడు మాత్రం అతని నిశ్చింతకు చాలా కోపం, దుఃఖం వస్తాయి. "పిల్ల యిట్లా వుంటే మీకు చీమ కుట్టినట్లయినా లేదే! కనీసం పిల్లమీదైనా మీకు అక్కర లేదే! నేనింత బాధపడుతున్నాను, మీరు బెల్లం కొట్టిన రాయిలాగా కూర్చుంటారు. ఈ బాధ్యతంత నేనే మొయ్యవలసిందేనా?" అంటూ మండిపడుతుంది. ఇలా ఘాటుగా మాట్లాడుతూ వుండగానే అంతా నటన, ఈ మాటలన్నీ వూరికెనే అంటున్నాను, అంతా అసత్యం అనిపిస్తుంది మనసులో. చంద్రికమీద అక్కర, రాధిక మీద ప్రేమ అన్నీ తాను చేసేవి, ఊహించుకునేవి, ఆడేవి. అవీ, తానూ, ఒకటి కాదు. అన్నీ అసత్యమే! ఆమెకు భయం వేస్తుంది. ఆలోచనలు అబద్ధం, బ్రతుకు అబద్ధం! ప్రపంచం అబద్ధం!

భయంతో, సందేహంతో ఇంకా గట్టిగా అరుస్తుంది. 'పిల్లలంటే కూడా అక్కరలేని మనిషి, ఏం మనిషి మీరు! మీ దగ్గర నిజం లేదు!' అని.

ఇటువంటి ఆవేశాలు, కల్లోలాలు లేని సమయాల్లో ఆమె మనస్సు నిద్రపోతున్న పాములాగా నిస్త్రాణంగా మత్తులో ఉంటుంది. ఏ పనీ చెయ్యనివ్వదు. చిన్న పని కూడా బలవంతాన చేయించాల్సిందే!

ఏడాది క్రితం కరెంట్ షాక్ కొట్టినప్పటినుండి ఈ స్థితి తీవ్రమయింది. ఇనుపతీగెమీద మామూలుగానే తడి టవలు ఆరవేద్దామని వేసింది. ఎక్కడో లీకేజి వుండి ఆ తీగెలోకి వచ్చివుండిన కరెంటు ఆమెను పట్టుకుంది. భయభ్రాంతిలో శరీరానికీ, మనస్సుకీ సంబంధం తప్పిపోయింది. 'అమ్మో' అన్న పొలికేక పెట్టి పడిపోయింది....

**జయలక్ష్మికి ఏడో ఏట వాళ్ళ తాత చనిపోయాడు. ఆయన ఎప్పుడూ అబద్ధం ఆడలేదు.**

ఆ తీగె తెగి పోకుండా వుంటే అప్పుడే ప్రాణం పోయి ఉండేదన్న విషయం భయంకరంగా ఆమె మనసును పట్టివేసింది. చావు, బ్రతుక్కి ఇంత దగ్గర్లో వుందేమిటి? అయ్యో, ఎంత దగ్గర్లో వుంది! దాన్నుంచి ఎక్కడికి ఎలా పారిపోవాలి??

చావు, రోగం, బాధ, కష్టం – ఇటువంటివన్నీ ఎందుకున్నాయి? వాటి బారినుండి తప్పించుకోవడానికి మార్గమే లేదే!?

జయలక్ష్మికి ఏడో ఏట వాళ్ళ తాత చనిపోయాడు. ఆయన ఎప్పుడూ అబద్ధం ఆడలేదు. ఆరునెల్లు మంచంలో వుండి ఆఖర్న 'అదుగో నాకోసం విమానం వచ్చింది' అంటూ ప్రాణం వదిలాడు. తాతకి లక్ష్మి అంటే ప్రాణం. లక్ష్మికి తాత మంచితాత.... తాత జబ్బుగా వున్నప్పుడు రోజూ మధ్యాహ్నం వేళల్లో ఒక చేత్తో ముక్కు మూసుకుని, మంచంలో తాత పక్కనే కూర్చుని విసనకర్రతో విసిరేది. అత్తయ్యవచ్చి 'ఏమే పిల్లా, మీ తాతకి నీవంటే ప్రాణం. నీవేమో తాతని అసహ్యించుకుని ముక్కు మూసుక్కూర్చున్నావు. శీలాల మారిదానా! అన్నది. "నాకూ తాతంటే ఇష్టం. అందుకే విసురుతున్నాను." "మరి ముక్కు మూసుకున్నావే!" "వాసనుంటే ముక్కు మూసుకోరా!" అత్తయ్య మాటలు లక్ష్మికి అర్థం కాలేదు. తాతయ్య చనిపోయాడు. అందరూ ఏడ్చారు. లక్ష్మి ఏడవలేదు. అత్తయ్య పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని "తాతయ చచ్చిపోతే ఏడుపన్నారాలేదే

నీకు.... తాత లేడు" అన్నది.

"అడుగో తాత"

"ఈ తాత చచ్చిపోయాడు. ఇహ కాల్చేస్తారు".

"పోనీ కాల్చెయ్యొద్దులే."

"ప్రాణం పోయాక శరీరం నిలవదు. కుళ్లిపోతుంది.... ప్రాణం లేని కట్టె ఎందుకు?"

"ప్రాణం ఎక్కడికి పోయింది?"

"దేవుడి దగ్గరికి".

దేవుడి దగ్గరకు పోతే ఎందుకేడవటం? అత్తయ్య ధోరణి లక్ష్మికర్థం కాలేదు. తాతయ్య కోసం విమానం వచ్చింది. వెళ్ళిపోయాడు. లక్ష్మికి ఏడుపు రానేలేదు. తాతయ్య దేవుడి దగ్గరున్నాడు. బాధ కలిగినప్పుడు, భయం వేసినప్పుడు ఏకాంతంలో దేవుడి దగ్గరున్న తాతయ్యకు చెప్పుకునేది లక్ష్మి. చాలాకాలంవరకూ చెప్పుకున్నది.... కాని ఇప్పటి జయలక్ష్మి వేరు. ఈమెకు చావు అర్థం కావటం లేదు. చావంటే భయం. విపరీతమైన భయం.

ఊళ్ళోకి సిటీ సర్కస్ వచ్చింది. అందరూ పిల్లల్ని సర్కస్‌కు తీసుకుపోయి చూపించుకుని వస్తున్నారు.

ఊళ్ళోకి సిటీ సర్కస్ వచ్చింది. అందరూ పిల్లల్ని సర్కస్‌కు తీసుకుపోయి చూపించుకుని వస్తున్నారు. కొంచెం పెద్దపిల్లలు "దాంట్లో ఏం తమాషా ఉంది? అంతకంటే సినిమా చూస్తే ఎంతో బాగుంటుంది?" అంటున్నారు. "ఏనుగు స్టూలుమీద కూర్చుంటే ఎందుకు సంతోషం? పులి తాడు మీద నడుస్తే ఎవరికేం ఒరుగుతుంది? మనుషులు ఎంతపైన ఉయ్యాలలూగితే మనకేమిటి? సినిమాల్లో వీటి తాతల్లాంటివి చూపిస్తారు.... సర్కస్ ఏమంత గొప్పగా లేదుగాని, అందులో ఒక బఫూను ఆడవేషం వేసుకుని మగబొమ్మతో డాన్సు వేస్తాడు. చీరా, రైకా, పావడా అన్నీ విప్పేస్తాడు. అది భలే తమాషాగా వుంది" అంటున్నారు.

రాధిక బలవంతాన జయలక్ష్మి కూడా వెళ్ళింది.

ఆ పిల్లకు ఆరేళ్ళుంటాయేమో, రంగంమీదకు వచ్చింది. చిన్న మెరిసే చెడ్డీ తప్ప వేరే బట్టలేమీ లేవు. ఆచ్ఛాదన లేకుండటాన ఆ పిల్ల పసితనం మరింత స్పష్టంగా తెలుస్తున్నది. సరైన పట్టు లేకుండా నిలబెట్టిన సన్నని గెడమీదికి పాక్కుంటూ వెళ్ళి పైన ఫీట్స్ చేసింది. టేబిల్ మీద నిల్చుని ఒంట్లో ఎముకలనేవి లేవేమో అనిపించేట్లుగా ఒళ్ళంతా రకరకాలుగా వొంచి చుట్టివేసింది. ఒక్కోచుట్టు తిప్పడం అవహానే లేచి నిల్చుని, ఒక ఘనకార్యం చేసినట్లు మొహంనిండా నవ్వు పెట్టుకుని ప్రేక్షకులవైపు చూసి చెయ్యూడిస్తున్నది. "మీరు చెయ్యలేని పనిని నేను చేశాను. అది చూడ్డానికి మీరు వచ్చారు. మీరు చూడాలని ఇంతదూరం వచ్చిన ఈ పనిని నేను చేసేశాను" అన్నట్లు చెయ్యి వూపుతున్నది పిల్ల. కాని ప్రేక్షకుల మొహాల్లో నవ్వులేదు. ఆశ్చర్యం లేదు. కరతాళధ్వనులు లేవు. రాతిబొమ్మల్లా కూర్చుని ఊరుకుంటున్నారు. "ఆ పిల్ల ఇంక ఎంతసేపు అలా గర్వంగా నవ్వగలదు?" అనుకుంది జయలక్ష్మి.

> **ఒక టేబిల్‌మీద నాలుగు సీసాలు పెట్టి వాటిమీద చదరపు పలక పెట్టారు. పిల్ల దానిమీదకెక్కింది.**

ఒక టేబిల్‌మీద నాలుగు సీసాలు పెట్టి వాటిమీద చదరపు పలక పెట్టారు. పిల్ల దానిమీదకెక్కింది. పలక నాలుగుమూలలా మరో నాలుగు సీసాలు పెట్టి ఇంకో పలకపెట్టారు. జాగ్రత్తగా బాలన్సు చేసుకుంటూ దానిమీదకెక్కింది. ఇట్లా నాలుగు పలకలు పెట్టారు. పిల్ల పైపైకి వెళ్ళిపోతోంది. నాలుగో పలక మీద మూడుసీసాలు పెట్టి త్రికోణపు పలక పెట్టారు. చాల జాగ్రత్తగా దానిపైకి ఎక్కింది. సీసాలు పెట్టే ముసలాయన పిల్ల అంతెత్తునుంచీ పడిపోతే పట్టుకోడానికి అనువుగా చేతులు పైకి చాచి ఏమరకుండా చూస్తూ పక్కనే నిల్చున్నాడు. పిల్ల ఆ పైన నిల్చుని ఒళ్ళంతా చుట్లు తిప్పింది. అన్నీ పూర్తి చేసుకుని నిల్చుని చెయ్యూడించింది. ప్రేక్షకుల్లో చలనం లేదు. ఒక బఫూన్ వచ్చి "చప్పట్లు ఖొటండి, ఖొటండి" అంటూ చప్పట్లు చరిచి చూపాడు. అందరూ నవ్వుతూ అందుకొని చప్పట్లు కొట్టేశారు. ఆ పిల్ల చేస్తున్నంతసేపూ జయలక్ష్మికి పిల్ల పడిపోతుందేమోనన్న భయం. ఆ భయంలోనే ఎందుకో "ఆ పిల్లకొక మెరిసే గౌను తొడిగితేనేం?" అనుకుంది చాలాసార్లు. 'పసిపిల్ల పొరపాటున పడిపోతే అవిటదయిపోతుంది. అవిటిదనం భయంకరమైనది. పసిపిల్లచేత ఎవరూ మెచ్చని ఈ పనులన్నీ ఎందుకు చేయిస్తున్నారు? మీ డబ్బులు మీకెలాగు వస్తాయిగాని ఆ పిల్లచేత చేయించొద్దు"

అని మేనేజిమెంటుతో చెప్పాలనీ, రంగంపైకెక్కి అరవాలనిపించింది జయలక్ష్మికి.

"ఎక్కడికి వెళ్ళినా దుఃఖపడటానికి ఒక కారణం కనబడుతుంది అమ్మకి" అన్నది రాధిక నవ్వుతూ.

**అందరూ ఎందుకు దుఃఖపడటం లేదు? ఆ సర్కస్ పాపతో మనకు సంబంధం లేదు. ఆ పిల్ల అవిటదయిపోతే మనం దుఃఖపడం.**

అందరూ ఎందుకు దుఃఖపడటం లేదు? ఆ సర్కస్ పాపతో మనకు సంబంధం లేదు. ఆ పిల్ల అవిటదయిపోతే మనం దుఃఖపడం. ఆ పిల్ల భవిష్యత్తు గురించి మనం ఆలోచించం. వాటిని నేర్చుకోడానికి ఎంత శ్రమపడిందో మనకక్కరలేదు. ఆ పిల్ల తీసుకుంటున్న రిస్క్ తో మనకు సంబంధం లేదు. అందుకే ఆ పిల్ల చేస్తున్న పనుల్లో మనకు ఉత్సాహం లేదు. మామూలుగా చేసేవి చేస్తున్నది. అంతేకదా అనిపిస్తుంది. ఏనుగు యొక్క సహజ గాంభీర్యమూ, అడవికి రాజు వంటి పులి స్వభావంలోని రాజసమూ మనకు తెలియదు. అందుకే కనికట్టు లాంటి సినిమా దృశ్యాలకీ, దీనికీ పోల్చ సాహసిస్తున్నాం. ఎదుటి ప్రాణితో 'సంబంధాన్ని' కోల్పోయి ప్రాణులన్నింటిలోకీ హీనజాతి అయిపోతున్నాం. ఒక శరీరంలోని సహజమైన కణాలన్నిటి మధ్యనా ఒక ప్రాణం, ఒక నియమం, ఒక సంబంధం వుంటుంది. సంబంధం తప్పిపోయినవి అసహజమైన కాన్సర్ కణాలై వూరికే అస్తవ్యస్తంగా పెరిగిపోయి శరీరాన్నే నాశనం చేస్తాయి... మానవజాతి కూడా ఎదుటి మనిషితోనూ, అతని సుఖదుఃఖాలతోనూ, కష్టనిష్ఠూరాలతోనూ సంబంధం కోల్పోవడాన రోగగ్రస్తమైపోతున్నది!.... స్వామీ, మానవజాతిని ఒక క్యాన్సర్ పుండుగా మార్చకు. ఏడ్చే నవ్వే మనుష్యులుగా ఎదుటి వాళ్ళను అర్థం చేసుకునేవాళ్ళుగా వుండనీ!

ఇంటికొచ్చేసరికి చంద్రిక హాల్లో ఒక గజ్జికుక్కతో ఆడుకుంటున్నది. పని పిల్ల కూర్చొని నిద్ర పోతున్నది. ఇంటినిండా కమురు కంపు. ఎవరి శరీరమో స్మశానంలో కాలిపోయింది. కంపు, చావు, అశుభం – భయంకరమైనది, తలచరానిది ఇంట్లో దూరింది.

జయలక్ష్మి పనిపిల్లని తిట్టి లేపింది. గజ్జికుక్కను కొట్టి తరిమేసింది. చంద్రికను

చూస్తే కోపం, దుఃఖం పట్టరాకుండా వచ్చేశాయి. ఎడాపెడా బాదేసింది. చేతులు నొప్పి పుట్టేవరకూ బాదింది. సీతారామారావు వచ్చి ఏడుస్తున్న పిల్లను దగ్గరకు లాక్కునేవరకూ కొట్టింది.

"ఎందుకు దాన్నట్లా చావగొడతావు?" అన్నాడతను కోపంగా....

అతనికి కోపం రావటం అరుదు.

"ఎందుకా? ఎందుకా??..... అది అట్లా మురికి కుక్కల్తో ఆడుకుంటూ బుద్ధి లేకుండా వుండటం సహించలేను. అందుకని!" అన్నది.

"అది దాని పుటక. కొడితే మారుతుందా? మారదు! మారకపోతే నీకు అక్కర్లేదా? అది బతికుండాలనీ, బాగుండాలనీ వుంది. అందుకనే ఈ పరిస్థితిని సహించలేక బాధపడుతున్నది. ఎంత మాటను ఎంత సులువుగా అడిగారు!" జయలక్ష్మికి కడుపులో మంట పుట్టింది.

"అది ఎట్లావున్నా మీకు ఫరవాలేదు. అదేమైపోయినా మీకు ఫరవాలేదు. అందుకే నింపాదిగా సూత్రాలు మాట్లాడుతారు. అది బాగుండాలనుకునేవాళ్ళయితే అక్కరగలవాళ్ళయితే మీకూ బాధపుట్టేది" అన్నది.

అతను సమాధానం ఇవ్వనవసరం లేనట్లు వూరుకొన్నాడు. అనుకున్న మాట అనేస్తాడు. ఇహ ఎన్నన్నా సమాధానం ఇవ్వడు. ఆ మౌనం వలన అతని మాట నిజమైపోతున్నట్లు ఆమెకు బాధ కలుగుతుంది. అతనన్న మాట ఆమెను నలిపేస్తుంది.

"అది బతికుండాలని లేదా? అది అంతే. దాని పుటక అంతే. అది నీకు అక్కర్లేదా?" ఈ ప్రశ్నలు ఆమెలో ప్రతిధ్వనించాయి.

ఒక క్షణం ఆ పిల్లను కడుపులో దాచుకొని కాపాడుకోవాలని ఆరాటం, మరో క్షణంలో కోపంతో దాన్ని చావబాదటం.... ఓ ఆవేశపు వలయంనుంచీ ఆమెకు విముక్తి లేదు!

"పిల్ల అక్కర్లేదని నేనెందుకంటాను? అది నా బిడ్డ కాదా? పిల్లలు బాగుండాలని ఆశించడం తల్లి ధర్మం కాదా? రాధికను చూచి ఎంత ఆనందిస్తాను! ఇదీ అలాగే బాగుండాలని కోరుకోవడం తప్పా?"

నా ఆశల్నీ కోరికల్నీ ప్రేమిస్తున్నానేగాని నిజంగా ఈ పిల్లల్ని ప్రేమించడం లేదా? ప్రేమించడం, అర్థం చేసుకోవడం, ఒప్పుకోవడం.... అన్నీ ఒకటేనా?

ఈ బాగోగుల మనస్సు ఎలా ఏర్పడింది?

'ఆలోచనలు, కోరికలు, ఆశలు అన్నీ అబద్ధాలేనా?'

సమాధానంలేని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరైపోయింది జయలక్ష్మి.

3

శ్రీనగర్ కాలనీలో మొదటివీధి చివర ఇంటి పాప మూడేళ్ళ పద్మ. ముద్దులు మూటగట్టినట్లుండే పద్మ సంచీ బుజానికి వేళ్ళాడేసుకుని పనిమనిషి కారియర్ తెస్తుంటే ఒక్కోసారి ఏడుస్తూనూ, ఒక్కోసారి ఏడవకుండానూ స్కూల్ బస్ దగ్గరకు వెళ్ళటం జయలక్ష్మి చాలాసార్లు చూచింది. పద్మ సరిగ్గా చంద్రిక రంగులో, అంతే ఎత్తుగా, పలుచగా ఉంటుంది. అన్ని సరిగ్గా వుంటే చంద్రిక కూడా ఇలానే వుండేది కదా అని జయలక్ష్మికి లీలగా అనిపించేది. ఆ అమ్మాయి బస్సు దగ్గరకు వెళ్తుంటే చూడటం జయలక్ష్మికి సంతోషం.

ఆ రోజున పద్మని స్కూలుకు పంపడానికి డ్రస్ వేశారు. పనిమనిషి కారియర్ పట్టుకుని తయారుగా వుంది. బస్సుకు టైమయింది.

ఆ రోజున పద్మని స్కూలుకు పంపడానికి డ్రస్ వేశారు. పనిమనిషి కారియర్ పట్టుకుని తయారుగా వుంది. బస్సుకు టైమయింది. పద్మ పెద్దగా ఏడుపు ప్రారంభించింది. వాళ్ళమ్మ పద్మను తిట్టి, రెండు అంటించి పనిమనిషికిచ్చి పంపేసింది. తొందర తొందరగా బస్సులో ఏడుస్తున్నందుకు కండక్టరు కసురుకుంటూనే వున్నాడు. పద్మ ఏడుపు తగ్గలేదు. క్లాసులో టీచరు ఏడుస్తున్నందుకు పద్మని క్లాసు బయట కూర్చోపెట్టేసింది. ఆ బయట గోడకానుకుని ఒంటరిగా కూర్చొని ఏడ్చి, ఏడ్చి చచ్చిపోయింది పాప. చెడ్డీలో చచ్చివున్నది తేలు.... ఈ విషయం విన్నప్పుడు జయలక్ష్మికి కడుపులో వికారం కలిగింది. భయంతో, దుఃఖంతో గుండెలో బరువు. ఎవరిమీదో కోపం. ఏమిటీ అమానుషం! కుక్క అరిస్తే అరుపులోని అర్థం తెలుస్తుంది. పాప ఏడిస్తే అది బాధవలన ఏడుపో, మామూలు బడి ఏడుపో ఎందుకు కనుక్కోలేకపోయారు? అంత పసిపాప అలా ఏడిస్తూ బడికి పోకపోతేనేం?.... మూడో ఏట అమ్మ పాపని బస్సులో వేస్తుంది. బస్సు బళ్ళో వేస్తుంది. టీచరు ఏడ్చేవాళ్ళని బయటా, ఏడవని

వాళ్ళను లోపలా వేస్తుంది. క్రమం ప్రకారం యంత్రం ఠంచనుగా కదిలిపోతూ వుంటుంది. ఆగటానికి వీల్లేదు. అమ్మలూ లేరు, పాపలూ లేరు. యంత్రం టకటక మాత్రమే వుంటుంది. మనిషి ఒంటరితనంలో ఏడ్చి ఏడ్చి చచ్చిపోతాడు.

అయ్యో, పాపా, అంత ప్రాణాంతకమైన నొప్పిని ఒక్కదానివే ఎలా భరించావమ్మా.... మీ అమ్మ నిన్ను పొదివి పట్టుకొని నీ నొప్పికి నీతో ఏడ్చివుంటే.... స్వామీ, ఈ ప్రపంచంలో ఎవరినీ ఒంటరి చెయ్యకు. ఒంటరితనం భయంకరమైనది, భరించరానిది. తలచుకొని తలచుకొని కుమిలిపోతోంది జయలక్ష్మి.

"అతిగా ఆలోచించటం ఆరోగ్యకరం కాదు, జయా! ఎందుకు వూరికే లేనిపోనివి ముందు వేసుకుని బాధపడతావు?" అన్నాడు సీతారామరావు. "మనుషుల్ని పట్టిపీడించే ఈ భూతాలు లేనిపోనివా? నేను పనిలేక కూర్చుని బాధపడుతున్నానా? "ఆలోచన అనేది మనిషి లక్షణం. అది అక్కర్లేనిది జంతువులకూ, వెర్రివాళ్ళకూను" అన్నది విసురుగా.

"దాన్లోనూ రెండు రకాలున్నాయి. జరుగుతున్నదాన్ని, జరిగినదాన్ని అర్థం చేసుకునే ఆలోచన ఒకరకం. అది మంచిదే. కాని జీవితాన్ని ఒప్పుకోలేక అనవసరపుటూహలతో బాధను పెంచుకుంటూ పోవటం మంచిది కాదు.... మనసు వేరూ. శరీరం వేరూ కాదు. మనసులో పుట్టే ఊహలకి శరీరంమీద ఫలితం వుంటుంది. నవ్వటం నేర్చుకోవాలి జయా!"

అయ్యో జీవితమే దుఃఖసముద్రం అయివుండగా నవ్వటానికి వీలెక్కడుంది! ప్రపంచంలోని రంగులన్నీ చూద్దామని, ఎన్నెన్నో రుచుల్ని చవిజూద్దామని, గుండెనిండా గాలి పీల్చుకుందామని, ఎగిరే దుమికే ప్రాణుల్తో ఎగిరి దుముకుతూ నవ్వుదామని చిన్ని శరీరంలో జీవం నింపుకుని ఆనందంగా వచ్చిన పద్మకేమయింది!

అనుభవం, ఆనందం, ఇవి అబద్ధాలు.

ఒంటరితనం, చావు, దుఃఖం.... ఇవే నిజం.

అవాంఛనీయాలు, అనుకోని ప్రమాదాలు, పిచ్చివాని చేతిలోని రాళ్ళలాగా వచ్చిమీదపడుతున్నాయి. వీటిని నియంత్రించే సూత్రం ఉన్నదా? లేదా? ఇవి మనిషిని కించపరిచి అధీరుణ్ణి చేస్తున్నాయి. భయపెట్టి నాశనం చేస్తున్నాయి.

తల దాచుకోడానికి ఎన్నో చోట్లుండగా చెడ్డీలోకే తేలు ఎందుకొచ్చింది? అది కొంచెంగా అటు తిరిగి వేరేచోటికి వెళ్ళి వుండవచ్చు. చెడ్డీ తీసినప్పుడు క్రిందపడిపోయి వుండవచ్చు. అది కుట్టగానే వాళ్ళు గమనించి డాక్టరు దగ్గరకు

తీసికెళ్ళి వుండొచ్చు. బ్రతికి వుండటానికి ఎన్ని అవకాశాలు! కొంచెం అటు ఇటు అయితే బ్రతికిపోవచ్చు. అటు ఇటు చేసే అవకాశాన్ని ఎలా పట్టుకోవాలి? పిచ్చివాడి చేతిలోని రాళ్ళనుంచీ ఎలా తప్పించుకోవాలి? అసలు ఈ అవకాశం అనేది వుందా? ఉన్నట్లు కనిపిస్తూ, మెరిపిస్తూ, మురిపిస్తూ అనిశ్చితిలో మనిషిని నిలిపి ఆడిస్తున్నది అది!

....మనిషి పరిస్థితుల ముందు చిన్నవాడు కావచ్చు. అధీరుడు కావొచ్చు. భయంతో, దుఃఖంతో నశించవచ్చు. కాని 'మనిషి'గానే నశించవచ్చునే. తన్ను తాను యంత్రంగా మార్చుకోవలసిన దుర్గతి ఎందుకొచ్చింది?

**సీతారామారావుగారి చిన్నాయన వెంకటప్ప పల్లెనుంచీ వచ్చారు. అతనికి నలభై ఏళ్ళ వయసు.**

ఏదో పొరపాటు జరుగుతోంది! ఎక్కడో ఏదో సంబంధం తప్పిపోతున్నది! జీవితంలోని ఏదో కృప జారిపోతున్నది!

........ఆవేశమంతా ఆలోచనలుగా మారి ఆమెనుండి వేరై చల్లబడిపోయింది. ఆ దుఃఖానికీ, ఈ ఆలోచనలకూ ఏమీ సంబంధం కనబడలేదు.....

4

సీతారామారావుగారి చిన్నాయన వెంకటప్ప పల్లెనుంచీ వచ్చారు. అతనికి నలభై ఏళ్ళ వయసు. ఎందుకో, కారణం లేకుండా ఈ మధ్యన మనిషి బాగా కరిగిపోయాడు. జలుబు చేసి తగ్గటం లేదు. ఈ మధ్యనే కొద్దిగా వీపులో నొప్పి ప్రారంభమైంది. పరీక్ష చేయించాలని చెల్లెలు సుబ్బమ్మ బలవంతాన వెంటబెట్టుకొచ్చింది. ఎక్స్ రే తీశారు. కుడి ఊపిరితిత్తిలో క్రిందిభాగాన గడ్డ కనిపించింది. బ్రాంకోస్కోపీ చేసి చూచారు. కాన్సర్ అని ధృవపడింది. ఆ విషయం చెప్పినప్పుడు ముసలాయన గోడకానుకుని కూర్చుని 'ఆహాఁ' అని తలూపాడు. విచారంగాని, బాధగాని ఏమీలేదు ఆ స్వరంలో. ఈ మనిషికి అసలు సంగతి అర్థమైందా? అన్న అనుమానం వచ్చింది జయలక్ష్మికి. సుబ్బమ్మత్తా, సీతారామారావూ అతని దగ్గర కూర్చుని ఏమీ ప్రమాదం మీదకు రానట్లుగానే అతనితో ట్రీట్‌మెంట్ గురించి, వూళ్ళో కబుర్లూ మాట్లాడుతూనే వున్నారు.

ఈ నాలుగు రోజుల్లోనే నొప్పి జాస్తి అయింది. అతనికి ఆపరేషన్‌కు తట్టుకోగల శక్తి లేదు. వెంటనే ఏదో ఒకటి చెయ్యాలి.... మర్నాడు రైల్లో

హైదరాబాద్ కాన్సర్ హాస్పిటల్‌కు తీసుకు వెడతానన్నాడు సీతారామారావు.

సీతారామారావుకు తండ్రి చిన్నప్పుడే పోయాడు. తల్లి అతని పెళ్ళి కాకముందుగానే పోయింది. పినతండ్రులు నలుగురూ మేనత్తలు ఇద్దరూ ఉన్నారు. అందరూ కలిసే వున్నారు. కాలగమనంతో ఆ పల్లెలోని సమిష్టి కుటుంబాలన్నీ చిన్న చిన్నవిగా ముక్కలైపోయినా, సోంపల్లె వారి కుటుంబం అలానే వున్నారు. ఇంట్లోని కష్టనష్టాలన్నీ ఆడవాళ్ళు సర్దుకోవాల్సిందేగాని, విడిపోవటం అనేది లేదు. పూర్వం నుంచి కుటుంబంలో వున్న పాతికెకరాలు మడిసీ సేద్యం చేసుకుంటారు. పండింది అందరూ తింటారు. ఉంటారు. కాలం తీరి చనిపోయినవాళ్ళను వాళ్ళ చింతలదొడ్లోనే భూస్థాపితం చేస్తారు. ఏడాదికోసారి పోయినవాళ్ళకు భోజనం, బట్టలూ ఇస్తారు. వాళ్ళ తాత, అవ్వ, అమ్మ, నాయన, బావిలోపడి చనిపోయిన రెండేళ్ళ శ్రీను, పరికిణి అంటుకొని కాలిపోయిన సునీత, రెండ్రోజుల జ్వరానికే ప్రాణం విడిచిన పార్వతి, అందరికంటే పెద్దన్న రామయ్య – పోయినవాళ్ళంతా ఒక్కరూ ఒక్కో రాతికింద స్థిరంగా వుంటారు ఎల్లకాలాలకీను. ప్రాణం పోయినవాళ్ళు చింతలదొడ్లోను, బ్రతికున్నవాళ్ళు వూర్లోను. చావుకీ, బతుక్కీ తేడా అంతే. చావు కూడా బ్రతుకులోని భాగమే.

> **అవిచ్ఛిన్నంగా ఇలా జరిగిపోతున్న ఆ జీవనవిధానంలో వెంకటప్ప మొదట్నుంచి ఆకతాయిగానే పేరు తెచ్చుకున్నాడు.**

అవిచ్ఛిన్నంగా ఇలా జరిగిపోతున్న ఆ జీవనవిధానంలో వెంకటప్ప మొదట్నుంచి ఆకతాయిగానే పేరు తెచ్చుకున్నాడు. చిన్నప్పట్నుండీ కూడా సిగరెట్లు, బీడీలు ఎక్కువగా కాల్చేవాడు. వాళ్ళ పద్ధతులన్నిటినీ ప్రశ్నించి, కాదని, ఎగతాళి చేసేవాడు. క్రియదగ్గర మాత్రం నలుగురితోపాటు నారాయణా అంటాడు. అతని ప్రోత్సాహం వల్లనే సీతారామారావు బయటికిపోయి చదువుకున్నాడు. డాక్టరయ్యాడు. వాళ్ళిద్దరికీ చేరిక ఎక్కువ.

“వీళ్ళు నన్ను ఆ హైదరాబాదు నుంచి ఇంటికి తీసుకురారు. అక్కడే పారేస్తారు!” ఆ రాత్రి ముసలాయన స్వాధీనంలో లేకండా ఆ చీకట్లోంచి నొప్పిలోంచి దూసుకొచ్చింది ఆవేదన.

“పొద్దున్నుంచీ హైదరాబాద్ పోదామంటే సరేనన్నాడు. లోపల ఏముందో

చూడు.... ఎంతకీ వూరి చుట్టుపక్కల దాటి రారు. వీళ్ళందరూ అంతే!" సీతారామారావు నవ్వాడు.

సుబ్బమ్మత్త తలూపింది. వాళ్ళందరూ అంతే!

"హైదరాబాదు చాలా దూరం. బెంగుళూరు వెళ్దాం. మనూరినుంచి మనవాళ్ళంతా రావటానికీ, మనము అనుకున్నప్పుడు తిరిగి ఊరు చేరడానికి వీలుగా వుంటుంది" అన్నాడు ముసలాయనతో.

ముసలాయన ముఖంలో తృప్తి కనిపించింది. తరంకాని జబ్బు వచ్చినప్పుడు వాళ్ళ వాళ్ళందరూ బెంగుళూరే వెళ్తారు, దగ్గరగా ఉంటుందని.

సీతారామారావు వెళ్ళి అతన్ని కాన్సర్ హాస్పిటల్లో చేర్పించి డాక్టర్‌తో మాట్లాడి, సుబ్బమ్మత్త వుండటానికి ఏర్పాటు చేసి వచ్చాడు. కోబాల్ట్ ట్రీట్‌మెంట్ నెలరోజులు పడుతుంది. తర్వాత వూరికి తీసుకెళ్ళవచ్చు.

కాని వారం రోజులకే టెలిగ్రాం వచ్చింది, అతనికి సీరియస్‌గా వుందని.

సీతారామారావు వెళుతుంటే జయలక్ష్మి కూడా బయల్దేరింది. కాన్సర్ హాస్పిటల్ పక్కనే మెదడు, నరాల వ్యాధుల హాస్పిటల్ చాలా పెద్దది ఉన్నది. అక్కడ చంద్రికను చూపించాలన్నది.

> కాన్సర్ హాస్పిటల్ పట్టణానికో చివర్న పెద్ద మైదానంలో వుంది. ఒక్క బ్లాక్ మాత్రం కట్టారు.

కాన్సర్ హాస్పిటల్ పట్టణానికో చివర్న పెద్ద మైదానంలో వుంది. ఒక్క బ్లాక్ మాత్రం కట్టారు. ఇంకో రెండు బ్లాకులు నిర్మాణంలో వున్నాయి. భవనం పెద్ద గాజు కిటికీలతో, పలకలతో అత్యాధునికంగా, శుభ్రంగా వుంది. అందమైన, ఆరోగ్యకరమైన జీవితానికి పెట్టిన కోటలాగా వుంది గాని మృత్యుదేవత కంచుకోట అని అనుకోవడానికి ఏమాత్రం వీల్లేదు.

మగవాళ్ళ వార్డు అనబడే గది పొడుగ్గా, విశాలంగా వుంది. ముందుగా గోడకానుకొని వరుసగా మందుల బీరువాలు, పక్కనే పెద్ద స్టూలుమీద ఈశ్వరుడి పటం. ఆ పక్కనే కుర్చీలో డ్యూటీనర్సు. అక్కణ్ణుంచి రెండు వరుసల్లో మంచాలు. మంచాలమీద తెల్లని దుప్పట్లు. కాళ్ళ దగ్గర ఎర్రని రగ్గులు. అన్ని మంచాలమీద అన్ని వయసుల మనుషులూ వున్నారు. కొందరు దగ్గరున్న వాళ్ళతోనో, పక్కనున్న వాళ్ళతోనో మాట్లాడుతున్నారు. ఇద్దరికీ రక్తనాళాల ద్వారా సెలైన్ ఎక్కుతోంది.

కొందరికి ముఖాన, కొందరికి గొంతుమీద, కొందరికి ఛాతీమీద, ఒకతనికి కాలుమీద ఊదారంగు సిరా గుర్తులున్నవి, కోబాల్ట్ ట్రీట్‌మెంట్ ఇవ్వవలసిన చోటును సూచిస్తూ. పేషెంట్లందరూ ఏ పనిలో, ఏ స్థితిలో వున్నా కొత్త మనుషుల రాక పోకల్ని గమనిస్తున్నారు. నిర్వికారమైన ముఖాల్లో ఏ భావమూ లేని కళ్ళు అందరి అన్ని కదలికల్ని అలవాటుగా గమనిస్తూ కదులుతున్నై.

> జయలక్ష్మి పేషెంట్లందరి ముఖాల్ని వరుసాగ్గా పరిశీలించింది. అక్కడ ఏదో చూడాలనీ, తెలుసుకోవాలనీ తపన.

జయలక్ష్మి పేషెంట్లందరి ముఖాల్ని వరుసాగ్గా పరిశీలించింది. అక్కడ ఏదో చూడాలనీ, తెలుసుకోవాలనీ తపన. మృత్యుగహ్వారంలో వున్నవాళ్లని ఏదో అడగాలనీ, ఎవరికీ తెలియరానిదీ, వాళ్ళకు మాత్రమే తెలిసేది అయిన నిగూఢ విషయాన్ని గ్రహించాలని ఆరాటం.

"మేము చచ్చిపోయేవాళ్ళమని మీరు అనుకుంటున్నారుగదా అన్నట్లున్నవి వాళ్ళ చూపులు – అందుకే అందర్నీ అలా చూస్తున్నారు" అన్నది జయలక్ష్మి సీతారామారావుతో తగ్గుస్వరంలో...

"మనిషన్న ప్రతివాడు చచ్చిపోయేవాడే..... వాళ్ళట్లా అనుకోవాలని నీ ఉద్దేశ్యం" అన్నాడు రావు.

కాన్సర్ వచ్చాక ఇవాళో, రేపో చావబోతున్నామని నిశ్చయంగా తెలిశాక ఇంకేమనుకుంటారు ఎవరైనా? ఇతనితో ఇగ ఎప్పుడూ ఏమీ అనకూడదు అనుకుంటుంది ప్రతిసారీ, కానీ అంటూనే వుంటుంది.

వెంకటప్ప చిన్నాన్న పధ్నాలుగో నెంబరు బెడ్‌మీద కూర్చుని వున్నాడు.

"రాత్రి చాలా గత్తర అయ్యింది. డాక్టర్ నీకు టెలిగ్రాం ఇవ్వమన్నాడు. పదో నెంబరు వాళ్ళతో చెప్పి ఇప్పించాను. రాత్రంతా ముక్కుకి గాలి పెట్టారు. మతి లేదు. మా అమ్మ, అవ్వ, నాయన, పెద్దన్న, అత్త, సునీతి, సుబ్బమ్మ, సీతారావుడు అందరు ఉండేచోటికి నేనూ పోతా అని పలవరింత. ఇహ తీరిపోయిందనే అనుకున్నా. తెల్లారేసరికి చూడు ఎంత బాగా లేచి కూర్చున్నాడో!" అంది

సుబ్బమ్మత్త.

వెంకటప్ప చిన్నాన్న షెల్ఫ్ మీద ఉమ్మి గిన్నె చేతిలోకి తీసుకుని మెల్లగా, బలహీనంగా దగ్గి దగ్గి పలుచటి బంకను దాన్లోకే వూసాడు. "రాధికమ్మ రాలేదే! ఇంట్లో ఎవర్నన్నా తోడుగా వుంచారా?" అన్నాడు మెల్లగా, కష్టంగా....

"నీకు బాగాలేదంటే మేము అర్జంటుగా బయల్దేరి వచ్చాం" అన్నాడు రావు.

"బాగుంది. ఇప్పుడు బాగుంది" అన్నాడు ముసలాయన.

ఆ రోజే ఆపరేషన్ అయి సగం మగతలో వున్న నడివయస్కుణ్ణి కూతురు అడుగుతోంది. "టెంకాయలు మళ్ళీ ...

పేషెంట్లు అడపాదడపా ఉమ్మిగిన్నెల్లోకి ఆ బంక వూస్తూనే వున్నారు. హాస్పిటలు, వార్డులు, మంచాలు, అక్కడుండే మనుషులు, గచ్చు, చుట్టూ వుండే మట్టికూడ ఆ వుమ్మిని, ఆ జబ్బును పొదుగుకొని అందర్నీ పట్టుకోవాలని పొంచివున్నట్టు తోచింది జయలక్ష్మికి. ఒళ్ళంతా భయంతో, అసహ్యంతో ముడుచుకుపోతోంది. 'ఇక్కడ్నుంచి తక్షణం పారిపోవాలి' అన్న తొందరపాటు పుడుతున్నది. కాని అక్కణ్ణుంచి కదలనీయకుండా ఏదో శక్తి ఆమెను అంత గట్టిగానూ కట్టిపడవేస్తోంది.

"ఎప్పుడు బయల్దేరారో..... ఫ్లాస్కులో కాఫీ వుంది. తాగండి" అన్నది సుబ్బమ్మత్త.

"ఒద్దు.... ఒద్దు" అరిచినట్లు కేక పెట్టింది జయలక్ష్మి.

ఆ రోజే ఆపరేషన్ అయి సగం మగతలో వున్న నడివయస్కుణ్ణి కూతురు అడుగుతోంది. "టెంకాయలు మళ్ళీ అయిపోతయ్యేమో డబ్బులియ్యి తెస్తాను" అని. అతను ఎంతో ప్రయాసతో జేబులో చెయ్యి పెట్టి తడుముకుని నోట్లకట్టలోనుంచి అయిదు రూపాయల నోటు తీసి ఆమె చేతికిచ్చాడు.

గట్టిగా, దిట్టంగా వున్న దవడ కాన్సర్ పేషెంటు, ఎవరినో బయటి వరండాలోనికి పిల్చుకుపోయి తగ్గుస్వరంలో వ్యవహార విషయాలు చర్చిస్తున్నాడు.

కాలి ఎముక కాన్సర్ ముసలాయన పెండ్లాము పెద్ద కుంకుమ బొట్టు

పెట్టుకున్న పండు ముత్తయిదువ ఈశ్వరుని పటానికి పూలదండ వేసి, పూజ చేసి అరటిపండ్లు నివేదన పెట్టింది. ఇవాళ ముసలాయన్ని డిశ్చార్జి చేసి ఇంటికి పంపుతున్నారు. అతనికి ఇప్పట్లో వాళ్ళు చేయగలిగిన ట్రీట్‌మెంట్ అయిపోయింది. అతన్ని బయటికి తీసుకువెళ్ళడానికి మనుష్యులు స్ట్రెచర్ తెచ్చారు.

అవతల మంచంలో బట్టల క్రింద మనిషి వున్న వైనం కూడా తెలీకుండా మంచాని కంటుకుపోయిన ముసలాయనకు, ముక్కులోంచి ప్లాస్టిక్ ట్యూబ్ వేళ్ళాడుతున్నది.

ఆమె అరటిపండ్లు ఒలిచి చిన్న ముక్కలుగా తుంచి వార్డులో అందరికీ ప్రసాదం పంచింది. నవ్వు మొగాలతో అందరు భక్తిగా, కళ్ళకద్దుకొని నోట్లో వేసుకున్నారు. జయలక్ష్మికి ఆమె అందరికీ కాన్సర్ ముక్కలు పంచుతున్నట్లనిపించింది. యిచ్చిన ముక్కను చేతితో పట్టుకొని ఏం చేయాలో తెలీక చూస్తూ నిల్చుంది. తనకిచ్చిన ముక్కను తినేసిన చంద్రిక ఆమె చేతిలోనిది కూడా లాక్కుని మింగేసింది. "ఛీ, పాడుపిల్ల" అంటూ గట్టిగా మొట్టికాయ వేసింది జయలక్ష్మి.

అవతల మంచంలో బట్టల క్రింద మనిషి వున్న వైనం కూడా తెలీకుండా మంచాని కంటుకుపోయిన ముసలాయనకు, ముక్కులోంచి ప్లాస్టిక్ ట్యూబ్ వేళ్ళాడుతున్నది. అతని దగ్గరున్న యువకుడు ఒక గ్లాసులో మందులు, పచ్చి కోడిగుడ్డు, నలిపిన బ్రెడ్‌ముక్కలు అరటిపండు వేసి, అన్నీ కలిపి గిలకొట్టాడు. ముక్కులోని ట్యూబు చివర్న గరాటు తగిలించి అందులోకి పోశాడు. నోటి అవసరం, రుచి, వాసన, అనుభవం ఏమీ అక్కర్లేకుండానే ఆహారం ముసలాయన కడుపులోకి పోయింది. జయలక్ష్మికి కడుపులో దేవినట్లయింది. ఈ మనిషి చావకుండా ఇంకా ఎందుకు బతికున్నాడు? అనుభవం లోపించాక ఎందుకీ పాకులాట! పనికిమాలిన శరీరాల్తో, చావు నిశ్చయమని తెలిశాక కూడా జీవితాన్ని వదల్లేక మంచాల్లో పడివున్నవాళ్ళ ఉదాసీనపు చూపుల్లోని అర్థంకానిదేదో ఆమెను చుట్టుముట్టింది.

"ఇంక పోదాం పదండి" అన్నది.

వెంకటప్ప చిన్నాన్న నిశ్చలత్వంలోంచి మెల్లగా కళ్ళు పైకెత్తాడు. సుబ్బమ్మత్త పాలగ్లాసు ఇచ్చింది. అవి త్రాగి, గ్లాసు ఆమె చేతికిచ్చి మెల్లగా వెనక్కి వాలిపోయాడు. నర్సు పక్కనేవున్న ఆక్సిజన్ తెచ్చి పెట్టింది. వార్డ్ బోయ్ వెళ్ళి డాక్టర్ని పిల్చుకొచ్చాడు. అతని ప్రాణం ఎప్పుడో వెళ్ళిపోయింది.

**కాన్సర్ హాస్పిటల్‌కు వెళ్ళి వచ్చినప్పటినుండి జయలక్ష్మికి తన శరీరం భయంకరంగా కనిపిస్తోంది.**

## 5

కాన్సర్ హాస్పిటల్‌కు వెళ్ళి వచ్చినప్పటినుండి జయలక్ష్మికి తన శరీరం భయంకరంగా కనిపిస్తోంది. అక్కడ తను చూసిన కాన్సర్లన్నీ ఇక్కడా వుండవచ్చునన్న భ్రమ కలుగుతోంది. ఎక్కడ చూచినా చిన్న వాపు వున్నదేమోనన్న అనుమానం. లివర్‌లో ఏ పక్క కొద్దిగా గట్టిగా లేదా? మొన్న కాలి ఎముకకు చిన్న దెబ్బ తగిలింది. ఇన్నాళ్ళు మానలేదే! ఈ పులిపిరి లాంటిది స్కిన్ కాన్సర్ కాదుగద! ఏమిటీ కఫం బంకగా, ఎక్కువగా వస్తుందే! ఏమిటిది ఇలా వెంటాడుతోంది నన్ను?

ఒకచోట పుట్టి హేలగా ఇతర భాగాలమీదకి ఎగురుతూ, ఆడుకుంటూ, అక్కడ పాడుకుంటూ తిరిగే వెర్రి మృత్యువు కాన్సర్. ఒకచోట ఆపితే ఇంకోచోట పెరుగుతుంది, ఊరగాయలో బూజు పెరిగినట్టు.

మలబద్ధకం కొత్తగా వచ్చిందా? పెద్ద పేగులో కాన్సర్ వచ్చి వుండొచ్చు. కడుపు నుగ్గులాంటిది వుందా! అదీ కోలన్ కాన్సర్ కావచ్చు. చర్మం రంగు మారిందా? పులిపిరి వచ్చిందా? వాపుగాని, నొప్పిగాని వున్నదా? జలుబు తగ్గలేదా? ఆకలి చచ్చిందా? అన్నం సహించటం లేదా? మెడమీద వాపు వచ్చిందా? క్రింది దవడ మొదట్లో వుబ్బిందా? పళ్ళలోంచి రక్తం పడుతున్నదా? ఎక్కడైనా కాయగాని, గడ్డకాని ఏర్పడిందా? కాలుగాని, చెయ్యిగాని నొప్పి వచ్చిందా? ఇవన్నీ కాన్సర్లు కావొచ్చు. ఏం జబ్బు లేదా? క్రిందటి అయిదారేళ్ళలో జ్వరం కూడా రాలేదా! అదీ కాన్సర్ సూచనే! తొందరగా కనిపెట్టండి.... చావు తప్పించుకోండి! ఎక్కడుందా కాన్సర్? ఇవాళ నీవు కనిపెట్టడానికీ, ఉపేక్షించడానికీ మధ్యన బ్రతుక్కీ, చావుకీ మధ్యన వుండేంత దూరం వుంది! త్వరపడు, కనిపెట్టు, బ్రతుకు! తెలుసుకో!!

ఇలాంటి అనుమానం వచ్చిన ప్రతిసారీ జయలక్ష్మికి భయంతో మతిపోతుంది. ఆమె గుండె ధన్‌ధన్‌మని కొట్టుకునే చప్పుడు ఆమెకే వినిపిస్తుంది. శరీరం స్తబ్దమై,

చెమటలు కారిపోతుంది. భయం దయ్యంలాగా పట్టేస్తుంది. ఆమె చేసే పనులు, మాటలు ఏవీ తనవి కానట్లు ఎవరో చేస్తున్నట్లు అనిపిస్తుంది..... తన అనుమానం నిరాధారమైనదనీ, తనకు కాన్సర్ లేదనీ, చావు ముంచుకురాలేదనీ అనుకోగలిగినప్పుడే మళ్ళీ తాను తానై, ఒకటై, ఆనందం వెల్లువలాగా ముంచుకొస్తుంది....

'నేను అప్రమత్తతతో వుంటూన్నంతవరకు నా దగ్గరకు ఏ ప్రమాదమూ రాదు.... ఈ తెలుసుకుంటున్న తెలివే నాకు రక్ష. సత్యం. ఈ తెలివి లేకుంటే యిహ నేను అనేది ఏముంటుంది? ఈ తెలివే నేను. నిజం' అనిపిస్తుందామెకు.

'నేను అప్రమత్తతతో వుంటూన్నంతవరకు నా దగ్గరకు ఏ ప్రమాదమూ రాదు.... ఈ తెలుసుకుంటున్న తెలివే నాకు రక్ష.

"నీకు బ్రతుకే ఒక కాన్సర్‌లాగా కనిపిస్తోంది. అలా భయపడుతుంటే బతికేదెలాగ?.... పుట్టినప్పటినుండి శరీరం నిర్ణీతమైన దోవలో నడుస్తూ, పెరుగుతూ నశింపుకు సిద్ధమౌతుంటుంది. కానీ అదంతా మనకు కనిపించదు! జీవమూ, మృత్యువూ రెండూ ఎప్పుడూ ఇక్కడ జంటగానే వుంటూ వుంటవి. పుట్టిన ప్రతి మనిషి చచ్చిపోతాడు. ఎప్పుడో ఒకప్పుడు శరీరమూ, మనస్సు కూడా కొన్ని పరిమితులకు లోబడే ప్రవర్తిస్తాయి. ఒక పరిధిని దాటి పోలేవు. ఆ పరిమితుల్ని మనం ఒప్పుకోకపోతే మనకే బాధ....." సీతారామారావు మందలించాడు.

"ఓహో.... ఇదంతా మీ సోంపల్లెవారి కుటుంబ వేదాంతం కాబోలు! ఇదే మా పరిధి అనుకునేవాళ్ళకి పెరుగుదల ఎలా వుంటుంది? శాస్త్ర విజ్ఞానం ఉరుకులు పరుగులతో ముందుకు సాగుతున్నది. అమ్మవార్లు అని దణ్ణం పెట్టిన జబ్బులకి వాక్సిన్సు కనిపెట్టారు. శివుడి తలలో వున్నాడనే చందమామ మీదికి ఎక్కి కూర్చున్నారు. సర్వజగదాధారభూతుడు, ఆత్మకారకుడు, గాయత్రీ మంత్రానికి అధిష్టానదేవత అయిన సూర్యుడి మర్మం కనుక్కుంటున్నారు. ఇంకా మీలాటివాళ్ళు పరిధుల్ని గురించి మాట్లాడుతున్నారు..... ఈ పరిధుల్నీ, పరిమితుల్నీ నేను ఒప్పుకోను!...... ఒప్పుకోను!...." అంటూనే గుండె పట్టుకొని

'అమ్మా' అంటూ కూలబడిపోయింది.

హాస్పిటల్లో కార్డియాలజిస్ట్ పరీక్షిస్తుండగానే రెండోసారి నొప్పి వచ్చింది. ఇ.సి.జి తీసి చూశారు. "గుండె బాగా దెబ్బతిన్నది. మళ్ళీ నొప్పి వచ్చినప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేము. జాగ్రత్తగా వుండాలి" అని ఇంగ్లీషులో అతను భర్తకు చెప్పడం విన్నది.

ఆమె మనస్సు ఆలోచిస్తోంది. నేను గుండెనొప్పితో చచ్చిపోతాను. కాన్సర్‌తోకాదు.... చావు దగ్గరకొచ్చింది.

ఆమె మనస్సు ఆలోచిస్తోంది. నేను గుండెనొప్పితో చచ్చిపోతాను. కాన్సర్‌తోకాదు.... చావు దగ్గరకొచ్చింది. రేపో, నెలకో, సంవత్సరానికో ఎప్పుడో దగ్గరకు వచ్చేసింది. నవ్వు.... .... అర్థం లేని నవ్వు. ఏడుపు... సర్వం పోగొట్టుకున్న మహాభారాన్ని గుండెల్లో పొదువుకున్న ఏడుపు. రెండూ ఒక్కసారిగా ముంచుకొచ్చాయి.

ఇంతవరకు నేను సరిగ్గా కళ్ళయినా తెరవలేదే? అప్పుడే చచ్చిపోతానా?! మనసు భయభ్రాంతిలో మూగగా ఏడుస్తోంది. చూపుమేరంతా అంధకారం. అంధకారంలో దేనికోసమో పరిభ్రమణం. ఏ దిక్కునైనా తప్పించుకోవడానికి దోవ వుందేమోనని మనసు వెర్రెత్తినట్టు పరుగులిడుతోంది.

పైకి మాత్రం ఆమె మామూలుగానే ఇంటికొచ్చింది. రాధిక కాలేజీలో తనకు డిబేట్‌లోనూ, ఎలక్యూషన్‌లలోనూ ఫస్ట్ ప్రైజ్ వచ్చిన ఆనందంలో వుంది. ఆ విషయాలు వింటుంటే జయలక్ష్మికేమీ ఉత్సాహం కలగలేదు. అవన్నీ తనకు సంబంధించని విషయాల్లాగా వినపడ్డవి. అన్నీ చెప్పాక రాధిక అడిగింది "డాక్టరు ఏం చెప్పారు?" అని. "గుండె కొంచెం దెబ్బతిన్నది. జాగ్రత్తగా వుండాలన్నారు" అన్నది. ఆ మాటలు ఆమె నోట్లోంచి బయల్దేరి బయటి ప్రపంచంతో సంబంధం ఏర్పరచుకుంటున్నా ఆమెతో ఏమీ సంబంధం లేని విషయంలాగా కొత్తగా అనిపించాయి. చంద్రిక ఏదో అర్థమైనదానిలాగా దగ్గరకొచ్చి ఆమె చీరకుచ్చెళ్ళు చుట్టూ తిప్పుకుంటూ 'అమ్మా' అన్నది. మొదటిసారిగా చంద్రికమీద ఏమాత్రం కోపంలేని, సానుభూతి కలిగింది.

తాను నిజంగా చచ్చిపోతున్నానని ఆమెకు నమ్మకం కలగటం లేదు. నేను ఇంతవరకు ఏమీ అనుభవించలేదే. తెలుసుకోలేదు. జీవించలేదే! నేను

చచ్చిపోవటం ఏమిటి?? అసంభవం! నేను చావను! ఇన్నాళ్ళు నేను గడిపిన జీవితం ఏది? నా అనుభవాలేవి? నా భవిష్యత్తు ఏది? ఏమీ కనబడటం లేదు. 'నేను' ఏది? ఎక్కడున్నాను? అదిగో ఆ కనిపించేవాళ్ళంతా నవ్వుతున్నారు. ఏడుస్తున్నారు. పరుగెత్తుతున్నారు. తింటున్నారు. ఆనందిస్తున్నారు. అనుభవిస్తున్నారు. నా అనుభవాలేవి? 'నేను' ఏది?

**తాను నిజంగా చచ్చిపోతున్నానని ఆమెకు నమ్మకం కలగటం లేదు. నేను ఇంతవరకు ఏమీ అనుభవించలేదే. తెలుసుకోలేదు.**

మనసునిండా కసి, ఆశ్చర్యం. నేను లేకున్నా వీళ్ళందరూ ఇలాగే బతికుండి, భోంచేసి, తిరుగుతూ నవ్వుతూ వుంటారా? ఈ ప్రపంచం ఇలాగే వుంటుందా? ఈ చెట్లు ఇలాగే పచ్చగా వుంటాయా? ఇల్లూ, వూరూ, భూమీ, ఆకాశం.... ఈ ఆకాశం ఇంత స్వచ్ఛంగా, నీలంగా, అనంతంగా వుంటే, దాన్ని చూస్తూ యీ క్రింద నేనుండనా?!..... నాకంటే ముసలి వాళ్ళు, అప్రయోజకులు, రోగిష్టులు, మూర్ఖులు..... ఇందరూ వుంటుంటే నేను మాత్రం వుండకుండా పోవాలా? ఎంత అన్యాయం! నేను లేకుంటే ఇదంతా ఎందుకు? అంతా నశించిపోవాలి! నశించిపోతుంది....

ఒక ముసలామె వంటకు కుదిరింది. మంచి మనిషి. చంద్రికకు అన్నం పెట్టడం దగ్గర్నుంచీ అన్ని పనులూ ఆమె సమర్థించుకుంటోంది. ఇప్పుడు జయలక్ష్మికి పనేమీ లేదు. మంచంలో పడుకుని పనులన్నీ జరిగిపోవటం చూస్తోంది. తానుగా కల్పించుకొని పురమాయించడం కూడా లేదు. 'నేను అప్పుడే యీ ఇంట్లోంచి మాయమై పోతున్నాను. వీళ్ళందరూ నేను లేకుండా పోయే స్థితికి అలవాటు పడిపోతున్నారు అప్పుడే' అనుకుంది.

"నా బ్రతుకు పరిమితమైపోయింది కదా..." అన్నది దిగులుగా భర్తతో.....

"బ్రతుకనేది మనుషులందరికీ పరిమితమే.... ఎవరు ఎన్నాళ్ళుంటారో ఎవరూ చెప్పలేరు.. నీకంటే ముందే నేను పోవచ్చు...." ఆమెను ఓదార్చాలనే అన్నాడతను.

"ప్రతి మాటకీ వంకర అర్థాలు తీస్తారు... మీరందరూ నాలాగా ప్రతిదినమూ ఇదే ఆఖరిదేమో ననుకుంటూ వుంటారా?"

అతను నవ్వాడు. "అనుకోను. నిజమే. కాని అనుకున్నప్పుడూ బాధపడను" అన్నాడు.

'ఈ ఓదార్పు మాటలకేమిలే' అనుకుందామె.

నిజంగా నేనే చేయవలసిన పని అనేది లేదు! ఇన్నేళ్ళు నేను ఎందుకు తాపత్రయపడ్డాను? నేను సాధించినదేమిటి? అసలు ఈ నేను ఎవరు? – ఈ ప్రశ్నలు ఆమెను కలతపెడుతున్నాయి. వాటికి సమాధానం దొరకందే ఆమెకు శాంతి లేదు.

నేను అంటే ఈ కనిపించే శరీరం –

కాని నా రక్తం పారుదల నాకు తెలియదు. నా శరీరం పెరుగుదల నాకు తెలియదు. నరాలద్వారా తెలిసే కొంత విషయం తప్ప నిజానికి ఈ శరీరం నాకు తెలియదు. కొంత అదుపువున్నా అది నాకు ఆజ్ఞకు లోబడి ఉండలేదు. అది నేను ఎలా అవుతాను?

> కాని నా రక్తం పారుదల నాకు తెలియదు. నా శరీరం పెరుగుదల నాకు తెలియదు.

నేను అంటే నా మనసు –

కాని నాకు అనేకమైన ఆలోచనలు నిరంతరం తోస్తూనే వుంటాయి. ఎప్పుడు, ఎందుకు, ఎక్కణ్ణుంచి వస్తున్నవో తెలియదు. అవి తోచాకనే నావి అంటున్నాను. అవి 'నావి' ఎలాగవుతాయి?

నా అనుభవాలు....

మరుపు తెరల్లోకి జారి మాయమైపోతున్నాయి.

మిగిలినవాటిని మిగుల్చుకుంటున్న 'యిష్టం' నేనా? అదీ నా చేతిలో లేదే! అనుకుంది.

నేను అంటే ఏమిటో తెలియకపోయినా బ్రతుకు చాలా విలువైనదిగా తోచింది. వెధవ బతుకు! వుత్తబోర్! ఇందులో ఏముంది? అంటూ జీవితంలోని ప్రతి క్షణాన్నీ విషపూరితం చేస్తూ వచ్చిన ప్రశ్న యిప్పుడు లేదు.... చావును చూచినప్పుడే బ్రతుకు విలువ తెలుస్తుంది!

కాని ఇప్పుడు – ఈ చివర్లో – అది తెలిసి ప్రయోజనమేముంది?

జీవితం చెయ్యిజారిన చేదతాడులాగా పట్టులేఖుండా జారిపోతున్నది. ఇంత జీవితం యిన్ని సంవత్సరాలు – ఎట్లా గడిపేశాను? ఎంత నిర్లక్ష్యంగా గడిపాను? ఇంతకాలంలో ఏం చేశాను? ఏం తెలుసుకున్నాను? ఏదో మహాశక్తి నా ముందు ప్రత్యక్షమై "జయా, ఇదిగో నీ జీవితం.... తిరిగి జీవించు" అంటే.... ఎంత తెలివితో, ప్రతిక్షణాన్ని ఎంట అపురూపంగా బతుకుతాను!" అప్పుడు.... అప్పుడు...

ఒకవేళ రాధిక పుట్టాక ఇహ పిల్లలే వద్దని అనుకుని వుంటే అప్పటి ఆనందం అలానే వుండునా? ఎంతో వేదన, ఆలోచన తప్పేది అనుకుంది.

అప్పుడు ఏం చేస్తుందో, తన జీవితాన్ని ఏ క్షణం దగ్గర మార్చి మలుపు తిప్పుకుంటుందో జయలక్ష్మికి తోచలేదు. ఆలోచించేకొద్దీ మళ్ళీ జీవించినా తాను అల్లాగే జీవించాల్సి వస్తుందనే తోచింది.

ఒకవేళ రాధిక పుట్టాక ఇహ పిల్లలే వద్దని అనుకుని వుంటే అప్పటి ఆనందం అలానే వుండునా? ఎంతో వేదన, ఆలోచన తప్పేది అనుకుంది. కాని రాధిక పుట్టినప్పుడు ఆ పిల్ల చురుకుదనం, త్వరగా మాటలొచ్చాయనీ, తోటివారికంటే ముందు నడిచిందనీ, దాని కళ్ళు పెద్దవనీ, అది ముద్దుగా వుందనీ, తెలివిగలదనీ.... ఎన్నోవిధాల పొందిన సంతోషం పునరావృతం కావాలని, ఇంకో బిడ్డ – కొడుకు కావాలని కోరికతో తపించిపోగా.... దాని పర్యవసానంగా ఏర్పడిన చంద్రిక – ప్రతిక్షణమూ అంతకుముందు గడచిన కాలానికి, ఏర్పడిన మనస్థితికి వారసత్వం వహించి అనుల్లంఘ్యం అయి కనిపించింది. ఎన్నిమార్లు అవకాశం వచ్చినా ఈ మనసు ఇలాగే ప్రవహిస్తుంది.

కాని.... ఈ శరీరంలో ఉన్న ఎన్నో కణాల్లోనుంచీ, ఎన్నో అవకాశాల్లోనుంచీ రాధికను మించినవారు, కొడుకు, మహాజ్ఞాని, శాస్త్రవేత్త, పండితుడు.... ఎవరైనా ఏర్పడటానికి అవకాశం వున్నప్పుడు ఈ చిట్టి పిచ్చి చంద్రిక ఏర్పడటానికి కారణం ఏమిటి? ఇది కూడా ఇచ్చివాడి చేతిరాయిలాగా తగలటమేనా? అంతకుమించిన అర్థం వున్నదా? మనసులోని ఆలోచనలకూ, బయట ఏర్పడుతున్న సృష్టికీ మధ్యన సంబంధం ఎక్కడో తప్పిపోతున్నది.

తన మనస్సును పరిశీలించినకొద్దీ ఆమెకది విపరీతమైనదిగా, వికృతమైనదిగా కనిపించసాగింది. జ్ఞాపకాలూ, కోరికలూ అనేవాటిని కలబోసుకుని ఏర్పడి, విలువల కొలబద్దను ఆధారంగా పెట్టుకొని, కోరికలను ఆరాధిస్తూ, కన్పించేదాన్ని తిరస్కరిస్తూ, ఆదర్శాల ఔన్నత్యాలు, అథఃపతనాల హైన్యాలు, హెచ్చుతగ్గులు అంటూ ఒక కృతకపు విలువల అవాస్తవిక లోకాన్ని సృష్టించుకొని సహజత్వాన్నీ, వాస్తవికతనూ నిరాకరించే మహమ్మారిలాగా కన్పించింది. దాని ఇష్టప్రకారం జరిగితే చంద్రిక వుండదు. గొప్పదనానికి హద్దు ఎక్కడుంది? సీతారామారావూ వుండడు. జయలక్ష్మి వుండదు! ఈ మనస్సుకు, ఈ ఎక్కువ తక్కువల విలువల లోకానికి మూలతత్వం వినాశం. వాస్తవికతను నిరాకరించి, అవాస్తవిక లోకాన్ని సృష్టించడం? కనిపించేదాన్ని నాశనం చెయ్యడం!

తన మనస్సును పరిశీలించినకొద్దీ ఆమెకది విపరీతమైనదిగా, వికృతమైనదిగా కనిపించసాగింది.

అయితే ఆమెనూ, ఆమె లోకాన్ని రక్షిస్తున్నది ఏమిటి? ఆ రక్షణ, ఆ ప్రేమభావం యీ మనఃస్థాయికి సంబంధించినది కాదు. కార్యకారణ సంబంధాన్ని అధిగమించిన మరోస్థాయి నుండి వస్తున్న కృపావర్షం అది!

నాది అనుకుంటున్న ఈ మనస్సుకీ, నేను అనుకుంటున్న ఈ మనిషికీ ఏమీ శక్తిలేదు! మనిషి ఆలోచనలతో, కోరికలతో నిమిత్తం లేకుండా స్థితులు ఏర్పడుతున్నాయి. ఏర్పడ్డాకనే అవి మనిషిలోని భాగాలవుతున్నాయి. 'నా'వి అనేవన్నీ ఎందుకు, ఎక్కణ్ణుంచీ వస్తున్నాయో మనిషి చెప్పలేడు. మనిషికి ఇప్పుడు అందని ఏదో ఒక స్థితిలో అవి 'నా'వి అవుతాయా? అవకుంటే మనిషి జీవితం నిరర్థకం. గాలికి కొట్టుకువచ్చిన మేఘాలు ఆకాశంలో ఒకచోట ఒక ఆకారంగా ఏర్పడతాయి. అదొక నిశ్చలమైన ఆకారమనీ, దానికేదో అర్థం వుందనీ భ్రమ కలుగుతుంది. మరో గాలితో అవి చెదిరిపోతాయి. మనిషి కూడా ఇంతేనా?!

మనిషి దానిని ఎలా సహించగలడు? దేన్ని నమ్మి ముందుకు వెళ్ళగలడు? తాతయ్య దేవుణ్ణి నమ్మి సులువుగా తెలియనిదాన్లోకి వెళ్ళిపోయాడు. వెంకటప్ప చిన్నాన్న వంశాన్నీ, రక్తాన్నీ నమ్ముకుని పుట్టినవాళ్ళకు చావు తప్పదన్న స్పృహతో మరో ఆలోచన లేకుండా దాన్లోకి వెళ్ళిపోయాడు. "నేను దేన్నీ నమ్మగల శక్తి

లేనిదాన్ని. నేను ఎలా వెళ్లేది? ఈ పెంజీకటిలో నాకు రక్షణ, మార్గం ఏవి?' అనుకుంది జయలక్ష్మి.

ఆలోచనలతో ఆమె మనసు అలసిపోయింది. స్తబ్ధమైపోయింది.... ఎప్పుడో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. పూజగదిలో దేవుడి పీఠం ముందు పడివున్నది పెద్దబల్లి. ఆమెకు బల్లి అంటే చెప్పరాని భయం. పట్టరాని అసహ్యం. దాన్ని అక్కణ్ణుంచి తరిమెయ్యాలని నేలమీద చప్పుడు చేసింది. అది పోలేదు. ఒక పొడుగాటి పుల్లతెచ్చి దాన్ని కదిల్చింది. అది నేలను గట్టిగా కరిచి పట్టుకుంది. ఏమాత్రం కదల్లేదు. మెల్లిగా కళ్ళెత్తి చూచి, మళ్ళీ మూసుకుని తోకను మెల్లిగా కదిలీ కదలనట్లు కదిలించింది. దాని చూపులో భయం లేదు. ప్రాధేయపడటం లేదు. నాపాటికి నన్ను చావనీ, కదిలించకు అన్నదే ఆ బల్లి ఉద్దేశ్యమని ఆమెకు నిశ్చయంగా తెలిసింది. దాని ప్రక్కనే నేలమీద నాలుగు అన్నం మెతుకులు వేసి, కొంచెం నీళ్ళు పోసి వెళ్ళిపోయింది. ఆ క్షణంలో ఆ బల్లి అంటే ఆమెకు భయం వెయ్యలేదు. అసహ్యమూ కలగలేదు! అది ఒక ప్రాణి.

**ఆలోచనలతో ఆమె మనసు అలసిపోయింది. స్తబ్ధమైపోయింది... ఎప్పుడో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.**

రోడ్డులో మేళం వెళ్తోంది. జయలక్ష్మి లేచి ఇంటి వెనక్కు వెళ్ళింది. మేళం కూడా ఇంటి వెనక్కు వచ్చి దిగింది. ముందే తవ్వి పెట్టుకున్న గుంత దగ్గర చేరారు జనం. మనిషిని గుంటలో పడుకోబెట్టి మట్టి కప్పేశారు. అయిపోయింది.... జయలక్ష్మి దేవుడి గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. దేవుడిముందు సాష్టాంగపడి, కన్నీళ్ళతో 'స్వామీ నన్ను బతకనీ! నన్ను బతికి వుండనీ!' అన్నది.... మళ్ళీ మళ్ళీ అన్నది.... పిచ్చిగా అన్నది..... అంటూనే వుంది.

## 6

అకస్మాత్తుగా ఆమె ఆలోచనలు స్తంభించిపోయినై. సంతోషం, దుఃఖం, బాధ, బరువు, ఆలోచన – ఏమీ అంటని, దేనితోనూ సంబంధంలేని నిశ్శబ్దం ఏర్పడింది. తాను వేరై, పైకి లేచింది. అన్నీ తనకు కనబడుతున్నై. అర్థం అవుతున్నై, విశ్వమంతా ఒక గొప్ప యంత్రంలాగా కదిలిపోతున్నది. గాలి, నీళ్లు, భూమి,

చెట్లు, జంతువులు, మనుష్యులు, ఏడ్పులు, నవ్వులు అన్నీ కాలంలో నడుస్తూ తిరుగుతూ పరుగెత్తుతూ వున్నాయి. అవి నడవవలసినట్లు నడుస్తున్నవి. చేయవలసినట్లు చేస్తున్నవి. దేని సహజధర్మాన్ని అది నెరవేర్చుకుంటున్నది. అక్కడ ప్రశ్నలు లేవు. సమాధానాలు లేవు. అక్కడ నిండుగా ఎన్నో జీవాలు కదలాడుతున్నై. ఒకే జీవం వెల్లి విరుస్తున్నది. అక్కడ నిండుగా ఎన్నో ఆనందాలు నర్తిస్తున్నాయి. ఒకే ఆనందం పొర్లిపోతున్నది. ఒకటే అన్నీ. అన్నీ ఒకటే. బ్రతుకు దాన్నుంచీనే పుడుతున్నది. చావు దాన్నుంచీనే పుడుతున్నది. రెండూ కూడా దేశకాలాలకతీతమైన యీ పూర్ణతలోనివే. ఏం జరిగినా ఏం ఫర్వాలేదు!

ఆమెకు చంద్రిక కనపడ్డది ఆడుతూ, నవ్వుతూ. రాధిక నవ్వుతూ పరుగెడుతున్నది. సీతారామారావు తాపీగా నడుస్తూ కనబడ్డాడు. జయలక్ష్మి కూడా కనబడ్డది – తలవంచుకుని ఏడుస్తూ. 'ఫరవాలేదు, ఏమి జరిగినా ఫరవాలేదు. అన్నీ ఒకటే' అని చెప్పింది జయలక్ష్మితో.

> ఈ ఆనందం నుంచీనే, ఈ నవ్వునుంచీనే, ఈ పూర్ణతనుంచీనే ప్రపంచం పుడుతున్నది.

జయలక్ష్మి లేచింది. ఎన్నో జీవాలు. ఎన్నో ఆనందాలు ఆమెలో నిండి, ఆమెను సఫలీకృతురాల్ని చేస్తున్నట్లు సంతృప్తి, ఆనందం, నిండా నవ్వు, పెద్ద నవ్వు.

ఈ ఆనందం నుంచీనే, ఈ నవ్వునుంచీనే, ఈ పూర్ణతనుంచీనే ప్రపంచం పుడుతున్నది. అందువలననే యింత దుఃఖం, అర్థం లేని తనం, బాధ, బరువులను సునాయాసంగా భరిస్తున్నది. సత్యమూ సమాధానమూ అక్కడున్నవి. ఈ నిమిషంలో యింత తేటతెల్లంగా స్పష్టంగా కనిపిస్తున్న, తెలుస్తున్న విషయం – యిదే జీవరహస్యం. ఇప్పుడు నేను ఎన్ని జన్మలైనా ఎత్తగలను. అవలీలగా ఎన్ని చావులైనా చావగలను. ఈ జీవితం ఒక ఆట. ఈ ఆటను ఆడించేది, ఆడేదీ ఆటా కూడా నేనే!

మనిషికుండే పరిమితులు జీవితానికి అర్థం, స్వేఛ్ఛ – అన్నీ ద్వంద్వ స్వరూపమైన మనసుకు సంబంధించిన ప్రశ్నలు. అనవసరమైన ఆలోచనలు. కాలం కూడా మనసుకు సంబంధించిందే గాని సత్యం కాదు. శరీరధారి అయిన మనిషికి ఈ క్షణం ఒక్కటే సొంతం. కాలం అనేది ఊహ. అనేకమైన క్షణాలు వున్నాయి. ఒక క్షణానికి మరో క్షణానికీ మధ్యన సంబంధం నిజం కాదు. ఆ

సంబంధాన్ని కల్పించేది మనస్సే.

......... ఇవన్నీ ఆ క్షణంలో ఆమెకు తెలిసినై.

ఆ రోజంతా ఆమె నిశ్చలమైన మనస్సుతో, స్తంభించిన కాలంలో ఆనందంలో వుండిపోయింది.

అంత స్పష్టంగా నిశ్చితంగా తన స్వత్వాన్నంతా ఆవరించిన ఆ మహత్తరానుభూతి నిత్యమూ, సత్యమూ అన్పించింది. చెదిరిపోతుందని అనుకోనేలేదు. కాని క్రమంగా.....

‘ఈ జ్ఞాపకాన్ని నిలుపుకోవటమే తపస్సు. ఈ స్పృహను సజీవం చేసుకోవడమే విముక్తి’ అనుకుంది జయలక్ష్మి.

అనుభూతి స్పష్టతను కోల్పోయింది. ఎంత ప్రయత్నించినా మళ్ళీ దాన్ని అందుకోవడం సాధ్యం కాలేదు. అది మనసులోకి జారి ఊహగా, సిద్ధాంతంగా, మాటలుగా మారిపోయింది. పేలవమూ అయిపోయింది.

కాని అటువంటి స్థితి ఉన్నదన్న జ్ఞాపకం మిగిలింది. ఆ జ్ఞాపకంలో భయం ఎరుగని నిబ్బరం ఏర్పడ్డది. ఆలోచనలోకి కొత్త జీవం ప్రవేశించింది.

‘ఈ జ్ఞాపకాన్ని నిలుపుకోవటమే తపస్సు. ఈ స్పృహను సజీవం చేసుకోవడమే విముక్తి’ అనుకుంది జయలక్ష్మి. ప్రతి చిన్న విషయంలోనూ అర్థాన్ని, ప్రయోజనాన్నీ చూడటానికి అలవాటుపడ్డ మనస్సు, అర్థమో ప్రయోజనమూ లేని స్థితిని ఎప్పటికైనా గ్రహించగలదా? నేను, నేను అంటున్న అరకొరా తెలివి అణిగిపోవటం జరుగుతుందా? అని అనుకుంది.

ఇంటి వెనుక స్మశానాన్ని చూస్తే ఆమెకు జుగుప్స కలగలేదు. మిట్టపల్లాలూ, తుప్పలూ, బూడిదకుప్పలూ, సన్నని ఏరూ – అంతా సూర్యకాంతిలో మామూలుగా ఉన్నది. వూళ్ళో వీచేగాలి ఇక్కడా వీస్తున్నది. వూళ్ళో ప్రకాశించే సూర్యుడే ఇక్కడా ప్రకాశిస్తున్నాడు.... చావు సహజమైనదీ, పుట్టుకవలెనే అవసరమైనదిగా తోచింది. మనుష్యులు ఒకే మాదిరిగా పుట్టినందువలన ఒక జాతి కావటం లేదు.... పుట్టినవారందరికీ చావు సత్యం కనుక ఒకేజాతి అవుతున్నారు. పుట్టుక వేర్పాటుకు నాంది అవుతున్నది. చావు ఐక్యతకు చిహ్నం అవుతున్నది.

జీవితంలో వుండే సత్యం 'మార్పు'. ఆ మార్పు యొక్క పరాకాష్ట చావు. అవసరాలు, బాధ, దుఃఖం చావు – ఇవే ఈ మనుష్యులందరి మధ్యన వుండే సంబంధాన్ని సూచించేవి. వాటిని జయించాలనేదే మానవుని నిరంతర ప్రయత్నం. కానీ, ఆ విజయం లభించటంతోనే ఆ సంబంధం చెదిరి మనిషి నశించిపోతాడు!

ప్రపంచ స్థితి ద్వంద్వాల మీదనే నిలిచి వుంది. ఆ నిరంతర ద్వంద్వాలలో ఒకటే వుండి రెండోది లేకపోవటం వుండదు. ఈ మనస్సు దేన్ని కోరుకుంటుందో దేన్ని కరుణ అంటోందో అది చావు. ద్వంద్వాల్ని నిరాకరించినప్పుడు జీవం, సత్యం అక్కడుండవు!.... కాని కాలానికీ, కార్యకారణ సంబంధానికీ లోబడి వుండే మనస్సు దాన్ని గ్రహించలేదు!

> నీలాకాశంలో నల్లమబ్బులూ, సూర్యుడి నారింజ రంగు కాంతీ కలిసి రంగుల చిత్రంగా ఏర్పడి, అద్భుతమైన సౌందర్యాన్ని సృష్టిస్తున్నై.

'ఈ క్లిష్టతను, సంకీర్ణతను, ఈ వైవిధ్యాన్నీ, ఈ చైతన్యాన్ని నేను గ్రహించగలనా! భరించగలనా!' ఆమె గుండెలో ఉత్కంఠ, ఆనందం, ఎదురు చూపు, వేడికోలు.....

నీలాకాశంలో నల్లమబ్బులూ, సూర్యుడి నారింజ రంగు కాంతీ కలిసి రంగుల చిత్రంగా ఏర్పడి, అద్భుతమైన సౌందర్యాన్ని సృష్టిస్తున్నై. క్షణక్షణానికీ మారుతున దృశ్యాలు. ప్రతి క్షణమూ అంత సుందరంగానూ వుంది. అద్భుతమైన ఆ సౌందర్యంలో ఆమె మనసు మూగపోయింది.

ఎక్కణ్ణుంచో తాళాలశబ్దం.... టింగ్ టకా.... టింగ్ టకా, టింగ్ టకా..... టింగ్ టకా.... విశ్వమంతా వ్యాపించి నవ్వుతూ, నర్తిస్తూ ఆమె గుండెల్లోకి చేరి, అక్కడ సంతోషంతో నాట్యం చేయటం ప్రారంభించింది.

'అమ్మా, చంద్రికమ్మ తమాషబంగ్లా పిల్చుకొచ్చింది.... ఒద్దంటే ఈమె వినదు. పొమ్మంటే వాడు పోడు' వంటామె ఫిర్యాదు.

అతను తెల్లగా పొడుగ్గా వున్నాడు. మొహం పొడుగ్గా, గంభీరంగా వుంది. వయస్సు అరవై దగ్గరబడుతున్నా, కళ్ళల్లో చురుకుదనం, జీవం నిండుగా వున్నాయి. 'అమ్మా పాప పిలిచింది. పిల్లలూ, పెద్దలూ అందరూ చూడొచ్చు. ప్రపంచంలోని వింతలన్నీ వున్నై దీంట్లో.....' అన్నాడు గంభీరంగా.

"ముప్ఫయి పైసల కోసం ఎన్ని కబుర్లు చెబుతున్నావు" అన్నది జయలక్ష్మి.

అతను నొచ్చుకున్నాడు. "పైసలకోసం కాదు.... ఇది నా వృత్తి. నేను ప్రపంచాన్ని చూపిస్తాను.... పైసలు నేను బతకటానికి" అన్నాడు.

అంటూనే భుజంమీది గోనెసంచి దించి అందులోని పెట్టె తీశాడు. ఎండవాలు చూచుకొని స్టేండు అమర్చి పెట్టె పెట్టాడు.

చంద్రికతో పాటు జయలక్ష్మి కూడా దానిని చూడటానికి కూర్చుంది.

టింగ్ టకా... టింగ్ టకా... ఒక చేత్తో తాళం కొడుతూ, రెండో చేత్తో తాపీగా బొమ్మలు మారుస్తూ రాగయుక్తంగా వర్ణిస్తున్నాడు.

ఆ బొమ్మల్లో నిజానికి విశేషం ఏమీలేదు. కాని ఆ బొమ్మలే లెన్స్ లోంచీ లోతునూ జీవాన్నీ గ్రహించి, రాగయుక్తమైన వర్ణనతో లయబద్ధమైన తాళంతో కలిసి వింతకథను సృష్టిస్తున్నై.

"ఢిల్లీ పట్నం చూడండి

ఇందిరగాంధీ దర్బారు చూడండి

ఎర్రకోట చూడండి.... టింగ్ టకా.... టింగ్‌టకా...."

రాధికా వచ్చింది. "ఏమిటమ్మా నీవు కూడా చూస్తున్నావా? పక్కింటివాళ్ళు కిటికీలోంచి చూస్తూ ఎట్లా నవ్వుతున్నారో చూడు...." చెవిలో గుసగుసలాడింది.

"నవ్వుకోనీ.... మధ్యాహ్నం తెచ్చిన కేకులు అలమార్లో వున్నై. నాకూ, చంద్రికకూ, అతనికీ మూడు తీసుకురా. తింటూ చూస్తే ఇంకా బాగుంటుంది. నువ్వు కూడా వచ్చి చూడు" అన్నది.

"నీవు కేకులు తినకూడదు కదా" అని విసుక్కుంటూ వెళ్ళిపోయింది రాధిక.

"గోవా సంద్రం చూడండి

సంద్రంలోన మంది చూడండి

ఆడా మగలా ఆట చూడండి.... టింగ్ టకా.... టింగ్ టకా...."

ప్రదేశాలు, మనుష్యులూ, లోకాలు మారిపోతున్నాయి. లండన్ నగరం, కాశీపట్నం, మహంకాళి ఉత్సవాలు, జపానీ గెయిషాలు, చంద్రలోకపు చిత్రాలు..... ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోతున్నవి, ఆకాశంలోని చిత్రాల్లాగా.

"మన లోకం చూడండి

ఈ లోకం చూడండీ

తమాషాల లోకం ఇది

విచిత్రాల లోకం ఇది

అందాల లోకంలో

ద్వంద్వాల శోకం.... టింగ్ టకా... టింగ్ టకా.....

తిండికి బట్టకు రోదనా

నెత్తిన కప్పుకు వేదనా

రోగం చావు శోధనా... టింగ్‌టకా... టింగ్‌టకా...

అయినా

బ్రతుకుతానంటాడు మనిషి

నవ్వుతానంటాడు మనిషి

ఇక్కడే వుంటానంటాడు మనిషి.... టింగ్ టకా..... టింగ్ టకా...."

జయలక్ష్మి నవ్వటం మొదలుపెట్టింది.

ఆమెతోపాటు చంద్రికా నవ్వుతోంది.

ఒకర్ని చూసి ఒకరు నవ్వుతూ వున్నారు.

"టింగ్ టకా... టింగ్ టకా....

నవ్వుల లోకం చూడండి

నవ్వే బాబులు చూడండి

నవ్వే పాపలు చూడండి

నవ్వొకటే నిజమండి.... టింగ్ టకా..... టింగ్ టకా...."

తమాష బంగ్లాలో రంగురంగుల పాపలు, బాబులు నవ్వుతూ నిల్చుండిపోయారు. కథ అయిపోయింది.

ముసలతను డబ్బా తీసి గోనె సంచీలో పెడుతున్నాడు.

"మీదే ఊరు? నీ సంసారం ఎక్కడుంది?" అనడిగింది జయలక్ష్మి.

అతను సంచీని తడుతూ "ఇదే నా సంసారం.... రోజుకో వూరు నాది....." అన్నాడు.

పైసలు జేబులో వేసుకున్నాడు.

తన ప్రపంచాన్ని బుజాన్న వేసుకుని వెళ్ళిపోయాడు.

సూర్యుని ఎర్రని వెలుగు కన్పించనీయకుండా ఒక నల్లని చిక్కని మేఘం అడ్డంగా నిల్చుంది. వేపచెట్టు కొసలన్నిటిమీదా గోరింకలు వాలి గోలగోలగా అరుస్తున్నై. మేఘాన్ని చీల్చుకుని వెలికి రావటానికి ప్రయత్నించిన ఎర్రని మెరుపు ఆ మేఘపు గుండెలోని లోతుల్ని ఒక్క క్షణం చూసి లోనికే వెళ్ళిపోయింది.

కొన కొమ్మలమీదనున్న గోరింకలు క్రిందకి గెంతుకుంటూ నెమ్మదిగా చెట్టులోపలికి మాయమయ్యాయి. ఈ వెలుగును వున్నంతసేపూ అనుభవిద్దామన్న కోరికతో రెండు గోరింకలు మాత్రం లోపలకి వెళ్ళకుండా లోగొంతులు కిరకిరలాడిస్తూ సాయంత్రాల కబుర్లు చెప్పుకుంటూ వున్నవి.

ఆమె మనసునిండా ఆనందం. నేను లేకపోయినా ఇదంతా వుంటుంది. ఈ మనుష్యులు, చెట్లు, గోరింకలు, సూర్యుడు, ఆకాశం.... అన్నీ ఎప్పటికీ వుంటాయి..... అనుకున్నది జయలక్ష్మి ఆనందంగా....

ఈ కథ తొలుత భారతి మాసపత్రిక లో 1976 సెప్టెంబర్ నెలలో ప్రచురితమైనది.



**"A politically subservient people have very little scope for exercising their moral and spiritual energies... subjection makes a people wholly tamasic, a sort of physical, intellectual and moral palsy seizes them and keeps them to a low level of being; they are like an insect grovelling in the dust and before they can be lifted up to the higher plane of sattwa, they must pass through Rajas"**

**- Arabindo**

# కలల రజను



శ్రీ తెలుగు వెంకటేష్
✆ 9985325362

అమీబా నిద్రపోతోంది
సడి చేయకండి
నిద్ర పిగిలిపోతుంది

పులుగులు
ఆకాశాన్ని కప్పుకుని
కునుకు తీస్తున్నాయి
అటు వెళ్ళకండి
భూమి ఉలిక్కిపడుతుంది

స్టేషన్ బెంచీపై
గండుచీమ జోగుతోంది
దయచేసి ఎవరైనా
రైలు చెవిలో
పిల్లిలా అడుగులు వేయమని
చెప్పండి

రాత్రిలోకి తొంగిచూడకండి
దానిది అనాది నిద్ర

తన రెప్పలను తాకితే
చీకటి బెదురుతుంది
ఆ ఇంట్లో
దీపం నిదురోయి
చాలా సేపయింది
ఈ ఇల్లే
మెలకువను పేనుతోంది

ఆరుబయట చెప్పులు
మసక మసగ్గా నిదురోతున్నాయి
గాలి మొరుగుడును తరమండి
పాదరక్షలు ప్రశాంతంగా
నిదురపోనివ్వండి

వేటకు వెళ్ళిన పడవ
తిరిగి రాలేదు
కుక్క నిదురను
నోటకరుచుకుని
నది వైపు చూస్తూనే ఉంది.

**మేటి కథలు-లోతు వ్యాఖ్యలు**

# ఈ క్షణం జీవించు... అని చెప్పే కథ, పెంజీకటికవ్వల



డాక్టర్ సుంకర గోపాలయ్య
✆ 94926 38547

రచన ప్రయోజనం ఆలోచనపరులైన సహృదయ పాఠకుల ముందుకు వచ్చి వారి జ్ఞాపకాల్లో నిలవడం అంటారు, వసుంధరా దేవి.

మన జీవితంలో అస్తిత్వపు సమస్యలుగా భావించే మరణము ,ఒంటరితనం ఇలాంటి ఇతివృత్తాలు వసుంధరా దేవి కథల్లో ప్రధానంగా ఉండడాన్ని మనం గమనించవచ్చు. ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి ఈ క్షణం జీవించు అనే మాట అంటూ ఉంటారు.. మనిషి తన జీవితంలో వర్తమానం బంగారం లాంటిది కానీ ఒక ఆందోళన, ఒక సమస్య, ఒక పోరాటము, దుఃఖబాధ ఏదో ఒకటి మనసు ప్రభావంతో మనిషి లోనౌతాడు. తన ముందు ఉన్న, తనతో ఉన్న వర్తమాన క్షణాల్ని దగ్ధం చేసుకుంటాడు. సూర్యోదయాన్ని ,సూర్యాస్తమయాన్ని, వెన్నెలని చల్లగా దూకేగాలిని ప్రవహించే నీటిని, ఎగిరే పిట్టని, ఎక్కడి నుంచో వినిపించే పాటని, రాత్రిపూట వెలిగే ఆకాశాన్ని ,అటు ఇటు తిరిగే మేఘాలను వీటిని వదిలేసి అనవసరపు భయాలతో సంక్షోభ వర్తమానాన్ని గుండెల్లో మోస్తుంటాడు. మనిషికి చావు అంటే విపరీతమైన భయం ఉండడాన్ని మనం గమనించవచ్చు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించినప్పుడు చావుని అమంగళంగా భావించడం ఎప్పటినుంచో ఉంది .చనిపోవడం అంటే వెళ్లిపోవడం అనే అర్థం మాత్రం తీసుకున్నప్పుడు మనం ఈ ప్రపంచానికి వచ్చాక వెళ్లిపోక తప్పదు అనే నిజాన్ని ఊహ తెలిసిన నుంచి మనిషి తెలుసుకోగలిగితే ఏ భయాలు ఆందోళనలు ఏ విజయాలు ఏ అపజయాలు మనిషిని తాకలేవు.

వసుంధరా దేవి రచించిన పెంజీకటికవ్వల కథలో జయలక్ష్మి పాత్ర ద్వారా రచయిత్రి మరణ భయాన్ని, మానసిక ఊగిసలాటనే సమర్థవంతంగా చిత్రీకరించారు.

> అయ్యో ఎంత దగ్గరలో ఉంది?. దాన్ని నుంచి ఎక్కడికి పారిపోవాలి. చావు, రోగం బాధ, కష్టం ....

ఈ జయలక్ష్మి పాత్ర విభిన్నంగా ఉంటుంది. వాళ్లు నివసిస్తున్న కాలనీలో ఎందుకుంటుందో తనకు తెలియదు. అక్కడ మనుషులు తనకు నచ్చరు. తన భర్త ,కూతురు వ్యవహారం నచ్చదు. అలానే వాళ్లంటే ఇష్టం లేదని కాదు జయలక్ష్మి పాత్ర ప్రతి విషయంలోనూ ఒక ఊగిసలాటలో ఉంటుంది. ఒక్కోసారి చాలా సంతోషంగా ఉండే జయలక్ష్మి మరోసారి అకారణంగా దుఃఖంతో ఉంటుంది. జీవితం నిస్సారం అనుకుంటుంది. తన రోజు పూజించే లక్ష్మీదేవిని చూసి ఒక్కోసారి కాగితం మీద కొట్టిన వట్టి బొమ్మగా అనుకుంటుంది . జయలక్ష్మి తన మనసు లోపల ఎప్పుడు దేనికోసమో వెతుక్కుంటూ ఉంటుంది ఏదో తెలుసుకోవాలని ప్రయత్నం ఉంటుంది. అనేక విషయాల్లో జయలక్ష్మి 20 ఏళ్లుగా కాపురం చేస్తున్న సరే తన భర్త తనకు అర్థం కావడం లేదు తను భర్తకు అర్థం కావడం లేదు తెలుసుకోలేని స్థితిలో ఉంటుంది.

ఓసారి కరెంట్ షాక్ కొట్టినప్పుడు చావు బతుకుకి ఇంత దగ్గరలో ఉంది ఏమిటి?

అయ్యో ఎంత దగ్గరలో ఉంది?. దాన్ని నుంచి ఎక్కడికి పారిపోవాలి. చావు, రోగం బాధ, కష్టం ఇటువంటివన్నీ ఎందుకు ఉన్నాయి? వాటి భారీ తప్పించుకోవడానికి మార్గమే లేదే. అని నిష్టూర పోతుంది ఈ వాక్యాలు కథలో చాలా కీలకమైనవి. జయలక్ష్మి ఎప్పుడు మృత్యువు గురించి ఆలోచిస్తూ ఉంటుంది. ఇంటి పక్కనే ఉన్న స్మశానం, దానికి ఉత్ప్రేరకంఅవుతూ ఉంటుంది. చిన్నప్పుడు తాత చనిపోయినప్పుడు, తాత కోసం విమానం వచ్చిందని తాత దేవుడి దగ్గరికి వెళ్ళాడని పెద్దవాళ్ళు చెప్తే నమ్మింది. కానీ ఇప్పుడు జయలక్ష్మి చావుని అర్థం చేసుకునే స్థితిలో లేదు చావంటే భయం విపరీతమైన భయంతో ఉంది.

ఈ కథలో రచయిత్రి ఒక్కో సన్నివేశాన్ని చాలా పగడ్బందీగా నడుపుకుంటూ వెళ్తారు. కరెంట్ షాక్, తాత చావు, సర్కస్ పిల్ల సన్నివేశం ఇలా కథలో ఒక్కో సన్నివేశాన్ని ఒక్కో మెట్టుగా చేసుకుంటూ పోవడం ఆమె కథ నిర్మాణ నైపుణ్యం మనకు తెలుస్తుంది.

జయలక్ష్మి ఏ పని చేస్తున్న ఏ దృశ్యం చూసినా ఆమె బాధ పడుతూనే ఉంది. ఆమె దుఃఖిస్తూనే ఉంది. దానికి కారణం మృత్యువు మాత్రమే.

అదే కాలనీలో మొదటి వీధి చివర్లో ఉండే మూడేళ్ల పద్మ తేలు కుట్టి చనిపోయినప్పుడు జయలక్ష్మి నిలవలేకపోయింది. అదే ఆలోచనతో కుంగిపోయింది. ఆ పసిపాప తేలు కుట్టిన బాధని ఎంత అనుభవించిందో కదా అని క్షణక్షణం బాధపడింది. ఒంటరితనం గురించి అడుగడుగునా భయపడుతూ ఉంటుంది. అతిగా ఆలోచిస్తూ లేనిపోనివి ముందు వేసుకొని ఎందుకు బాధపడతావని భర్త సీతారామారావు హెచ్చరించిన నేనేమీ ఊరికే బాధపడటం లేదు. ఆలోచన అనేది మనిషి లక్షణం. వెర్రి వాళ్ళు, జంతువులు దాని గురించి బాధపడకపోవచ్చు అని తనకు తాను సమర్థన చేసుకుంటూ ఉంటుంది. జయలక్ష్మి దృష్టిలో అనుభవం, ఆనందం అబద్దాలు. ఒంటరితనం, చావు, దుఃఖం నిజాలు.

> అదే కాలనీలో మొదటి వీధి చివర్లో ఉండే మూడేళ్ల పద్మ తేలు కుట్టి చనిపోయినప్పుడు జయలక్ష్మి నిలవలేక పోయింది.

జయలక్ష్మి లోపల తనకు తెలుస్తూ తెలుస్తూనే ఒక పెంజీకటి వలయాన్ని ఏర్పరచుకుంది. దాన్ని ఎలా దాటాలో తెలియక సతమవుతమవుతూఉండే ప్రతి క్షణాన్ని రచయిత్రి చిత్రికరించిన విధానం మనలాకట్టుకుంటుంది.

అలాగే క్యాన్సర్ ఆస్పత్రిలో తన బంధువును చూడ్డానికి వెళ్ళినప్పుడు అక్కడ వ్యాపించి ఉన్న మరణ వాతావరణం చూసి క్షణక్షణం పెంజీకట్లోకి జయలక్ష్మి వెళ్ళిపోతూ ఉంటుంది. వర్తమానంలోనే కాదు తన చిన్నతనంలో జరిగిన ఒక బల్లి సంఘటన కూడా తనని నిలువనీయదు. తన చుట్టూ ఉన్న మనుషులు తన భర్తతో సహా తన కూతురు రాధికతో సహా చావుని ఇంత సులభంగా ఎలా తీసుకోగలుగుతున్నారు జయలక్ష్మి తెలుసుకోలేక పోతుంది. క్యాన్సర్ హాస్పిటల్ కి వెళ్ళాక ఆమె ప్రవర్తన తారాస్థాయికి వెళ్ళిపోతుంది తనకూ్కడా క్యాన్సర్ వచ్చేసింది ఏమో అని భయపడి పోతుంది.

అనుక్షణం భయపడుతూ ఉండే తన భార్యను చూసి సీతారామారావు

చెప్పే మాటలు ఇలా ఉంటాయి.

"నీకు బ్రతుకే ఒక క్యాన్సర్ లాగా కనిపిస్తోంది అలా భయపడుతుంటే బతికేదిలాగే. పుట్టినప్పటి నుండి శరీరం నిర్ణయం దోవలో నడుస్తూ పెరుగుతూ నశింపుకు సిద్ధమవుతూ ఉంటుంది కానీ అదంతా మనకు కనిపించదు. జీవనము మృత్యువు రెండు ఎప్పుడు ఇక్కడ జంటగానే పుట్టిన ప్రతి మనిషి చచ్చిపోతాడు. ఎప్పుడో ఒకప్పుడు శరీరము మనసు కూడా కొన్ని పరిమితులకు లోపట ప్రవర్తిస్తాయి. ఒక పరిధిని దాటి పోలేవు ఆ పరిమితులను మనం ఒప్పుకోకపోతే మనకే బాధ".

కానీ ఈ మాటల్ని జయలక్ష్మి వెటకారంగా తీసుకుంటుంది. ఈ పరిధిలోని పరిమితుల్ని నేను ఒప్పుకోనంటుంది. అంటే ఇక్కడ సమస్యలో ఉన్న జయలక్ష్మి సమస్య నుండి బయట ఉన్న సీతారామారావు గారు చెప్పిన మాటల్ని స్వీకరించలేకపోతోంది. మానసిక విశ్లేషణ ప్రకారం సమస్యలో ఉన్న వ్యక్తి తన సమస్యను తాను తెలుసుకోగలిగినప్పుడు అతను లేదా ఆమె సమస్య పరిష్కారం వైపు చాలా వేగంగా వెళ్తారు. ఆ సమస్య గురించి చెప్పే ప్రతి వ్యక్తిని శత్రువుగా భావిస్తారు. ఇక్కడ జయలక్ష్మి కి తన భర్త తన కూతురు రాధిక ప్రస్తుతం అలానే కనిపిస్తున్నారు.

> నేను ఇంతవరకు ఏమీ అనుభవించలేదు తెలుసుకోలేదు జీవించలేదే నేను చచ్చిపోవటం ఏంటి?

జయలక్ష్మికి గుండె నొప్పి వచ్చిన తర్వాత కొద్ది కొద్దిగా జీవన అస్తిత్వం అర్థమవుతూ వస్తుంది.

నేను ఇంతవరకు ఏమీ అనుభవించలేదు తెలుసుకోలేదు జీవించలేదే నేను చచ్చిపోవటం ఏంటి? అసంభవం నేను చావను ఇన్నాళ్లు నేను గడిపిన జీవితం ఏది? నా అనుభవాలేవీ నా భవిష్యత్తు ఏది? ఏమీ కనబడటం లేదు.

"నేను ఏది? ఎక్కడున్నాను?" అని అన్వేషణ ప్రారంభం అవుతుంది. అయ్యో ఈ భూమి, ఆకాశము, నీళ్లు ఇల్లు, ఊరు అన్ని అలానే ఉంటాయా నేను మాత్రం వెళ్ళిపోతానా అని తన లోపల ఆలోచించుకుంటుంది. అసలు నేను ఎవరు అని అన్వేషణలో పడుతుంది నేనంటే నా మనసు అని తెలుసుకోగలుగుతుంది.

జీవితం చేయిజారిన చేదతాడు లాగా పట్టు లేకుండా జారిపోతున్నది. ఇంత జీవితం ఇన్ని సంవత్సరాలు ఎట్లా గడిపేసాను ఎంత నిర్లక్ష్యంగా గడిపాను? ఇంతకాలంలో ఏం చేశాను? ఏం తెలుసుకున్నాను? ఏదో మహాశక్తి నా ముందు ప్రత్యక్షమై "జయ, ఇదిగో నీ జీవితం తిరిగి జీవించు" అంటే ఎంత తెలివితో ప్రతి క్షణాన్ని ఎంత అపురూపంగా బతుకుతాను అంటూ ఆలోచనలో పడుతుంది. తన జీవితాన్ని ఏ క్షణం దగ్గర ఎలా మార్చుకోవాలో ఎలా జీవించి ఉండవచ్చు ఆలోచించడం మొదలుపెడుతుంది. ఆ మ్యాజిక్ క్షణం కోసం జయలక్ష్మి ఎదురు చూస్తూ ఉంటుంది. అలాంటి అన్వేషన్లో నుంచి జయలక్ష్మి మనిషికి ఉండే పరిమితులు జీవితానికి అర్థం స్వేచ్ఛ ఇవన్నీ ద్వంద్వ స్వరూపమైన మనసుకు సంబంధించిన ప్రశ్నలని తెలుసుకుంటుంది. కాలం అనేది ఒక ఊహని అందులో అనేక క్షణాలు ఉన్నాయని ఒక క్షణానికి మరొక క్షణానికి మధ్య ఆ సంబంధాలు కల్పించేది మనస్సు అని ఆమె తెలుసుకున్న క్షణం ఆనందంతో ఉండిపోతుంది. అప్పుడు జయలక్ష్మికి స్మశానాను చూస్తే అసహ్యం కలగడం లేదు, భయం కలగడం లేదు. కాలానికి కార్యకరణ సంబంధానికి లోబడి ఉండే మనసుని ఎలా గ్రహించాలో తెలుసుకుంటుంది. ఆ క్లిష్టతను సంకీర్ణతను వైవిధ్యాన్ని చైతన్యాన్ని గ్రహించడం ఎలాగో భరించడం ఎలాగో ఆమె గుండెల్లో ఒక ఎదురు చూపు మొదలవుతుంది. ఇప్పుడు ఆమెకు నీలాకాశంలో నల్లమబ్బులు నారింజ రంగు సూర్యుడు కాంతి ఇవన్నీ అద్భుతంగా కనిపిస్తున్నాయి.

ఇక్కడ రచయిత్రి జయలక్ష్మి పాత్రలో కలిగిన ప్రవర్తనకి కారణం జయలక్ష్మి అయింది గానీ ఇతరులు కాదు. వ్యక్తి తనని తాను తెలుసుకోవడం మొదలుపెట్టినప్పుడు ఏ భయాలు ఏ ఆందోళనలు ఏ దుఃఖాలు ఏమీ చేయలేవు అనే విషయాన్ని జయలక్ష్మి పాత్ర ద్వారా రచయిత్రి అందించారు.

మనలో కూడా ఈ భయాలు చాలా ఉంటాయి పక్కింట్లో మనిషి చనిపోతే నిద్ర పట్టని రాత్రులు ఉంటాయి. సమీప బంధువు చనిపోతే దిగులు పడిన క్షణాలు ఉంటాయి. ఓ ప్రదేశంలో ప్రమాదం జరిగితే అదే ప్రదేశం కి వెళ్ళినప్పుడు మనకు కూడా అలాంటి ప్రమాదమే జరిగే అవకాశం ఉందనే ఆలోచన వస్తుంది. ఎవరికైనా హార్ట్ ఎటాక్ వస్తే మనకు కూడా వస్తుందేమో అనే భయం కలుగుతుంది. ఇలాంటి భయాల్ని, ఆందోళనని జయించడానికి పెంజీటి కవ్వల అనే కథ ద్వారా రచయిత్రి ఓ దారి చూపుతున్నారు.

పుట్టుక, మరణము రెండు కాలం నుంచి పుట్టేవి. ఈ విషయం జయలక్ష్మి

తనకు తానే గ్రహిస్తుంది.

రచయిత్రి ఈ కథ ముగింపులో ఒక బయోస్కోప్ లాంటి సాధనంలో బొమ్మలు చూపించేటటువంటి ఒక ఆట తమాషా బంగ్లా ఆట ద్వారా ముగిస్తుంది. బొమ్మలు చూశాక జయలక్ష్మి మనసు నిండా ఆనందం నిండుతుంది.

నేను లేకపోయినా ఇదంతా ఉంటుంది. ఈ మనుషులు, చెట్లు, సూర్యుడు, ఆకాశం ఎప్పటికీ ఉంటాయి అనే నిర్ధారణకు వస్తుంది. రచయిత్రి కథ నడిపిన తీరు స్మశాన వాతావరణం నుండి మొదలుపెట్టి ఒక్కో సంఘటన ద్వారా జయలక్ష్మి చిన్నప్పుడు తాత చనిపోయిన సంఘటన, జయలక్ష్మి సర్కస్లో ఒక చిన్న పాపను చూసిన సంఘటన, తేలుకుట్టి చనిపోయిన మూడేళ్ల పాప, హాస్పిటల్లో పల్లెటూరు నుంచి వచ్చిన సమీప బంధు వెంకటప్ప, తన బాల్యంలో జరిగినటువంటి బల్లి సంఘటన చివరికి తనకే గుండె నొప్పి రావడం ఇలా ఒక్కో సంఘటన ద్వారా కథను పతాక స్థాయి కి తీసుకుపోయారు. నిజానికి కథలో తమాషా బంగ్లా ఆట అక్కర్లేదు. ఈ ఆట కంటే ముందు కథ ముగిసినట్టుగా మనకు అనిపిస్తుంది.

> నేను లేకపోయినా ఇదంతా ఉంటుంది. ఈ మనుషులు, చెట్లు, సూర్యుడు, ఆకాశం ఎప్పటికీ ఉంటాయి అనే నిర్ధారణకు వస్తుంది.

ప్రముఖ కవి శివారెడ్డి గారు 'మనం లేకపోతే' అనే కవిత ద్వారా ఇలా చెప్తారు...

మనం అనుకుంటాం
మనం లేకపోతే ఎట్లా బతుకుతారో వీళ్ళని
లోకమెట్ట మనతుందోనని, మనం లేకపోయినా బాగానే బతుకుతారు వీళ్ళు
మనం లేకపోయినా ప్రపంచంలో బ్రహ్మాండంగా నడుస్తూనే ఉంటుంది
నువ్వు అనుకుంటావు చక్రం నువ్వే తిప్పుతున్నావని
సమస్తము నీతోనే ముడిపడి ఉందని

నీ కోడి కూస్తేనే తెల్లారిందని లేదు నువ్వు లేకపోయినా బండి నడుస్తుంది

పిల్లల పుడతారు పెరిగి పెద్దవుతారు

ప్రేమలో పడతారు పెళ్లిళ్లు చేసుకుంటారు

దుఃఖిస్తారు ఆనందిస్తారు ఆక్రోశిస్తారు

అపూర్వంగా నవ్వుకుంటారు పక్షులెగురుతాయి గాలివీస్తుంది పూలు పూస్తాయి

అమ్మాయి అబ్బాయి ఒక దగ్గర కూర్చుంటే చంద్రోదయం అవుతుంది.

వేలవేల మిలియన్ల రెల్లు పువ్వుల్లా గాలికి ఊగి ఊగి పోతాయి

రాత్రులు మనోహరంగా ఉంటారు

ఒకళ్ళని ఒకళ్ళు ఓదార్చుకుంటారు

ఒకరు భుజం మీద తలపెట్టి మరొకరు

విస్తు పోతారు వీరవీగుతారు ఎడాపెడా పడిపోతారు పడిపోయిన వాడిని చేయందించి లేపుతారు

మనం ఉన్నప్పటి కంటే మనం లేనప్పుడే లోకం బాగుంటుంది బాగుపడుతుంది

ప్రపంచం ఇంకా అర్థవంతంగా అందంగా ఉంటుంది

మనం లేకపోతే ఏమీ నష్టం లేదు మనం లేకపోవడం తప్ప

ఈ కవిత ఆర్. వసుంధర దేవి కథ సారాంశానికి సరిగ్గా సరిపోతుందని నాకనిపించింది.

ఈ కథలో నాకు నచ్చిన, నచ్చని కొన్ని అంశాలు:

1. కథా ప్రారంభం అంతగా ఆసక్తి గా లేకున్నా మెల్లగా పాఠకుడు కథలోకి వెళ్తాడు.
2. జయలక్ష్మి పాత్ర చిత్రణ.
3. జీవితపు వ్యాఖ్యానాలు.
4. చంద్రిక పాత్ర.

5. మెట్టు మెట్టు ఎక్కి , మేడ మీదకి చేరినట్టు ఉన్న కథా నిర్మాణం.
6. కథ ముందే ముగిసిపోయినా, ఇంకో ముగింపులా తమాషా బంగ్లా ఆట ఉండటం అనేది లోపంగా అనిపించింది.
7. బహిఃఅంతర ప్రపంచాల చిత్రణ అద్భుతంగా ఉంది.

అనవసరపు దుఃఖాన్ని త్యజించడం, ప్రతి క్షణాన్ని జీవితంలో భాగంగా చూడడం, జీవితాన్ని ఇష్టంగా జీవించడం ఇవే వసుంధరా దేవి ఈ కథ ద్వారా మనకు చెప్పే కీలక అంశాలు.

కొండల లోపల నిండిన నింగిలో
ఉరిమెను మేఘం ఇన్నాళ్ళకి
పిల్లన గ్రోవిలో పిలవని మోవిలో
కురిసెను రాగం ఈనాటికి
మట్టింటి రాయే మాణిక్యమైపోయె
సంగీత రత్నాకరానా

స్వర సప్తకాలే కెరటాలు కాగా
ఆ గంగ పొంగింది లోన
స్వర రాగ గంగా ప్రవాహమే
అంగాత్మ సంధాన యోగమే
ప్రాప్తే వసంతే త్రికాలికే

పలికే కుహు గీతికా
గాన సరసీరుహమాలికా
స్వర రాగ గంగా ప్రవాహమే

చైతన్య వర్ణాల ఈ చైత్ర సుమవీధి
వినిపించు రాగాలనంతాలులే
ఈ చక్రవాకాలు ఎగిరే చకోరాలు
జగమంత విహరించు రాగాలులే
పిలిచే శకుంతాలు పలికే దిగంతాలు
పులకింతలా పుష్యరాగాలులే
మలిసంధె దీపాలు గుడిగంట నాదాలు
మౌనాక్షరీ గాన వేదాలులే

- శ్రీ వేటూరి సుందరరామ మూర్తి

## ప్రత్యేక వ్యాసం

# 'ముప్వా' కవిత్వంలో కవిత్వ సాధన తత్త్వం



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
✆ 91826 85231

మంచి భోజనం పెట్టి ఎలా ఉందంటే చెప్పగలం. ఆ రుచులన్నీ వర్ణిస్తూ మరీ చెప్పగలం. కానీ, మనకొక మంచి కవిత్వానికి చెందిన ఒక పుస్తకాన్నిచ్చి ఎలా ఉందంటే చెప్పలేం. ఆ కవి పట్ల తప్పకుండా మనమొక భావనను మాత్రం ఏర్పరుచుకుంటాం. బయటకు కనిపించే మనిషిలో, బయటకు కనిపించనిదేదో కవిత్వంలో కనిపించి ఆ వ్యక్తితో మాట్లాడాలంటే, అంతకు ముందున్నంత చొరవగా మాట్లాడలేం. ఇలా సాధారణంగా ఎప్పుడు జరుగుతుంది? ఆ కవిత్వంలో లోతులున్నప్పుడు, ఆ కవిత్వంలో వాచ్యం కాని వ్యంగ్యార్థాలున్నప్పుడు, ఆ కవిత్వంతో మనల్ని రసలోకాల్లోకి తీసుకెళ్ళినప్పుడు, ఆ కవిత్వంలో మనల్ని మనం చూసుకునేలే చేయగలిగినప్పుడు, ఆ కవిత్వం మనల్ని వెంటాడుతున్నప్పుడు, ఆ కవిత్వం మన గురించే రాసినట్లనిపించినప్పుడు... ముప్వా శ్రీనివాసరావుగారి కవిత్వం చదివినప్పుడు నాకు కలిగిన భావాలివి. అప్పుడప్పుడూ మాత్రమే ఇలాంటి కవిత్వాన్ని చదివే సందర్భం వస్తుందేమో. ఆయన కవిత్వం...

వాక్యం నిప్పులా ఉండదు
    కానీ,
సెగ పుట్టిస్తుంది
వాక్యం మంచులా వుండదు
    కానీ,
వణుకు పుట్టిస్తుంది
వాక్యం మల్లె పువ్వులా ఉండదు
    కానీ
పరిమళిస్తుంది
వాక్యం వెలుగులా వుండదు
    కానీ

అన్నిటిని దృశ్యమానం చేస్తుంది. (కానీ... వాక్యాంతం. పుట: 148) అన్నట్లు ఉంటుంది. దీన్ని మనం అధ్యయనం చేసేముందు కవి మువ్వాశ్రీనివాసరావుగారి గురించి పరిచయం చేసుకుందాం.

## మువ్వా శ్రీనివాసరావు గారి పరిచయం :



మువ్వా శ్రీనివాసరావుగారు ఒక కవిగా, విద్యావేత్తగా ప్రసిద్ధుడు. ఆయనకు అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. అనేకమంది పేద విద్యార్థిని విద్యార్థులు కూడా అందులో చదువుకుంటున్నారు. ఆయన అనేక సేవా కార్యక్రమాలు కూడా చేస్తూ ఉంటారు. ఆయన హృదయాన్ని తాకేలా కవిత్వం రాస్తారు. శ్రీశ్రీ అంటే మహా అభిమానం. తెలంగాణలోని ఖమ్మం జిల్లా లంకపల్లి గ్రామంలో ఆయన జన్మించారు. శ్రీమతి పద్మావతి, శ్రీ రంగయ్య వారి తల్లిదండ్రులు. ఆయన ఎం.ఎస్.సి అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ చేశారు. కొంతకాలం పాటు ఇంజనీర్ గా పనిచేశారు. ఆ తర్వాత జూనియర్ కళాశాల, ఎం.బీ.ఏ కళాశాల, ఎం.సీ.ఏ కళాశాల, బీ.ఈడీ కళాశాలలను స్థాపించి ఆ సంస్థలకు కరస్పాండెంట్ గా వ్యవహరిస్తున్నారు. తాను చదివింది ఇంజనీరింగ్ అయినా సాహిత్యం పట్ల గల అభిరుచితో అనేక రచనలు చదివేవారు. ముఖ్యంగా శ్రీ శ్రీ మహాప్రస్థానం ఆయన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. ఆయనకు శ్రీశ్రీ తో పాటు నగ్నముని, శివారెడ్డి, డాక్టర్ సి.నారాయణరెడ్డి ఇలా అనేకమంది ప్రముఖ సాహితీవేత్తలతో పరిచయాలు ఉన్నాయి. ఆయన సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తే ఒక పెండ్లి చేసినట్లుగా చేయడం ఆయనకే సాధ్యం. మువ్వా పద్మావతి రంగయ్య ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది సాహితీవేత్తలకు పురస్కారాలు అందిస్తూ, పుస్తకాల ప్రచురణకు తన వంతు సహకారాన్ని అందిస్తూ ఉంటారు. ఆయన కోవిడ్-19 ని దృష్టిలో పెట్టుకుని ఒక గొప్ప కావ్యం రాశారు. దాని పేరు 'వైరాయణం'. అంతకుముందు ఆయన 'సమాంతర ఛాయలు' (2013) అనే కవితా సంపుటిని ప్రచురించారు. తర్వాత 6th ఎలిమెంట్ (2014), వాక్యాంతం (2019), వైరాయణం (2020). పుస్తకాల్ని చూస్తే తెలుగు పుస్తకాలు కూడా ఇంత క్వాలిటీతో వేసేవాళ్ళుంటారా? అనిపించేంత క్వాలిటీతో అందంగా ముద్రిస్తారు. వీటిలో సమాంతర ఛాయలు కవితాసంపుటి కన్నడం, తమిళం, హిందీలోకి అనువాదం అయ్యింది. వీరు

ఆవంత్స సోమసుందర్, సీతారాం శిఖామణి, స్మైల్, గిడుగు రామ్మూర్తి తదితర పురస్కారాలను అందుకున్నారు. వీటితో పాటు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) వారిచ్చే సాహిత్య పురస్కారాన్ని కూడా అందుకున్నారు. వీరి రచనలపై వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరుగుతున్నాయి. ఈయనపై త్వరలో సుమారు వెయ్యి పేజీల ఒక బృహ గ్రంథం వెలువడబోతుంది. జాషువా సాహిత్య వేదిక ద్వారా సమకాలీన సాహిత్యాన్ని ప్రతి నెల నెలా పరిచయం లేదా చర్చకు పెడుతుంటారు.

కవి ముద్దా శ్రీనివాసరావుగారు తన కవిత్వం ద్వారా తనలోకి తాను ప్రవహిస్తూ, మనల్నీ తనలాగే ప్రహహించేలే చేస్తారు. వ్యక్తిగతంగా ఆయనతో నాకు ప్రత్యక్షంగా పరిచయం లేదు. కానీ, ఆయన కవిత్వంతో చాలా సంవత్సరాలుగా నాకు పరిచయం ఉంది. పత్రికల్లో ఆయన కవిత్వాన్ని చూశాను. పుస్తకంగా ఆయన కవిత్వం చూశాను. కవిత్వం పుస్తకాల్ని అంత అందంగా, అంత ప్రేమగా, అంత ఖరీదుగా ప్రచురించేవాళ్లలో ముద్దా శ్రీనివాసరావుగారు కూడా ఒకరని తెలుసుకున్నాను. ఆయన సాహిత్య సమావేశాల్ని కూడా ఎంతో వైభవంగా చేస్తారనీ ఆ నోటా ఆనోటా కూడా విన్నాను. అంతర్జాల సమావేశాల్లో గుర్రం జాషువా సాహిత్య వేదిక సమావేశంలోను, తర్వాత ఆచార్య పులికొండ సుబ్బాచారిగారు ముద్దా శ్రీనివాసరావుగారి వైరాయణం కావ్యంపై రాసిన విమర్శ సభలో ఒక ప్రధాన వక్తగా మాట్లాడినప్పుడూ ఆయన్ని చూశాను. ఆ తర్వాత ఆయనతో రెండు మూడు సార్లు ఫోన్లో మాట్లాడాను. ఈలోగా సాహితీ మిత్రులు పగిడిపల్లి వెంకటేశ్వర్లుగారు ముద్దా శ్రీనివాసరావుగారి కవిత్వంపై ఒక పుస్తకం తీసుకొస్తున్నామని ఒక వ్యాసం రాయమన్నారు. అప్పుడు ఆయన కవిత్వాన్నంతా ఒక క్రమంగా చదవడానికి ప్రయత్నించాను. ఆయన రాసిన వైరాయణం (మూడో ప్రపంచ యుద్ధ కవిత) 2020లో వెలువడింది. దీనిపై వచ్చిన విమర్శ గ్రంథం గురించి మాట్లాడినప్పుడు ఈ కవిత్వం గురించి కూడా కొంత రాశాను. కాబట్టి దాన్ని తప్ప మిగతా వాటి

> కవి ముద్దా శ్రీనివాసరావుగారు తన కవిత్వం ద్వారా తనలోకి తాను ప్రవహిస్తూ, మనల్నీ తనలాగే ప్రహహించేలే చేస్తారు.

గురించి ఈ వ్యాసంలో రాస్తాను.

విడివిడిగా పత్రికల్లో అనేకమందిలో ఒక్కొక్క కవి కవిత చదవడం ఒక అనుభవాన్ని కలిగిస్తుంది. అదే మరలా ఒక కవి కవితలన్నీ ఒకచోట చదవడం వేరుగా అనిపిస్తుంది. ఒక కవి కవితలను మరొక కవి కవితలతో తులనాత్మకంగా చదివినప్పుడు మరొకలా అనిపిస్తుంది. ఈయన ఇప్పటివరకు ప్రచురించిన నాలుగు కవిత్వం సంపుటాలు నేను చూశాను. అన్నీ అందమైన అట్టలతో ఆకర్శిస్తున్నాయి. అన్నీ అందమైన కాగితంపై చదవడానికి అనుకూలంగా ఉన్నాయి. దేన్ని ముట్టుకున్నా కవిత్వమే తగులుతుంది. దేన్ని ముట్టుకున్నా సమాజంలోని భిన్న మనస్తత్వాలే కనిపిస్తున్నాయి. దేన్ని చదివినా ప్రజాస్వామ్యంలో వైఫల్యాలు, పాలకుల, రాజకీయ నాయకుల ఎత్తుగడలు కనిపిస్తున్నాయి. దేన్ని చూసినా కవి అంతర్ముఖమూ కనిపిస్తుంది. కవి సమాజాన్ని చూసిన బహిర్ముఖమూ కనిపిస్తుంది. మనిషిలో పెరిగిపోతున్న వస్తు సంస్కృతి, దూరమవుతున్న మానవ సంబంధాలు, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని విప్లవాత్మక మార్పులు, ఆ మార్పులు తెచ్చిన మానవ సంబంధాల్లోని చీకటికోణాలు మనిషిని మళ్ళీ ఆదిమ సమాజంలోకి వెళ్ళిపోతే బాగుండుననిపించేంత అసహనం కూడా కనిపిస్తుంది. ఇదంతా ప్రతి కవీ ఇంచుమించు తన సమాజాన్ని, తాను జీవించిన సమకాలీన సమాజాన్నీ కవిత్వీకరిస్తాడు. కానీ, ఒక సాహిత్య విద్యార్థిగా నాకు ఈ కవిత్వంలో ఒక పార్శ్వం బాగా ఆకట్టుకుంది. అది ఒక వస్తువుని కవిత్వం చేయడంలోని రహస్యాన్ని కవిత్వ రహస్యంగా చెప్పే తీరు. కవిత్వం కోసం కవిపడే తపన, కవిత్వమవ్వడం కోసం పడిన సంఘర్షణ, కవిత్వంలో జీవితాన్ని తీసుకొనిరావడానికి పడిన సంవేదన. కవిత్వంలో తీసుకొనే శబ్దాలు, అందించాల్సిన అర్థాలు, వేయవలసిన పదాలు, వీటిని కవిత్వం చేయడంలో గల శిల్పరహస్యాలు, ఇవన్నీ కవిత్వ సాధన చేసేవారికి ఉపయోగపడే పరికరాలు. ఇవన్నీ కవిత్వం రాసేవారికి ఉపయోగపడే కవిత్వలక్షణాల తత్త్వంగా కూడా భావించవచ్చు. ఇది నన్ను కవి మువ్వా శ్రీనివాసావుగారి కవిత్వంలో బాగా

> విడివిడిగా పత్రికల్లో అనేకమందిలో ఒక్కొక్క కవి కవిత చదవడం ఒక అనుభవాన్ని కలిగిస్తుంది. అదే మరలా ఒక కవి కవితలన్నీ ఒకచోట చదవడం వేరుగా అనిపిస్తుంది.

ఆకర్షించిన ఒక అంశం. దీన్ని కొన్ని కవితల ద్వారానైనా వివరించే ప్రయత్నం చేస్తాను.

ప్రాచీన లేదా సంప్రదాయ సాహిత్యాన్ని పద్యంలో రాయడమెలాగో తెలిపే అనేక లక్షణగ్రంథాలున్నాయి. ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికీ, ఆధునిక వచన కవిత్వ నిర్మాణాన్ని తెలుసుకోవడానికి చేకూరి రామారావుగారు 'చేరాతలు'లో కొంత వివరించే ప్రయత్నం చేశారు. తర్వాత దాన్ని జి.లక్ష్మీనరసయ్యగారు కొనసాగిస్తున్నారు. వీరికంటే ముందు కొంత వరకూ ముదిగొండ వీరభద్రయ్యగారు కూడా ఈ దిశగా కృషి చేశారు. ఈ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాల్లోను, వివిధ పత్రికల్లోను కూడా వచనకవిత్వ నిర్మాణపద్ధతుల్ని వివరించే ప్రయత్నం చాలామంది చేస్తున్నారు. అటువంటి వారిలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, నందిని సిధారెడ్డి, బొల్లోజు బాబా, బిక్కి కృష్ణ తదితరులు ఈ దిశగా కొంత ప్రయత్నం చేస్తున్నారు. అయినా ప్రపంచంలోని ప్రతివ్యక్తికీ ఒక్కో ప్రత్యేకత ఉన్నట్లు, వచన కవిత్వం రాసే ప్రతి కవికీ అంతే ప్రత్యేకత కనిపిస్తుంది. అందుకే కవిత్వం నిత్యాన్వేషణ. కవిత్వం సత్యాన్వేషణ. ఈ అన్వేషణే మువ్వా శ్రీనివాసరావుగారి కవిత్వంలోనూ కనిపిస్తుంది.

### సమకాలీన సమాజ ఉద్యమాల సమాంతర ఛాయలు (2013) :

మువ్వా శ్రీనివాసరావుగారి కవితాసంపుటాల్ని అన్నీ ఒకేసారి చదివిన వాటిలో ఆయన తొలి కవితాసంపుటి సమాంతర ఛాయలు (2013) ఒకటి. ఇది శ్రీశ్రీ ఆరాధనలోంచి, కమ్యూనిజం నేర్పిన సారంలోంచి వచ్చింది. ఒక యువకుడికి ఉండాల్సిన ఉడుకు రక్తాన్ని ఈ కవిత్వంలో గమనించాను. సమకాలీన ఉద్యమాల్ని వదల్లేని ప్రభావాన్ని కూడా చూశాను. "మొన్న అచ్చంపేటను అచ్చంగా తొక్కిపెట్టి/నిన్న కారంచేడు చుండూరు/గుండెలు గాయం చేసిన/ఆ గడీ/ఇవాళ లక్ష్మింపేటలో కన్ను తెరచింది" (దొరసానుడు, పుట:41). ప్రపంచీకరణ ప్రభావాన్నంతా ఎంతో నైపుణ్యంతో గ్రామీణ వాతావరణమెలా విధ్వంసమైపోయిందో

> ఒక యువకుడికి ఉండాల్సిన ఉడుకు రక్తాన్ని ఈ కవిత్వంలో గమనించాను. సమకాలీన ఉద్యమాల్ని వదల్లేని ప్రభావాన్ని కూడా చూశాను.

ఒక్క కవితలో కూడా ఎలా చెప్పాలో దృశ్య చిత్రణ చేయగలకవి నైపుణ్యాన్ని చెప్పే కవిత "నేలదీపం". అలాగే మీడియా మాయాజాలాన్నీ, దానితో కుదేలవుతున్న షేర్ మార్కెట్ పతనాన్నీ, సాఫ్టవేర్ ఉద్యోగులు నిత్యం భద్రత కోల్పోయే ఉద్యోగాలతో ఎలా సతమతమవుతున్నారో చెప్పే కవిత కరెప్టెడ్ సాఫ్ట్వేర్. కవి తనలో తాను, వ్యవస్థతో తాను పడిన సంఘర్షణ కవిత్వాన్ని చూశాను. అందరికీ దయ్యాల మాణిక్యమ్మగా పరిచితమైన ఆమెలో తాను చూసిన త్యాగం, తాను చూసిన ధైర్యంతో కవి "నేనిప్పుడు అందరికీ పంచుతోంది/ ఆమె నాకిచ్చిన ప్రేమలో వాటాయే కదా..." అని చెప్పి, " అప్పుడప్పుడూ లెక్కలేనన్ని లాంతర్లు/ నాకలలోకి నడిచి వస్తూనే ఉన్నాయి/బహుశా అవి మాణిక్యం కళ్ళు కావచ్చు" (దెయ్యాల మాణిక్యమ్మ, పుటలు: 65-67) అనడం ద్వారా కవిత్వమయ్యారు. లోకం చూసే సాధారణ చూపుకీ కవి చూపుకీ ఉన్న వ్యత్యాసాన్ని వర్ణించడంలోనే మనుష్యుల్ని మనమెలా అపార్థం చేసుకుంటామో, ఎలా అర్థం చేసుకోవాలో చెప్పిన తీరు అద్భుతం. "గెలుపంతా ఆమెదే..." కవిత తనని తాను, తనలో తన జీవిత భాగస్వామిని చూసుకున్న దృశ్య చిత్రం ఒక డైరీ పుటనావిష్కరించినట్లుంది. 'కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు' అని మహాకవి జాషువ అన్నట్లు, తల్లి మాత్రమే కాదు, కూతురు, కొడుకు, భార్య, తల్లిదండ్రులు, మనవలు, మనవలరాళ్ళు... ఇలా అంతా అదృష్టవంతులే. అందుకే నాన్నకళ్ళలో కురిసిన కరుణ జలపాతంలో కవి కూడా తడవగలిగారు. "పసిగుడ్డుకు పక్క గుడ్డలు మార్చినట్టు/గడ్డిని పేర్చి పక్క మారుస్తూ" పెంచుకున్న తమ ఎద్దు చనిపోయినప్పుడు తన తండ్రి ఎలా దు:ఖ సంతకమయ్యాడో చెప్తూ "నాన్న కళ్ళు/మానవత్వపు వాకిళ్ళు" (పుట: 124) అని అలాంటి పశుపక్ష్యాదుల్ని కూడా ప్రేమించగలిగే కరుణార్ద్రహృదయుల్ని వెతుకుతుంటాడు కవి. జంటపక్షుల్లో ఒక పక్షి నేలరాలినప్పుడు మహాకవి వాల్మీకి హృదయం కన్నీరైంది. అలాంటి కన్నీరే ఇక్కడా కనిపిస్తుంది.

## సమాంతర ఛాయలు - కవిత్వసాధన తత్త్వం :

మువ్వా శ్రీనివాసరావు తాను రాసిన ప్రతి కవితాసంపుటిలోనూ ఏదొకచోట కవిత్వసాధనను వివరించే ఓ అక్షరమై గుభాళిస్తారు. కవిత్వ రచనలో నిమగ్నమైన వాళ్ళకి కవిత్వం రాసేవాళ్ళే మిత్రులుగా మారతారు. అందుకేనేమో మన స్నేహితులెవరో చెప్తే మనమెలాంటివాళ్ళమో చెప్పేయగలమని పెద్దలంటారు. సంస్కృతంలో కూడా యద్భావం తద్భవతీ అనొక మంచి మాట ఉంది. మనకెలాంటి భావన ఉంటుందో, ప్రపంచమంతా అదే భావనతో దృశ్యమానమవుతుంది. " 'ఓ... ప్రకటన" కవిత చదివితే ఈ భావన మనకి స్పష్టంగా కనిపిస్తుంది. కవి కవిత్వ సాధనలో నిరంతరం నిమగ్నమైనప్పుడు కవిత్వావేశం నిద్రపోనీయనిదొకట్టైతే,

మనకంతా కవిత్వంగా నే కనిపించడం మరొకటి. వ్యక్తిలోని సౌందర్యం బహిః ప్రపంచంలో మరింత అందంగా కనిపించడమే సౌందర్యమని మన పూర్వీకులు అందుకే అన్నారేమో. "వాడెవడో ఇప్పుడే/ అద్భుతకవితా వాక్యాలను/మా ఇంటెనుక గోడమీద/పారబోశాడు" (పుట: 118) అని ఉద్యమాల స్లోగన్స్ లోను కవిత్వాన్ని కనుగొనగలిగాడీ కవి.

"జ్ఞాపకాల ప్రవాహం లోంచి కొట్టుకొచ్చి/ఆలోచనల సుడిగుండాల్లో చిక్కుకున్న/నాలుగు వాక్యా"ల్ని ఏరుకొని "ప్రతీకలతో పదిలంగా చుట్టుకుంటూనో /మనసును మాటల్లో పోసి/అవసరమైనప్పుడు మార్మికంగా" (క్షతగాత్రం, సమాంతర ఛాయలు, పుట:20,21) చెప్తానంటూ తన కవిత్వం బాణాల సంచుల్లా, ఆయుధాల పొదుల్లా మారాలని తపించారు. ఖాళీ సమయం దొరికిందని కవిత్వాన్నిరాయడం కాదు, కవిత్వం రాయడానికి ఒక లక్ష్యం ఉండాలని భావిస్తున్నారు. కనుకనే "అర్థాలు మోస్తూమాటలు/వేల మైళ్ళు/ మనసు తీరం వెంబడి నడవకుండా/ భావాల అలల్లో తడవకుండా/వాక్యమై వొళ్ళు విరుచుకోవు/తెల్ల కాగితం పై / కవిత్వం కళ్ళూ తెరుచుకోదు" (పుట: 129) అని కవిత్వం రాయాలంటే కవి పడవలసిన మధనాన్ని కూడా ఇక్కడ కవిత్వంగానే చెప్పారు. కవిత్వంలో ప్రయోగించే పదాలిచ్చే అర్థాలు పాఠకుడికి శాశ్వతమైన, సుదీర్ఘమైన అనుభూతిని, ఆహ్లాదాన్ని కలిగించగలగాలనీ, అలాంటప్పుడు మాత్రమే తాను కూడా కవిత్వం రాస్తానని చెప్తున్నారు. కవిత్వానికి సమాజిక, ఉద్యమ ప్రయోజనాన్ని ఆకాంక్షించారు. అదిక్కడ కవిత్వ సాధనతో పాటు తన లక్ష్యం కూడా చెప్పడాన్ని గమనించాలి.

మువ్వా శ్రీనివాసరావుగారి రెండవ కవితాసంపుటి పేరు ఆయన చదువుకున్న శాస్త్ర పరిభాషతో రాసిన 6th ఎలిమెంట్ (2014).

## మానవ సంబంధాల విధ్వంస ప్రతిఫలన 6th ఎలిమెంట్ (2014) :

మువ్వా శ్రీనివాసరావుగారి రెండవ కవితాసంపుటి పేరు ఆయన చదువుకున్న శాస్త్ర పరిభాషతో రాసిన 6th ఎలిమెంట్ (2014). ప్రపంచ వ్యాప్తంగా మనుష్యుల్లో పేరుకుపోతున్న అవినీతి లేదా స్వార్థాన్ని ఆరో ఎలిమెంట్ (మూలకం) గా

భావించారనుకుంటున్నాను. కవితాసంపుటికి 6th ఎలిమెంట్ అని పేరు పెట్టడం వెనుక ఆయనలోని శాస్త్రవేత్త తెలుగు సాహిత్యంలో ఒక నూతన పరిభాషను తీసుకొచ్చేలా చేసిందని అనుకొంటున్నాను. దీనికి రమణజీవి గారు ఆధునిక జీవితాన్ని అద్దం పట్టేలా గొప్ప భావుకత ఉట్టిపడేలా ముఖచిత్రాన్ని రచించారు.

> శ్రీశ్రీ కవిత్వ ప్రవాహంలాంటి కవిత 'చైతన్యపురుగు' (పుట: 20) 'నెత్తురు చినుకులు/తడిసిన కత్తులు'' అంటూ సాగే ఈ కవిత దోపిడీ చరిత్రను లయబద్ధంగా చదివిస్తుంది.

ముళ్ళజెముడుల్లా ముట్టుకుంటే ముళ్ళు గుచ్చుకుంటాయన్నట్లు మానవసంబంధాలకు దూరమవుతున్న మనుషులతో ఆ చిత్రాన్ని వేశారు. తొలి కవితా సంపుటిలో ఉన్నట్లే దీనిలోనూ ఆ ఉద్యమ ప్రభావం అధికంగానే కనిపించినా ఆ 78 కవితలూ అవే వాసనలో లేవు. ప్రపంచవ్యాప్తంగా మనిషిలో వచ్చిన పరిణామాల్ని, ముఖ్యంగా ప్రపంచీకరణ ప్రభావాన్నీ పుస్తకంలో కవిత్వీకరించారు. మన విద్యావిధానం మొదలు, మన పాలన, పాలకులను ఎన్నుకునే మనుషుల మధ్య కొనసాగుతున్న సంబంధాలన్నెంటినో దీనిలో కవిత్వం చేశారు.

మనిషిని ఏమార్చే కలలు/మనకెందుకు/లోకాన్ని మార్చే కలలు కందాం/కలలు కనటం/కలగన్నంత తేలికేం కాదు/గ్లోబలైజేషన్ గురి చూసి కొట్టే దెబ్బలకు/గుండె పగిలి/భంగపడ్డ మనిషి కలలు /అభద్రతా సుడిగుండాల్లో/ఎటూ చేరక తిరుగుతున్నాయి/ఇప్పుడు కలకనడం పెద్ద కలైపోయింది" ( కలల పిడికిలి, 6th ఎలిమెంట్, పుట: 20) అని ప్రపంచీకరణ వల్ల విధ్వంసమవుతున్న జీవితాల్ని వర్ణిస్తారు కవి.

శ్రీశ్రీ కవిత్వ ప్రవాహంలాంటి కవిత 'చైతన్యపురుగు' (పుట: 20) 'నెత్తురు చినుకులు/తడిసిన కత్తులు" అంటూ సాగే ఈ కవిత దోపిడీ చరిత్రను లయబద్ధంగా చదివిస్తుంది. ఇటువంటిదే 'మంచుపువ్వు' కవిత కూడా. "ఇసుక పూల జ్ఞాపకం" (పుట: 34) కృష్ణుడు అష్టమ గర్భంలో పుట్టి/నోట అనంతాన్ని

చూపెట్టినట్లు/ఎనిమిదో స్థానంలో నిలిచిన/సిలికాన్ మూలకమిప్పుడు/ సమస్తాన్నీ అంగుళంలో బంధించింది" అని ప్రపంచ ఆధిపత్య సామ్రాజ్యవాదపు ఆక్రమణలెలా ఉంటాయో చెప్తారు.

## 6th ఎలిమెంట్ – కవిత్వసాధన తత్త్వం :

ఈ కవితా సంపుటిలో కూడా కవి ముప్వాశ్రీనివాసరావుగారు కవిత్వం మనిషిలోని మానవత్వాన్ని తట్టిలేపాలనే ప్రయోజనాన్ని వ్యక్తీకరిస్తారు. అనేక సందర్భాల్లో మనిషి కవిత్వమవ్వడం, కవిత్వమయ్యే సాధన తత్త్వాన్ని వర్ణించే ప్రయత్నం చేయడం కనిపిస్తుంది. కవిత్వం మనిషిని రసప్లావితం చేయాలంటూ, స్వార్థాన్ని పోగొట్టేలా ఉండాలంటూ పరోక్షంగా చెప్తూ.."ఓ మనిషీ!/ఏనాడైనా నిన్ను నీవు/విన్నావా/నీ ఎద నిండా /ఎండుటాకుల చప్పుడు... అంటూ మనిషి స్వార్థపరత్వాన్ని విడనాడాలంటే తనలో తాను మూడొందల అరవై డిగ్రీల్లో చూసుకోవాలంటాడు కవి. అంటే తనకు మాత్రమే తెలిసే తనని కూడా ఆత్మప్రక్షాళన చేసుకోవాలంటూ, అలా మనిషిలోని మనిషి ని కనుగొనాలంటే "ఇదిగో కవిత్వపు కళ్ళజోడు/లోపలి మనుషుల/జాడలు చూడు/ నీ లోపలి నీడలనూ చూడు/నీ ఎదనిండా ఎండుటాకుల చప్పుడు" (ఎండుటాకుల చప్పుడు, పుట: 58) వినిపిస్తుందంటాడు కవి. ఇక్కడ కవిత్వపు కళ్ళజోడు అనేది కవిత్వ సాధన తత్త్వంలోని ఒక అంశం. కవిత్వ ప్రయోజనం మనిషిని నిజమైన మనిషిగా మార్చగలగడంగా చెప్తున్నారు. సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే అదొకగొప్ప ఆయుధంగా చేసుకోవచ్చు. కానీ, దాన్ని వాడుకోవడంలో జరిగే వైఫల్యాల్ని చెప్పే సందర్భంలో కవిత్వం కూడా అలాంటిదేనంటూ... "ఎటు చూసినా/అక్షరాలతో అల్లిన /అర్థంలేని పదాల బొంతలపై/ప్రేమగా పొర్లాడే పావురాళ్ళు... తూట్లు పడిన శబ్దాలు/చిట్లిపోయిన దృశ్యాలు/ పగిలిన సన్నివేశాలు/అటుపై ఆచూకీ దొరకని/ఆర్తనాదాలు" (పరాజయం! పరాభవం!, పుట: 60) అంటాడు కవి. ఒక అద్భుతమైన

ఈ కవితా సంపుటిలో కూడా కవి ముప్వా శ్రీనివాసరావుగారు కవిత్వం మనిషిలోని మానవత్వాన్ని తట్టిలేపాలనే ప్రయోజనాన్ని వ్యక్తీకరిస్తారు.

భావచిత్రంలా వచ్చిందీ కవిత. రెండు అంశాల్ని జతచేసి ఆ రెండింటిలోని సామ్యాల్నీ వర్ణిస్తూ ఆ రెండూ ఎందుకలా వైఫల్యానికి గురవుతున్నాయో తన కవిత్వ సాధన తత్త్వంతో తెలుసుకున్న రహస్యాన్ని మనతో పంచుకుంటాడు కవి. అ కవిత్వాన్ని రాయడం ఒక అసమర్థత అయితే, దాన్ని ఆస్వాదించడమం మరింత అసమర్థులకు మాత్రమే ఆనందాన్నిస్తుంది తప్ప, కవిత్వ రహస్యం తెలిసినవాళ్ళకు అది ఆనందాన్నివ్వదని అర్థంలేని పదాలబొంతలపై పొర్లాడ్డంలాంటిదంటున్నారు. "మూట గట్టిన/ మాటల అయస్కాంతాలు/ అంతరంగమంతా/ కారి/ పారించిన/ విద్యుత్తేజపు వెలుగులు" నింపేలా కవిత్వం ఉండాలంటూ ఆ కవిత్వం చదువుతుంటే కళ్ళల్లో మెరుపురావాలి. దాన్ని ఇలా అంటున్నాడు కవి "కొత్తకనులను వెలిగించడమంటున్నాడు. అంతే కాదు "సరికొత్త రుచులను రగిలించి/రసగంగలో ముంచడాన్ని ఏమంటారో?" దీన్ని జాగ్రత్తగా చూస్తే కవిత్వం ఎలా ఉండాలో ప్రతిపదం ద్వారా తెలుపుతున్నాడు కవి. కవిత్వం చదువుతుంటే అయస్కాంతంలా ఆ ప్రయోగాలు ఆకర్షించాలి. ఆ కవిత్వం చదువుతుంటే కొత్త శక్తినివ్వగలగాలి. అంటే కవిత్వం నిరుత్సాహాన్ని కాకుండా జీవితాన్ని వెలిగించాలి. కొత్త కనులు అనే ప్రయోగం నూతన పదకల్పన. రోజూ చూసే దాన్ని చూస్తే కళ్ళలో కొత్త దనం ఉండదు. కొత్తదాన్ని అంటే మునుపెన్నడూ చూడనంత అద్భుతాన్ని ఆ కన్ను చూడగలగాలి. కొత్త కన్ను అనే ప్రయోగం వల్ల కవిత్వంలో అభివ్యక్తిలో కొత్త దనాన్నీ, పదకల్పలనలో కొత్త దనాన్నీ, పదాల కలయిక వల్ల వచ్చిన అర్థంలోని కొత్తదనాన్నీ సూచిస్తున్నాడు కవి. ఈ ఖండికలో చివరిలో సరికొత్త రుచులు రగిలించి, రసగంగలో ముంచగలిగేలా కవిత్వం రసభరితంగా ఉండాలనే భావాన్న వ్యక్తం చేస్తున్నారు.

ఆ తర్వాత పాదాల్లో కూడా కవిత్వమెలా ఉంటే బాగుంటుందో చెప్తూ... మాటను/ మరో మాటతో తాటించి/ మాటకు మరోమాట జోడించి / మాటను మాటనుంచి తొలగించి/ మాటమాటనూ పెళ్లగించి/ మాటల వెనుక మాటల్ని నింపి/ మాట మాటకూ/మాటమాటికీ/ కొత్త భావాలను పుట్టించే/లోహాలోహ, లోకాలోకన/ అర్ధ నిమీలిత శబ్దాశ్రయ/ వాక్యాలనే మంటారో/ బతుకు పోరులో/బతుకు హోరులో/ అక్షత శరీరునిగా నిలిపే/ అరమరికలేని/ అక్షరాలా అక్షర అమరికనేమంటారో! /ఏ మాటంటారో!! అని ముగించి ఎక్కడా దాన్నే కవిత్వమంటారనకుండా తన భావాలకు తానే అక్షర సమన్వయాన్ని అందించాడు కవి. కవిత్వం రాసేటప్పుడు శీర్షిక వాచ్యంగా పెట్టేసి,

ఆ వస్తువుని వర్ణిస్తూ కొంతమంది కవిత్వం రాస్తుంటారు. అప్పుడు పాఠకుడు భావుకత్వం కోసం ప్రయత్నించే అవకాశం కోల్పోతాడు. అందుకే కవిత్వం రాసి దేనికోసం రాశాడో దాన్ని చెప్పకుండా దాన్ని ధ్వనింపచేయాలి. అదే ఇక్కడ చేశాడు కవి. మాటను మాటనుంచి తొలగించడమంటే అదే. కవిత్వం చదివి కాసేపు కళ్ళు మూసుకొని ఆ దృశ్యమాన ప్రపంచాన్ని దర్శించగలగాలి. అది 'అర్ధనిమీలిత శబ్దాశ్రయం'గా ఉపమించాడు కవి. ఇదంతా కవిత్వ సాధన తత్వరహస్యంలో భాగమే.

**ఈ కవితా సంపుటి వాక్యాంతం (2019)లో మువ్వా శ్రీనివాసరావుగారు పరిపూర్ణమైన కవిగా కనిపిస్తారు.**

ఇలా ఈ కవితా సంపుటిలో కూడా కవి అనేక సందర్భాల్లో కవిత్వ సాధన రహస్యాల్ని వివరించారు.

### సమకాలీన సమాజంలో సౌందర్య స్వప్నం – వాక్యాంతం (2019 ) :

ఈ కవితా సంపుటి వాక్యాంతం (2019)లో మువ్వా శ్రీనివాసరావుగారు పరిపూర్ణమైన కవిగా కనిపిస్తారు. తొలి కవితాసంపుటిలోని ఆవేశాన్నీ, మలికవితాసంపుటిలోని ప్రయోగాల్నీ సమన్వయీకరించుకొని సమాజాన్ని ఒక సుందరభరితంగా మార్చాలనే ఒక సౌందర్యస్వాప్నికుడు, ఒక కవితా తాత్వికుడుగా కనిపిస్తారు. సమాజంలో అన్నీ నావనుకోవడంలోని స్వార్థపరతత్వాన్ని చెప్పడమే కాకుండా ఒక స్వేచ్ఛాజీవిగా మానవుడు మారే క్రమాన్ని స్వప్నించిన యోగితత్వం దీనిలో కనిపిస్తుంది. వైయక్తికానుభూతులుగా కనిపించేవి కూడా సాధారణీకరించే తాత్వికాలోచన ప్రతికవితలోనూ కనిపిస్తుంది. ఆలోచనలోను, అభివ్యక్తిలోను, వస్తు స్వీకరణలోను ఎంతోపరిణతి కనిపిస్తుంది.

> "ఇప్పుడూ మనదే కదా
> అయినా
> అప్పుడెప్పుడో మనదనుకోవడం
> నిజంగానే దౌర్భాగ్యం
> కోట్లమంది దేవుళ్ళున్న దేశంలో"

ఇంకో ఇద్దర్ని కలుపుకుంటే పోయేదేముంది? (తెరవాల్సిన తలుపులు,

వాక్యాంతం. పుట: 42). ఈ కవిత చదివేవారికి దీన్నీ మధ్యనే రాశారేమో అనిపిస్తుంది. ప్రపంచంలోని ముఖ్యమైన ఏడు వింతల్లో ఒకటైన తాజ్ మహల్ గురించి ఒక వివాదం చాలాకాలం నుండి నడుస్తుంది. ఆ మహల్ కింద ఉన్న కొన్ని గదుల్ని నేటికీ తెరవడం లేదు. దాన్ని తెరవాలనీ, అక్కడ ఒక శివలింగం ఉందనీ, దాన్ని ప్రజలకు తెలియకుండా దాచిపెడుతున్నారనేది ఆ వివాదం. అది ముస్లిములది కాదనీ, హిందువుల దేవాలయాన్నే అలా మార్చేసారనేది ఆ వివాదంలోని సారాంశం. ఈ వివాదాన్ని కేంద్రం చేయకుండా తాజ్ మహలే మన భారతదేశానిదనే ఆలోచనతో ముందుకుపోలేకపోతున్న స్థితికి కవి బాధ పడుతున్నాడు. ఇక్కడ జాగ్రత్తగా గమనిస్తే కవిలోని శాంతికాముకత తెలుస్తుంది.

సైన్స్ ద్వారా ఇంద్రియానుభవాల్ని కవిత్వీకరించడం కత్తిమీద సాము. అణు విచ్ఛేదనం జరిగిందంటే శక్తి విడుదలవుతుంది.

ప్రజాస్వామ్యానికి ముందున్నదంతా రాజరికం. అదికూడా మత ప్రాతిపదికపై సాగిన పాలనలో ఆ పాలకుల అభీష్టం మేరకే ఏదైనా జరుగుతుంది. ఆ విధంగా పాలకుల మతానికి అనుగుణంగా మారిపోయినవెన్నో. అవన్నీ నేడు మరీ ముఖ్యంగా ప్రజాస్వామ్యదేశంలో, లౌకిక భావనకు కట్టుబడిన దేశంలో గతాన్ని తవ్వుకొంటూపోతే దానికొక ముగింపు అంటూ ఉండదు. అది ద్వేషాలకు, అశాంతికీ, ఘర్షణలకు కారణమవుతుంది. అందువల్ల మనం తెరవాల్సిన నిజమైన తలుపులు మానవత్వపు లోగిళ్లు అనడంలో కవికున్న విశాలదృక్పథం, శాంతి, సహృదయతలను వెల్లడి జేస్తుంది. నిజంగా అలా చరిత్ర తలుపులు తెరుచుకుంటూ పోతే మానవుల మధ్య వివిధ కారణాలతో జరిగిన వివక్షలన్నింటి చప్పుడుని వినగలగడానికి సిద్ధంగా ఉన్నారా? అనే ప్రశ్నతో కవితను ముగించారు.

"ఏ ఆవేశం లేకున్నా ఓ చిన్న న్యూట్రానే
యురేనియం కేంద్రకాన్ని బద్దలు చేసినట్లు
ఒక మాటేదో మనసుకేంద్రకంలో చేరి ధ్వంసమైపోతాం
శోకపు చుక్కలై రాలిపడుతుంటాం" ( గురూ... 'వాక్యాంతం' పుట: 45)

సైన్స్ ద్వారా ఇంద్రియానుభవాల్ని కవిత్వీకరించడం కత్తిమీద సాము. అణు విచ్ఛేదనం జరిగిందంటే శక్తి విడుదలవుతుంది. వాటిని శాస్త్రవేత్తలు ఎలక్ట్రాన్లు,

న్యూట్రాన్ల మధ్య జరిగే సంఘర్షణలుగా చెప్తుంటారు. అవి మామూలుగా చూసే కంటికి కనిపించనంత అణువు, పరమాణువుల్లో జరిగే ఘర్షణలు. కొంతమంది చాలా సెన్సిటివ్ గా ఉంటారు. చిన్నదానికి కూడా కదిలిపోతారు. తను, తనవాళ్ళు, తన సమాజం, తన దేశం, ప్రపంచం అంతా ఎక్కడ ఏమి జరిగిగా తనదిగా భావించుకుంటూ మంచి జరిగితే సంతోషం, చెడు జరిగితే దు:ఖపడిపోతుంటారు. చివరికి తానేదైనా పొరపాటుగా మాట్లాడినా తనలో తాను బాధ పడిపోతుంటారు. దీన్ని సైన్స్ తో ముడిపెట్టి "భూ అయస్కాంత క్షేత్రం తిరగబడితే/సౌర తుఫానులో తగలబడుతున్నట్లు" మన మాటలు మనకే అపార్థమైపోతున్న ఒక గొప్ప ఇంద్రియానుభవంతో ముడిపెట్టారు కవి. ఇక్కడ మనసు రెండు రకాలుగా ప్రతిస్పందించిన తీరుని కవిత్వీకరించారుకవి.

కవికి స్వేచ్ఛ ఉంటుంది. తానేదైనా రాయొచ్చు. తన అంతరంగం మనకి చూపించే కవిత్వం రాయొచ్చు.

ఒకటి: తనవల్ల జరిగిన దానికి తాను స్పందించడం.

రెండు: తన వల్ల కాకపోయినా తనవాళ్లుగా భావించుకోవడం వల్ల జరిగే అంతః సంఘర్షణ. మనిషికి ఈ లక్షణాలే లేకపోతే మానవుల మధ్య ఈ మమకారాలు, అనుబంధాలు ఉండేవేకావు. నిత్యం మనం చూస్తుంటాం. మనవాళ్ళకేమైనా జరిగిందని తెలిసిందంటే, మన మనసెలా విలవిలలాడిపోతుందో. దాన్ని మనం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పట్టించుకోవాలో లేదో అనేది కూడా ఒక అంత: సంఘర్షణే. అది మనసుకేంద్రంగా జరిగే ధ్వంసం. విచిత్రమేమిటంటే, సైన్స్ ప్రకారం కేంద్రకాన్ని బద్దలు చేసే కొద్దీ శక్తి విడుదలవుతుంది. కానీ మనసు కేంద్రం విధ్వంసమయ్యేకొద్దీ కన్నీళ్ళొస్తాయి. ఇక్కడే కవి దృశ్యమానమైన ప్రతిదానిలోనూ మానవీయతను చూడ్డం కరుణార్ద్రమైన కవికి మాత్రమే సాధ్యం. మనిషిని ప్రేమించేవాళ్లకే అది సాధ్యమం. అది కవి మువ్వా శ్రీనివాసరావుగారి మనసుకు సాధ్యమైంది.

కవికి స్వేచ్ఛ ఉంటుంది. తానేదైనా రాయొచ్చు. తన అంతరంగం మనకి చూపించే కవిత్వం రాయొచ్చు. అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రపంచ పరిణామాల్నీ కవిత్వంగా అందించవచ్చు. కానీ, కవి మొగ్గు దేనిపైన ఉందనే దానిపైనే కవిత్వ విలువలు ఆధారపడి ఉంటాయి. పాలస్తీనా-ఇజ్రాయెల్

జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు... దాని వెనుకున్న వాళ్ళ గురించి చెబుతూ 'స్వేచ్ఛ ప్రతిమ అయిన దగ్గరే కదా/పదకొండు పదఘట్టనలు మొదలైంద"ని ఆధిపత్య దేశాన్ని స్ఫురింపజేస్తూనే 'ఎగిరిపోపావురమా... ఎగిరిపో " అంటూ చెప్పిన ఆ కవిత ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛపై జరిగే దాడులని భావించేలా ఉంది. ఈ కవిత చివరిలో "ఎగిరో పావురమా ఎగిరిపో/ గాజాలో నీకిక జాగానే లేదు/ ఎగిరిపో..." (ఎగిరిపో...' వాక్యాంతం' పుట: 52) 'గాజా' అనేది తప్ప మిగతాదంతా ఏదో ఒక దేశంలో జరుతున్న యుద్ధానికి చెందింది కాదు. అందుకే దీన్ని ఒక అంతర్జాతీయ కవితగా చెప్పొచ్చు.

భాషతో చేసే ప్రయోగాలన్నో ఈయన కవిత్వంలో కనిపిస్తాయి. సమాంతర ఛాయలు కవితా సంపుటిలో ఇన్ సోమ్నియా కవితలో వార్తల్ని టీవీల వాళ్ళెలా విధ్వంసానికి గురిచేస్తున్నారో అంతే విధంసక భాషతో ఔచిత్యంతో కవిత్వమయ్యారు. "24 ఇంటూ 7 చిరుతపులి కళ్ళతో చెలరేగుతూనే

ఇంటింటికీ నిజాన్ని చెప్పాల్సినవాడు

అ

ర్ధాం

త

రం

గా

వార్తను వధిస్తుంటాడు" (పుట: 26). ఇటువంటి "ప్రయోగమే నెలరాని రోజు" (పుట:149)లో కూడా కనిపిస్తుంది. N కౌంటర్ (పుట:144) పేరుతో రాసిన కవిత Number of Encounters అనే భావాన్ని శక్తివంతంగా కవితా శీర్షికతోనే చెప్పగలిగారు. ఇటువంటి ప్రయోగంతోనే 6th ఎలిమెంట్ కవితాసంపుటిలో 'అలా వెళ్లొద్దాంరా' (పుట్ 36) పేరుతో ఒక కవిత రాశారు. రాజకీయాల్లో మతతత్వమెలాంటి వ్యవస్థను తయారు చేస్తుందో వర్ణిస్తుంది కవిత. ఇలాంటి కవితలు ఈయన అన్ని కవితా సంపుటాల్లోను కనిపిస్తాయి.

### కవిత్వ సాధన రహస్య తత్వం — వాక్యాంతం :

ఆధునిక సమాజంలో నిలబడి, అన్నీ అందుబాటులో ఉన్నా మనిషి కోల్పోతున్న స్వచ్ఛమైన మనిషితనాన్ని వెతుక్కోవడం కోసం మరలా ఆదిమ సమాజానికైనా వెళ్ళడానికి సిద్ధపడి అచ్చమైన మానవత్వ పరిమళాల్ని వెతుక్కొనే

సాధనంగా కవిత్వాన్ని నమ్ముకున్న కవి మువ్వా శ్రీనివాసరావు. ఆయన కవిత్వాన్ని చదువుతుంటే మళ్ళీ కవిత్వం రాయాలనిపిస్తుంది. ఆయన కవిత్వాన్ని చదువుతుంటే దేనికోసం కవిత్వం రాయాలో తెలుస్తుంది. ఆయన కవిత్వాన్ని మనిషి దేనికోసం అన్వేషించాలో తెలుస్తుంది. కవి కె.శివారెడ్డిగారి కవిత్వం చదువుతుంటే మనకి తెలియకుండానే కవిత్వ ఆవేశం పుట్టుకొస్తుంది. అది మామూలు పదాలతోనే రాసినట్లు ఉంటుంది. కొన్ని కవితలు చదివే సరికి మనమే ఒక కవిగా మారిపోతుంటాం. మళ్ళీ నాకు అలాంటి ఓ గొప్ప అనుభవాన్ని కలిగించిన మరో కవిత్వం మువ్వా శ్రీనివాసరావు గారి వాక్యాంతం. సాధారణంగా కవిత్వమంటే ఏమిటి? దాని స్వరూప స్వభావాలేమిటనే లాక్షణిక జ్ఞానాన్ని కావ్యశాస్త్రాలు అందిస్తాయి. వాటిని చదివితే పాండిత్యం వస్తుందేమో కానీ, కవిత్వం రాదు. పద్యం రాసే కవిత్వ ఆవేశం రావాలంటే ఆంధ్ర మహాభారతాన్ని చదవాలి. ఆంధ్రమహా భాగవతాన్ని చదవాలి. ప్రబంధాల్ని చదవాలి. అవి చదివితే పద్యం దానికదే తన్నుకొని వస్తుంది. అందులోనే లక్షణాలున్నాయి. అందులోనే పద్యనైపుణ్యాన్ని అవగాహన చేసుకొనే అంతర్లీన శక్తి ఉంది. మరి ఆధునిక వచన కవిత్వాన్ని రాయగలిగించే ప్రేరకశక్తి వేటికుంది? శ్రీశ్రీ కవిత్వానికుంది. కృష్ణ శాస్త్రి కవిత్వానికుంది. తిలక్ అమృతం కురిసిన రాత్రి కుంది...ఆ కోవలోనే మరికొంతమంది కవిత్వం కూడా ఉంది... అలాంటి అరుదైన కవుల్లో మువ్వా శ్రీనివాసరావు గారు కూడా చేరారనిపించేలా చేసే గొప్ప కవితా సంపుటి 'వాక్యాంతం'.

> 'ఎవరెవరో... కవిత్వపు చినుకులు' (పుట: 59) కవితలో కవిత్వం ఒక రసవిద్యగా తెలిసినవాడికీ, తెలియని వారికీ మధ్యగల భేదాల్ని ఒక లాక్షణికుడిలా కవిత్వంలో చెప్పారు.

'ఎవరెవరో... కవిత్వపు చినుకులు' (పుట: 59) కవితలో కవిత్వం ఒక రసవిద్యగా తెలిసినవాడికీ, తెలియని వారికీ మధ్యగల భేదాల్ని ఒక లాక్షణికుడిలా కవిత్వంలో చెప్పారు. కవిత్వం అక్వేరియంలో చేపపిల్లలా రంగురంగుల్లో ఉండాలంటారు. అంటే, ఒక పదం లేదా ఒక కవిత్వ పాదం అనేక భావాల సంగమంలా అనిపిస్తూ పదేపదే చదివించేలా చేయాలంటారు.అంతేకాదు కవిత్వం మనసుకీ, మనిషికీ మధ్య కురిసే చినుకులా ఉండాలట. అంటే,

మనిషి బహిర్రూపాన్నో కేవలం అంతరంగాన్ని మాత్రమేనో వర్ణించేలా ఉండే కంటే, మనసుని కదలిస్తూ మనిషిని దీప్తిమంతం చేయాలంటారు కవి. ఇదొక అద్భుతమైన కవిత. ఇదొక అనుభవంతో చేసిన కవిత్వ శాసనం. ఇది చదివేవారు జాగ్రత్తగా ఆలోచిస్తే శ్రీశ్రీ 'కదిలేదీ, కదిలించేదీ కావాలోయ్ నవకవనానికి' అని చెప్పిన దాన్ని మరింత చిక్కగా, చక్కగా కవిత్వం చేసినట్లు నిరూపిస్తుంది.

"రంగురంగుల వాక్యాలను పుక్కిలించి పోతారు.
వీడెవడో
వాటిని ఆక్వేరియంలో చేపల్లా సాకుతుంటాడు."
వీడే
కావాల్సిన వాక్యాలను గిల్లుకుని
కవిత్వాన్ని కనబడకుండా చేస్తాడు.
వీడు మాత్రమే
మనసుకు, మనకు మధ్య కురిసే
కవిత్వపు చినుకులను ఏరుకొని పోతాడు"

ఈ కవితానిర్మాణాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కవి ముందుగా ఒక ప్రశ్న వేస్తాడు....ఒక ప్రతిపాదన చేస్తాడు. తర్వాత దానికి సమాధానం చెప్తాడు. తన ప్రతిపాదకు తనదైన ఒక సమన్వయం చేస్తాడు. ఇలాంటి కవితా నిర్మాణ పద్ధతి చాలా కవితల్లో కనిపిస్తుంది. ఈ కవి శబ్దం పదంగాను, పదం వాక్యంగాను, వాక్యం కవిత్వంగాను మారడంలో, మార్చడంలో ఉన్న రహస్యాన్ని అన్వేషించడమే అనేక కవితల్లో కనిపిస్తుంది. అది ఆయనదేనా? కవిత్వం రాసే ప్రతి కవీ పడేదేనా? కవిత్వం కోసం ప్రతి కవీ పడవలసిందనా?వాక్యాంతం పూర్తిగా చదివిన తర్వాత అన్నీను అనే సమాధానమే నిజమని తెలుస్తుంది.

కవి మువ్వా శ్రీనివాసరావుగారి కొన్ని కవితలు చిన్న చిన్న కవితల్లాగే ఉంటాయి. కానీ, తుపాకీలోని బుల్లెట్టుల్లా ఉంటాయి. ముఖ్యంగా అసమర్థ పాలకుమీద ఎక్కుపెట్టిన కవితలు చాలానే ఉన్నాయి. ప్రజల గోడు పట్టని పాలకుల్ని తన అక్షరాల తూటాలతో కాల్చేయగల కవితలు చాలానే ఉన్నాయి. పాలకులు సామాన్య ప్రజల్ని మాయ చేసినట్టే గొప్ప ప్రజాకవుల్ని కూడా ఆకర్షించి ఏ ఉగాదినాడో ఒక పురస్కారంతో సత్కరించడమో, ఏదో ఎమ్మెల్సీ పదవినిచ్చి అతని నోరుకట్టేస్తుంటారని కవుల్ని హెచ్చరించే కవిత్వం కూడా ఉంది. ఈ చిన్న కవిత చూడండి ఎంత శక్తివంతంగా ఉందో.

"వీడెవడో కవిలా ఉన్నాడు
మాయా కంబళీ ఒకటి కప్పి
మాయం చెయ్యండిరా వాణ్ణి
ఉగాది నాడే అగాధంలోకి తోసెయ్యాలి
వదిలేస్తే
వాడు మాటల్ని మంత్రిస్తాడు
జనం నాలుకలపై ప్రశ్నల్ని అతికిస్తాడు" ( కవిగాడు, పుట: 50)

ఈ కవిత చదివితే కవులు వాస్తవానికి రెండింతలు దూరంగా ఉంటారని, వాళ్ళు ఊహల్లో బతుకుతూ సమాజానికి పనికిరారు కనుక, వాళ్ళని సత్కరించి దేశం నుండి గౌరవంగా పంపేయమన్న తాత్త్వికుడ ప్లేటో మళ్ళీ ఆలోచనలో పడేవాడేమో. ఈ కవితలో కవి ప్రజల పక్షం వహించాలని కవిత్వ నిబద్ధతను చెప్పడమే కాకుండా, పురస్కారాల పట్ల కవులు జాగురూకులై ఉండాలంటున్నారు. అందుకనే మరో చోట ఇలా వర్ణించారు కవి.

"మిత్రమా ప్రియురాలి పెదాలపై అందిన
వెన్నెల ఎంగిలిలో కలిసిపోతేపో
కానీ---
అవసరమయినప్పుడన్నా
అక్షరాన్ని ఆయుధంగా మార్చు"

భావుకత్వ సామ్రాజ్యంలో కవి సర్వశక్తిమంతుడు. అటువంటి శక్తి రావాలనుకునేవాళ్ళు మువ్వా శ్రీనివాసరావుగారి కవిత్వాన్ని చదవాలి. ఈ సమాజం సౌందర్యభరితంగా ఉండాలని కోరుకునేవారు ఈ కవిత్వాన్ని చదవాలి. కవిత్వం, దాని తత్వాన్ని, కవిత్వ నిర్మాణ రహస్యాల్నీ తెలుసుకోవాలనుకునే సాహిత్య విద్యార్థులు ఈ కవిత్వాన్ని చదవాలి.

# నిషేధిత సమయంలో




శ్రీ మురళీకృష్ణ పాయల
✆ 8309468318


వేసవి అధిక మాసం వస్తే

ఇక్కడి ఎండ గడియారాలన్నీ నకనకలాడుతూ
కుంటుకుంటూ నడుస్తాయి

ఈ జలనిధి ముందు దాహంతో పిడచకట్టుకుపోతుంది
గొంతు

ఇంత సముద్రపు హోరులోనూ భరించలేని ఉక్కబోత

చీకటిపిట్టలు వాలిన తీగల మధ్య రెక్కలు లేని గుడ్డి
కొంగల్లాంటి దీపాలను మోస్తూ కొన్ని కరంటుస్తంభాలు

బీటలు వారిన చూపుల ముందు ఎముకల గూళ్ళై నడుస్తున్న
కొన్ని జాగిలాలు దేనికి సంకేతమని ప్రశ్నిస్తే ఈ సముద్రం
కాసేపు గంభీరమైపోతుంది

గాలి బండెక్కి దౌడుతీస్తూ విహరించే ముళ్ళకిచ్చలు తప్ప
మిగిలినదేమిటో తేల్చుకోలేకపోతోంది తీరం

రోకళ్ళు బద్దలయ్యే తాపానికి
పెళుసు బారిపోనివ్వకుండా

తెప్పల్ని ఓ తాటి పెండె కమ్మలుగా
వాటేసుకుంది

వేటపై నిషేధమా .. నీ కథేమిటమ్మా
అంటే

రాజ్యం విదిల్చే రూకలమొత్తం
ఎంత్తైతేనేం ఖాతాలో జమయ్యే
సమయానికి

ఇక్కడి ప్రాణ స్పందనలు

ఏ దిక్కునున్నా

రెక్కలు కట్టుకుని వాలకపోతే

రేపటికి మిగలమేమో నన్న భయం

ఇసుకగా మేటవేయడం చూపింది

ఎన్ననుకున్నా

మే నెలలో ఈ బెస్త పల్లె

బోర్లించిన ఉప్పునీటి గిన్నె ముందు

ఆబగా కూర్చున్న ఆకలి పేగు



పరిశోధనా వ్యాసం

# శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం- ప్రాచీనం నుండి ఆధునికం వరకూ



ఆచార్య అయినవోలు ఉషాదేవి
✆ 85005 24879

## శేషేంద్ర జీవితం, సాహిత్య ప్రస్థాన నేపథ్యం

గుంటూరు శేషేంద్ర శర్మ గారు నెల్లూరు జిల్లా లో 1927 అక్టోబర్ 20 న జన్మించారు. గుంటూరు లోనూ, మద్రాసు లా కాలేజీ లోనూ చదువుకున్న ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ( ఉమ్మడి) మున్సిపల్ కమీషనర్ గా పదవీవిరమణ వరకూ పని చేశారు.

గుంటూరు శేషేంద్ర శర్మ గారు పేరెన్నిక గన్న సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు. బాల్యంలో తన ఇంట్లోనే పెద్ద లైబ్రరీ ఉండటం ఆయనకు బాగా కలిసొచ్చింది. అందువల్ల పుస్తక పఠనం ఆయనకు చిన్నతనం నుండి అలవడింది. దానినే ఆయన తన 'ఊహాలో...' అనే పుస్తకంలో "ప్రజానీకం, ఆది వ్యాధులకు పరమౌషధం పుస్తక పఠనం" అనే వ్యాసం లో వ్యక్తం చేసారు. అనేక పుస్తకాలు చదవడం వల్ల ఆయనకు చదవడమే కాకుండా, ఆలోచించడం వితర్కించడం, రాయడం కూడా తన జీవితంలో అనివార్యం అయిపోయాయి. ప్రాచీన వాల్మీకి 'రామాయణం' మొదలుకొని, ఆధునిక వచనకవిత్వం వరకూ ఆయన రచనా అంశాలు విస్తరించాయి. తానే స్వయంగా చెప్పుకున్నట్లు ఆయనకు "కవిత్వమంటే" స్వప్నవిద్య. సుమారు యాభై ఏళ్లు ఆయన సాహిత్య కృషి కొనసాగింది. తన కాలం నాటి కవుల కన్నా ఆయన సాహిత్యం విలక్షణమైనది.

ఆయన కాలానికి విశ్వనాథ సత్యనారాయణ వంటి సంప్రదాయ కవులూ, శ్రీశ్రీ ఆరుద్ర వంటి అభ్యుదయ కవులూ, రాయప్రోలు, దేవులపల్లి వంటి కాల్పనిక కవులూ, ఇంకా తిరుగుబాటు, విప్లవ కవులూ అంటూ ఒక్కొక్కరూ ఒక్కొక్క

కవితారీతికి ప్రతీకలు గా ఉన్న రోజుల్లో ఈ కవి ఒక్కడూ విలక్షణంగా పై లక్షణాలన్నీ 'కొత్త పాతల మేలు కలయికగా' క్రొమ్మెరుంగులు చిమ్ముతూ తెలుగు సాహిత్య లోకం లో ప్రవేశించాడు; ప్రకాశించాడు.

శేషేంద్రకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, భారత ప్రభుత్వం వారి "రాష్ట్రేందు" అవార్డు కలకత్తా హిందీ అకాడెమీ అవార్డు లతో పాటు తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ వంటి ఎన్నో విశిష్ట పురస్కారాలు లభించాయి. 2004 లో నోబెల్ బహుమతికి ఆయన పేరు ప్రతిపాదించడం జరిగింది. దాదాపు 30 కి పైగా వివిధ సాహిత్య రంగాలలో, పద్యకవిత్వం, వచన కవిత్వం, విమర్శ, వ్యాసం వంటి అనేక ప్రక్రియలలో రచనలు చేసారు. సంస్కృత, తెలుగు భాషల్లోని ప్రాచీన సాహిత్యం బాగా చదువుకోవడం వల్ల రామాయణం, శృంగార నైషధం వంటి కావ్యాలలోని అనేక నిగూఢ అంశాలను వెలికి తెచ్చే రచనలు ఒకపక్క చేస్తూనే ఆధునిక భావజాల దృక్పథం తో మరో పక్క అనేక వినూత్న కల్పనలతో కూడిన రచనలు కూడా చేశారు. ఆయా రచనలతో ఆయన అటు ప్రాచీన సాహిత్యం లోనూ ఇటు ఆధునిక సాహిత్యం లోనూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. అందుకే ఈ వ్యాసానికి పై శీర్షికను పెట్టడం జరిగింది.

### శేషేంద్రసాహిత్య పఠనం

"ఊహాలో" అనే పుస్తకం లో శేషేంద్ర చెప్పుకున్నట్లు తన ఏడెనిమిది ఏళ్ల వయసు నుండే బయట స్కూలు చదువుతోబాటూ ఇంట్లో ఉన్న సంస్కృత తెలుగు కావ్యాలు, పురాణాలు, నిఘంటువులు, తెలుగు ప్రబంధాలు చదువుతూ "విజ్ఞాన సేకరణ" చేస్తుండే వాడు. 'చదవని వాడజ్ఞుండగు' అన్న పోతన మాట శేషేంద్ర నిజమని నిరూపించాడు. కవిత్వం రాయాలంటే ఏం చెయ్యాలి అని శ్రీశ్రీ ని అడిగితే ముందుగా సాహిత్యం చదవాలని చెప్పారని చదివిన గుర్తు. ఇట్లా ఇంట్లోని గ్రంథాలయం లో ఉన్న పుస్తకాలు చదవడం వల్లనే శేషేంద్ర అతి చిన్న వయసులోనే సోరాబు వంటి పద్య కావ్యంతో తన సాహిత్య రచనా ప్రయాణం ప్రారంభించాడు.

### శేషేంద్ర సాహిత్యం

పైన పేర్కొన్నట్లు అంత భాషా సాహిత్య పరిజ్ఞానమే ఆయనకు రామాయణం మొదలుకొని రిక్షా వాడి వరకూ 'కాదేదీ కవిత కనర్హం' అన్నట్లు సాహిత్యవస్తువులుగా అయినట్లు మనకి కనిపిస్తుంది. పురాణేతిహాసాల లోతులను,

మంత్ర, యోగ కుండలినీ వంటి ఆధునికులకు అంతుపట్టని విషయాలతో బాటు వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం, ప్రపంచం దాటి అంతరిక్ష, దిగంతాల వరకు; అలాగే వ్యక్తి ప్రేమ, వైయక్తిక స్వేచ్ఛ మొదలుకొని, సామాన్య మానవుల ఆకలి, పేదరికం, అగచాట్లు, బాధలు, కష్టాలు, కన్నీళ్ల వరకూ అన్నీ ఆయన సాహిత్య రచనా వస్తువులే అయ్యాయి.

మానవుడి బాధలను కవిత్వీకరించడమే కాదు, వాటినుండి విముక్తి కావటం కోసం దిశానిర్దేశాలూ, సామాజిక న్యాయాల సూచనలూ కూడా ఆయన సాహిత్యంలో కనిపిస్తాయి. ఒకవైపు మనిషి ఉన్నతమానవుడుగా పరిణామం చెందటానికి పుస్తకపఠనం ఎంత ముఖ్యమో చెప్తూనే, మరోవైపు చదువులకన్నా వ్యవసాయమే (నాగలి) మిన్న అనీ అంటాడు. అయితే మనం దీనిలో వైరుధ్యం చూడకూడదు. మనిషి రాజకీయాల కంపును వదులుకొని, ప్రకృతి పారవశ్యాలను ఆస్వాదిస్తూనే, దానినీ అధిగమించి వైజ్ఞానిక అంశాల వైపు ఎందుకు దృష్టిసారించాలో, ఆ జ్ఞానం మనిషికి ఏవిధమైన అవగాహనను పెంచి, సృష్టి తత్త్వాన్ని అర్థం చేసుకోగల తాత్త్విక చింతనను అలవర్చుతుందో తన కవిత్వం, సాహిత్యం ద్వారా వివరిస్తాడు. అంటే ఈనాటి చదువుల విధానం పట్ల వ్యంగ్య విమర్శ లో భాగంగా, చదువుల చట్రంలో ఇరుక్కొన్న ఈ నాటి విద్యార్థి జీవితాన్ని కోల్పోతున్నాడన్న బాధ అందులో మనం గమనిస్తాం. ఇలాంటి చదువుల కన్నా నాగలి పట్టి దున్నుకోవడం మేలని ఆయన ఉద్దేశంగా కనిపిస్తుంది. అంతేకాదు. తన మట్టి మూలాలను ఎవ్వరూ మరవకూడదనీ, నేల విడిచిన సాము చేయకుండా ప్రజల జీవన సుఖ సంతోషాల కోసం కవి కలం నిలవాలన్న ఆయన ఆకాంక్ష ఆయన రచనల్లో కనిపిస్తుంది.

> **మానవుడి బాధలను కవిత్వీకరించడమే కాదు, వాటినుండి విముక్తి కావటం కోసం దిశానిర్దేశాలూ, సామాజిక న్యాయాల సూచనలూ కూడా ఆయన సాహిత్యంలో కనిపిస్తాయి.**

ఈ విధమైన జీవిత పరిధిని కూడా దాటిన అన్వేషణలో మార్మిక, తాంత్రిక, ఆధ్యాత్మికలతో కూడిన మరో ప్రపంచాన్ని స్వప్న లోకంగా చూపిస్తాడు. ఒక విషయాన్ని ఎన్ని భిన్న కోణాలనుండి అర్థం చేసుకోవచ్చో, వాల్మీకి నుండి తన

వరకూ (శేషేంద్ర) వచ్చిన భారతీయ, తెలుగు సాహిత్యాల తీరుతెన్నులేమిటో చర్చిస్తాడు. ఇట్లా ఆయన సాహిత్య వస్తువుకానిదేదీ లేదని తెలిసి మనం ఆ కవన వేగానికి, ఆవేశంలోని ఉద్ధృతికి, వ్యక్తీకరణకూ ఉక్కిరిబిక్కిరి అయిపోతాం. ఆయన గ్రంథాల అధారంగా ఆయన సాహిత్య వస్తువులను ఈ కింది అంశాలుగా స్థూలంగా వర్గీకరించవచ్చు.

### శేషేంద్ర సాహిత్య వస్తువులు

i) ప్రాచీన కావ్యాల విశ్లేషణ; ఆ విశ్లేషించడంలో విలక్షణత (షోడశి, స్వర్ణ హంస, కవిసేన మ్యానిఫెస్టో)

ii) ప్రేమాభివ్యక్తి: ఈ కవిత్వీకరణ లో వైవిధ్యం, సున్నితత్వం , వినూత్న అభివ్యక్తి

iii) సామాజిక చైతన్యం: అసమానతలు, దారిద్ర్యం వంటి వాటి గురించి ప్రజలను చైతన్య పరచి, వాటి నుండి విముక్తి కోసం విప్లవమార్గనిర్దేశం చేయటం.

iv) ప్రకృతి ఆరాధనలో పులకించటం (చెట్లు, సముద్రం, అరణ్యాలు, పూలు, ఆకాశం, ప్రజలు, కాలం, ఋతువులు మొ॥వి); నగర జీవన నిరసన (నేనూ నా దేశం; ఋతు ఘోష, మొదలైనవి).

v) కుత్సిత రాజకీయాలనూ, కుహనా కవులనూ ఎండగట్టడం (అనేక రచనలలో)

vi) వైజ్ఞానిక, శాస్త్ర దృష్టి కలిగించాలనే, పెంచాలనే జిజ్ఞాసతో వివిధ అంశాలపై వ్యాసాలు రాసి వాటిని ప్రాచీన భారతీయ విజ్ఞానంతో మేళవించి చూపడం (విశ్వవివేచన, నరుడు–నక్షత్రాలు, ఊహలో.. మొదలైనవి)

vii) ప్రాచ్య, పాశ్చాత్య ఆలంకారిక, సాహిత్యవిమర్శ శైలీ విశ్లేషణలతో కూడిన సాహిత్య విమర్శ; ఇతరుల విమర్శల పట్ల ధిక్కారం. (కవిసేన మ్యానిఫెస్టో)

viii) భారతీయ తత్త్వ ఆవిష్కరణ ( షోడశి , కవిసేన మ్యానిఫెస్టో)

ix ) గజల్ లక్ష్యలక్షణాలవర్ణన.

అంటే పైనే చెప్పినట్లు స్థూలంగా జీవితాన్ని అన్ని కోణాల నుండి దర్శించి,

దానితో ముడిపడ్డ ఆధ్యాత్మికత, ప్రేమ, సమానత్వం కోసం విప్లవం, ప్రకృతి ఆస్వాదనఇలాంటివన్నీ కలగలిపిన ప్రాచీన, ఆధునిక సమ్మేళనం ఈయన కవితావరణంగా గుర్తించ వచ్చు.

ఇంత వైవిధ్యభరితమైన సాహిత్యాన్ని సృష్టించటం ఒక సాహితీవేత్తకు ఎంత కష్టమో, అంతటి సాహిత్యాన్ని అంచనా వెయ్యటమూ, అధ్యయనం చేసి విశ్లేషించటమూ ఏ ఒక్కరికీ పూర్తిగా సాధ్య మయ్యే పని కాదు; కనీసం సులభమైంది మాత్రం కాదు అని అర్థం అవుతుంది (ఈ విషయం ఆయన గ్రంథాలకు ముందుమాటలో రాసిన గొప్ప కవులూ రచయితలు మొదలుకొని ఆధునికుల వరకు రాసినవి చదివితే తెలుస్తుంది). మొత్తం మీద సాహితీప్రియులను ఆకట్టుకునే కవిత్వీకరణతోనూ, ఆలోచింప జేసే భావావేశంతోనూ ఆయన పుస్తకాలు మనల్ని చదివింప చేస్తాయి.

ఈ గ్రంథం 1970-1986 మధ్య కాలంలోని వచన కవితా సమాహారమే అయినా దీనిని సంకలన కావ్యం అని చెప్పటం శేషేంద్రకు సమ్మతం కాదు.

శేషేంద్ర తాను 1970-1986 ల మధ్య రాసిన వివిధ రచనలు నిజానికి వేర్వేరు అంశాలు కావని తనే గుర్తించి వాటన్నింటినీ కదంబమాలగా కూర్చి "ఆధునిక మహాభారతం" అనే ఏక కావ్యంగా రూపొందించారు. మహాభారతంతో పోలికగా ఒక్కొక్క అధ్యాయంగా చేర్చిన వాటిని పర్వాలుగా వర్ణించారు.

## ఆధునిక మహాభారతం

ఈ గ్రంథం 1970-1986 మధ్య కాలంలోని వచన కవితా సమాహారమే అయినా దీనిని సంకలన కావ్యం అని చెప్పటం శేషేంద్రకు సమ్మతం కాదు. ఆయన స్వయం గా "ఇది నా సంకలన కావ్యం కాదు; ఇది నా సంపూర్ణ కావ్యం" అని చెప్పుకున్నారు.

స్థూలంగా 'నాదేశం, నా ప్రజలు' అనే తాత్త్విక చింతన చుట్టూ నిర్మితమైన ఈ సాహిత్యంలో అంతర్లీనంగానూ, ప్రత్యక్షంగానూ కూడా కవి 'నేను' అనే రూపంలో కూడా మనకు దర్శనమిస్తాడు.

ఈ ఆధునిక మహాభారతంలోని కావ్యాలను వేరువేరుగా, వేర్వేరు కాలాల్లో రాసినప్పటికీ, అవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమైనవే తప్ప, విడివిడి భాగాలు కాదని చెప్పటం వల్ల, 'పర్వం' అనీ, గ్రంథానికి "ఆధునిక మహా భారతం" అనీ వ్యాస మహాభారత పర్వాలతో ఉపమింప చేస్తూ చేసిన వర్గీకరణకు పద్దెనిమిది పర్వాలు లేకపోయినా న్యాయం అనే అనిపిస్తుంది, వీటిని ఏక బిగిన చదివితే. అయితే వాటి మధ్య 'ఏక సూత్రత' ఎలా ఉందో, ఎలా సాధ్యమైందో ఇంకా లోతుగా పరిశోధించాల్సి ఉంటుంది. ఇతిహాస, మహాకావ్యాలలో వలె, ఆయన ఆశ్వాసాంత గద్య(ల) లో ఇలా రాసుకున్నారు:

"ఇది వింశంతితమ శతాబ్ది షట్ సప్తతితమ సంవత్సర డిసెంబర్ మాసాన (1976) 'విప్లవభాషా విధాత' 'కవిసేన మానిఫెస్టో ప్రణీత', 'బుధజనవిధేయ' శేషేంద్ర నామధేయ కవివర్య ప్రణీత.... ....... నామాంతర సమేత ...... పర్వం" (ఒక్కొక్క పర్వం పేరు ఉంటుంది). సమాప్తం

ఈ గ్రంథం లోని 10 పర్వాలు వరుసగా–

1) ప్రజా పర్వము ( నాదేశం, నా ప్రజలు. 7 సర్గలు 1975 లో ముద్రితం)
2) సూర్య పర్వము ( మండే సూర్యుడు. 3 సర్గలు 1974)
3) పశుపర్వము ( గొరిల్లా. 4 సర్గలు1976)
4) ప్రవాహపర్వము (నీరై పారిపోయింది. 3 సర్గలు 1976)
5) ఆద్మీ పర్వము (అరుస్తున్న ఆద్మీ. 3 సర్గలు 1983)
6) ప్రేమ పర్వము ( ప్రేమలేఖలు – 3 సర్గలు 1983)
7) సముద్రపర్వము (సముద్రం నా పేరు. 3 సర్గలు 1979)
8) జ్యోత్స్నాపర్వము ( శేషజ్యోత్స్న. 3 సర్గలు1972)
9) మౌక్తిక పర్వము (చమత్కారికలు) (వేరే పేరు లేదు, ఒకే ఒక సర్గ. 1985)
10) మయూర పర్వము (నేనూ నా నెమలి. 8 సర్గలు 1975)

ఈ ఆధునిక మహాభారతాన్ని సంస్కృతంలో కవి 'భారతీయ కర్షకేతిహాస' మని చెప్పుకున్నారు.

దీర్ఘకాలాల తర్వాత ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క ఐతిహాసికకావ్యం,

దాని అనుబంధం వచ్చాయని చెప్తూ, శేషేంద్ర ఆధునిక మహాభారతానికి అనుబంధకావ్యంగా 'జనవంశం' రాశానని స్వయంగా పేర్కొన్నారు.

## జనవంశం

జనవంశంలో ఆరు 'కాండ' లున్నాయి. అవి: 1) ఋతుకాండ; 2) భ్రమర కాండ; 3) ప్రజాకాండ 4) చంపూ కాండ 5) యుద్ధకాండ 6) చమత్కారిక కాండ. ఇవి రామాయణం లోని ' కాండల' స్ఫూర్తి తో చేసిన విభజనలే.

శేషేంద్ర సాహిత్య శైలి, అలంకారాలు: నిత్యజీవితంలోనైనా, కవిత్వ జీవితంలోనైనా, మనిషి భావ వ్యక్తీకరణకు అవసరమైంది భాష. ప్రతి వ్యక్తీ భాషను తనదైన పద్ధతిలో ఉపయోగించుకొని మాట్లాడినట్లే, కవులు, రచయితలు (సాహిత్యవేత్తలు) కూడా భాషను తనదైన పద్ధతిలో వినియోగించి, వ్యక్తీకరిస్తారు. ఆయా వ్యక్తుల రచనా శైలిని, కవితాత్మలను వారి వారి 'భావవ్యక్తీకరణ' విధానమే పట్టి ఇస్తుంది. ఋతువులు, కాలం, పూలు, చెట్లు, ప్రకృతి, ఆకాశం, నక్షత్రాలు, సూర్య చంద్రులు, వాన, ఎండ, చలి, మనిషి, జీవితం – ఇవన్నీ వర్ణించకుండా ఎవరైనా రాయగలరా? అసలు తెలుగు ప్రబంధ కావ్యాలలో అష్టాదశ వర్ణనలు ఉండాలని కవులు ప్రకృతి వర్ణనలలో కొత్తదనం కోసం ఎంతో తాపత్రయ పడ్డారు. అయినా వాళ్ళ భాషను వాడే తీరే వారి 'శైలి' అవుతుంది. శైలిలో సౌందర్యం, అలంకారం, లయ వంటివి మిళితమౌతాయి.

> **శేషేంద్ర సాహిత్య శైలి, అలంకారాలు: నిత్యజీవితంలోనైనా, కవిత్వ జీవితంలోనైనా, మనిషి భావ వ్యక్తీకరణకు అవసరమైంది భాష.**

నిత్యజీవితంలో మనిషి మాట్లాడే భాష సాధారణంగా 'విషయ' సంబంధంగా, సూటిగా ఉంటుంది. అయినా, సంభాషణల్లో మనుషులు వారి వారి తత్వాన్ని బట్టి "ఆకట్టుకొనే విధంగా", 'వినాలనిపించే విధంగా' 'ఆకర్షణీయంగా' మాట్లాడుతుంటారు. కానీ సాహిత్యంలో ఈ 'ఆకట్టుకునే', 'ఆకర్షించే', 'చదవాలనిపించే' లక్షణాలు ఆయా కవులకూ, రచయితలకూ భిన్నభిన్నంగా ఉంటాయి. అవి వారివారి 'శైలి'గా మన గుర్తిస్తాం. నిత్యజీవితంలో

'ఇది దానివలె', 'అది దీనివలె' అని చెప్పేవే, సాహిత్యంలో వివిధ అలంకారాలుగా రూపుదిద్దుకున్నాయి. శేషేంద్రగారికి ఉన్న ప్రాచీన అలంకార శాస్త్రాల, ఆధునిక పాశ్చాత్య సాహిత్య విమర్శ శాస్త్రాల అవగాహన లోతైనది. అందువల్ల ఆయన రచనల నిండా మనకు అనేక రకాలైన అభివ్యక్తి రూపాలు, అలంకారాలే కనిపిస్తాయి. మచ్చుకు కొన్ని మాత్రమే ప్రస్తావిస్తాను.

ప్రజాపర్వం, పు.44: కవిత్వం ఎర్ర గుర్రంలా పరిగెత్తుకు వస్తోంది – రక్తంలో మునిగిన బాణంలా, వీరుడు విడిచిన ప్రాణంలా. (కవిత్వ ధార ను పరిగెత్తే ఎర్రగుర్రం తో పోల్చాడు).

పు.42:చరిత్రలో చెమట ఒక శాశ్వత అంతర్వాహినిలా ప్రవహిస్తూ ఉంటుంది. (శ్రమ జీవి చెమట చరిత్రలో అంతర్భాగమని అర్థం).

సూర్యపర్వం, పు. 74: పిల్లల్ని రాత్రి ముక్కలు వెన్నెల్లో ముంచుకొని కొరుక్కుంటూ తినమంటా. (పిల్లలు వెన్నెలను ఆస్వాదించాలని. ఏదైనా పాల వంటి వాటిలో ముంచుకుని తినడానికి పిల్లలు ఇష్ట పడతారు)

పశుపర్వం, పు. 113: కష్టాల్ని కన్నీటిలో ముంచుకొని బిస్కెట్లలా తింటాను. (కష్టాలను దిగ మ్రింగి అనటం పరిపాటి; ఇక్కడ వాటిని బిస్కట్ల తో పోల్చి వాటిని కన్నీళ్ళలో ముంచుకుని ' తింటాడట' కవి)

పై ఉపమలన్నీ ఎవ్వరూ ఎప్పుడూ వాడనివి. కవిత్వాన్ని 'ఎర్ర గుర్రంతో' పోల్చడం; 'చెమట' అనేది చరిత్రలో ఒక అంతర్వాహిని, అనడం ఎంత కొత్త ఉపమలు! అట్లాగే 'రాత్రి' ని ముక్కలు చేసుకొని, 'వెన్నెల'లో ముంచుకుని 'కొరుక్కు' తినమని పిల్లలతో చెప్తాడు. తాను కూడా కష్టాలను కన్నీటిలో ముంచుకుని 'బిస్కెట్ల వలె' తింటానంటాడు. ఇలాంటివే ఇంకా ఎన్నో ప్రతీకలు ఈయన రచనల నిండా కనిపించి, మనల్ని అబ్బురపరుస్తాయి.

ప్రవాహ పర్వమంతా ఆలంకారికమే. ఏ ఒక్క వాక్యమూ వదలాలనిపించదు. చాలా బాగా ఆకట్టుకొని పదే పదే చదివిస్తాయి. మచ్చుకు చూడండి :

"నేను ఘనీభవిస్తే ఒక నామరూపాత్మక వేగం. నేను ద్రవీభవిస్తే ఒక జ్ఞాపకాల ప్రవాహం."

"రాజకీయ నాయకుడు ఇరుసుగా – తిరుగుతోంది పత్రికల భాగోతం". (పు.167, ఆద్మీ పర్వం)

"భాష బోధిస్తుంది – పెదవులకు విచ్చుకునే విద్య" (పు. 193)

"అన్ని నేత్రాలకూ కనిపిస్తుంది, వస్తు జాలం;

కానీ కొన్నింటికే కనిపిస్తుంది

వీటిలో కవిత్వం అనే ఇంద్రజాలం." (ఆద్మీ పర్వం 211)

"నిన్ను కలియక ముందు నా ముఖం ఒక కొలంబస్ చూడని అమెరికా; ఒక హిల్లరీ ఎక్కని ఎవరెస్టు" (ప్రేమపర్వము 247).

సముద్రంలో వల వేసి చేపల్ని పడతారు — కానీ శేషేంద్ర అభివ్యక్తి గమనించండి.

"వలలు కావాలి, సముద్రం దున్నడానికి; పడవలు బుజాన వేసుకున్న వాడికి.

కలలు కావాలి జీవితం దున్నడానికి

గొడవలు భుజాన వేసుకున్నవాడికి". (సముద్రపర్వము 256)

"వడిగా కొండల ఒడిలో దూకే జలపాతాలు

మన ప్రేమకు సంకేతాలు" (జ్యోత్స్నపర్వము 288)

"నీవు కాలేజికి పోతుంటే బాబు

నిన్ను పొలాలు బిక్క మొహంతో చూస్తున్నాయి.

నీవు కాలేజి గోడల్లోకి పోతావు

అక్కడ్నించి గవర్నమెంటు గోడల్లోకి పోతావు

ఆ తర్వాత ఎప్పుడూ ఎవ్వరూ తిరిగిరాని

గోడల్లోకి పోతావు. ఇక నీవు బ్రతికిందెప్పుడూ?" (మౌక్తికపర్వము, పు. 301) (పిల్లలు పల్లె, ప్రకృతులకు దూరం అయి, కేవలం చదువు అంటూ నాలుగు గోడల మధ్య బందీలు అవటం గురించిన బాధతో)

"రైతులారా! రాజకీయ వర్షం పడుతోంది. మోసపోయి మీ విత్తనాలు చల్లకండి" (302) (ఇది ఎప్పుడు రాసారు; ఇప్పటికీ దీని ప్రాసంగికత (relevance) పోక పోగా, ఇంకా బలవత్తరం అయింది).

ఇట్లా ఉదహరిస్తూ పోతే, శేషేంద్ర కవిత్వం లోని వాక్యాలకు వాక్యాలనే ఎత్తి రాయాల్సి వస్తుంది. అంటే ప్రతీ వాక్యమూ కవితామయం. ఏది కూడా వదిలెయ్యలేం. వచన కవిత్వం, వచనమూ కలిసిన చంపూ కావ్యం ఈ ఆధునిక

మహాభారతం.

ఇక "జనవంశం" అనే అనుబంధ కావ్యంలో కూడా ప్రతీ వాక్యమూ కవిత్వీకరించిన కొటేషనే. మచ్చుకు కొన్ని ఉదాహరణలు:

"చెట్టుగా ఉంటే ఏడాదికొకక వసంతమన్నా దక్కేది.

మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను" (పు. 238)

"పుస్తకం మనిషి పశుత్వానికి, అడ్డంగా నేను కడుతున్న ఆనకట్ట" (పు. 251)

"ఒకనాడు నా శరీరం అంతర్ధానమవుతుంది.

అప్పుడు మీకు నా వాక్యాల్లో దర్శనమిస్తాను" (పు. 252)

"స్వర్గాలు పిడికిళ్లతో పట్టుకొచ్చిన

అనిష్కపట శిశువు – అశ్రువై నిద్రపోతున్నాడు" (237)

(చిన్నపిల్లలు పిడికిళ్లు మూసుకుని నిద్ర పోతారు).

నూతనత్వం, రమణీయకత

శేషేంద్ర పదబంధాలు, సమాస కల్పనలు కూడా కొత్తగా, ఆసక్తి కరంగా ఉంటాయి.

ఉదాహరణకు:

'పువ్వెడు వసంతం, రాజకీయ వర్షం, శిల్పించే, మధురించే, రాజకీయ రుతువు; ప్రజాస్వామ్య శిశువు ప్రసవం...'; .... ఇట్లా ఎన్నో కొత్త కొత్త పదబంధాలను, పదాలనూ సృష్టించాడు శేషేంద్ర.

ఆయన రచనల్లో విశ్వనాథ కనిపిస్తాడు; శ్రీ శ్రీ కనిపిస్తాడు. జాగ్రత్తగా చూస్తే ఒకసారి తిలక్‌నూ, మరోసారి జాషువానూ తలపిస్తాడు.

ఉదా: ఇది కవిత్వం కాదు. ఇది రక్తంతో,

కన్నీటితో తడిసిన అక్షరాల గుంపులు.

తుపాకి దెబ్బకు బెదిరి చెల్లా చెదరైపోతున్న

పక్షుల సమూహాలు (పు. 115) (ఇది తిలక్ "నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అనే కవితను గుర్తు చేస్తుంది)

మరో ఉదాహరణ:

మనుషులకే ఇళ్లులేని ఈ దేశంలో, దేవుళ్లకు ఇళ్లు కట్టించాలని ఆక్రోశిస్తావెందుకు (116) (ఇది జాషువా రాసిన "ముప్పదియారుకోట్ల దేవతలెగవడ్డ దేశమున క్షుధార్తుల బాధ తీరునే" అనే వాక్యాలను గుర్తుకు తెస్తుంది).

అలాగే పశుపర్వం (135) లోని ఈ ఉపమ చూడండి:

కవిత్వంలో రామణీయకతవల్లనే ఆకర్షణ శక్తి, కావ్యత్వం సిద్ధిస్తాయనీ మిగిలిన 'కమిట్‌మెంట్' 'సార్వజనీన శ్రేయస్సు' అనేవి ఔపచారికం అనీ ప్రాక్ పశ్చిమ సాహితీ విమర్శకులందరూ చెప్పారనే సారాంశాన్ని మేనిఫెస్టో ద్వారా అందించారు.

"ఎక్కడ శివమెక్కిన గణాచారుల్లా పూలు వసంతాలతో పోట్లాడుతుంటాయో, ఎక్కడ అడవులన్నీ వీరమాతల్లా జుట్టు విరబోసుకుని విద్యుల్లతలు మెడల్లో దాల్చుకొని ఉగ్రతాండవం చేస్తూంటాయో, ఎక్కడ సముద్రాలేగానీ సరస్సుల్లేవో ఆ మహా లోకానికి తీసుకు పో! ( ఇది రవీంద్ర కవీంద్రుని "where the mind is..." ను గుర్తుకు తెస్తుంది.

"కవిత్వంలో ఎట్లా చెప్పడమనే దానికే స్థానం ఉంటుంది; ఎందుచేతనంటే విశిష్టంగా చెప్పబడిన మాటే కవిత్వం కాగలదు" (పు.92) అని తేలికమాటలతో వివరిస్తాడు.

కవిత్వంలో రమణీయకతవల్లనే ఆకర్షణ శక్తి, కావ్యత్వం సిద్ధిస్తాయనీ మిగిలిన 'కమిట్‌మెంట్' 'సార్వజనీన శ్రేయస్సు' అనేవి ఔపచారికం అనీ ప్రాక్ పశ్చిమ సాహితీ విమర్శకులందరూ చెప్పారనే సారాంశాన్ని మేనిఫెస్టో ద్వారా అందించారు. తన మొత్తం సాహిత్యమంతా ఒకే విధమైన మహాకావ్యమనీ, అందుకే అది 'ఆధునిక మహాభారతం' అనీ నిబద్ధతతో ప్రకటిస్తాడు. తద్వారా, తననూ, తన కావ్యసృష్టినీ ప్రాచీన కవుల సరసన చేర్చుకున్న సమర్థన కనిపిస్తుంది. 'జనవంశ' మనే అనుబంధ కావ్యంతో 'తన కావ్యయాత్ర' ముగిసిందని అవతారికలో (పు.29) చెప్పుకొన్నారు.

ఇవన్నీ చదివితే ప్రాచీన కావ్యాల కావ్యత్వ మంటే శేషేంద్ర కు ఉన్న గౌరవం, తన కవిత్వం కూడా వాటి వలె నిలిచి ఉండాలనే అంతర్లీన తపనా తెలుస్తాయి.

## శేషేంద్ర కవిత్వం లో భాషా ప్రయోగాలు :

ఏ కవి కవిత్వం గుర్తించాలన్నా ఆ కవి వాడిన భాషను అధ్యయనం చేయడం అవసరం. ఆయనే చెప్పినట్లు:

"ఏ శతాబ్దపు భాష అయినా వాడు; కానీ వట్టి శబ్దాలు కవిత్వం కాదు. భాషే కవిత్వం కాదు గనక " (పు. 87).

పైన శేషేంద్ర నే స్వయంగా భాషే కవిత్వం కాదన్నా, భావాలను కవిత్వీకరించేందుకు కవి ఎంచుకునే భాషా పరిశీలన వల్ల మనకు ఆ కవి హృదయం, కవిత్వ తత్త్వం తెలుస్తాయి. అందువల్ల శేషేంద్ర భాషా పరిశీలన భాషా శాస్త్ర అధ్యయనం పట్ల నా కున్న ఆసక్తి తో ఈ కింద కొంతవివరిస్తాను. ఈయన రచనల్లో గ్రాంథికం మొదలుకొని ఉర్దూ, ఆంగ్ల మిళితం అయిన వివిధ వ్యక్తీకరణల తో కూడిన తెలుగు లోని విభిన్న భాషా భేదాలు మనకు కనిపిస్తాయి.

ఏయే విషయ వ్యక్తీకరణకు కవి/రచయిత ఏయే పదాలు, ఏయే పదబంధాలు, ఏయే వాక్యాలు ఎట్లా, ఎప్పుడు వాడాడో చూస్తే, ఆ భావానికీ, ఆ భాషకూ మధ్యగల సంబంధం, సాన్నిహిత్యం మనకు బోధ పడుతాయి.

ఒకటి రెండు భాషలు వచ్చిన వారికన్నా బహుభాషలు వచ్చినవారి వ్యక్తీకరణల్లో వారికి తెలియకుండా, అచేతనంగానో, చేతనంగానో ఆయా భాషలు కలిసిపోతాయి.

శేషేంద్ర రచనల్లో ఉర్దూ అలవోకగా, ఆత్మీయంగా మిళితమైంది. 'దారి' అనేమాటకన్నా 'రస్తా' అనే మాట వాడడానికే ఎక్కువ మొగ్గు చూపాడు. అలాగే ఎన్నెన్నో ఉర్దూ మాటలు స్వేచ్ఛగా కలిసిన పదబంధాల, వాక్యాల ప్రయోగాలు కనిపిస్తాయి.

1946 నుండి రాస్తూండటం వల్ల శేషేంద్ర భాషపై, ఎంచుకున్న ఛందోరీతులపై ఆయా కాలాల భావ ప్రభావమూ, భాషా ప్రభావమూ కనిపిస్తుంది.

వాటిలో 1946 – 67 ల మధ్య శేషేంద్ర రచనల్లోంచి 'సొరాబు', 'షోడశి' లను పరిశీలించాను. వాటిలో 'సొరాబు' పద్యకావ్యం; 'షోడశి' రామాయణ రహస్యాలను విప్పి తెలిపే వ్యాఖ్యానం. ఈ రెండింటిలోనూ ప్రధానంగా గ్రాంథిక,

కావ్యభాష మనకు కనిపిస్తుంది.

## సొరాబు నుండి :

లేఖన పరంగా చూస్తే శకట రేఫ (ఎఱుక), ఋ కారం, (ఋషి, ఋతువులు), అరసున్నాలూ, ద్రావడులూ (క్రొత్త, ప్రొద్దు, త్రొక్క, ప్రక్క) కనిపిస్తాయి.

పదాలను విడదీసి కానీ, అచ్చును తొలగించి సంధి చేసి కానీ ఛందస్సు కనుగుణంగా పదాలను భాషా నియమాలకు లోబడి మార్చే విధం కనిపిస్తుంది.

ఉదా: రాత్రి/రాతిరి; తార్తారు/తార్త్ర, అందురు/అంద్రు మొ॥ బారులు తీర్చినారు. ఎది < ఏది.

క్రియారూపాలు: పడిపోయెను; వచించెను, తెలియగఁజేతును; సల్పినాడను, చూపట్టెడు, పిలిచిరి వంటి ప్రాచీన క్రియా రూపాలు కనిపిస్తాయి.

బహువచనాలు: తెలుగు బహువచన రూపాలు సంక్లిష్టమైనవి. ప్రాచీన కావ్యాలలోవాడిన 'కాళులు (కాళ్ళు) (పు:35), గోళుల(గోళ్ళ) (పు. 31); కుచ్చెళులు (కుచ్చిళ్లు) వంటి అనేక ఆధునిక భాషలో లేని, కేవల ప్రాచీన వ్యక్తీకరణలు కనిపిస్తాయి.

కింది ఉదాహరణలు కూడా గమనించండి. ఇవి సందులకు సంబంధించినవి.

గసడదవాదేశ సంధి: సుతుండువోలె, చిల్లులువోయెడి; ఇల్లు సేరక; కంచెగట్టి.

వాక్య నిర్మాణం: వాక్యం మధ్య క్రియారూపం అంటే క్రియాంత భాష అయిన తెలుగులో కవులు ఛందస్సు సౌకర్యాల కోసం లయ కోసం, కొత్తదనం కోసం క్రియను కొన్ని సార్లు వాక్యం మధ్యలో వాడారు. ఇలాంటి శేషేంద్ర ప్రయోగాలు కూడా ప్రాచీనమే. ఇవి పద్యాలలో ఎక్కువగా కనిపిస్థాయి. కొన్ని ఉదాహరణలు చూడండి:

సకల వ్యథఁ దొలగఁ ద్రోయుచుఁ బుచ్చగలేవె కాలమున్?

(కాలము పుచ్చగ లేవె (కలవాడను) (పుట. 51).)

ఓ సొరాబగపడెంగాదె నీకు తుదకంతయు? (ఓ సోరాబూ! నీకు తుదకంతయు నగపడెంగాదె?)

'ఏమియనం గలాడ?

ఇవన్నీ ప్రాచీన కావ్య భాషా వ్యక్తీకరణలే.

ఆయన పద్యాలలో ఇలాంటి రూపాలు కనిపిస్తాయి.

'షోడశి'లో రామాయణానికి, ప్రత్యేకించి సుందరకాండకు అందరికీ పైకి తెలిసిన సామాన్యార్థమూ వాచ్యార్థమూ కాకుండా, రహస్యార్థము కూడా ఉన్నదని అది "గుప్తము"గా ఉందని, అది "శ్రీవిద్య"కు సంబంధించిన మంత్రతంత్రపరమైన వ్యాఖ్యానం అని సోపపత్తికంగా వివరించడం జరిగింది. ఈ విషయాలు అందరికీ అర్థమయ్యేవి కావు.

ఈ గ్రంథమంతటా 'బడు' వాక్యాలు కొల్లలుగా కనిపిస్తాయి. 'కుండలినీ యోగము సుందరకాండమున చెప్పబడినది' తో ప్రారంభమై, 'కొనిపోబడిన'. 'వేడబడకపోవుట' (నాటకం), చెప్పబడినది, సూచించబడినది, అనబడును; (వ్యంజిత) చేయబడెను... వంటివెన్నో వాక్యాలున్నాయి. ఒక్కొక్క సారి ఒకే వాక్యంలో రెండుమూడు 'బడు' ప్రయోగాలు కనిపిస్తాయి. (విశ్వనాథ కూడా 'బడు' వాక్యాలు ఎక్కువగా వాడినాడు).

ఇది వ్యాఖ్యానం కాబట్టి చదువరిని శ్రోతగా గుర్తించి – "కదా!"; 'చూడుడు' వంటి సంభాషణల్లో శ్రోత దృష్టి తనవైపునే ఉంచుకునే భాషా ప్రయోగ వర్ణనలు కూడా కనిపిస్తాయి. క్రియలలో "చెప్పజాలను" వంటి ప్రయోగాలున్నాయి.

మొత్తానికి ఈ ప్రయోగాల అధ్యయనం ద్వారా సంస్కృత, తెలుగు సాహిత్యాలలోని ఆయన పాండిత్యాన్ని మనం తెలుసుకోగలుగుతాం. ఆధునిక మహాభారతంలోని కొన్ని యత్తదర్థక వాక్యాల తో కూడిన సంశ్లిష్టవాక్యం చూడండి: (పుట 62):

"ఎవరు దేశమంతా దున్ని తమ దేహపు కండలు మట్టికిస్తారో, ఎవరు నేలగొంతు ఆలించి దాన్ని లాలించి తమ చెమటతో, రక్తంతో వెన్నలా జున్నులా మృదువు చేశారో, పెరిగే పైర్ల వొంపు సొంపూ, అందమూ గంధమూ లాలనతో చూస్తూ చూస్తూ, ఉదయించబోయే ధాన్యం కోసం ఉదయాస్తమయాలు కలలు కన్నారో, కానీ అంతిమ సమయంలో ఒక్క గింజ కూడా దక్కకుండా అంతా విడిచి నిష్క్రమించారో, ఆ అమృత వీరులు, మానవ ఇతిహాసంలో అమృత వీరులు; ఆ కోట్లాది పేరు లేని శ్రామిక జీవులు భూమిని వదల్లేక మట్టిలో కలిసి నిరీక్షిస్తుంటారు". (ఈ వర్ణన లోని పరిస్థితి ఇప్పటికీ ఇలాగే ఉంది, ఏమీ

మారలేదు)

"ఈ సమస్య ఏదయితే ఉందో అదే కన్నీటికి జన్మస్థానం" (పుట 152 ప్రవాహ పర్వం)

గొరిల్లా/పశుపర్వంలో (పు. 118)

సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలు

ఈ కింది ఉదాహరణలలో మొదటిది సంయుక్త వాక్యం అయితే రెండోది సంయుక్త వాక్యాలతో కూడిన సంశ్లిష్టవాక్యం.

"ఈ బ్రతుకు నీకివ్వబడింది ఎలా చావాలో తెలుసుకోవడానికి కాదు. ఎలా బ్రతకాలో తేల్చుకోవడానికి".

ఇవి రెండూ వేర్వేరు వాక్యాలే కానీ వాటిమధ్య ఉన్న సంబంధం వల్ల రెండూ కలిపి సంయుక్త వాక్యం అయింది.

సంశ్లిష్ట (పెద్ద) వాక్యం: (ప్రవాహపర్వం. పు. 41).

"ఆ తామస ఖండాల అంతరాళాల్లో మార్మికదేవతా సమూహాలు చేసే కృత్యాలూ, అగరుధూప కోపోద్రేకాలు రేపే మేఘాలు ఢమరుఢక్కాది చర్మవాద్యాల కంఠనాళాల్లో నుంచి మూకలు మూకలుగా దూకే భూతప్రేత పిశాచాలూ శబ్దంలో అధివసించే సూక్ష్మశక్తికి లొంగి సంగీతాల్లా మసలే చరాచర వస్తుజాల ప్రకంపనాలూ అంతా ఒక విచిత్ర ధూమ్రమండలం!"

ఇందులో కృత్యాలు, మేఘాలు, భూత ప్రేత పిశాచాలూ, ప్రకంపనాలు అనే మూడు నామాలు కలిసి సంయుక్తమైతే,అవి తిరిగి ఒక్కొక్కటీ ఒక్కొక్క ఉపవాక్యాలతో ("మార్మిక దేవతా సమూహాలు చేసే") వంటి పద బంధ విశేషణాలు అన్నీ కలిసి ఒక పెద్ద వాక్యం అయింది. ఈ వాక్యం లో ' చేసే; రేపే; దూకే; లొంగి; మసలే' వంటి అసమాపక క్రియలతో ఈ సంశ్లిష్ట వాక్యం రూపొందింది.

ఇలాంటి ఊహలతో కూడిన సంశ్లిష్టవాక్యాలు సామాన్య పాఠకులకు ఎంత మేరకు అర్థం అవుతాయో అన్న సందేహం కలుగుతుంది; కానీ ఆయన పాండిత్యం, ఆయన ధార అట్లాంటిది. అవి "అప్రయత్నంగా" ఏర్పడ్డవి.

ఆయన రచనల్లో పైన చెప్పుకున్నవిధంగా ప్రతీ వ్యక్తీకరణ ఆయన సృష్టి; వాటిలో కొన్ని ఎంత వినూత్నం అంటే, ఇతర కవులెవ్వరిలోనూ అలాంటి వాటిని

మనం చూడం.

పైన ఇచ్చిన ఉదాహరణలు శేషేంద్ర భాషాపటిమకూ, ఊహాకల్పనారచనా సామర్థ్యానికి మచ్చు తునకలు మాత్రమే. నిజానికి ఆయన ప్రతి రచనా కూడా ఆయనబాల్యం నుండీ పెంపొందించుకున్నభాషసాహిత్యాల పాండిత్య ప్రతిభలను సాహిత్య అభిరుచి వున్న పాఠకులందరనీ వదలకుండా కట్టి పడేస్తాయి

**శేషేంద్ర సాహిత్య విమర్శ:** సంప్రదాయ వ్యాకరణ అలంకార శాస్త్రాలనూ, పాశ్చాత్య సాహిత్య విమర్శనూ, మార్క్సిస్టు సిద్ధాంతాలను అధ్యయనం చేసి, తన సాహిత్య ఆలోచనలను మేళవించి తెలుగు సాహితీవిమర్శ లోకానికి అందించిన కొత్త ' tonic' వంటి సైద్ధాంతిక సాహితీ విమర్శ పరికల్పనే 'కవిసేన మానిఫెస్టో'. ఇది 1977 లో వచ్చి, సాహిత్య లోకాన్ని ఒక ఊపు ఊపింది.

తన కవిత్వంలో కూడా అక్కడక్కడా సాహిత్యం, కవిత్వం, కవులపై తన అభిప్రాయాలు నిష్కర్ష గా వెల్లడించిన శేషేంద్ర "కవి మొదట అనుభూతిని కళగా అభ్యాసం చెయ్యాలి; ఆత్మీకరణని కళగా అభ్యాసం చెయ్యాలి; తర్వాత అభివ్యక్తిని కళగా అభ్యాసం చేయాలి" అనీ వివిధ ప్రాచ్య పాశ్చాత్య విమర్శకులను క్రోడీకరిస్తాడు. (కవిసేన మేనిఫెస్టో పు. 68)

కవిసేన మానిఫెస్టో లో " కవిత్వం బతుకు తెరువు కాదు; జీవన విధానం" అనీ, యువతరం లో సాహిత్య విద్యార్థుల కోసం వాళ్ళలో ప్రాచ్య పాశ్చాత్య కావ్య తత్త్వ చింతన గురించిన సరియైన అవగాహన కోసం తపించి శేషేంద్ర అందించిన ఈ మేనిఫెస్టో చదవడం ద్వారా ప్రతీ సాహిత్య అభిరుచి కల తెలుగు వాడూ సాహిత్యం పట్ల సరియైన అవగాహన ఏర్పరచుకోగలుగుతాడు; లేదా ఆయన సిద్ధాంతాన్ని ప్రశ్నించ గల జ్ఞానం నేర్చుకుంటాడు. కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా ప్రతి సాహిత్య విద్యార్థీ ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదవాల్సి ఉంది. సాహిత్య విమర్శకుడిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో కాలు/చెయ్యి పెట్టే ప్రతిసాహిత్య విద్యార్థీ ముందుగా చదవాల్సిన గ్రంథం ఇది.

**శేషేంద్ర వైజ్ఞానిక రచనలు:** ఎక్కువమంది పరామర్శించని శేషేంద్ర రచనలు ఆయన 'వైజ్ఞానిక రచనలు'. విశ్వవివేచన, (చైతన్య పరిణామ చరిత్ర); నరుడు — నక్షత్రాలూ, ఊహాలో – అనే మూడు గ్రంథాల్లో "భూమి, విశ్వం, నక్షత్రాల గమనం, విజ్ఞానానికి కర్త ఎవరు?, నక్షత్రాలు అలసిపోతే?" వంటి అనేక అంశాల గురించి శాస్త్రీయంగా మనకు తెలియవస్తోన్న వాటిని వివరించే ప్రయత్నాలు చేశారు. అయితే, వాటిల్లో కొన్ని చోట్ల అంతర్లీనంగా 'జ్యోతిష' సంబంధమైన

పరామర్శ నిబిడీకృతమై కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రతిపాదనలను కొన్నింటిని ప్రాచీన భారతీయ తాత్త్విక చింతనతో మేళవించడం జరిగింది. "డబ్బునూ, అధికారాన్నీ నిరసించి, అంతరజ్యోతిని వెలిగింప జేయడం మన సంప్రదాయ వాఙ్మయ పద్ధతి" అని, తన మార్గం కూడా దానిలో భాగమే నని సూచించినా, ఆధునిక భారతీయ, ప్రపంచ సమాజాలు ఆ సంప్రదాయేతరమైన డబ్బు, అధికారాల చుట్టే పరిభ్రమించడం చూస్తే, దాన్ని మార్చడం ఎంత కష్టసాధ్యమో అవగతమవుతుంది. కవులు ఆదర్శ, తాత్వికత లు ఎంత అద్భుతంగా కవిత్వీకరించినా వాటి ప్రభావం అతి స్వల్పమని అనిపిస్తుంది.

**శేషేంద్ర రచనల అనువాదాలు:** శేషేంద్ర స్వయంగా బహు భాషా వ్యవహర్త అయినా, ఆయన రచనలను ఆయనే అనువాదం చేసుకోలేదు. ఆయన రచనల్లో వాల్మీకి సుందరకాండ తాత్త్విక వ్యాఖ్యానమైన 'షోడశి' ని అదే పేరుతోను, శ్రీహర్షనైషధ కావ్యారసావిష్కరణ అయిన స్వర్ణహంస ను అదే పేరుతోనూ గురజాడ సూర్యనారాయణమూర్తిగారు ఇంగ్లీషు లోనికీ; 'సముద్రం నా పేరు' కవితను కె. దామోదరరావు గారు ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. ఈ అనువాదాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల కాలంలో అభివృద్ధి చెందుతూ వస్తూన్న అనువాద సిద్ధాంతాల నేపథ్యంలో ఈ గ్రంథాల అనువాదాల అధ్యయనం అనువాదాల తీరునూ, అనువాదంలో చిక్కులనూ, పరిష్కారాలను చూపడానికి దోహదపడవచ్చు.ఇటీవల హిందీ అనువాదాల ప్రయత్నం కూడా జరుగుతోంది.

**శేషేంద్ర గజల్స్– లక్ష్య లక్షణాలు:** శేషేంద్ర శర్మగారికి ఉర్దూ కవిత్వంపైనా, ప్రత్యేకించి గజల్ పైనా ఎంతో ప్రీతి. "ఈ నగరం జాబిల్లి" హైదరాబాదు నగర పుట్టుకతో పెనవేసుకున్న కులీకుతుబ్ షా, భాగమతి ప్రణయగీతి. 'గజల్ వాతావరణం'తో పై కథను నృత్యనాటికగా రాసి ఇచ్చి తీరాలనే మిత్రుని (పి. యస్. రామారావు) మాట కాదనలేక "గజల్లలోనే జీవించిన " శేషేంద్ర గజల్ కు లక్ష్యంగా "ఈ నగరం జాబిల్లి" గీత కావ్యాన్నిరాసి , దీనికి అనుబంధంగా గజల్ లక్షణాలనూ వివరించారు. ఈ వ్యాసాలు చదివితే, ఒక సైద్ధాంతిక వివరణ, చర్చ ఎంత విలక్షణంగా, ఉద్వేగంగా కూడా చేయవచ్చో తెలుస్తుంది. "గజల్ ఒక అయస్కాంతం, 'ఒక అగ్ని', ఒక రంగుల పక్షి', 'ఒక సంస్కృతి'; దీన్ని కులీకుతుబ్ షా దక్కనీఉర్దూలో (పారశీక, మరాఠి, తెలుగు, కన్నడ భాషల సమ్మిళిత) మొట్టమొదటిసారిగా 16వ శతాబ్దంలో రాసాడు. అక్కడి నుండి అది ఢిల్లీకి పాకి,

వలీ, సౌదా, మీర్, గాలిబ్, ఇక్బాల్ వంటి అనేకమంది కవులను సృష్టించింది." అని గజల్ పుట్టుక హైదరాబాదు లోనే అని నిర్ద్వంద్వం గా ప్రకటించాడు.

"గజల్లో రెండేసిపాదాల ద్విపదలు (అంటే – కప్లెట్స్) ఏడు, ఎనిమిది ఉంటాయి. అందులో ఒక్కో ద్విపదని 'షేర్' అంటారు. పాదాన్ని మిస్రా అంటారు".

(పక్షులు, సముద్రం నాపేరు, ఈ నగరం జాబిల్లి, పుట. 118)

"ఆ రెండు పాదాల్లో హృదయాన్ని స్పృశించే చమత్కారం"

"గజల్ వాస్తవంగా పాడబడే పాట".

రెండు పాదాల షేర్ దాలీ దబీల్ టెక్నిక్.

అందులో నాలుగు జీవ ద్రవ్యాలుంటాయి; అవి: (1) అందాజె (అభివ్యక్తి), (2) బయాఁ (శైలి), (3) ఖాఫియా (అంత్యానుప్రాసలో మొదటి భాగం); రతోఫ్ (అంత్యానుప్రాసలో ఖాఫియాను అంటుకుని వచ్చే రెండో భాగం)".

ఇట్లా గజల్ లక్షణాలను వివరిస్తూనే, గజల్ కవిత ప్రేమలో పుట్టి, శోకం మీద బతుకుతుందనితెలిపాడు. ఆ లక్షణాలను కొన్ని 'కుటుంబాలు' గా వర్గీకరించాడు. ఇవి ప్రేమ, దుఃఖము, మధువు, కవిత, ఖుదా అనే హిరణ్య సోపానాలపై ఆధారపడి రూపొందుతాయనీ, వాటిని ఎక్కి ఉర్దూ కవులు 'మానవశిఖరాల్లో కలిసిపోయారనీ' ఉద్వేగంగా వివరిస్తారు.

ఈ గజల్ లక్షణాలు కబీర్ దోహాల (ఇతర దోహారచనల్లోనూ) లోనూ వాల్మీకి అనుష్టుప్ శ్లోకాల్లోనూ ("అసలు వాల్మీకిలో ఉన్నన్ని గజళ్లు ఎవ్వరిలోనూ లేవు" (పు. 139) ); వేమన్న ఆటవెలదిలోనూ ("వేమన ఆటవెలది గజల్ యొక్క (దావా దబీల్ టెక్నిక్‌కు నిలిచే విద్య" (పు. 140) ) ఉన్నాయనీ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ, నిరూపిస్తారు.

"గజల్ అనే ఒక మోహపాశంతో ఉర్దూ కవి ప్రజల్ని బంధించి తన వైపుకు లాక్కుంటాడు. మాట శక్తే మానవుడ్ని ప్రభావితం చేయగల ఏకైక ఆయుధం" అని సిద్ధాంతీకరిస్తారు.

తెలుగు లో గజల్ సాహిత్యం లో కృషి చేసిన దాశరథి, సి. నారాయణ రెడ్డి వంటి కవుల తో పాటు శేషేంద్ర కూడా గుర్తుంచు కోవలసిన మంచి గజల్ కవీ విశ్లేషకుడు కూడా.

ముగింపు: శేషేంద్ర సాహిత్యం, పైన వివరించినట్లు భావుకత, మానవత, ఆధ్యాత్మికత లను మేళవించి భారతీయ, భారతీయేతర తాత్త్వికత లతో కలగలిపి తన సాహిత్యంలో ఒక కొత్త ఒరవడిని, సృష్టించినట్లు ఆయన సాహిత్యం చదివితే మనకర్థమవుతుంది. ఆయన పద్యాన్నీ, వచనాన్నీ సమానంగా, సమర్థవంతంగా స్వంతం చేసుకుని, తన కవిత్వం ద్వారా వాటికి వినూత్న శక్తిని అందించారు. భారతదేశంలోని రైతుకోసం, శ్రామికుల కోసం, వారి సంక్షేమం కోసం ఆయన సాహిత్యం అధిక స్థానాన్ని ఇచ్చింది. కమ్యూనిస్టు భావజాలంతో రాసినా, ఆయన విప్లవ రచయితలతోనూ, కమ్యూనిస్టులతోనూ కలిసి పని చేయలేదు. సాహిత్య సామాజిక అంశాల పట్ల ఎంతో స్పష్టత ఉన్నప్పటికీ ఎందువల్ల వారితో కలసిపోలేకపోయాడు? అన్న ప్రశ్న మనకు స్ఫురిస్తుంది; దానికి సమాధానమూ ఆయన రచనల్లోనే మనకు దొరుకతుంది కూడా. ఆయన సృష్టించిన సాహిత్యంలో ఛందోబద్ధమైన పద్యపాదాలూ లయబద్ధంగా ఉండే రచనలూ మొదలైనవాటిని ఈ కాలం సాహితీ కృషి చేస్తున్న వారు చదవటం అర్థం చేసుకోగలగటం కష్టం. అంటే అటు విశ్వనాథ , జాషువాల వలె కాకుండా; ఇటు గురజాడ, శ్రీ శ్రీ ల వలేకాకుండా శేషేంద్ర ప్రాచీన అర్వాచీనాలను ఏకీకృతం చేసే ప్రయత్నం చేసినట్లు తోస్తుంది. ఆధునికంగా తెలుగు సాహిత్య విద్యార్థులే అనేకమంది పద్యం చదవలేని, అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు. అలాంటప్పుడు ఆయన తన సాహిత్యాన్ని ఎవరికోసం నిర్దేశించారో, వాళ్లకు చేరడం కష్టమైపోయింది. తెలుగువారిలో ఇంకా పూర్తి అక్షరాస్యత సిద్ధించలేదు; అక్షరాస్యుల్లో సాహిత్యం చదివేవాళ్లు తగ్గిపోయారు. సాహిత్యం చదివే ఆసక్తి ఉన్న ఏ కొద్దిశాతం మందో యువ తరంవారికి శేషేంద్రను చదవాలంటే పైన చెప్పిన కారణం వల్ల కాబోలు కొంత అనాసక్తి గా ఉన్నట్టు సాహిత్యకారుల అంచనా. ఎందుకంటే, ఈ వ్యాసంలో వివరించినట్లు ప్రతి ఖండికను చదివి అర్థం చేసుకుని, ఆస్వాదించగల 'సాహితీ మానసిక సంసిద్ధత' ఉన్నవారు చాలా తక్కువ అనిపిస్తుంది.

ఆయన సామాన్య మానవుడికి సమాన న్యాయాన్ని ఎంత ఆకాంక్షించాడో , అంతగానే ప్రాచీన భారతీయ సాహిత్య సంప్రదాయాన్ని కూడా అభిమానించాడు; అంతేకాదు ప్రకృతినీ, ప్రేమనూ ప్రేమించాడు. ఈ అన్నింటినీ సరిగ్గా అర్థం చేసుకోవడం ఆధునిక సాహిత్య విద్యార్థికి అంత సులభం కాదు. అల్పాక్షరాలతో అనల్పార్థాలను సృష్టించిన ఆయన కవిత్వీకరణను అర్థం చేసుకుని, ఆస్వాదించాలంటే, ప్రాచీన, ఆధునిక సంస్కృత, తెలుగు సాహిత్యాలను చదివిన జ్ఞానం కొంతలో కొంతైనా అవసరం.

శేషేంద్ర వ్యక్తిత్వం, కవిత్వం ఆయన మాటల్లోనే తనని తనే విశ్లేషించుకున్న ఈ కింది వాక్యాల ద్వారా అర్థం చేసుకోవచ్చు :

"కలల వర్తకపు క్యాపిటలిస్టువు నీవు

– నీకు జ్ఞానం కంటే ప్రేమతోనే పని ఉంది; నీవు కవివి ఓ శేషేన్!

– విప్లవానికి నీవు ఉదయతారవు!

– నా పోయెం.... ఒక తిరుగులేని ఆయుధం.

– "నేనింతే ఒక పిడికెడు మట్టే కావచ్చు;
కానీ కల మెత్తితే నాకు
ఒక దేశపు జెండా కున్నంత పొగరుంది".

– నా కవిత్వం మనిషికి, కేవలం ఒక డిఫెన్సు.

– పోట్లాట నేను బ్రతకడానికి పీల్చే ఊపిరి.

– నా కవిత్వం ఏ జెండానూ ఎగరేయదు; కానీ నా చేతులు నా దేశ ఖడ్గాలు.

– ఒక అందమైన పోయెం అంటే దానికి ఒక గుండె ఉండాలి.
అది కన్నీళ్లు కార్చాలి; క్రోధాగ్నులు పుక్కిలించాలి.

– శేషేన్, నీవు పీడిత ప్రజలకే చెందుతావు
అక్షరమై అందరికీ అందుతావు.

– ఓ శేషేన్, నీవొక పల్లెటూళ్లో, మొలకెత్తిన ప్రేమ దేవతవు.

– ఓ శేషేన్, నాకు తెలుసు, నీకు కవిత అంటే ఒకద్రాక్ష, ఒక ఉత్ప్రేక్ష.

– స్వర్గనరక పేజీలను బాగా తిరగేసిన రుషి వో శేషేన్!

– నీవొక గడ్డం లేని మహర్షివి; దేవుడు లేని భక్తుడివి."

అంటే తానొక కలల వర్తకపు క్యాపిటలిస్టు, ఒక విప్లవ ఉదయతార, ఒక పల్లెటూళ్ళో మొలకెత్తిన ప్రేమ దేవత, గడ్డం లేని మహర్షి, దేవుడు లేని భక్తుడు, జెండా పొగరు వంటి దేశ భక్తుడు.

ఇన్ని పరస్పర విభిన్న రూపాల ఏకాకృతి అవడం వల్ల శేషేంద్ర, ఆయన కవిత్వమూ అర్థం అయినట్లే కనిపిస్తూనే పూర్తిగా అర్థం కావు. మన మనస్సులలో ప్రేమను, ఆత్మలో స్థైర్యాన్ని అందించే ఈ సాహిత్యం బహుశా అందువల్లేనేమో

విస్తృత సాహిత్య లోకం నోళ్లలోనూ, నాలుకల పైనా నిలదొక్కుకోలేక పోతోంది. అయినా కొందరిలో నైనా ఈ సాహిత్య సంకల్ప ఉద్దేశాలు నిలబడు తున్నాయి! అందుకు ఈ పుస్తకాలలో ముద్రిత మైన అనేక సాహిత్యకారులు రాసిన వ్యాసాలే సాక్ష్యం!!

## ఆధార గ్రంథాలు


ఉషా దేవి, అయినవోలు. 2022. వ్యాఖ్య. జాషువా రచనలు గబ్బిలము టీకా తాత్పర్యాలతో. ఎమెస్కో. హైదరాబాదు

జాషువా, గుర్రం. 1941–42. గబ్బిలము.

తిలక్, బాలగంగాధర, దేవర కొండ. 1968. అమృతం కురిసిన రాత్రి.


## శేషేంద్ర శర్మ గారి రచనలు :


1. ఆధునిక మహాభారతం. (Poems published between 1970–1986). (వీటిలో కొన్ని ముందుగా విడి విడి పుస్తకాలుగా వచ్చాయి. వాటి పేర్లు కింద ఇవ్వబడ్డాయి)
2. సొరాబ్. పద్య కావ్యం. 1954. 3rd. Edition 2016.Gunturu Seshendra Sharma Memorial Trust
3. మండే సూర్యుడు. 1974.(ఆధునిక మహాభారతం)
4. షోడశి. 2013. Ibid.
5. స్వర్ణ హంస 2014. e– book Online. (1St edn. 1967 and 2nd edn. 1999.)
6. నాదేశం – నా ప్రజలు. 1975. 4 త్. Edn. 2016. Ibid.(ఆధునిక మహాభారతం లో కూడా)
7. గొరిల్లా 1976. ( పై..)
8. నీరై పారిపోయింది 1976. (పై)
9. అరుస్తున్న ఆద్మీ 1983 (పై)
10. ప్రేమ లేఖలు. 1983. (పై)

11. సముద్రం నా పేరు 1979. ( పై.)
12. శేష జ్యోత్స్న 1972. ( పై)
13. చమత్కారికలు 1985. (పై)
14. నేనూ నా నెమలీ 1975. (పై.)
15. జనవంశమ్ కావ్యకృతి 1993, 2 nd. Edition 2016. Gunturu Seshendra Sharma Memorial Trust, Hyderabad
16. కవిసేన మేనిఫెస్టో ఆధునిక కావ్యశాస్త్రమ్. 1977(2015 3rd edition) Gunturu Seshendra Sharma Memorial Trust, Hyderabad
17. ఋతు ఘోష పద్య కావ్యం; మండే సూర్యుడు వచన కవితా సంపుటి( రెండూ కలిపి) 2008. Kavita Publications, Houston. USA
18. నరుడు – నక్షత్రాలు 2011. Gunturu Seshendra Sharma Memorial Trust, Hyderabad
19. విశ్వ వివేచన ( చైతన్య పరిణామ చరిత్ర). 2012
20. ఊహాలో్....1968. 2nd edn. 2001. Jyotsna Publications. Hyderabad
21. పక్షులు (పుటలు 33–80); సముద్రం నా పేరు (పుటలు 81–97); ఈ నగరం జాబిల్లి ( పుటలు 106–151).
22. (మూడూ కలిపి) 2009. Gunturu Seshendra Sharma Memorial Trust. Hyderabad.

గమనిక: శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ గారి జయంతి సందర్భంగా 2018 అక్టోబర్ లో ఇచ్చిన ఉపన్యాసం ఆధారంగా రాసిన వ్యాసం. శేషేంద్ర శర్మ గారి అబ్బాయి సాత్యకి గారికి ధన్యవాదాలు.

# పరవశం




శ్రీమతి మందరపు హైమవతి
✆ 9441062732

ఇంకా
మేఘాల ఉయ్యాల్లో
ఊగుతున్నట్లే వుంది పరవశంగా
మామూలు వాక్యమే
కవితా ఫించమైనట్లు
నేలపై నుంచి నింగికెగరగానే
కొత్త లోకంలోకి అడుగుపెట్టిన
సంబరం.

భూలోకంలో కనిపించే
విశాల ఆకాశహర్మ్యాలు
అగణిత అంతస్తుల అపార్ట్మెంట్లు
చిన్నపిల్లలాడుకునే బొమ్మరిళ్ళు


ద్విచక్ర చతుష్చక్ర షట్చక్ర
వాహనాలతో
క్షణం తీరికలేని రాక్షస రహదారులు
సన్నని గీతల్లా మారిన చిత్రం

కనిపించని ముసలమ్మ ఏకులు వడుకుతున్నట్లు
ఎటు చూస్తే అటు దూది పింజల మబ్బులు
రాత్రి కాగానే వెలిగిన రంగుల దీపాలు
ముంగిట్లో వేసిన రంగుల రంగవల్లులు
గంటసేపో రెండు గంటలసేపో
మబ్బుల వీధిలో చక్కర్లు కొట్టి
నేల మీదకు దిగి రాగానే
మళ్ళీ యధార్థ దృశ్యాలు



దానవుడని ప్రకృతి విధ్వంసకుడని
స్వార్థపరుడని వేనోళ్ల నిందించినా మానవుణ్ణి
పక్షిలా ఎగరాలనే ఊహకు రెక్కలిచ్చి
నింగిలో ఎగరేసినవాడిని
విమానమెక్కినప్పుడల్లా స్మరించుకుంటాను.






పరిశోధనా వ్యాసం

# స్వాతంత్ర్య సమరంలో ఆధ్యాత్మిక, తత్త్వవేత్తల పాత్ర



ఆచార్య వంగరి త్రివేణి
✆ 99514 44803

భారత స్వాతంత్ర్య సమరానికి అంతర్గత స్ఫూర్తిని అందించింది ఆధ్యాత్మిక చింతన. ప్రపంచంలోనే అత్యంత పురాతన దేశం భారతదేశం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, తాత్త్విక భూమికకు పట్టుగొమ్మ. ఆధ్యాత్మిక, తత్త్వవేత్తల అభీష్టమే స్వాతంత్ర్య సంగ్రామానికి మహా బలాన్ని చేకూర్చింది. ఈ ఆధ్యాత్మిక జాతీయవాదమే క్రూరమైన విదేశీ పాలన నుండి మాతృభూమిని రక్షించడానికి ప్రేరేపించింది. ఈ సమరంలో దేశప్రజలందరు కుల, మత, భాషా, వర్ణ భేదాలకు అతీతంగా ఏకమయ్యారు. ఆధ్యాత్మిక వీరుల సంకల్ప బలం, పోరాట పటిమ, కర్తవ్య దీక్ష, పట్టుదల, ధ్యేయం, స్వేచ్ఛా, సమానత్వం వంటివి స్వాతంత్ర్య సాధనకు ఆయువుపట్టుగా నిలిచాయి. అటువంటి ఆధ్యాత్మిక, తాత్త్విక స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటిన కొందరు వీరులను గూర్చి ఈ వ్యాసంలో తెలిపే ప్రయత్నం చేస్తాను.



## యోగి అరవిందో ఘోష్

“ఈ దేశ ప్రజలకు భగవత్ సాక్షాత్కారమే స్వరాజ్యం. ఇది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కాదు. వ్యక్తి, సామూహిక, సాంఘిక, జాతి, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం. భగవంతుడు భారతదేశాన్ని పవిత్ర, ఆధ్యాత్మిక అగ్రగామిగా ఉండాలని నిర్దేశించాడు. దేశ ప్రజలు భగవత్ సాన్నిహిత్యాన్ని పొందాలి. పాశ్చాత్య దేశాల ప్రజాస్వామ్యం మన

దేశానికి ఆదర్శం కాదు. అది హక్కులు, విధుల పేరుతో భారతీయ ఆత్మను గుర్తించలేదు. మన ప్రజాస్వామ్యం ధర్మం ఆధారంగా ఉండాలి" "ప్రపంచం కోసం భారత్ జీవించి ఉండాలి. అందుకోసమే స్వరాజ్యాన్ని సాధించాలి. సంకుచితమైన రాజకీయ, ప్రాపంచిక ప్రయోజనాల కోసం కాకుండా మానవాళికి ఆధ్యాత్మికంగా, మేధోపరంగా మేలు చేయగలిగిన స్వేచ్ఛాయుత ప్రజానీకం కలిగిన దేశంగా మనుగడ సాగించాలి." (Collected Works of Sri Aurobindo, Vol. 6, p. 573) అని వందేమాతరం పత్రిక సంపాదకీయంలో యోగి అరవిందో ఘోష్ రాశారు.

**స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ రాజకీయ నాయకునిగా, ఆధ్యాత్మిక వేత్తగా, జాతీయవాద ప్రవచకునిగా జీవితాంతం భారతమాత సేవలో శ్రమించారు యోగి అరవిందో ఘోష్.**

స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ రాజకీయ నాయకునిగా, ఆధ్యాత్మిక వేత్తగా, జాతీయవాద ప్రవచకునిగా జీవితాంతం భారతమాత సేవలో శ్రమించారు యోగి అరవిందో ఘోష్. ఆధ్యాత్మిక భారత నిర్మాణం కోసం తపించారు. ఎంతో మందికి స్ఫూర్తి దాతగా, మార్గదర్శిగా నిలిచారు. దేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని కోరుకున్న అరవింద్ ఘోష్ కాంగ్రెస్ మహాసభలకు కూడా హాజరయ్యారు. ఒక పక్క రాజకీయాలతో పాటు మరో పక్క ఆధ్మాత్మిక చింతనను కూడా పెంపొందించుకున్నారు. విష్ణు భాస్కర్ లేలే అనే యోగి దగ్గర యోగసాధన చేసి మూడు రోజుల్లోనే నిర్వాణ స్థితిని సాధించారు. ఆ సమయంలోనే బెంగాల్ విభజన జరగడంతో దేశవ్యాప్తంగా వందేమాతర ఉద్యమం ఉధృతం అయ్యింది. ఇంతకాలం స్వరాష్ట్రానికి దూరంగా ఉన్న అరవిందో ఘోష్ కలకత్తాకు మకాం మార్చారు. అక్కడి నేషనల్ కాలేజీకి తొలి ప్రిన్సిపల్‌గా నియమించబడ్డారు. బిపిన్ చంద్రపాల్ ప్రారంభించిన వందేమాతరం పత్రికకు సంపాదకుడిగా వ్యవహరిస్తూ అరవిందో రాసిన వ్యాసాలు సంచలనం రేపాయి.

1908లో వందేమాతర ఉద్యమకారులకు కఠిన శిక్షలు విధించిన ముజఫర్‌పూర్ జిల్లా జడ్జి కింగ్స్ ఫర్డ్‌ను హతమార్చేందుకు ఖుదీరాం బోస్,

ప్రఫుల్ల చాకీ ఓ బండిపై బాంబు విసిరారు. ఆ బండిలో కింగ్స్‌ఫర్డ్ లేడు. ఇద్దరు స్త్రీలు చనిపోయారు. ఆలీపూర్ కుట్రగా ప్రసిద్ధికెక్కిన ఈ కేసులో అరవిందోపై కుట్రదారుడిగా అభియోగాలు నమోదయ్యాయి. చిత్తరంజన్ దాస్ న్యాయవాద పటిమతో 126 రోజుల విచారణ తర్వాత అరవిందో నిర్దోషిగా విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత అరవిందో ఘోష్ దేశ ప్రజల్లో స్వాభిమానం, దేశభక్తి పెంపొందించు కొనేందుకు ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించారు. కర్మయోగిన్, ధర్మ పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశారు. 'జాతీయవాదం అంటే ఒక ధోరణి, మతం, నమ్మకం కాదు. అది మన సనాతన ధర్మం, అదే మనకు జాతీయవాదం. వందేమాతరంలో మనకు మాత అనే పదం మాతృభూమిని గుర్తుకు తెస్తుంది. ఇప్పుడు ఇది నూతన ధోరణి.' అని ఉద్బోధించారు అరవిందో. ఆయన కార్యకలాపాలపై బ్రిటిష్ ప్రభుత్వం గట్టి నిఘా పెట్టింది. ఆయనను ఎలాగైనా అండమాన్ జైలుకు పంపాలని కుట్ర పన్నింది. 1910 ఏప్రిల్ మాసంలో ఓ బోటులో ఫ్రెంచ్ వారి ఆధీనంలోని పాండిచ్చేరి చేరుకున్నారు అరవిందో. ఇదే ఆయన శాశ్వత నివాసమై పోయింది. జీవిత చరమాంకాన్ని పూర్తిగా ఆధ్యాత్మిక మార్గానికే కేటాయించాలని నిర్ణయించుకున్నారు. అరవిందోను పాండిచ్చేరి నుంచి వెనక్కి రప్పించి అరెస్టు చేయాలని బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

> **పాండిచ్చేరిలో నాలుగేళ్ల పాటు ఏకాగ్రతతో యోగ దీక్ష చేసి 1914లో 'ఆర్య' అనే పత్రికను ప్రారంభించారు**

పాండిచ్చేరిలో నాలుగేళ్ల పాటు ఏకాగ్రతతో యోగ దీక్ష చేసి 1914లో 'ఆర్య' అనే పత్రికను ప్రారంభించారు. దీని ద్వారా దివ్యజీవితం, వేద రహస్యం, గీతా వ్యాసాలు, ఉపనిషత్ వ్యాఖ్యలను ధారావాహికగా అందించారు. అరవిందోను కలుసుకునేందుకు ఎంతోమంది ప్రముఖులు పాండిచ్చేరి వచ్చేవారు. వారిలో రవీంద్రనాథ్ ఠాగూర్, లాలాలజపతి రాయ్, పురుషోత్తమదాస్ టాండన్, డాక్టర్ మూంజే, డాక్టర్ హెడ్గేవార్ ప్రముఖులు. అరవిందో ఆశ్రమం క్రమంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించడం మొదలైంది. 1947 వ సం. తన జన్మదినమైన ఆగస్టు 15న భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినా, దేశ విభజన జరగడం అరవిందోను బాధించింది. అందుకే తన దగ్గరికి వచ్చిన విలేకరులతో 'ఇది నేను కోరుకున్న స్వాతంత్ర్యం కాదు. నేను చేపట్టిన విప్లవ ఉద్యమ లక్ష్యం ఇది కాదు. సంపూర్ణ, సమైక్య భారతదేశం

కోసం నేను కలలు కన్నాను. దేశం మత ప్రాతిపదికన హిందూ, ముస్లింల పేరుతో రెండు ముక్కలైంది. శరీరంలో ఒక భాగం కోల్పోయినట్లే దేశం అంగవైకల్యంతో బలహీన పడుతుంది. భవిష్యత్తు నిరాశాజనకంగా ఉండకూడదనుకుంటే విభజన రద్దయి తిరిగి భరతభూమి అఖండం కావాలి' అన్నారు.

## స్వామి వివేకానంద

"భారతీయ నాగరికతలోని ముఖ్యమైన రెండు భావనలు, విశ్వ భావన, మానవతావాదంపై ఆధార పడింది. వ్యక్తి తన మౌలిక తత్త్వాన్ని ప్రకటించడానికి అవసరమైన స్వేచ్ఛ, సమానత్వంతోపాటు ఆధ్యాత్మిక సౌభ్రాతృత్వం ఆధారంగా ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా సమైక్యం చేయడానికి వీలు కలిగించేదే జాతీయవాదం. నిస్వార్థమైన సేవ ద్వారా రాజకీయ, ఆధ్యాత్మిక మోక్షం సాధించడానికి అవకాశం కలిగించే వ్యవస్థ కర్మయోగమని అన్నారు. ప్రతి జాతి ఒక జీవనసూత్రాన్ని, సారాంశాన్ని ప్రతిఫలిస్తుందని, ఆధ్యాత్మికతలోనే జాతి బలం ఉంది" "ప్రతి జాతికి ఒక లక్ష్యం, అది ప్రపంచానికి ఇచ్చే సందేశం ఉంటాయి. మిగిలినవన్నీ ముఖ్యం కాదు. భారత దేశపు సారాంశం మతం." (The Complete Works of Swami Vivekananda. P.2173) అని స్వామి వివేకానంద పేర్కొన్నారు.



స్వావలంబన, ధైర్యం, బలం, నిరంతర ప్రయత్నం, దేశభక్తి చాలా అవసరమని ఆయన దేశ ప్రజలకు ఉద్బోధించారు. స్వేచ్ఛ, సమానత్వ భావనలను ఆయన భారత సంప్రదాయ వేదాంతానికి జోడించారు. ముఖ్యంగా వీటిని అద్వైత సిద్ధాంతం బాగా చెప్పిందని అన్నారు. బ్రిటిష్ వారి పాలన మొదలయ్యాక 'రాజ్యశక్తే సర్వస్వం' అన్న వాతావరణం ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో ధర్మశక్తే సర్వస్వం, ధర్మమే ఆధారం, మన జాతీయత స్థిరంగా నిలబడాలని బంకిమ్‌చంద్ర చటర్జీ, దయానంద సరస్వతి, యోగి అరవిందో, రామకృష్ణ పరమహంస, స్వామి

వివేకానంద వంటివారు అగ్రగణ్యులు. సమకాలీన సామాజిక పరిస్థితులను అర్థం చేసుకున్న వివేకానందుడు ఈ దేశంలోని యువతకు ప్రేరణగా నిలిచారు. ఆధ్యాత్మిక సంకల్పంతో వివేకానందుడు దేశంలో 'సాంస్కృతిక జాతీయవాదాని'కి బలమైన పునాదులు వేశారు.

కలకత్తాలో 1863 జనవరి 12న జన్మించిన వివేకానందుడికి– 'భగవంతుడ్ని దర్శించాల'నే ఆకాంక్ష చిన్నతనం నుంచి ఉండేది. ఆ ఆకాంక్షను తీర్చుకునే అన్వేషణలో ఆయన రామకృష్ణ పరమహంసకు దగ్గరయ్యారు. రామకృష్ణ పరమహంస వద్దకు వెళ్లాక ఆయన వేసిన మొదటి ప్రశ్న– 'మీరు భగవంతుడ్ని చూశారా?' అని. దానికి పరమహంస– 'నేను నిన్ను ఎట్లా చూస్తున్నానో భగవంతుడ్ని అలాగే చూశాను' అని బదులిచ్చారు. ఆ క్షణంలోనే 'భగవంతుడు సర్వాంతర్యామి' అని తెలుసుకున్న వివేకానందుడు రామకృష్ణ పరమహంస ప్రేరణతో సన్యాసిగా మారారు. పరమహంస మరణించిన తర్వాత వివేకానందుడు 'భారత పరిక్రమ'కు బయలుదేరారు. దేశమంతా అపరిచితుడిగా తిరిగారు. దేశంలోని సామాజిక సమస్యలు, ఆధ్యాత్మిక రంగంలో సంఘర్షణలు, సంస్కరణ వాదంతో తలెత్తిన సరికొత్త సమస్యలను ఆయన అవగాహన చేసుకున్నారు. అప్పటి పరిస్థితులను, అస్పృశ్యత వంటి సామాజిక సమస్యలను చూసి దుఃఖించడమే కాదు, వాటిని చక్కదిద్దాలని సంకల్పించారు.

> **కలకత్తాలో 1863 జనవరి 12న జన్మించిన వివేకానందుడికి– 'భగవంతుడ్ని దర్శించాల'నే ఆకాంక్ష చిన్నతనం నుంచి ఉండేది.**

1893లో చికాగోలో ఉపన్యాసం ఇవ్వడానికి ముందే దేశంలోని సమస్యలను, సంక్షోభాలను చూసి వాటిపై ఎంతోమంది ప్రముఖులతో వివేకానందుడు చర్చించారు. అప్పట్లో ఆయన ఆవేదనను కొంతమంది గుర్తించలేదు. చికాగో ఉపన్యాసం తర్వాత వివేకానందుడి గొప్పతనాన్ని తిలక్ వంటి నేతలు అర్థం చేసుకున్నారు. చికాగోలో ఉపన్యాసం ఇచ్చిన తొలిరోజే ప్రపంచమంతా ఒక్కసారి వివేకానందుడి ఆలోచనల వైపు మళ్లింది. చికాగోలో జరిగిన 'మత మహా సమ్మేళనం'లో ఆయన చేసిన సింహగర్జనకు యావత్ ప్రపంచం ఒక్కసారి ఉలిక్కిపడింది. అప్పటి ఉపన్యాసంలో ఆయన చెప్పిన మాటలు ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లోనూ

మననం చేసుకోవాల్సి ఉంది. 'నేను చెప్పిందే సత్యం అనే మూర్ఖవాదనే ప్రపంచ మానవ నాగరికత వికాసానికి అడ్డంకి అవుతుంది' అంటూ ఆయన ప్రబోధించారు. "నేటి ఆధునిక యుగంలో మతాల ఆధిపత్య పోరాటంలో ప్రపంచం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. వీటి నుంచి బయటపడాలంటే హిందూ తాత్విక చింతనే ఆధారం". చికాగో ఉపన్యాసం తర్వాత వివేకానందుడు దేశ దేశాలు తిరిగి చెప్పారు. చికాగో నుంచి తిరిగి వచ్చాక ఆయన దేశవ్యాప్తంగా పర్యటించి ప్రజలను జాగృతం చేశాడు. ఆయన బోధించిన వ్యక్తి నిర్మాణం, సాంస్కృతిక జాతీయ వాదం, సామాజిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఆయన బోధించారు. ఇలా జాతీయవాదిగా, దార్శనికుడిగా, సంస్కరణవాదిగా, ఆధ్యాత్మిక చింతకుడిగా వివేకానందుడు చిరస్మరణీయులు.

## లోకమాన్య బాలగంగాధర్ తిలక్



లోకమాన్య బాలగంగాధర్ తిలక్ సాంస్కృతిక జాతీయవాదాన్ని ప్రచారం చేస్తూ కాంగ్రెస్ సంస్థాగత కార్యక్రమాలను ప్రజల్లో విస్తరింపజేశారు. 1897 నాటికే కాంగ్రెస్‌కు ఒక బలమైన నాయకుడయ్యాడు. బార్, ఎం.ఎ.జిన్నా, అలీ సోదరులు లాంటి నాయకులు కూడా తిలక్ అనుచరులలో ఉన్నారు. తిలక్ ప్రేరేపించిన ఆధ్యాత్మిక జాతీయవాదం మహారాష్ట్ర, పంజాబ్, బెంగాల్, మద్రాసు ప్రెసిడెన్సీలలో విప్లవాత్మకమైన అన్ని ఉద్యమాలకు పునాదిగా నిలిచింది. ఎ. వోల్పెర్ట్ తన "తిలక్ అండ్ గోఖలే" (1962) అనే పుస్తకంలో ఆధ్యాత్మిక జాతీయవాదాన్ని పునరుజ్జీవింప చేసినందుకు తిలక్‌కు సరైన ఘనత గోఖలే అందించాడని అన్నారు. ఆధ్యాత్మిక జాతీయవాదం నిద్రాణమైన స్వేచ్ఛా భావనను రేకెత్తించడంలో ముఖ్యమైన పాత్ర పోషించిందని, భారతీయ ప్రజలలో స్వేచ్ఛ కోసం అంకితభావాన్ని వెలిగించిందని ఆయన పేర్కొన్నారు.

1905లో వైస్రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్‌ను హిందూ మెజారిటీ మరియు ముస్లిం మెజారిటీ ప్రాంతాలుగా విభజించడాన్ని ప్రకటించడం భారతీయ ప్రజానీకానికి కోపం తెప్పించింది. ఇది సాంస్కృతిక జాతీయవాదం ప్రాతిపదికను

బలోపేతం చేయడానికి కాంగ్రెస్ యొక్క ప్రసిద్ధ 'లాల్-బాల్-పాల్' త్రయంకు అవకాశం కల్పించింది. మహారాష్ట్రలో లోకమాన్య తిలక్, బెంగాల్‌లో బిపిన్ చంద్ర పాల్ మరియు పంజాబ్‌లో లాలా లజపతిరాయ్ కాంగ్రెస్‌లోని మిలిటెంట్లను సంఘటితం చేశారు. మత విశ్వాసం ప్రాతిపదికన బెంగాల్ ను విభజించే చర్యను ఖండిస్తూ డిసెంబర్ 1906 కలకత్తాలో కాంగ్రెస్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించడంలో విజయం సాధించారు. గోపాల్ కృష్ణ గోఖలే నేతృత్వంలోని మితవాదులు మరియు 'లాల్-బాల్-పాల్' త్రయం నేతృత్వంలోని మిలిటెంట్ల మధ్య కాంగ్రెస్‌లో నాయకత్వ ఆధిపత్యం కోసం యుద్ధం ప్రారంభమైంది.

> **తిలక్ అందరి పట్ల సమానమైన సమిష్టి దృక్పథాన్ని ఏర్పరచుకోవడం, స్వాతంత్ర్య సమరానికి మాత్రమే కట్టుబడి ఉండటం, ప్రజలందరిని ఉద్యమం వైపు ప్రేరేపించడం వంటి అంశాలతో ముందుకు నడిచారు.**

తిలక్ అందరి పట్ల సమానమైన సమిష్టి దృక్పథాన్ని ఏర్పరచుకోవడం, స్వాతంత్ర్య సమరానికి మాత్రమే కట్టుబడి ఉండటం, ప్రజలందరిని ఉద్యమం వైపు ప్రేరేపించడం వంటి అంశాలతో ముందుకు నడిచారు. అనిబిసెంట్ మద్రాసులో 1915లో హోమ్ రూల్ లీగ్ ని స్థాపించారు. హోమ్ రూల్ లీగ్ సభ్యత్వాన్ని జిన్నా కూడా అంగీకరించారు. ఈ లీగ్ ని సమర్థించిన తిలక్ దాని శాఖను పూణేలో ప్రారంభించారు. ఈ లీగ్ కూడా ఆధ్యాత్మిక జాతీయవాదాన్ని పునాదిగా చేసుకొని ముందుకు కొనసాగింది. అనిబిసెంట్ అతని భావజాలానికి చాలా బలమైన మద్దతుదారుగా నిలిచారు.

### మదన్ మోహన్ మాలవ్య

భారతరత్న మదన్ మోహన్ మాలవ్య దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అతను నాలుగుసార్లు 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' అధ్యక్షుడిగా పనిచేశారు. అతను ఆసియాలోని అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయం, ప్రపంచంలోనే అతిపెద్ద బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బి హెచ్ యు ) స్థాపకులు. 'హిందూ మహాసభ'లో సభ్యుడిగా కొనసాగారు. గయా, కాశీలో జరిగిన రెండు



ప్రత్యేక సమావేశాలలో అధ్యక్షుడిగా పనిచేశారు. హరిద్వార్‌లో 'గంగా మహాసభ' ను స్థాపించారు. ప్రజలు ఆయనను పండిట్ మదన్ మోహన్ మాలవ్య అని గౌరవంగా సంబోధించేవారు. మహాత్మాగాంధీ ప్రదానం చేసిన బిరుదును "మహామాన" అని ముద్దుగా పిలిచేవారు. "సత్యమేవ జయతే" (సత్యమే గెలుస్తుంది) అనే నినాదాన్ని 'ముండకోపనిషత్' నుండి గ్రహించి అశోక చక్రంలో పొందుపరిచారు.

డిసెంబరు 1886లో కలకత్తాలో జరిగిన రెండవ 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' సమావేశానికి హాజరై కౌన్సిల్ ప్రాతినిధ్యాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అవి సెషన్ చైర్మన్ దాదాభాయ్ నౌరోజీని, కలకంకర్ ఎస్టేట్ రాజా రాంపాల్ సింగ్‌ను కూడా ఆకట్టుకున్నాయి. "హిందుస్థాన్" 'ఇండియన్ ఒపీనియన్' 'అభ్యుదయ' 'మర్యాద' వంటి పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించి వాటి మనుగడకు ఎంతో కృషి చేశారు. న్యాయశాస్త్రం చదివి హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. రెండు సార్లు 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చౌరీ-చౌరా ఘటన తర్వాత, సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధించిన 177 మంది స్వాతంత్ర్యం సమరయోధుల తరపున వాదించేందుకు అలహాబాద్ హైకోర్టు ముందు హాజరయ్యారు. 156 మందిని నిర్దోషులుగా విడుదల చేయడంలో విజయం సాధించారు. 'సెంట్రల్ హిందూ కాలేజ్' స్థాపించిన అనిబిసెంట్ ఏప్రిల్ 1911లో మాలవ్యను కలిసి వారణాసిలో "హిందూ విశ్వవిద్యాలయం" ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. 1916లో పార్లమెంటరీ "బి. హెచ్. యు. చట్టం" ను ఆమోదించింది. అప్పటి నుంచి 1939 వరకు యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్‌గా కొనసాగారు.

1912లో 'ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'లో సభ్యుడయ్యారు. అది 1919లో 'సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ'గా రూపాంతరం చెందినప్పుడు అతని సభ్యత్వం 1926 వరకు కొనసాగింది. జవహర్‌లాల్ నెహ్రూ, లాలా లజపత్ రాయ్‌తో కలిసి 1928లో సైమన్ కమిషన్ ను వ్యతిరేకించారు. 1931లో 'రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి' ప్రతినిధిగా హాజరయ్యారు. 1932లో

ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఖిలాఫత్, సహాయ నిరాకరణోద్యమంలో మాలవ్య ప్రధాన పాత్ర పోషించారు. ఏప్రిల్ 25, 1932న ఢిల్లీలో మాలవ్యతో పాటు దాదాపు 450 మంది కాంగ్రెస్ వాలంటీర్లను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. సెప్టెంబరు 25, 1932న ఆయనకు, డాక్టర్ అంబేద్కర్‌కు మధ్య "పూనా ఒప్పందం" కుదిరింది. 1933లో కలకత్తాలో నాలుగోసారి కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. తర్వాత మాధవ్ శ్రీహరి అనీ తో కలిసి కాంగ్రెస్ నుండి విడిపోయారు. ఇద్దరూ కలిసి 1934లో 'కాంగ్రెస్ నేషనలిస్ట్ పార్టీ'ని స్థాపించారు. ఆ సంవత్సరం కేంద్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో పార్టీ 12 సీట్లు గెలుచుకుంది. తర్వాత 1937లో క్రియాశీల రాజకీయ జీవితం నుండి విరమించుకున్నారు.

## కేశవ్ చంద్ర సేన్



కేశవ్ చంద్ర సేన్ హిందూ ఆలోచనా చట్రంలోకి క్రైస్తవ వేదాంతాన్ని చేర్చడానికి ప్రయత్నించారు. బెంగాల్ ప్రెసిడెన్సీలో హిందువుగా జన్మించిన ఆయన 1856 లో బ్రహ్మ సమాజం సభ్యుడయ్యాడు. కానీ 1866 లో దాని నుంచి విడిపోయి "భరతవర్షీయ బ్రహ్మ సమాజం"ను స్థాపించాడు. తదనంతర జీవితంలో రామకృష్ణ పరమహంస ప్రభావానికి లోనయ్యాడు. క్రైస్తవ భక్తి, హిందూ ఆచారాలతో ప్రేరణ పొంది సమకాలీన "క్రొత్త వ్యవస్థ"ను స్థాపించాడు.

1863 లో ఆయన బ్రహ్మ సమాజం విండికేటెడ్ రాశారు. ప్రాచీన హిందూ వనరులను ఉపయోగించడం ద్వారా, వేదాల అధికారం ద్వారా హిందూ మతాన్ని పునరుజ్జీవింప చేయడానికి బ్రహ్మ సమాజం ఉద్భవించిందని ఉపన్యాసాలు చేస్తూ దేశమంతా పర్యటించారు. అయితే, 1865 నాటికి క్రైస్తవ సిద్ధాంతం మాత్రమే హిందూ సమాజానికి కొత్త జీవితాన్ని తీసుకురాగలదని నమ్మారు. తర్వాత 1876 లో యాదృచ్ఛికంగా రామకృష్ణ పరమహంస కేశవ్ సేన్ ను 'సాధన కానన్' వద్ద కలిశారు. సేన్ మొదట్లో రామకృష్ణ ఆధ్యాత్మికత పట్ల ఎటువంటి అనుబంధాన్ని చూపించలేదు. కాని అతడి సాధు ప్రవర్తన సేన్ ను ఆకర్షించింది. రామకృష్ణ ఆయనను కలిసినప్పటికే కేశవ్ సేన్ క్రైస్తవ మతాన్ని స్వీకరించి ఉన్నారు. బ్రహ్మ

సమాజం నుండి విడిపోయి విగ్రహారాధనను తిరస్కరించారు. కాని రామకృష్ణ ప్రభావంలోకి వచ్చాక మళ్ళీ హిందూ బహు దేవతారాధనను అంగీకరించారు. "కొత్త వ్యవస్థ" (నవ విధాన) అనే మత ఉద్యమాన్ని స్థాపించారు. ఇది రామకృష్ణ చెప్పిన "దేవుడిని తల్లిగా ఆరాధించడం", "అన్ని మతాలు నిజం" అనే సూత్రాలపై ఆధారపడి కొనసాగింది.

## బంకించంద్ర ఛటోపాధ్యాయ




'ఛటోపాధ్యాయ్' అని బ్రిటీష్ వారికి పిలవడం రాక 'ఛటర్జీ' అని పిలిచేవారట. దీనితో ప్రజలందరూ 'ఛటర్జీ' అని పిలవడం ప్రారంభించారు. బెంగాల్ కవి, వ్యాస రచయిత, సంపాదకులు. వీరి రచన "వందేమాతరం" మంచి పేరు తెచ్చి పెట్టింది. "ఆనంద్ మఠ్" అనే నవల నుండి ఈ గీతాన్ని సంగ్రహించారు. ఈ గీతం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సమరశంఖంగా పనిచేసింది. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులు. ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేశారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహాకవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింపచేసిన ప్రభావం బంకించంద్రుడి విషయంలో లాగా మరొక దేశంలో, మరొక స్వాతంత్ర్యోద్యమంలో సంభవించలేదంటే నమ్మ శక్యం కాదు.

బంకించంద్ర చటర్జీ రచనలు ఉదాత్త ఆదర్శాలకు, రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు కాల్పనిక సౌందర్య తాత్వికతకు, శరత్ చంద్ర రచనలు సమాజ వాస్తవికతకు దర్పణాలు. మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని ఆయా పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం ఆరాధన అపూర్వం. ఆనందమఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైనా, సాహసానికైనా వెనుకాడని ప్రతీకలు. పురాణ భారతీయ వాఙ్మయంలో ధర్మ ప్రతిష్ఠాపన, నీతి, ఆదర్శం, సత్యం కలిగిన పురాణ పాత్రల లాగా బంకించంద్రుడి నవలలో కాల్పనిక, వీర, ఐతిహాసిక నవలల్లో ఆయన

సృష్టించిన పాత్రలు పాఠకులను ఆకర్షిస్తాయి. ఆ పాత్రలు జీవ చైతన్యాన్ని, వాస్తవిక మూర్తిమత్వాన్ని విస్మరించవు. బహుశా అటువంటి పాత్రలను సృష్టించడానికి ఆయన ఎందుకు పూనుకున్నాడంటే ఆయన సమకాలీన సమాజంలో అటువంటి భావోద్విగ్నతలు గల సంఘటనలే కారణం.

## రవీంద్రనాథ్ ఠాగూర్



రవీంద్రనాథ్ ఠాగూర్ తన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి ఆసియా వాసి. బాల్యంలో నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించేవారు. కథలంటే చాలా ఇష్టం. అనేక పద్యాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించారు. ఆయన రచించిన సంధ్యాగీత్ కావ్యం ప్రశస్తి గాంచింది. "వందేమాతరం" గీతాన్ని రాసిన బంకించంద్ర చటర్జీ రవీంద్రుని ప్రశంసించారట. రవీంద్రుని రచనలలో గీతాంజలి చాలా గొప్పది. రవీంద్రుడు తాను బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాలను కొన్నింటిని ఆంగ్లంలోనికి అనువదించి గీతాంజలి అని పేరు పెట్టారు. అది అనేక ప్రపంచ భాషలలోనికి అనువదించబడింది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని క్రుంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. 1913 లో సాహిత్యానికి సంబంధించి రవీంద్రుని గీతాంజలికే నోబెల్ బహుమతి లభించింది. విశ్వకవి అనే బిరుదును సాధించి పెట్టింది.

రవీంద్రుడు బాలల హృదయాలు వికసింపచేయడానికి ప్రాచీన ఋషుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. 1919 లో కళా భవన్ ను స్థాపించారు. బాలలకు విభిన్న కళలను నేర్పేవారు. రవీంద్రుడు మొదటి నుండి జాతీయభావాలు గలవారు. హిందూ మేళాలో దేశభక్తి గీతాలను పాడేవారు. పృథ్వీరాజు పరాజయం గురించి ప్రబోధాత్మక పద్యనాటకాన్ని రచించారు. బ్రిటీష్ ప్రభుత్వం తిలక్ ను నిర్బంధించినప్పుడు రవీంద్రుడు తీవ్రంగా విమర్శించారు. బెంగాల్

విభజన ప్రతిఘటన ఉద్యమంలో రవీంద్రుడు ప్రముఖపాత్ర వహించారు. జాతీయ నిధికి విరాళాలు వసూలు చేశారు. రవీంద్రనాథ టాగూర్ 1896 లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో మొట్టమొదటిగా బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరాన్ని ఆలపించారు. రవీంద్రుడు వ్రాసిన "జనగణమన" ను జాతీయ గీతంగా ప్రకటించే ముందు "వందేమాతరం", "జనగణమన" లపై దేనిని జాతీయ గీతంగా ప్రకటించాలని సుదీర్ఘ చర్చలు జరిగాయి. చివరికి రవీంద్రుడి "జనగణమన"నే నిర్ణయించారు. రాజ్యాంగ సభ కమిటీ అధ్యక్షులు బాబు రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న జనగణమనను జాతీయ గీతంగా, వందేమాతరంను జాతీయ గేయంగా ప్రకటించారు. ఇవి రెండూ సమాన ప్రతిపత్తి కలిగి ఉంటాయని స్పష్టం చేసాడు.



## స్వామి రామానంద తీర్థ

స్వామి రామానంద తీర్థ లోకమాన్య బాల గంగాధర తిలక్‌ను ఆదర్శంగా తీసుకుని స్వాతంత్ర్య సమరంలో అడుగు పెట్టారు. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని బడికి గాంధీ టోపి పెట్టుకొని వెళ్ళేవారట. తరువాత కాంగ్రెస్ లో చేరారు. కొంత కాలం ప్రసిద్ధ కార్మిక నాయకుడు ఎన్ ఎం జోషి కార్మికోద్యమంలో పాల్గొన్నారు. 1932లో స్వామి నారాయణ అనే గురువు ఆయనకు సన్యాస దీక్ష ఇచ్చి 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు.

స్వామీజీ రాజకీయాలలోకి ప్రవేశించి హైదరాబాద్ నగరాన్ని కేంద్ర రంగంగా చేసుకున్నారు. 1938, సెప్టెంబర్ 8న హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఎన్నుకొని అధ్యక్షా బాధ్యతలు చేపట్టారు. కానీ, ఈ సమావేశ ముందు రోజు నిజాం ప్రభుత్వం ఈ సంస్థను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకోసం 1938 అక్టోబర్ 24న రావి నారాయణరెడ్డి, రామకృష్ణ దూత్, జనార్ధనరావు దేశాయ్, గోవిందరావు నానక్ కలిసి స్వామి రామానంద తీర్థ నేతృత్వంలో సత్యాగ్రహం చేశారు. ఈ క్రమంలో స్వామి రామానంద తీర్థను హైదరాబాదులో 1938 అక్టోబరు 27వ తేదీన ప్రభుత్వం బంధించి 18 నెలలు కఠిన శిక్షకు గురి చేశారు. తర్వాత ప్రజారక్షణ నిబంధనల క్రింద 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను

బంధించి నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింపబడిన బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని షోలాపూర్ నుంచి తిరిగి రాగానే ఆయనను నిజాం ప్రభుత్వం బంధించింది. 1943 డిసెంబరులో విడుదల చేసింది. దేశానికి స్వాతంత్ర్యం లభించిన రోజున ఢిల్లీలో నెహ్రూ ఇచ్చిన జాతీయ పతాకం తీసుకొని హైదరాబాద్ విచ్చేసిన స్వామిజీని పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైల్లో ఉంచారు. ఇలా జైలులో ఉన్న అనేక సందర్భాలలో స్వామిజీ ఆధ్యాత్మిక సాధన చేసేవారు. పోలీసు చర్య తరువాత విడుదలయ్యారు. చాలా ఎక్కువ సంవత్సరాలు జైలు శిక్షను అనుభవించినవారు వీరు ఒక్కరే.

రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజీ వ్యవస్థాపకులు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులు. 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగా పని చేశారు. 1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నారు.1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు స్వామీజీ ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. 1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభా జీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. 1962 పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేయడానికి నిరాకరించి తన ఆధ్యాత్మిక రాజకీయ యాత్రలో మరో అడుగు ముందుకు వేశారు.

## విద్యా ప్రకాశానందగిరి స్వామి



విద్యా ప్రకాశానంద బాల్య నామం ఆనంద మోహన్. చిన్నతనంలోనే ఎంతో ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించేవారు. పసితనం నుంచే ఎంతో దైవ భక్తి ఉండేది. రామస్వామి ఆధ్యాత్మికంగా ఎదిగే కొద్దీ ప్రాపంచిక విషయాల పట్ల తీవ్ర విరక్తి ఏర్పరచుకున్నారు. వకీలు వృత్తికి రాజీనామా చేసి చిన్న కుటీరంలో జీవిస్తూ ధ్యానం, జపం, భజన, పారాయణం, అర్చన, ఆత్మవిచారణ, వేదాంత గోష్టులతో కాలం గడప సాగారు.

సహజంగానే ఆధ్యాత్మిక సంస్కారం గల ఆనంద మోహనుని చిత్త వృత్తి దైవ మార్గంలో పురోగమించటానికి వాతావరణం అనుకూలించింది. తండ్రితో పాటు "పంచదశి", "జీవన్ముక్తి", "ప్రకాశిక " గ్రంథాలను పఠించేవారు. "భర్తృహరి సుభాషితం", "ప్రశ్నోత్తర", "గాయత్రీ రామాయణం", "ఆత్మబోధ" గ్రంథాలన్నీ కంఠస్థం చేశారు. ఆనందమోహన్ కూడా ఆయా సందర్భాల్లో తండ్రితో కలిసి శ్లోకాలను చదువుతూ ఉంటే అతను వ్యాఖ్యానం చేసేవారు. బాల్యం నుంచి ఆనందమోహన్ కు భగవద్గీతతో అనుబంధం ఏర్పడింది. దేశభక్తి ప్రభావితుడైన రామస్వామి ఇంట్లోనే నూలు వడికి ఖద్దరు వస్త్రాలనే ధరించేవారు.

వివేకానందస్వామి సారస్వతాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేయటం ద్వారా ఆధ్యాత్మిక వికాసాన్ని పొందారు. భగవద్గీత బైబిల్ కు గల సామ్యాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేశారు. జాతీయోద్యమంలో భాగంగా సూత్ర యజ్ఞమనే పేరుతో రాట్నం నుండి నూలు తీసి దుస్తులు నేయించి ధరించటమనే మహా యజ్ఞంలో పాల్గొని అందులోనూ స్వర్ణపతకాలు సంపాదించారు. ఆనందమోహన్ తండ్రి శ్రీ మలయాళ స్వాముల వారిని తమ గురువుగా నిర్ణయించుకున్నారు. వారు రచించిన "శుష్క వేదాంత తమో భాస్కరం" వారిని ఎంతగానో ఆకర్షించింది. ఆయన రచించిన అనేక గ్రంథాలలో "గీత మకరందము" ఒకటి. తన 34వ ఏటా శ్రీ సద్గురు మళయాళ స్వామి వారి సన్నిధిలో సన్యాస దీక్ష స్వీకరించారు. అప్పుడే అతను పేరు విద్యాప్రకాశానందగిరి స్వామిగా మార్చుకున్నారు.



## ఉమర్ అలీషా

జాతీయభావం, సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం, సర్వమత సమభావనలతో పాటుగా సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా, మహిళాభ్యుదయాన్ని, ప్రజా చైతన్యాన్ని కాంక్షిస్తూ ఆధ్యాత్మిక–సాహిత్య రంగాలలో విశేష కృషి చేసినవారు ఉమర్ అలీషా. సమకాలీన రాజకీయ పరిణామాలకు అతను వ్యక్తిగా, పీఠాధిపతిగా, దేశభక్తునిగా స్పందించారు. బ్రిటీష్ పాలకుల చర్యలకు

వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తం చేస్తున్న స్వేచ్ఛా- స్వాతంత్ర్య కాంక్షకు కవిగా స్పందించి తోడ్పాటునందించారు. 1916లో జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ప్రముఖ కవిగా అప్పటికే బహుళ ఖ్యాతి గడించిన ఉమర్ అలీషాకు ప్రముఖ జాతీయ నాయకులు శ్రీ బిపిన్ చంద్ర, శ్రీ చిత్తరంజన్ దాస్, శ్రీ అరవిందో ఘోష్‌లతో మంచి స్నేహం ఏర్పడింది. ఈ నాయకుల ప్రభావంతో అతను జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, అలీ సోదరులు, మహమ్మద్ అన్సారి లాంటి ప్రముఖులు విజయవాడ వచ్చినప్పుడు వారిని కలిసి సమకాలీన పరిస్థితుల మీద చర్చించారు. గోదావరి జిల్లాలలో అలీషా సుడిగాలి పర్యటనలు చేశారని, ప్రజలలో దేశ భక్తిని, త్యాగాన్ని ప్రోది చేస్తూ అతను చేసిన ప్రసంగాలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయన్నారు. డాక్టర్ ఉమర్ అలీషా అలీపూర్ జైలులో యోగి అరవిందో ఘోష్ ని కలిసి జాతీయోద్యమం గురించి చర్చించారని, ఆ తరువాత అరవిందోతో మంచి స్నేహం నెరపారని ప్రొఫెసర్ యస్. యం. ఇక్బాల్ వివరించారు. ఆనాడు అరవిందోతో కలిగిన ఈ పరిచయం వలన కాబోలు ఉమర్ అలీషా తాత్విక ఆలోచనలు మీద అరవిందుడి ఛాయలు తారాడుతూ కన్పిస్తాయి.

1924లో అఖిల భారత ఖిలాఫత్ కమిటి ప్రధాన కార్యదర్శిగా, ముస్లిం లీగ్ మద్రాసు శాఖకు ఉపాధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా నాయకత్వం వహించారు. జాతీయోద్యమ కాలం నాటి ప్రజా పోరాటాలకు స్పందిస్తూ, దేశభక్తి పూరితమైన పలు పద్యాలను రాశారు. 1928 లో ఉమర్ అలీషా ఆధ్యాత్మిక పీఠం బాధ్యతలను స్వీకరించారు. 1935లో అఖిల భారత శాసనసభకు ఉత్తర మద్రాస్ నియోజకవర్గం రిజర్వుడ్ స్థానం నుండి సభ్యునిగా ఎన్నికయ్యారు. భారత శాసనసభలో పది సంవత్సరాల పాటు అతను ప్రజా ప్రతినిధిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. శ్రీ విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠాచార్యునిగా అసంఖ్యాకులైన శిష్యుల మనస్సులను చూరగొన్నారు. సర్వమత సమభావనా కేంద్రంగా "జ్ఞానసభ" ను నిర్వహించేవారు. జీవితాంతం వరకు భారత శాసన సభలో ప్రజా ప్రతినిధిగా బాధ్యతలను నిర్వహిస్తూ సర్వజనుల స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు కోరుకున్న స్వాతంత్ర్య సమర యోధుడుగా, ఆధ్యాత్మిక రంగాన శిష్యకోటికి ధార్మిక జ్ఞానబోధ చేసిన పీఠాధిపతిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్తగా, వేదాంతిగా చిరస్మరణీయమైన ఖ్యాతి గడించారు డాక్టర్ అలీషా.

## శిరశినగల్ కృష్ణమాచార్యులు

నిజామాబాద్ జిల్లాకు చెందిన కవి. వీరికి అభినవ కాళిదాసు అని బిరుదు కలదు. నైజాం రాష్ట్ర ఆద్య శతావధాని గా ప్రసిద్ధిని పొందారు. బాల్యం నుంచే కావ్య, నాటక, అలంకార, సాహిత్య గ్రంథాలు, తిరు మంత్రార్థము, శ్రీ వచన భూషణ వ్యాఖ్యానం మొదలైన గ్రంథాలు అధ్యయనం చేశారు. తర్వాత వల్లంకొండలో కనకాపురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందోర్శుల వెంకన్న వద్ద సిద్ధాంత భాగం, పిఠాపురంలో గుదిమెళ్ళ రంగాచార్య వద్ద వేదాంతాన్ని అభ్యసించారు. 1926 నుండి కోరుట్ల లోని ఉభయ వేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ప్రవేశించి అక్కడనే ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. మధ్యలో 1934-37లో కొడిమ్యాలలో ఆనందమ్మ అనే విద్యార్థినికి సంస్కృతాంధ్ర భాషలు, 1937లో లింగాపురంలో అనసూయాదేవి, సుశీలాదేవి అనే విద్యార్థినులకు సంస్కృత సాహిత్యం నేర్పించారు. జాతీయోద్యమానికి ప్రభావితుడైన కృష్ణమాచార్యులు "గాంధీతాత నీతి శతకము" వంటి రచనలు చేశారు.

## గరికపాటి మల్లావధాని

మహాత్మాగాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ నేతగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు గరికపాటి మల్లావధాని. ఆయన కవిగా, పండితునిగా, పరిష్కరణ కర్తగా వెలుగొందారు. కొవ్వూరు లో 1899లో జన్మించిన ఆయన కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో, విజయనగరం మహారాజా సంస్కృత కళాశాలలోనూ, సంస్కృతాంధ్ర భాషలను అభ్యసించారు. సీతారామశాస్త్రి, పురిమళ్ళ సుబ్రహ్మణ్యశాస్త్రి, తాతా సుబ్బరాయశాస్త్రుల శుశ్రూషలో సంస్కృత భాష సాహిత్యపు మెరుగులు దిద్దుకున్నారు. కల్లూరి వెంకట్రామ శాస్త్రి, వజ్ఝల సీతారామ శాస్త్రుల దగ్గర తెలుగు సాహిత్యంలో ప్రావీణ్యం సంపాదించారు. వేలూరి శివరామశాస్త్రి గారి అష్టావధానాల ఆకర్షణలో పడి అవధానాలు చేయడం ప్రారంభించారు. 1921 లో ఆయన చదువు మానుకొని సహాయ నిరాకరణోద్యమంలో చేరి గ్రామ గ్రామానికి పోయి జాతీయగీతాలు రాసి పాడేవారు. బ్రిటీషు వారికి వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చి జనాన్ని ఉత్తేజపరిచేవారు. 1930 లో గాంధీ పిలుపు విని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు పాలయ్యారు.

ఈ విధంగా భారత స్వాతంత్ర్య సమరంలో ఎంతో మంది ఆధ్యాత్మిక,

తత్త్వ వేత్తలు తమ తమ సాంస్కృతిక జాతీయవాదంతో బ్రిటీష్ వలస వాదాన్ని ఖండించారు. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక, సాంస్కృతిక, మత పరమైన ప్రేరణను కలిగించారు. ఆధునిక యుగం ప్రవేశిస్తున్న తరుణంలో సాంప్రదాయిక విలువలతో కూడిన వ్యవస్థను పునరుద్ధరించారు. యోగులుగా సన్యాసాన్ని స్వీకరించడమే గాక ఆధ్యాత్మిక, తాత్త్విక పీఠాలకు ఆధిపత్యం వహిస్తూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. స్వేచ్ఛా సమానతల కోసం పాటుపడ్డారు. దృఢ సంకల్పం, కృత నిశ్చయం, ఆత్మబలం వంటివి ధ్యాన సాధనతో గ్రహించి అకుంఠిత దీక్షకు పూనుకున్నారు. పరాయిపాలన నుంచి భారత మాతను బంధ విముక్తం చేశారు.

## ఆధార గ్రంథాలు:


1. రామానంద తీర్థ, స్వామి (ఆం). ఆదిశేషువు (తెలుగు సేత). (1984). హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం అనుభవాలు, జ్ఞాపకాలు. స్వామి రామానంద స్మారక సంఘం. హైదరాబాద్.
2. నాగేష్, కానూర్ (సేకరణ). (2019). శ్రీ కంచి పరమాచార్య (జగద్గురు శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామి). శ్రీ కంచి పీఠం. కాంచీపురం.
3. రామరాజు, బిరుదురాజు. (1998). ఆంధ్ర యోగులు (ఆరు భాగములు). నవయుగ బుక్ హౌస్. హైదరాబాద్.
4. Ghose Aurobindo. (2008). The Complete Works of Sri Aurobindo. Sri Aurobindo Ashramam Publications. Pondicherry.
5. Vivekananda Swami. (2015). The Complete Works of Swami Vivekananda. Manonmani Publishers, Chennai.

# వైద్యశాస్త్ర రంగంలో 1977 సంవత్సరపు నోబెల్ పొందిన మహిళ రోసలిన్ సుస్ మన్ యాలో



డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి
✆ 98851 63304

జర్మని నుండి యు.ఎస్.కి చిన్నతనంలో వచ్చిన రోసలిన్ తల్లి, క్లారా జిప్పర్ సుస్ మన్ 6వ తరగతి వరకు చదువు కొంది. తండ్రి సైమన్ సుస్ మన్ జననం న్యూయార్క్ లోనే! అతను 8వ తరగతివరకు చదువుకొని బస్ కండక్టర్ గా జీవితాన్ని ప్రారంభించాడు. తరువాత కాగితాలు,ట్వైన్ దారాల వ్యాపారం చేసాడు.కనీసం పాఠశాల చదువుకూడా పూర్తి చేయని ఈ దంపతులకి రోసలిన్ సుస్ మన్ (Rosalyn Sussman Yalow) జూలై 19,1921లో పుట్టింది.

వైద్యభౌతిక శాస్త్రవేత్త (medical physicist) గా ఎదిగిన రోసాలిన్ 1977 వ సంవత్సరపు వైద్యశాస్త్ర విభాగపు నోబెల్ పురస్కారాన్ని రేడియోయిమ్యునోయసె RIA (radioimmunoassay)ను కనుగొన్నందుకు అందుకొన్నది. ఈమె వైద్యవిభాగంలో యీ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకొన్న రెండవ మహిళ,1947 లో గ్రెట్టి కోరి మొదటి సారిగా బహుమతిని పొందిన మహిళ. ముప్పై సంవత్సరాల తరువాత రోసాలిన్ యాలో కి యీ గౌరవం లభించింది.

రోసాలిన్ భౌతికశాస్త్రాన్ని చదువుకొంది. రోసాలిన్ ఆమె భర్త ఆరన్ యాలో లు ఇద్దరూ అమెరికన్ బౌతిక శాస్త్రజ్ఞుడు మ్యూరిస్ గోల్డ్హాబర్ (Maurice Goldhaber) దగ్గర పిహెచ్ డి చేసారు. వైద్యశాస్త్రంలో ఆమెకు డిగ్రీలేదు. ఆరన్ యాలో అమెకు మెడికల్ ఫిజిక్స్ లో పరిశోధన చేయమని సలహా యిచ్చాడు. మెడికల్ ఫిజిక్స్



లో పరిశోధనకి పలు విజ్ఞాన శాఖలకు సంబంధించిన పరిజ్ఞానము అవసరము. 1950 లో సోలొమన్ బెర్సన్, రోసలిన్ యాలో లు భాగస్వాములయ్యారు. అతను ఆమెకు మానవనిర్మాణ శాస్త్రం, జీవ శాస్త్రం, వైద్యం, చికిత్స ఔషధాల పై చాలా లోతైన అవగాహనను కల్పించాడు. ఆమె అతనిని ఫిజిక్స్, కెమిస్ట్రి, మెథమాటిక్స్, ఇంజనీరింగ్, శాస్త్రాలతో పాటు హేతు బద్ధతలో కూడా బలీయున్ని చేసింది. రోసలిన్ యాలో ఆ నాటి పేరెన్నికగన్న జీవ శాస్త్రజ్ఞులకన్నాఎక్కువ జీవశాస్త్ర పరిజ్ఞానాన్ని సంపాదించింది. రోసలిన్, బెర్సన్ ల భాగస్వామ్యం ఇరవైరెండు సంవత్సరాలు కొనసాగగా నోబెల్ స్థాయి పరిశోధనా ఫలితాలను సాధించారు.

రేడియోధార్మికత(radioactivity) ను ప్రదర్శించే రసాయనమూలకాల సమస్థానీయాల ( ఐసోటోప్స్) ను రేడియోధార్మిక సమస్థానీయాలు (రేడియో ఐసోటోప్ లు) అంటారు. ఉదా హరణకి పరమాణుసంఖ్య 53 గల అయొడిన్ కేంద్రకంలో 53 ప్రోటానులు 74 న్యూట్రానులు వుంటాయి. ఇది అయొడిన్-127 దీని కేంద్రకము స్థిరమైనది. రేడియో సమస్థనీయమైన అయిడిన్ లో 53 ప్రోటానులు 78 న్యూట్రానులు వుంటాయి. ఇది అయిడిన్- 131 దీని కేంద్రకం అస్థిరమైనది, రేడియోధార్మిక విఘటనంచెంది బిటా కణాలను వెలువరిస్తుంది. జినాన్ (Xenon 131- 54) గా మారిపోతుంది.

తక్కువ జీవితకాలం గల రేడియో ఐసోటోపులు గుర్తించ వీలైన కణాలను వెలువరిస్తూ మానవ శరీరం ద్వారా తరలి పోతాయి.రసాయన,శారీరక ప్రక్రియలలో రేడియో ఐసోటొపులను ట్రేసర్లు- అనగా జాడ తెలియజెప్పేవిగా- ఉపయోగపడతాయి.

మధుమేహ శరీరంలో యిన్సులిన్ (insulin)ఎంత సేపు నిలిచివుంటుందో పరీక్షించడానికి యాలో, బెర్సన్ లు రేడియో ఐసోటోప్ చీటిని తగిలించిన యిన్సులిన్‌ను రోగి శరీరంలోకి జొప్పించారు. తరచుగా రోగి నుండి నెత్తురును గ్రహిస్తూ, రోగి శరీరంనుండి ఎంత వేగంగా ఈ హార్మోన్ మాయమయిందో పరీక్షలు నిర్వహించి చూసారు.ఇలా కొంత మంది మధుమేహంవున్న, లేని రోగులనుండి ఫలితాలను గ్రహించారు. మధుమేహరోగుల శరీరంనుండి మధు మేహం లేని-ఎన్నడూ యిన్సులిన్‌ను తీసికోని వారి శరీరం నుండికన్నా యిన్సులిన్ మాయమయి పోవడానికి ఎక్కువ సమయం పట్టింది. మనోవైకల్యం వున్నవారికి యిన్సులిన్ షాక్ చికిత్సచేస్తారు. ఒకవేళ మనోవైకల్యం రోగుల శరీరంనుండి కూడా యిన్సులిన్ మాయమవడానికి మధుమేహరోగుల కంటె

ఎక్కువ సమయం పడితే అప్పుడు దానికి కారణం శరీరంలోకి ఎక్కించిన యిన్సులిన్ కారణమవుతుంది కానీ మధు మేహం కాదు. ఎందుకంటే ఆ మనోవైకల్య రోగులకి మధుమేహం లేదు. యాలో, బార్సన్ లు ఊహించినట్టుగానే మధుమేహం గల వారి కంటే మనో వైకల్య రోగుల శరీరంనుండి యిన్సులిన్ తొలగిపోడానికి యెక్కువ సమయం పట్టింది. దీనిని బట్టి ఎక్కువ సమయం పట్టడానికి కారణం మధుమేహం కాదని తేలింది. యిన్సులిన్ని తీసికొన్న వ్యక్తులు తమ శరీరంలో యిన్సులిన్ కి ప్రతిరక్షకాల(antibodies)ను తయారు చేసు కొన్నాయని శాస్త్రవేత్తల జంట నిర్ధారణ కొచ్చింది. 1950లలో పందుల, పశువుల క్లోమాలనుండి (pancreases) యిన్సులిన్ని గ్రహించి వాడేవారు. జంతువుల యిన్సులిన్, మానవుల యిన్సులిన్ దాదాపుగా ఒకటే అయినప్పటికీ మానవ రోగనిరోధకశక్తి ఆ యిన్సులిన్ ని విదేశీయమైనది గా ఎంచి, దానితో పోరాడడానికి ప్రతిరక్షకాలను తయారు చెసింది.

వీరి ఈ పరిశోధన వ్యాసాన్ని ప్రతిష్టాత్మక సైన్స్ జర్నల్ తిరస్కరించింది. ఇన్సులిన్ అణువులు ఎంత చిన్న వంటే అవి ప్రతిరక్షకాలను వుత్తేజ పరచలేవని అప్పటి వారందరి యోచన. జర్నల్ ఆఫ్ క్లినికల్ యిన్వస్టిగేషన్ యిన్సులిన్ ప్రతిరక్షకం పదాన్ని తొలగిస్తే తప్ప ప్రచురించమంది. నోబెల్ పొందిన రోసలిన్ సుస్ మన్ యాలో ఇరవై ఏండ్ల తరువాత కూడా ఆ పత్రికను పదాన్ని తొలగించమన్నందుకు దెప్పిపొడుస్తూనేవుంది. అంతటి స్పష్టత వారి ఫలితాలపట్ల వారికున్నది.



*Rosalyn Yalow, who developed radioimmunoassay, a method for measuring concentrations of substances in the blood. Photo: US Information Agency*

ఒకానొక సంగతి వారి మేధస్సుకు తట్టగానే యీశాస్త్రవేత్తలు వులిక్కి పడ్డారు. వారి ప్రయోగము యిన్సులిన్ కి ప్రతిరక్షకాలని లెక్కకట్టినా, దీని విలోమపద్ధతిలో హార్మోన్ లనే లెక్కకట్ట వచ్చుకదా! అవును,లెక్కకట్టి తెలుసు కోవచ్చు ! వారీ పద్ధతిని రేడియోయిమ్యునోయసె (radioimmunoassay) అన్నారు.

సక్షిప్తంగా దీని పేరు ఆర్ ఐ ఎ(RIA).

రొసలిన్, బెర్సన్ తమ RIA పరిశోధనాఫలితాలను 1956లో ప్రచురించారు. తరువాత మూడు సంవత్సరాల పాటు వారి ఈ పరికల్పనను యదార్థంగా ఒక పరీక్షగా అమలు చేయ డానికి కృషిచేసారు. ఎల్లినాయ్ యూని వర్సిటీలో బెర్సన్ దీనిపై వుపన్యసించి నప్పుడు శ్రోతలలో ఒకరు దీనికి నోబెల్ లభిస్తుంది అన్నారు; మిగిలిన 29మంది అతనిని వెర్రి వాడి కింద జమకట్టారు.

RIA సరళమైన సూత్రము. ఈక్రింద చూపిన పోటీపడుతున్న చర్యలు ఈ సూత్రాన్ని క్రోడీకరిస్తాయి. ఒకానొక ప్రత్యేక ప్రతిరక్షకానికి బంధింపబడిన, రేడియోధార్మిక చీటీ తగిలించిన, యాంటిజన్ పైన ఒకతెలియని రేడియోధార్మిక చీటీ తగిలించని యాంటిజన్ యొక్క నిరోధక ప్రభావాన్ని పోల్చి చుడడంద్వారా, లేదా ప్రామాణీకరించిన నిరోధ ప్రభావలతో సరి చూచి దాని గాఢతను పొందవచ్చు.

చీటి తగిలించిన యాంటిజన్ + ప్రత్యేక యాంటిబాడి ⇌ చీటి తగిలించిన యాంటిజన్ యాంటి బాడి కాంప్లెక్

$$Ag^* + Ab \rightleftharpoons Ag^* + Ab$$

+

Ag చీటీ తగిలించని యాంటిజన్

( తెలియని లేదా తెలిసిన ప్రామణికమైన నమూనా)

↕

Ag– Ab

చీటి తగిలించని యాంటిజన్ యాంటి బాడి కాంప్లెక్

ఈ సాంకేతికత రేడియో ట్రాసర్లను వాడుతూ నెత్తుటి ప్రవాహం లోని యిన్స్‌లిన్, థైరాయిడ్, పునరుత్పత్తి,పెరుగుదల హార్మోన్ల వంటివేకాక విటమినులు, వైరస్ లు,ఇంకా అనేక పదార్థాల స్థాయి ఎంతవున్నదీ తెలియడానికి వినియోగపడు తుంది. ఇది నమ్మశక్యంకానంత సున్నితమైన పరీక్ష. ఈ సాంకేతిక పద్దతికి అసాధారణ ప్రయోజనాలున్నాయి. RIA ను పరీక్షనాళికలో నిర్వహించవచ్చు. రోగి శరీరంలోకి రేడియోధార్మిక పదార్థం వెళ్లదు; పరీక్షించడానికి ఒక గ్రాములో

వంద కోట్లవంతు నెత్తురు చాలును(ఒక ఔన్స్ లో 32 గ్రాములుంటాయి). అంతకు ముందు మధుమేహుల నుండి ఒకకప్పు (100 సిసి) నెత్తురును సేకరించాల్సి వచ్చేది. RIA పద్ధతిలో 0.1 సి.సి నెత్తురు చాలును. RIA ఒక్క యిన్సులిన్ హార్మోన్ కే కాదు, శరీరంలోని ఏ ఇతర హార్మోన్ను గుర్తించడానికైనా పనికివస్తుంది. జీవరసాయన సంబంధపు ఏ పదార్థాన్ని గుర్తించడానికైనా వినియోగ పడుతుంది. మరుగుజ్జులైన బాలబాలికలకు పెరుగుదలకు కారణమైన హార్మోన్ల చికిత్స; గర్భస్థ పిండాలకు వెన్నెముక చీలిక (spina bifida) వంటి వైకల్యాలకు పరీక్ష; సంతానలేమి గల జంటలలో సెక్స్ హార్మోన్ల లోపము; బ్లడ్ బ్యాంక్ లలో చేరే రక్తాలలో భయంకర రోగ కారకాల వునికికి పరీక్ష; క్రీడాకారులలో మందుల దుర్వినియోగ నిర్ధారణ; తక్కువ క్రియాశీలమైన కాకల గ్రంధి (thyroid) కారణంగా పుట్టిన పిల్లలలో పెరుగుదల తగ్గవచ్చు, కనక అందుకై ముందుగా నిర్వహించదగ్గ పరీక్షలు మొదలైన అన్వయాలతో అమోఘమైనదిగా RIA పద్ధతి అమలులోకి వచ్చింది. వ్యాపార పరమైన ప్రయోజనాలున్నవని వారికి అవగాహన వున్నప్పటికీ క్యూరి లవలె వీరిద్దరు కూడా తమ ఆవిష్కరణకు పేటెంట్ తీసుకోదలచలేదు.

1960ల నాటికి ఈ శాస్త్రవేత్తల జంట వినాళికాగ్రంధులశాస్త్రంలో (endocrinology) విప్లవాత్మక మార్పులు తీసికొని రాగలిగారు. అత్యంత ఆత్మవిశ్వాసంతో, అతి జాగ్రత్తగా నిర్వహించిన ప్రయోగాలతో మానవశరీరంలో హార్మోన్ లు ఎలా తయారవుతాయో, వాటిని శరీరం ఏవిధంగా సంభాళించుకొంటుందో సాహసోపేతమైన వివరణను ఇవ్వగలిగారు.

రక్త పరీక్షలు నిర్వహించగల అసాధారణమైన RIA పద్ధతి యొక్క వైజ్ఞానికలోక ఆమోదాన్ని పొందడానికి యిద్దరూ జంటగా పోరాడేరు. బర్సన్ మరణం యాలో కి గట్టి దెబ్బ! మెడికల్ గ్రేప్ వైన్ (medical grapevine) ఇక అమె వృత్తి జీవితం ఆటకెక్కేసిందనే అభిప్రాయపడ్డది. వారి పరిశోధన యెంత విశిష్ట ప్రాముఖ్యత గలదైనా బర్సన్ లేకుండా ఆమెకు నోబెల్ రాదు అన్నారు. నోబెల్ చరిత్రలో అంతవరకూ బతికి వున్న భాగస్వామికి నోబెల్ ను ప్రదానం చేయలేదు. పరిశోధన వెనకనున్న సృజనాత్మక మేధస్సు బర్సన్ దేనని అప్పట్లో పలువురు భావించారు.రోసలిన్ యాలో తనను తాను నిరూపించు కోవాలని ధృడంగా అనుకొంది. వారానికి ఎనభై గంటలకి బదులు ఆమె నూరు గంటలు పనిచేసింది. తన ప్రయోగశాల పేరును సోలమన్ ఎ.బార్సన్ రీసెర్చ్ లేబొరేటొరీగా తరవాత స్పేస్ గామార్చింది. బార్సన్ గారి సంపాదకీయాలనూ, వుపన్యాసాలనూ

తాను నిర్వహించింది. యూగెన్ స్ట్రాస్ (Eugene Straus) ని తన పరిశోధనా సహాయకునిగా నియమించుకొంది. 1972 –76 మధ్యకాలంలో ప్రయోగశాలనుండి 60 పరిశోధనా వ్యాసాలను ప్రచురించగలిగింది. పన్నెండు మెడికల్ అవార్డులను గెలుచుకొంది. మానవ శరీర యిన్సులిన్ ప్రతిరక్షకాలు (యాంటి బాడీలు) పంది, కుక్క, తిమింగలాల యిన్సులిన్ లను వేరు వేరుగా, వాటి అమైనో ఆమ్ల వరుస క్రమములు దాదాపుగా ఒకటే అయినప్పటికీ గుర్తించగలవని నిరూపించింది. కోలా సిస్టాకినిన్ హార్మోన్ (Cholecystokinin) చిన్నప్రేగులలోని కొవ్వు అరుగుదలకి దోహదపడుతుంది. ఈ రసాయనమే మెదడు లో ఒక నాడీకణం(neuron) నుండి మరొక నాడీకణానికి సమాచారాన్ని చేరవేసే పనిని కూడా నిర్వర్తిస్తుందని (synaptic transmitter)యాలో, స్ట్రాస్ లు కనుగొన్నారు. తొలిసారిగా కడుపు మరియు ప్రేగులకు సంబంధించిన (gastrointestinal) హార్మోన్ రెండు పనులను చేస్తుందని రోసలిన్ యాలో, స్ట్రాస్ లు నిరూపించారు.

నొబెల్ పురస్కారాలను ప్రతీసంవత్సరమూ అక్టోబర్ మాసంలో ప్రకటిస్తారు. ప్రతీ సంవత్సరమూ యాలో తన RIA పరిశోధనకు నోబెల్ ప్రకటిస్తారన్న ఆశతో నమ్మకంతో అందుకై ప్రత్యేక వస్త్రధారణతో తయారయ్యి, ఎదురు చూచేది.ప్రతీ ఏడూ నిరాశే! భర్త ఆరన్ యాలో తో నోబెల్ ను నాకు ప్రదానంచేయాడానికి నేనింకా ఏమి చేయాలి? అని అడిగేది. ఏళ్లు గడుస్తున్నకొద్దీ RIA సాంకేతికపు ప్రాముఖ్యత అంతకంతకూ పెరుగుతూ వుంది. దాంతో నోబెల్ కమిటి వారిమీద బార్సన్ చనిపోయినా బతికివున్న భాగస్వామి అయిన యాలోకి నోబెల్ ను ప్రదానం చేయాలనే వొత్తిడి పెరిగింది. 1975లో యాలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఎకాడమి ఆఫ్ సైన్స్ స్ కి ఎంపికయ్యింది. 1976లో పదివేల డాలర్ల ఆల్బర్ట్ లస్కర్ బేసిక్ మెడికల్ రీసెర్చ్ యవార్డును పొందిది. ఈ యవార్డుని అందుకొన్న తొలి మహిళ యాలో. ఈ పుర్కారాన్ని నోబెల్ కి ముందుగా వచ్చే దూతగా పరిగణిస్తారు. ఆరన్ దంపతులు అక్టోబర్13,1977న ఉదయం మూడు గంటలకు లేచి కూర్చున్నారు. 6:45 కి టెలిఫోన్



*Portrait of Rosalyn Sussman Yalow, ca. 1977.Science history institute*

ప్రోగింది. ఎదురు చూస్తున్న పురస్కార సామాచారం వచ్చింది. వారి ఆనందానికి అవధులులేవు.

2011 మే నెల 30వ తేదీన రోసలిన్ సుస్ మన్ యాలో న్యూయార్క్ లో మరణించింది. మొండి పట్టుదల, పోరాటపటిమ, స్పష్టత, లోతైన శాస్త్ర పరిజ్ఞానము, ప్రయోగాల నిర్వహణలో నైపుణ్యము మొదలైన లక్షణాలుండబట్టే, 1940 దశకాలనాటి వైజ్ఞానిక వాతావరణంలో మరీ ముఖ్యంగా భౌతిక శాస్త్ర రంగంలో, వైద్యరంగంలో ఒక స్త్రీగా, అందునా యూదు జాతి స్త్రీగా నెగ్గుకురాగలిగింది.

## References for further reading

1. Nobel prize Women in Science, Their Lives, Struggles and Momentous Discoveries National Academy of Sciences 2nd edition Sharon Bertsch McGrayne
2. https://embryo.asu.edu/pages/rosalyn-sussman-yalow-1921-2011 Jennifer R. Craer
3. https://www.nobelprize.org/prizes/medicine/1977/yalow/speech/
4. Rosalyn Yalow gave a detailed account of her researches and discoveries in
5. "A physicist in biomedical investigation," in Physics Today, 32 (October 1979).

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక
సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 3 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

# ధన్యోస్మి



జులై – సెప్టెంబరు 2023 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు, కవితలు ప్రత్యేకంగా రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు.

"మేటి కథలు–లోతు వ్యాఖ్యలు" శీర్షికని సమర్థవంతంగా నిర్వహిస్తున్న డాక్టర్ రాసాని గారికి అభినందనలు, ధన్యవాదాలు.

ప్రకాశిక వెబ్ సైటు ను నడుపుతున్న శ్రీ కిరణ్ గారికి ధన్యవాదాలు. ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

ప్రతే సంచికనీ సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్న శ్రీ వెంకట్ గారికి, ముఖచిత్రం వేసిన శ్రీ శివాజీ గారికి మనఃపూర్వక ధన్యవాదాలు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి.

భవదీయుడు
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ
ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 3 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

## 77వ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

